# అధ్యాయం 3 - అద్వైత ప్రకరణం

ఈ అధ్యాయము పేరు అద్వైత ప్రకరణం. ఇందులో 48 కారికలు ఉన్నాయి. మాండూక్య ప్రకరణాలన్నింటిలోకి ఇది చాలా ముఖ్యమైన ప్రకరణం. ఆ మాటకొస్తే మొత్తం వేదాంత గ్రంథాల్లోనే ఇది అపురూపమైన మాణిక్యం. అద్వైతజ్ఞానం గురించి స్పష్టమైన అవగాహన ఏర్పడాలంటే ఈ ప్రకరణాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటే చాలు.

ఈ ప్రకరణాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలంటే, ఉపనిషత్తులోని మంత్రాలు, ముఖ్యంగా 1–7 బాగా గుర్తుండాలి. అలాగే మొదటి అధ్యాయంలోని కారికలు 10–18 బాగా గుర్తుండాలి. ఎందుకంటే ఈ అధ్యాయంలోని బోధ వీటిని ఆధారంగా చేసుకుని సాగుతుంది. పునాది బలంగా లేకపోతే భవంతి ఎలా గట్టిగా నిలబడదో, అలాగే ఈ మొదటి అధ్యాయంలోని ఈ మంత్రాలు, ఈ కారికలనే పునాది బలంగా లేకపోతే, అద్వైత వేదాంతం అనే భవంతి గట్టిగా నిలబడదు మీ మనస్సులో.

**ప్రపంచోపశమం శాంతం శివమద్వైతమ్ – మంత్రం 7**

మంత్రం ఏడులోని ప్రపంచోపశమమ్ మంత్రంయొక్క వివరణే రెండవ అధ్యాయం అని చూశాము. దాన్ని వైతథ్య ప్రకరణమ్ అంటారనీ, అది జగత్తుయొక్క మిథ్యాత్వ నిశ్చయం చేసిందనీ కూడా చూశాము. జగత్తు అంటే మాండూక్యంలో ఉన్నంతవరకూ ఆత్మయొక్క మూడు పాదాలూ అనే విషయం మర్చిపోకూడదు.

ఈ అధ్యాయం అద్వైతమ్ అనే పదంయొక్క వివరణ. అందువల్లనే ఈ అధ్యాయాన్ని అద్వైత ప్రకరణమ్ అంటారు. ఇందులో గౌడపాదాచార్యులవారు తురీయ వర్ణన లోతుగా చేయబోతున్నారు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఇది వేదాంతసారం. గౌడపాదాచార్యులవారు జగన్మిథ్యాత్వదర్శనాన్ని రెండవ అధ్యాయంలో చేయిస్తే, బ్రహ్మయొక్క సత్యత్వదర్శనాన్ని ఇప్పుడు ఈ మూడవ అధ్యాయంలో చేయబోతున్నారు.

| | |
|---|---|
| **పాదత్రయ మిథ్యాత్వమ్** | **– వైతథ్య ప్రకరణం** |
| **చతుర్థపాద సత్యత్వమ్** | **– అద్వైత ప్రకరణం** |

**అద్వైత ప్రయాణంలో దశలు**

1. **కారణ – కార్యాలు:** ఆత్మయొక్క నాలుగు పాదాల వర్ణనను చూసినప్పుడు, మొదటి రెండు పాదాలను కార్యపాదాలు అంటారనీ, మూడవ పాదాన్ని కారణపాదం అంటారనీ; తురీయాన్ని కార్యకారణ విలక్షణపాదం అంటారనీ చూశాము.

**కార్యకారణబద్ధౌ తావిష్యేతే విశ్వతైజసౌ ।**
**ప్రాజ్ఞః కారణబద్ధస్తు ద్వౌ తౌ తుర్యే న సిధ్యతః ॥** – కారిక 1.11

దీన్నే ఇంకొక విధంగా చెప్పాలంటే

విశ్వ, తైజస – కార్య ఆత్మ
ప్రాజ్ఞ – కారణ ఆత్మ
తురీయం – కార్యకారణ విలక్షణ ఆత్మ

ఆత్మను బ్రహ్మ అని కూడా అంటారు. ఎందుకంటే ఆత్మ=బ్రహ్మ. ఇప్పుడు ఆత్మ పదం బదులు బ్రహ్మ పదం వాడితే, మొదటి రెండు పాదాలు కార్యబ్రహ్మ; మూడవపాదం కారణ బ్రహ్మ; నాలుగవ పాదం కార్య–కారణ విలక్షణ బ్రహ్మ.

2. **సవికారం:** కారణం – కార్యం రెండూ కూడా సవికారం. మార్పుకు లోనవుతాయి. కారణం, కార్యంగా రూపుదిద్దుకోవటానికి మార్పు చెందితే, కార్యం కారణాలలో లయమవటానికి మార్పు చెందుతుంది. ఏదైతే మార్పు చెందుతుందో అది కాలం కోరల్లో చిక్కుతుంది. కార్య, కారణ రూపంలో ఉన్నదేదైనా సవికారం. అందువల్ల సవికారం అంటే కార్యకారణ రూపం గుర్తు రావాలి; కార్యకారణరూపం గురించి వింటే మొదటి మూడు పాదాలూ గుర్తు రావాలి. **కారణ, కార్యాలు సవికారం.**

3. **ద్వైతం:** కారణం, కార్యం – రెండూ కూడా ద్వైతం. కార్యపాదాలు విశ్వ, తైజస అని చూశాము. వాటిలో ప్రమాతా–ప్రమేయ భేదం స్పష్టంగా తెలుస్తుంది. మొదటిపాదంలో జాగ్రదావస్థలో జాగ్రత్ పురుషుడు (విశ్వ) జాగ్రత్ ప్రపంచంతో వ్యవహారం నడిపితే, రెండవ పాదంలో స్వప్నావస్థలో స్వప్నపురుషుడు (తైజస) స్వప్నప్రపంచంతో వ్యవహారం నడుపుతాడు. మూడవపాదంలో సుప్తపురుషుని విషయంలో ద్వైతం ఉందా లేదా? అక్కడ కూడా ద్వైతం ఉంది. మూడవపాదం కారణపాదం అని చూశాము. కారణంలో ద్వైతం అవ్యక్తరూపంలో ఉంటుంది.

చూడటానికి విత్తనం ఒకటిగా ఉన్నా అందులో చెట్టు, చెట్టుకు వచ్చే విత్తనాలు అవ్యక్తంగా ఉంటాయి. ప్రతి తల్లిదండ్రుల్లోనూ పిల్లలు, వారి పిల్లలు అవ్యక్తంగా ఉంటారు. కాకపోతే అది అవ్యక్తంగా ఉంది కాబట్టి మనకు తెలియదు. అంతమాత్రాన ద్వైతం లేదనకూడదు. కార్యంలో ద్వైతం వ్యక్తరూపంలో ఉంటే, కారణంలో ద్వైతం అవ్యక్తరూపంలో ఉంటుంది.

కారణంలో అవ్యక్తరూపంలో ఉందని ఎలా చెప్పగలరు? లేవగానే ద్వైతం అనుభవంలోకి వస్తుంది అంటే దాని అర్థం నిద్రలో, ద్వైతం అవ్యకంలోకి వెళ్ళింది. అందువల్ల **కార్యపాదాలు వ్యక్తద్వైతం, కారణపాదం అవ్యక్తద్వైతం**.

కార్యకారణరూపాలు ద్వైతరూపమే. అందువల్లనే వేదాంతం, సమాధిస్థితిలో అనుభవంలోకి వచ్చిన అద్వైత అనుభవాన్ని అంతగా పట్టించుకోదు. వేదాంతం ప్రకారం ఆ అద్వైత అనుభవం నిజంగా అద్వైతం కాదు, అది అవ్యక్తంలో ఉన్న ద్వైతం మాత్రమే. అవ్యక్త ద్వైతాన్ని తెలుసుకోలేక అదే అద్వైతం అనుకుంటాడు సాధకుడు. అవ్యక్త ద్వైతం అని ఎలా చెప్పగలరు? ఆ సాధకుడు సమాధిస్థితినుంచి లేచాక ఏమంటాడు? 'నేను అప్పుడు సమాధిలో ఉన్నాను,' అంటాడు. అంటే దాని అర్థం 'ఇప్పుడు ద్వైతంలో ఉన్నాను,' అంటే అంతకుముందు అవ్యక్తద్వైతంలో ఉంటే ఇప్పుడు వ్యక్తద్వైతంలో ఉన్నాడు అంతే. ఇప్పటివరకూ నాలుగు పదాలను చూశాము. అవి అన్నీ పర్యాయపదాలు.

పాదత్రయం = కార్యకారణరూపం = సవికారం = ద్వైతం

ముందు ముందు ఈ నాలుగింటిలో ఏ పదం వాడినా తక్కిన మూడూ టక్కున గుర్తు రావాలి. ఇది మొదటిభాగం. ఇప్పుడు తురీయపరంగా చూద్దాము. వీటికి భిన్నమైన పదాలను తురీయానికి చూస్తాము.

నాలుగవ పాదం = కార్యకారణ విలక్షణం = నిర్వికారం = అద్వైతం

ఈ నాలుగు పదాల్లో ఏది వాడినా తక్కిన మూడూ టక్కున గుర్తురావాలి.

4. **ద్వైతం–సంసారం:** గౌడపాదాచార్యులవారు మొదటి మూడుపాదాలూ సంసారంలోకి వస్తాయి అంటున్నారు. ఎక్కడైతే కార్యకారణరూపం ఉంటుందో, ఎక్కడైతే సవికారం ఉంటుందో, ఎక్కడైతే ద్వైతం ఉంటుందో అక్కడ సంసారం ఉంటుంది.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్ 1. 4. 2

హిరణ్యగర్భ ముందు పుట్టాడు. పుట్టగానే చుట్టూ చూస్తే ఎవరూ లేరు. అప్పుడు ఆయనకు భయం వేసిందిట. కాని ఆ భయంలో కృంగిపోకుండా, తనను తానే ఓదార్చుకున్నాడుట. ఎందుకు అనవసరంగా భయపడుతున్నాను. రెండవది ఉంటే కదా భయం కలిగేది? నేను ఒక్కడినే ఉన్నాను. దేన్ని చూచి భయపడాలి అనుకున్నాడు. ఇది అద్వైత వేదాంతంలో అక్షరలక్షలు విలువ చేసే వాక్యం.

రెండవ వస్తువు ఎందుకు భయం కలిగిస్తుంది? రెండవ వస్తువును చూస్తే మీకు దాని మీద రాగమో, ద్వేషమో ఏర్పడుతుంది. ఒక వ్యక్తితో నాలుగురోజులు కలిసి మెలిసి తిరిగితేనే అతని మీద రాగమో, ద్వేషమో ఏర్పడుతుంది. రాగం ఏర్పడితే, అతను దూరమవుతాడేమోననే భయమే దుఃఖాన్ని కలుగజేస్తుంది. ఆ వ్యక్తి నిజంగా దూరమవనవసరం లేదు, దూరమవుతాడేమోననే భయం చాలు. అర్జునునికి జరిగింది అదే.

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥** – గీత 1.29

అర్జునుడు యుద్ధభూమిలో ఇంకా భీష్మాచార్యులను, ద్రోణాచార్యులను చంపనేలేదు. చంపబోతున్నాననే ఆలోచనే అతన్ని శోకంలో ముంచెత్తింది. రాగంయొక్క శక్తి అటువంటిది. ఈ రాగం ద్వైతం ఉంటే వస్తుంది. అందువల్ల ద్వైతం = సంసారం.

5. **సవికారం-సంసారం:** ఎక్కడ సవికారం ఉంటే అక్కడ సంసారం ఉంటుంది. శరీరం కాలం కోరల్లో చిక్కుకుని, షడ్వికారాలకు లోనవుతుంది. అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. శరీరం ఒకప్పుడు ఆనందహేతువు. కాని వయస్సుమీద పడుతున్నకొద్దీ, అదే శరీరం దుఃఖహేతువు. ఎవరైనా, 'నీ ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగితే దానికి జవాబు యాభయ్యోపడికి అటా, ఇటా అనే అంశంమీద ఆధారపడి ఉంటుంది.' యాభయ్యోపడికి ముందైతే, 'భేషుగ్గా ఉంది,' అంటారు. తర్వాతైతే 'లేచి నిలుచోవటమే గగనమై పోతోంది,' అంటారు. ఏ శరీరాన్ని చూసుకుని మురిసిపోయామో, ఏ శక్తిని చూసుకుని మిడిసిపాటు పడ్డామో, అవే మనను కృంగదీస్తున్నాయి. అందువల్ల సవికారం = సంసారం.

6. **కార్యకారణ రూపం - సంసారం:** ఎక్కడ కార్యకారణరూపం ఉంటే అక్కడ సంసారం ఉంటుంది. అదెలా? దీనికి అనేక కారణాలు చెప్పవచ్చు. ప్రస్తుతానికి ఒకటి చూద్దాము.

మీకు ఈ జన్మ, మీ పూర్వజన్మ కర్మఫలితంగా వచ్చింది అనుకుంటే, ప్రారబ్ధకర్మకు లోబడి ఉంటారు. మీరు విధిచేతుల్లో కీలుబొమ్మలనీ, విధి ఆడించిన వింత నాటకాన్ని ఆడక తప్పదనీ అనుకుంటారు. అందువల్ల మీ విధి లేదా మీ ప్రారబ్ధకర్మ ఎప్పుడే ఆటాడిస్తుందో, ఎటునుంచి ప్రమాదం పొంచివుందో, నిరంతరం భయపడుతూనే ఉంటారు. అంటే మీరు కార్యం, మీ పూర్వజన్మ కర్మఫలం కారణం అని చెప్పవచ్చు. కార్యంగా మీరు ఎప్పటికీ సంసారులే.

ఇప్పుడు ఇంకో కోణంలోంచి చూద్దాము. ఇక్కడ మీరు విధి చేతుల్లో కీలుబొమ్మలు కాదు; మీకు ఫ్రీవిల్ ఉంది, దాన్ని ఉపయోగించి మీ భవిష్యత్తును మీరే తీర్చిదిద్దుకునే శక్తి ఉంది. అంటే మీరు కారణం, మీ భవిష్యత్తు మీరు చేసే కర్మలనుంచి వచ్చే కార్యం అవుతుంది. అప్పుడు మీరు ఆనందంగా ఉంటారా? అప్పుడూ ఉండరు. ఎందుకంటే మీరు ఆశించినట్టుగా విజయం సాధించగలరో లేదో, మీ ప్రయత్నం ఫలిస్తుందో లేదో అనే భయం మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఉదాహరణకు కూతురు పెళ్ళి చేద్దామనుకుంటున్నారు. కాని మంచి సంబంధం కుదురుతుందో లేదో, కుదిరినా పెళ్ళి అవుతుందో లేదో, పెళ్ళి అయినా పదికాలాలు వారి కాపురం నిలబడుతుందో లేదో - అన్నీ బెంగలే, భయాలే. భయం, భయం, బ్రతుకు భయం.

మీరు ఫ్రీవిల్‌ను నమ్ముకుని, మిమ్మల్ని కారణంగా భావించుకుంటే, అప్పుడు మీరు కర్త అవుతారు; మీరు విధిని నమ్ముకుని, మిమ్మల్ని కార్యంగా భావించుకుంటే అప్పుడు మీరు భోక్త అవుతారు. కర్తగా అయినా, భోక్తగా అయినా సంసారం తప్పదు. భగవద్గీతలో సంసారం అంటే కర్తా, భోక్తా అని కృష్ణపరమాత్మ పదేపదే నిర్వచిస్తాడు. కర్తా, భోక్తా అంటే కార్య, కారణరూపం. అందువల్ల కార్యకారణ రూపం = సంసారం.

ఆ విధంగా ఈ మూడుపాదాలను ఎటునుంచి చూసినా అవి సంసారంలోనే పడవేస్తాయి. సంసారంలోంచి బయటకు రావాలంటే, దానికి ఒక్కటే మార్గం ఉంది. అది తురీయం స్థాయికి ఎదగటమే.

7. **అద్వైతం – మోక్షం:** అద్వైతంలో సంసారం లేదు.

**న బిభేతి న కుతశ్చనేతి** – తైత్తిరీయమ్

అద్వైతంలో కొంచెం కూడా భయం లేదు.

8. **నిర్వికారం – మోక్షం:** నిర్వికారంలో కాలపరిమితి లేదు; చావు, పుట్టుకలు లేవు. యమధర్మరాజు భయపెట్టలేడు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – గీత 2.20

9. **కార్యకారణ విలక్షణం – మోక్షం:** కార్యం అయితే భోక్త, కారణం అయితే కర్తా అనీ, ఎలా చూసినా భయం తప్పదనీ చూశాము. కాని ఆత్మ కర్తా కాదు, భోక్తా కాదు.

ఆత్మ కార్యకారణ విలక్షణం కాబట్టి, ఆత్మ అకర్తా, అభోక్తా. అందువల్ల సంసారం అంటదు. అటువంటి ఆత్మజ్ఞానం పొందాలి.

మన అద్వైత వేదాంత ప్రయాణాన్ని మళ్ళీ ఒకసారి టూకీగా చూస్తే ఆత్మయొక్క మూడు పాదాలు కార్యకారణ పాదాలు. అవి సవికారం కాబట్టి, ద్వైతం కాబట్టి అవి సంసారంలో పడవేస్తాయి. ఆత్మయొక్క నాలుగవ పాదం కార్యకారణ విలక్షణం. అది నిర్వికారం కాబట్టి, అద్వైతం కాబట్టి సంసారంనుంచి మోక్షాన్ని కలుగజేస్తుంది. అందువల్ల మనం మొదటి మూడు పాదాలనుంచి, నాలుగవ పాదానికి రావాలి.

ఈ నేపథ్యంతో ఈ అద్వైత ప్రకరణమ్‌లోకి అడుగుపెడదాము. ఈ అధ్యాయాన్ని ప్రధానంగా 5 అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. ఉపోద్ఘాతం – కారికలు 1, 2
2. సృష్టి నిషేధవాదన – కారికలు 3–30
3. ఆత్మజ్ఞానం – కారికలు 31–39

4. నిదిధ్యాసనం - కారికలు 40-47
5. ఉపసంహారం - కారిక 48

(ఈ అంశాలను **అద్వైతానికి తొమ్మిది మెట్లుగా** ఈ అధ్యాయం చివర్లో చూడవచ్చు.)

**కారిక 3.1**

**ఉపాసనాశ్రితో ధర్మో జాతే బ్రహ్మణి వర్తతే ।**
**ప్రాగుత్పత్తేరజం సర్వం తేనాసౌ కృపణస్స్మృతః ॥**

1. **ఉపోద్ఘాతం - కారికలు 1, 2**

మొదటి రెండు కారికల్లో గౌడపాదాచార్యులవారు తను చెప్పబోయే అంశాన్ని పరిచయం చేస్తున్నారు. ద్వైతం = సంసారం అంటున్నారు. ద్వైతం అంటే దానికి చూసిన పర్యాయ పదాలను గుర్తు తెచ్చుకోవాలి అని చూశాము. అవి పాదత్రయం, సవికారం, కార్యకారణ రూపం. ఇవన్నీ సంసారానికి హేతువులు.

ద్వైతం ఎక్కడ ఉంటే అక్కడ సంసారం ఉంటుంది. అది లౌకికంగా అవనీ, మతపరంగా అవనీ. ఈ సూత్రం ప్రకారం గొప్ప ఉపాసకుడు కూడా ద్వైతంలోకే వస్తాడు అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. ఉపాసనలో కూడా ఉపాస్యదేవత - ఉపాసకుడు భేదం ఉంది. భేదం ఉంటే అది ద్వైతం. ద్వైతం అయితే సవికారం, కార్యకారణరూపం. ఇవన్నీ సంసారానికి దారితీస్తాయి. అందువల్ల ఉపాసన కూడా సంసారమే. ఈ అధ్యాయంలో మనం అంత తేలిగ్గా జీర్ణించుకోలేని అంశాల్లో ఇది మొట్టమొదటిది.

మనకు తెలిసి కర్మ, భక్తి, ఉపాసన - ఇవన్నీ గొప్ప కర్మలు. ముఖ్యంగా ఉపాసన వీటిల్లో శ్రేష్ఠమైనది. కాని ఇక్కడ గౌడపాదాచార్యుల వారు మొదటే ఒక అణుబాంబు వేస్తున్నారు. గొప్ప ఉపాసకుడు కూడా సంసారే అంటున్నారు. లౌకిక విజయాల వెంట పరుగులు తీసే వ్యక్తి లౌకిక సంసారి అయితే, ఉపాసన చేసే ఉపాసకుడు మతపరమైన సంసారి అంతే అంటున్నారు.

ఈ భాగాలను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఎటువంటి విపరీతధోరణులకూ పోకూడదు. ఉపాసనను ఆయన విమర్శిస్తున్నారని కోపమూ తెచ్చుకోకూడదు; ఉపాసనను విమర్శిస్తున్నారు కాబట్టి ఇవాళ్టినుంచి ఉపాసనను మానేస్తాననీ అనకూడదు. రెండూ రెండు విపరీత ధోరణులు. వేదాలసారం కాని గీతాసారం కాని చూస్తే, అవి పదేపదే చెప్పేది ఒకటే. ఒక సాధకుని ప్రయాణం - కర్మయోగం చేసి చిత్తశుద్ధి పొంది, ఉపాసనయోగం చేసి చిత్త ఏకాగ్రత పొంది, జ్ఞానయోగానికి వచ్చి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసి ఆత్మజ్ఞానం పొందితే మోక్షం వస్తుంది. కాబట్టి ఉపాసనను పూర్తిగా ఖండించటం లేదు శాస్త్రం. కాని

దాన్నే అంతిమలక్ష్యంగా చేసుకోవద్దని అంటున్నది. ద్వైతంనుంచి అద్వైతానికి అడుగుపెట్టే ఒక మెట్టుగా భావించాలి ఉపాసనను. మన ప్రయాణం లౌకిక ద్వైతంనుంచి ఆధ్యాత్మిక ద్వైతానికి వచ్చి, అద్వైతంతో ముగియాలి కాని వచ్చిన చిక్కేమిటంటే, చాలామంది ఆధ్యాత్మికత పేరుతో శాశ్వతంగా ద్వైతంలోనే మిగిలిపోతున్నారు. అటువంటివారిని కృపణులు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

ఈ కారికలు చాలా లోతైన కారికలు. ఇవి చాలా రహస్యమైన కారికలు కూడా. సందర్భంనుంచి విడదీసి, వీటిని మాత్రం నలుగురిలో చెబితే వాటిని అపార్థం చేసుకునే ప్రమాదం ఉంది.

**ధర్మః** – ఇక్కడ ధర్మః అంటే జీవులు. ఎటువంటి జీవులు?

**ఉపాసనాశ్రితః** – ఉపాసన చేసే ఉపాసకుడు. ఉపాసన అంటే సగుణఈశ్వరధ్యానం; ఈశ్వరుని గుణాలమీద చేసే ధ్యానం. అటువంటి ఉపాసకుడు సహజంగానే పరమాత్మను ఉన్నత గుణాలు ఉన్నట్టుగానూ, తనను తక్కువస్థాయిగానూ ఊహించుకుంటాడు. అందువల్ల ఈ ఉపాసనలో ఉపాస్య, ఉపాసక ద్వైతం వస్తుంది. ప్రతి ఒక్క సగుణ ఉపాసకుడు కూడా ఈ ద్వైతప్రపంచంలోనే ఆగిపోతాడు. సహజంగానే ద్వైతం ఎక్కడ ఉంటే అక్కడ కార్య–కారణ రూపం ఉంటుంది.

**జాతే బ్రహ్మణి వర్తతే** – జాతబ్రహ్మ అంటే కార్యబ్రహ్మ. ఉపాసకునికి కార్య–కారణ సంబంధమే తెలుసు. కార్యకారణ విలక్షణ బ్రహ్మ ఒకటి ఉందని తెలియదు. అతను మొదటి మూడు పాదాల్లో ఏదో ఒక దాన్లో ఉంటాడు. విశ్వ–విరాట్ జంట, తైజస–హిరణ్యగర్భ జంట లేదా ప్రాజ్ఞ–ఈశ్వర జంట.

**ప్రాగ్ ఉత్పత్తేః** – ఉత్పత్తి అంటే సృష్టి. ప్రాగ్ అంటే దానికి ముందు. అంటే జగత్తుయొక్క సృష్టికి ముందు.

**అజం సర్వమ్** – అంతా కారణరూపంలో ఉంది. అజం అంటే కారణబ్రహ్మ రూపం. సృష్టికి ముందు అంతా కారణంలో ఉంటే, సృష్టి జరిగాక అంతా కార్యరూపంలో ఉంది. అంటే ఉపాసకుని దృష్టి కార్య–కారణ బ్రహ్మలోనే ఉంది. సృష్టికి ముందు పరమాత్మే ఉన్నాడు; ఆ పరమాత్మనుంచే సృష్టి వచ్చింది కాబట్టి పరమాత్మ కారణం, జగత్తు కార్యం అంటాడు. అంటే అతను సృష్టి, స్థితి, లయ వృత్తంలోనే ఉంటాడు.

'ప్రాగుత్పత్తేరజం సర్వం,' పదాలను ఇన్‌వర్టెడ్ కామాల్లో పెట్టాలి. ఇలా అనుకుంటున్నాడు ఉపాసకుడు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఇది ఒక ఉపసిద్ధాంతం.

ఉపాసకుని ఈ ఆలోచననుంచి మనం ఇంకొక ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి. ఉపాసకుడు ద్వైతంలో ఉన్నంతవరకూ అంటే కార్య-కారణబ్రహ్మ భావనలో ఉన్నంతవరకూ అతను కాలపరిమితిలోనే ఉంటాడు. అంటే అంతా సవికారం అనుకుంటాడు. దానివల్ల అతను మోక్షాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోడు. అతని దృష్టిలో మోక్షం అంటే, అతను పరమాత్మనుంచి వచ్చాడు, అందువల్ల తిరిగి వెనక్కి పరమాత్మ దగ్గరకు వెళ్ళటమే మోక్షం అనుకుంటాడు. ఇంకో విధంగా చెప్పాలంటే పరమాత్మనుంచి రావటం సంసారం, తిరిగి వెనక్కి పరమాత్మ దగ్గరకు వెళ్ళటం మోక్షం. నిజానికి అటువంటి భావన తప్పు. ఎందుకంటే మోక్షం కాలాతీతమైనది.

అద్వైతం నువ్వు నిత్యశుద్ధ ముక్త పురుషుడివి అంటుంది. ఒక సమయంలో వచ్చింది ఇంకొక సమయంలో పోతుంది. ఉపాసకుడు తను పరమాత్మ నుంచి వచ్చాను అని భావించినప్పుడు, అతను కార్యం, పరమాత్మ కారణం అవుతారు. తను ప్రయాణం చేసి వెనక్కి వెళ్ళి కలవటం మోక్షం అనుకుంటాడు. పరమాత్మతో ఐక్యం అవటమే మోక్షం అనుకుంటే, అతను దాన్ని భవిష్యత్తులో జరిగే ఒక సంఘటనగా చూస్తున్నాడు. 'పరమాత్మలో ఎప్పుడు ఐక్యం అవుతాను?' ఈ ప్రశ్న ఆధ్యాత్మిక ప్రయాణం తొలిదశల్లో అడిగితే ఫర్వాలేదు.

కాని తర్వాత మోక్షం అంటే అక్షరాలా పరమాత్మతో ఐక్యం అవటం కాదు, తను తురీయ ఆత్మనని అర్థం చేసుకోవటమే అని అర్థం చేసుకోవాలి. మోక్షం భవిష్యత్తులో వస్తుంది అని భావిస్తేనే, అతను కాలపరిమితిలో ఉన్నాడని అర్థం. అంటే అతను సవికారంలో, కార్య-కారణంలో ఉన్నాడని అర్థం. కాకపోతే ఈ విషయాలు ఉపాసకునికి తెలియవు. గౌడపాదాచార్యులవారు ఆ ఉపాసకునిమీద చాలా జాలి పడుతున్నారు.

**తేన** - ఈ ద్వైతం భావనవల్ల,

**అసౌ** - ఈ ఉపాసకుణ్ణి

**కృపణః స్మృతః** - జ్ఞానులు దీనుడిగా భావిస్తున్నారు. మొత్తం ప్రపంచం ఈ ఉపాసకుణ్ణి దేవీ ఉపాసకునిగా, హనుమ ఉపాసకునిగా కీర్తించుగాక, అతనికి సిద్ధులు కలుగుగాక, కాని అద్వైతాన్ని అర్థం చేసుకున్న జ్ఞానుల దృష్టిలో అతను దీనుడు, దురదృష్టవంతుడు. ఎందుకంటే అతను ద్వైతంలోనే ఉన్నాడు.

ఈ విధంగా గౌడపాదాచార్యులవారు తను చెప్పదలుచుకున్న అంశాన్ని మొదటి రెండు కారికల్లో పరిచయం చేస్తున్నారు.

చతుష్పాద ఆత్మయొక్క మొదటి మూడు పాదాలతో ఎవరైనా మమేకం చెందితే, వారు ద్వైతంలో ఉన్నట్టు అర్థం. ఎందుకంటే వాటిల్లో ద్వైతం వ్యక్తంగానో, అవ్యక్తంగానో ఉంది.

అంతేకాదు, వీటిని కార్య-కారణరూప పాదాలు అంటారని చూశాము. మొదటి రెండు పాదాలు కార్యపాదాలు అయితే, మూడవపాదం కారణపాదం అవుతుంది. కార్య-కారణాలు మార్పు చెందుతాయి. కారణం మార్పు చెంది కార్యంగా రూపుదిద్దుకుంటే, కార్యం మార్పు చెంది కారణంలో లయమవుతుంది. అందువల్ల ఇవి సవికారం.

ఎక్కడ సవికారం ఉంటే, అక్కడ కాలతత్త్వం ఉంటుంది. యమధర్మరాజుకు ఒక పేరు కాలః. కాలం ఉన్నచోట వృద్ధాప్యం, క్షీణించటం, మరణించటం ఉంటాయి. కాలపరిమితి ఉన్నచోట దుఃఖం లేదా సంసారం వస్తుంది. ఈ దుఃఖాన్నే కార్పణ్యం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అంటే నిస్సహాయత. మనం వృద్ధాప్యంలోకి అడుగుపెట్టకుండా ఆపలేము. నిజానికి వయసు పైనపడుతోంది అని మనం బెంగపడినకొద్దీ, వృద్ధాప్యం ముందే తోసుకువస్తుంది. అందువల్ల ఈ ఐదూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి.

పాదత్రయం = ద్వైతం = కార్యకారణరూపం = సవికారం = సంసారం

ఈ సంసారాన్నే కార్పణ్యం అంటున్నాము ఇక్కడ. అదే తురీయానికి వస్తే ఈ ఐదు లక్షణాలు భిన్నంగా ఉంటాయి.

చతుష్పాద ఆత్మ = అద్వైతం = కార్యకారణ విలక్షణం = నిర్వికారం = అసంసారం

దీన్నే అకార్పణ్యం లేదా మోక్షం అంటారు. గౌడపాదాచార్యులవారు ఈ మొదటి ఐదు అంశాలను మొదటి కారికలో పరిచయం చేస్తే, రెండవ కారికలో తక్కిన ఐదు అంశాలను పరిచయం చేస్తున్నారు.

ఈ రెండింటిలో దేన్ని ఎన్నుకుంటారో మీయిష్టం. పాదత్రయంలోనే ఉండిపోయి, సంసారంలోనే ఉంటానంటే మిమ్మల్ని ఎవరూ కాపాడలేరు. ఎందుకంటే దాన్ని మీరే కోరి ఎన్నుకున్నారు కాబట్టి.

లేదు, నేను పాదత్రయాన్ని దాటి తురీయానికి వస్తాను; నేను నిత్యముక్తపురుషుణ్ణి అని అర్థం చేసుకుంటాను అంటే మీకు స్వాగతం పలుకుతున్నారు గౌడపాదాచార్యులవారు. సంసారమా, మోక్షమా? ఏది కావాలి. నిజానికి మీరు మాండూక్యోపనిషత్‌కి వచ్చి, రెండు అధ్యాయాలు పూర్తి చేసుకున్నారు అంటేనే మీరు మోక్షం పొందటానికి సిద్ధపడి వచ్చారని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది అని గౌడపాదాచార్యుల వారి ఉద్దేశ్యం. అందువల్లనే ఈ అధ్యాయంలో తురీయం గురించి బోధ చేయటానికి నిర్ణయించుకున్నారు. తురీయం అద్వైతం కాబట్టి ఈ అధ్యాయాన్ని అద్వైత ప్రకరణమ్ అంటారు.

ఈ అధ్యాయానికి ఈ క్రింది ఐదు పేర్లలో ఏదైనా పెట్టవచ్చు - తురీయ ప్రకరణం, అద్వైత ప్రకరణం, కార్యకారణ విలక్షణ ప్రకరణం, నిర్వికార ప్రకరణం, మోక్ష ప్రకరణం.

కాని వీటిల్లో గౌడపాదాచార్యుల వారు అద్వైత ప్రకరణం అనే పేరు ఎన్నుకున్నారు. ఎందుకంటే, అద్వైతమ్ పదం ఏడవ మంత్రంలో వచ్చింది.

**శాంతం శివమద్వైతమ్** – 7

మొదటి కారికలో ద్వైతం ఉన్నవారిని కృపణులు అన్నారు గౌడపాదాచార్యులవారు. ఉపాసన చేసేవారు ఉపాస్య–ఉపాసక ద్వైతంలో ఉన్నారు. ఉపాసన గొప్పదే కావచ్చు కాని అది కూడా ద్వైతమే. మతపరమైన జీవనం, ఆధ్యాత్మిక చింతన వైపుకు దారితీయాలి. అలా ఒకవేళ దారి తీయకపోతే, వారు మతపరంగా దురదృష్టవంతులు. మతాన్ని నమ్మనివారు నాస్తికులుగా దురదృష్టవంతులైతే, మతాన్ని నమ్మి అద్వైతానికి రానివారు ఆస్తికులుగా దురదృష్టవంతులు. ఏ విధంగానైతేనేమి, రెండురకాలవారూ దురదృష్టవంతులే.

అయితే అదృష్టవంతులెవరు? రెండవ కారికలో వర్ణించబోతున్నారు గౌడపాదాచార్యులవారు.

**కారిక 3.2**

**అతో వక్ష్యామ్యకార్పణ్యమజాతి సమతాం గతమ్ ।**
**యథా న జాయతే కించిజ్జాయమానం సమంతతః ॥**

**అతః** – అందువల్ల. ఆత్మయొక్క పాదత్రయం సంసారంలోకి వస్తుంది కాబట్టి,

**వక్ష్యామి** – నేను బోధిస్తాను. దేని గురించి? అది మనం కలుపుకోవాలి. మాండూక్యోపనిషత్‌లోని ఏడవమంత్రంలో వచ్చిన ఆత్మ యొక్క తురీయపాదం గురించి బోధిస్తారు. ఎటువంటి తురీయం అది?

**అకార్పణ్యమ్** – ఎటువంటి దుఃఖం లేని, దురదృష్టకరం కాని, కాలానికి లొంగని, వికారాలు లేని తురీయం అది. అకార్పణ్యమ్ అంటే సంసారరహిత తురీయం.

**అజాతి** – అజాతి అంటే కార్యకారణ విలక్షణం. జాతి అంటే పుట్టుక లేదా సృష్టి. అజాతి అంటే సృష్టిలేనిది అని అర్థం. సృష్టిలోనే కార్య–కారణ పదాలు వాడుకలోకి వస్తాయి. జాతి అంటే కులం కాదు ఇక్కడ, జాతి అంటే జన్మ. అందువల్ల అజాతి అంటే జన్మరహితం లేదా కార్యకారణ సంబంధ రహితం. అందువల్లనే మాండూక్య కారికలను **అజాతి వాదః** అని కూడా అంటారు. అజాతివాదన అంటే కార్యకారణ విలక్షణ బ్రహ్మ గురించి బోధ.

**సమతా గతమ్** – అంటే నిర్వికారం, మార్పులు లేనిది. శరీరం షడ్వికారాలకు లోనవుతుంది; మనస్సులో షడ్వికారాలు చోటుచేసుకుంటాయి; బుద్ధిలో మార్పులు కలుగుతూ ఉంటాయి. అందువల్ల ఇవన్నీ విషమమ్ అయితే తురీయం సమం అవుతుంది. అంటే ఎప్పటికీ మారనిది.

**యథా న జాయతే కించిత్** – తురీయం కారణం కాదు, దాన్నుంచి ఏదీ పుట్టలేదు అని నేను

బోధించబోతున్నాను అంటున్నారు గౌడపాదాచార్యులవారు. తురీయం కారణం కాకపోతే, తురీయం కార్యకారణ విలక్షణమ్ అని మనం అర్థం చేసుకోవాలి.

**జాయమానం సమంతతః** – సృష్టి జరిగినట్టుగా కనిపిస్తున్నా కూడా, అది ఎలా మన భ్రమో, ఎలా నిజంగా సృష్టి జరగలేదో నేను నిరూపిస్తాను అనికూడా అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. స్వప్నంలో మనకు ఎదురుగా, అక్షరాలా కనిపించే వస్తువులు, మనం స్వప్నంనుంచి లేస్తే, అవి మిథ్యగా తేలిపోతాయి. అదే విధంగా ఈ జాగృత్ ప్రపంచం పంచభూతాలనుంచి వచ్చిందని, అవి కూడా సృష్టించబడ్డాయని నేర్చుకున్నా కూడా, జాగృత్ ప్రపంచం కూడా మిథ్యే అని నిరూపించబోతున్నారు. అందువల్ల **తురీయం కార్యకారణ విలక్షణం**.

**కారిక 3.3**

**ఆత్మా హ్యాకాశవజ్జీవైర్ఘటాకాశైరివోదితః ।**
**ఘటాదివచ్చ సంఘాతైర్జాతావేతన్నిదర్శనమ్ ॥**

### 2. సృష్టి నిషేధ వాదన – కారికలు 3–30

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు సృష్టి నిజంగా జరగలేదని నిరూపించబోతున్నారు. దాన్ని సృష్టినిషేధ వాదన అంటారు. ఆ విషయాన్ని గొప్పగా ఆరంభించబోతున్నారు. అందులో తురీయం కార్య–కారణ విలక్షణం అని నిరూపించబోతున్నారు. కార్యం–కారణం అంశాల్లో, గౌడపాదాచార్యుల వారు రెండవ అంశం అయిన కారణంమీద ఎక్కువగా దృష్టి పెట్టబోతున్నారు. అంటే తురీయం కారణవిలక్షణం అని చూపించబోతున్నారు.

కారణ విలక్షణం అంటే ఏమిటి? అంటే తురీయం సృష్టి కారణం కాదు; తురీయం నుంచి ఏదీ పుట్టలేదు. విశ్లేషణ తేలిగ్గా చేయటం కోసం సృష్టిని రెండుగా విభజించారు – జీవసృష్టి, జగత్సృష్టి. ఇంకో విధంగా చెప్పాలంటే చేతనసృష్టి, అచేతనసృష్టి. ఇటు జీవుడు కాని, అటు జగత్ కాని తురీయంనుంచి పుట్టలేదు అని నిరూపించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. తురీయంనుంచి జీవ, జగత్తుల సృష్టి జరగలేదు అని నాలుగు దశల్లో నిరూపించదలుచుకున్నారు. అవి –

ఎ) యుక్త్యా జీవసృష్టి నిషేధః – కారికలు 3–9
బి) యుక్త్యా జగత్సృష్టి నిషేధః – కారిక 10
సి) శ్రుత్యా జీవసృష్టి నిషేధః – కారిక 11–14
డి) శ్రుత్యా జగత్సృష్టి నిషేధః – కారికలు 15,16,23 –30

ఇప్పుడు వాటిని వివరంగా చూద్దాము.

ఎ) **యుక్త్యా జీవసృష్టి నిషేధః** – యుక్తి అంటే తర్కం. తర్కం ఉపయోగించి జీవాత్మ–పరమాత్మల మధ్య కార్యకారణ సంబంధం లేదని నిరూపించదలుచుకున్నారు. అంటే జీవాత్మ, పరమాత్మనుంచి పుట్టలేదు. అది పెద్ద పొరపాటు, కాకపోతే ఆ పొరపాటును లోకగ్రీవంగా స్వీకరిస్తున్నారు. లోకమంతా సత్యంగా స్వీకరించే పొరపాటు ఇది – నేను జీవాత్మను, నేను పరమాత్మనుంచి వచ్చాను; అందువల్ల నేను వెనక్కి తిరిగి పరమాత్మ దగ్గరకు వెళ్ళాలి. అదే మోక్షం. కాని ఈ పొరపాటును లోతుగా విశ్లేషిస్తే అది నిలబడదు.

జీవాత్మ–పరమాత్మల మధ్య కార్యకారణ సంబంధం లేదని నిరూపించటానికి గౌడపాదాచార్యుల వారు శాస్త్రం ఇచ్చే ఆకాశ దృష్టాంతాన్ని తీసుకుంటున్నారు. ఆకాశం అంటే ప్రదేశం. ఇక్కడ రెండురకాల ఆకాశాన్ని తీసుకుంటున్నారు. అవి ఘటాకాశం, మహాకాశం. ఘటాకాశం అంటే కుండలో ఉన్న ప్రదేశం. మహాకాశం అంటే పైన ఉన్న ఆకాశం.

జీవాత్మను ఘటాకాశంతోనూ, పరమాత్మను మహాకాశంతోను పోల్చవచ్చు. ముందు ఘటాకాశం, మహాకాశాలను తీసుకుంటే కొన్ని భావనలు కలుగుతాయి కాని, లోతుగా విశ్లేషిస్తే అవి తేలిగ్గా వీగిపోతాయి. అవేమిటో చూద్దాము.

1. **ఉత్పత్తిః** – సృష్టి. మహాకాశంనుంచి ఘటాకాశం పుట్టిందని అనుకుంటాము. కాని నిజానికి ఘటాకాశం ఎన్నడూ పుట్టదు. ఘటం (కుండ) మాత్రమే పుడుతుంది, అందులో ఆకాశం ముందే ఉంటుంది. కుండలో కొంత ఆకాశం ఉన్నట్టుగా అనిపించటం వల్ల దానికొక కొత్త నామధేయాన్ని ఇస్తాము. ఘటంలో ఉంది కాబట్టి దాన్ని ఘటాకాశం అంటాము. ఘటం పుట్టటం వల్ల ఆకాశం కూడా పుట్టింది అనుకుంటాము. అంటే కుండకు చెందిన పుట్టుకను పొరపాటుగా ఆకాశానికి మారుస్తాము. దీన్ని ఉత్పత్తి అంటారు.

'నేను ఇల్లు కడుతున్నాను.' ఈ వాక్యంలో కూడా మనం ఇదే పొరపాటు చేస్తున్నాము. అంతటా ఉన్న ఆకాశానికి నాలుగు గోడలు కట్టి, వాటిని గదులుగా చేసి, వాటన్నిటికీ ఒక ఆకారం ఇచ్చి ఇల్లు అంటున్నాము. ఇల్లు అంటే మనం నివాసం ఉండేది. నిజానికి మనం నివాసం ఉండేది ఆకాశంలోనే. కాబట్టి, నిజం చెప్పాలంటే, ఇల్లు, ఆకాశానికి ఇంకోపేరు మాత్రమే. ఆకాశాన్ని కొత్తగా కట్టము మనం; ఉన్న ఆకాశానికి గోడలు పెట్టి, ఇల్లనే నామకరణం చేస్తాము అంతే.

ఉదాహరణకు మనం చెన్నైకి రైలులో వెళితే, చెన్నై ముందు స్టేషన్ అయిన బేసిన్ బ్రిడ్జి రాగానే ఉత్సాహంగా 'అదుగో, చెన్నై వచ్చేసింది,' అని అరుస్తాము. నిజానికి చెన్నై రాలేదు. మనం చెన్నై చేరుకుంటున్నాము. రైలుకు వాడాల్సిన వచ్చింది పదాన్ని చెన్నైకి మార్చి వాడుతున్నాము. అలాగే కుండకు వాడాల్సిన పుట్టింది పదాన్ని, ఆకాశానికి వాడుతున్నాము.

2. **నాశః** – నాశనం. కుండ పగిలిపోతే, ఘటాకాశం పోయింది అంటాము. నిజానికి ఆకాశం ఎక్కడికీ పోదు. ఆ నాశనం కుండది మాత్రమే.

3. **దోషః** – దోషం. ఆకాశంలో ఉండే అనేక వస్తువులకు మలినం అంటుతుంది. వాయువు కాలుష్యం చెందుతుంది, నీరు కాలుష్యం చెందుతుంది, భూమి కాలుష్యం చెందుతుంది కాని ఆకాశానికి కాలుష్యం అంటదు.

4. **విశేషః** – రూపం. ప్రతి జీవాత్మకు ఒక రూపం ఉంటుంది. ఆ రూపంవల్ల ఒక ప్రత్యేకత ఉంటుంది. పెద్దకుండ, చిన్నకుండ అంటాము. గదిని వృత్తాకార గది అని, నలుచదరపు గది అనీ అంటాము. ఆ విధంగా వస్తువునుబట్టి, ఆకాశానికి రూపాన్ని ఇస్తాము కాని నిజానికి ఆకాశానికి విశేషరూపం లేదు.

5. **సంబంధః** – సంబంధం. తమాషా ఏమిటంటే భాగాలు లేని ఆకాశాన్ని భాగాలుగా విభజించి, ఆ భాగాల మధ్య సంబంధాన్ని కూడా నిర్వచిస్తాము. ఆకాశాన్ని మహాకాశంగానూ, ఘటాకాశంగానూ విభజించి, మహాకాశం కారణం అనీ, ఘటాకాశం కార్యం అనీ, వీటి మధ్య కారణ–కార్య సంబంధం ఉందనీ నిర్వచిస్తాము.

కాని నిజానికి అలాంటి సంబంధం ఉండే ఆస్కారమే లేదు. కుండ పుట్టకముందు ఆకాశం ఉంది. అలాగే ఇల్లు పుట్టకముందూ ఆకాశం ఉంది. మనం ఇంట్లో ఆకాశం ఉంది అంటాము కాని, నిజానికి ఆకాశంలోనే ఇల్లు ఉందనే విషయాన్ని విస్మరించాము.

ఈ విధంగా ఘటాకాశం–మహాకాశం గురించి ఐదు పొరపాట్లు చేస్తున్నాము. అవి – ఉత్పత్తిః, నాశః, దోషః, విశేషః, సంబంధః. ఇప్పుడు ఇవే సూత్రాలను జీవాత్మకు, పరమాత్మకు అన్వయించి చూద్దాము.

1. **ఉత్పత్తిః** – సృష్టి. జీవాత్మ ఎన్నడూ పుట్టలేదు. జీవాత్మ అంటే జీవ+ఆత్మ. కార్యకరణ సంఘాతంలో ఉన్న ఆత్మను జీవాత్మ అంటారు. ఆత్మ అంటే చైతన్యం. కార్యకరణ సంఘాతాన్ని శరీరం అంటే, ఆత్మను శరీరీ అంటారు. శరీరం పుడుతుంది కాని, శరీరీ ఎన్నడూ పుట్టదు. అందువల్ల జీవాత్మ పుట్టిందనటం పెద్ద పొరపాటు.

2. **నాశః** – నాశనం. జీవాత్మ మరణిస్తుందనేది ఇంకొక పెద్ద పొరపాటు. జీవాత్మకు ఎన్నడూ మరణం లేదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – గీత 2.20

ఆత్మ ఎన్నడూ పుట్టదు, మరణించదు. ఆత్మను కప్పిన శరీరం మరణించినా, ఆత్మ ఎన్నడూ మరణించదు.

3. **దోషః** – మలినం. ఆత్మకు ఎన్నడూ మలినాలు అంటవు. ఆత్మ అయిన నేను నిత్య శుద్ధముక్తబుద్ధచైతన్యస్వరూపాన్ని. దోషాలు శరీరానికి, మనస్సుకు చెందుతాయి కాని వాటిల్లో ఉన్న చైతన్యమైన నాకు ఏ విధమైన దోషాలు అంటవు.

**న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ మదో నైవ మే నైవ మాత్సర్యభావః**
**న ధర్మో న చార్థో న కామో న మోక్షః చిదానంద రూపః శివోఽహం శివోఽహమ్**

4. **విశేషః** – రూపం. ఆత్మనైన నాకు ప్రత్యేకించి రూపంగాని, గుణాలు కాని లేవు. నేను పుడితేనే కదా నాకొక వివరణ వచ్చేది. ఏదైనా చెప్పాలంటే శరీరం గురించి చెప్పాలి కాని, ఆత్మనైన నాకు ఏ గుణాలూ అంటవు.

**నాంతఃప్రజ్ఞం న బహిః ప్రజ్ఞమ్ నోభయతః ప్రజ్ఞమ్**
**న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞమ్ నాఽప్రజ్ఞమ్** – మాండూక్యమ్ 7

5. **సంబంధః** – సంబంధం. ఇది అన్నింటిలోకి పెద్ద పొరపాటు. సర్వవ్యాపకమైన చైతన్యాన్ని రెండుగా విభజిస్తాము. నేను జీవాత్మను, నేను పరమాత్మనుంచి పుట్టాను అనుకుంటాము. నిజానికి నేను చైతన్యాన్ని. చైతన్యమైన నాకు చావు పుట్టుకలు లేవు. నిజానికి చైతన్యపరంగా నేనూ పరమాత్మా ఒకటే. ఒకే చైతన్యానికి అది ఉన్న చోటుని బట్టి రెండు నామధేయాలు ఇచ్చాము. శరీరం లోపల ఉన్న చైతన్యాన్ని జీవాత్మ అంటున్నాము; బయట ఉన్న చైతన్యాన్ని పరమాత్మ అంటున్నాము. పేర్లు రెండు ఉన్నా, రెండింటిలోనూ ఉన్న ఆత్మ ఒకటే. ఒకచోట ఒక గీత గీసి, ఈ గీతకు ఇటువైపు కర్ణాటక అనీ, ఇటువైపు ఉన్నది తమిళనాడు అనీ అంటున్నాము కానీ ఉన్నదొకటే సర్వవ్యాపకమైన ఆకాశం.

నిజానికి జీవాత్మ, పరమాత్మ మధ్య సంబంధం లేదు. కాని సంబంధం గురించి మాట్లాడి తీరాలి అని ఒకవేళ మీరు అనేటట్లయితే, ఐక్య సంబంధం గురించి చెప్పవచ్చు. జీవాత్మ పరమాత్మ ఐక్యం అంటే ఇంక కార్యకారణ సంబంధానికి ఆస్కారమేది? అందువల్ల జీవాత్మ, పరమాత్మనుంచి పుట్టలేదు.

ఈ అంశాన్ని కారికలు 3–9ల్లో చూస్తాము. ఈ అంశాన్ని అర్థం చేసుకున్నాము కాబట్టి ఇప్పుడు కారికలను తేలిగ్గా అర్థం చేసుకోగలము.

1. **ఉత్పత్తిః** – ఈ కారికల్లో ఉత్పత్తి గురించి చెబుతున్నారు గౌడపాదాచార్యుల వారు.

**ఆత్మా ఆకాశవత్** – ఆత్మా అంటే పరమాత్మ లేదా తురీయం. ఈ పరమాత్మను ఆకాశం అంటే మహాకాశంతో పోల్చవచ్చు.

**ఘటాకాశైరివోదితః** – మహాకాశం ఘటాకాశంగా పుట్టినట్టు ఎలా అనిపిస్తుందో, అలాగే పరమాత్మ జీవాత్మగా పుట్టినట్టు అనిపిస్తుంది. కుండ పుడుతుంది కాని అందులో ఉండే ఆకాశం కాదు. నిజానికి శరీరం పుడుతుంది కాని అందులో ఉండే శరీరీ కాదు.

**ఘటాదివచ్చ సంఘాతైః** – కాని పరమాత్మ శరీరంలాగా పుట్టినట్టుగా అనిపిస్తుంది. ఎలాగైతే మహాకాశం ఘటంగా పుట్టినట్టుగా అనిపిస్తుందో, అలా పరమాత్మ జీవాత్మగా పుట్టినట్టుగా అనిపిస్తుంది. ఆకాశం కుండగా పుట్టిందని ఎలా చెప్పగలము? ఆకాశం కుండగా పుట్టలేదు, మట్టే కుండగా పుట్టింది అని అనుకుంటాము మనం. కాని ఆకాశం కుండగా కూడా పుట్టింది అని అర్థం చేసుకోవటానికి తైత్తిరీయోపనిషత్‌కు వెళ్ళాలి.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః । ఆకాశాద్వాయుః ।**
**వాయోరగ్నిః । అగ్నేరాపః । అద్భ్యః పృథివీ ।** – తైత్తిరీయమ్ 2.1.1

ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్నినుంచి జలం, జలంనుంచి భూమి పుట్టాయి. ఇక్కడ భూమినుంచి కుండ పుట్టింది అని కలుపుకుందాము. ఇప్పుడు మొదటి పదం, ఆఖరి పదం కలిపితే ఏమవుతుంది? ఆకాశం నుంచి కుండ పుట్టింది. అంటే మహాకాశం నుంచి ఘటాకాశమూ వచ్చింది, ఘటమూ వచ్చింది. అలాగే పరమాత్మ నుంచి జీవాత్మ వచ్చింది, శరీరమూ వచ్చింది.

**ఏతన్నిదర్శనమ్** – ఇది ఉదాహరణ. దేనికి?

**జాతే** – జీవాత్మ పుట్టినట్టుగా అనిపించటానికి. ఈ కారిక పుట్టుక ఒక పొరపాటు అంటున్నది.

**పొరపాటు 1 – ఉత్పత్తిః.**

**కారిక 3.4**

**ఘటాదిషు ప్రలీనేషు ఘటాకాశాదయో యథా ।**
**ఆకాశే సంప్రలీయంతే తద్వజ్జీవా ఇహాత్మని ॥**

2. **నాశః** – నాశనం కూడా ఒక పొరపాటే అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**యథా ఘటాదిషు ప్రలీనేషు** – ఎలాగైతే కుండవంటి వస్తువులు పగిలిపోయినప్పుడు,

**ఘటాకాశాదయో ఆకాశే సంప్రలీయంతే** –ఘటాకాశం, మహాకాశంలో లయమయినట్టుగా అనిపిస్తుంది. లయమవుతుంది పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. కుండ మాత్రమే పగిలిపోయింది, ఆకాశానికి ఏమీ అవలేదు. ఆకాశం కొంచెం కూడా చెక్కు చెదరలేదు; కాని మనం లయమయింది పదాన్ని వాడతాము. అలాగే జ్ఞాని బ్రహ్మలో లయమవుతాడు అంటాము. లయమవటం క్రియాపదమే కాని అక్కడ నిజానికి క్రియ ఏమీ జరగదు.

**తద్వత్** – అదే విధంగా, **జీవాః** – జీవులన్నీ;

**ఆత్మని (సంప్రలీయంతే)** – పరమాత్మలో లయమవుతున్నాయి. లయలో జీవులు పరమాత్మలో లయమవుతున్నట్టుగా అనిపిస్తున్నాయి కాని నిజానికి అక్కడ లయమయే ప్రసక్తి లేదు.

నిజానికి పరమాత్మలో ఐక్యం అవాలి అని కోరుకుంటున్నారంటే, వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం.

చాలామంది, 'నాకు వేదాంతం బాగా అర్థమయింది. నేను పరమాత్మతో ఈ జన్మలో ఐక్యమవుతానా, వచ్చే జన్మ వరకూ ఆగాలా?' అంటారు. అంతేకాదు, ఇంకో మెట్టు పైకెళ్ళి 'వచ్చే జన్మలో కూడా స్వామీజీయే మాకు గురువుగా రావాలి,' అని తీవ్రంగా కోరతారు.

పరమాత్మలో లయమయే ప్రసక్తి ఎక్కడ ఉంది? నేను అంతకుముందూ, ఇప్పుడూ, ఎప్పుడూ పరమాత్మనే. నేను నిత్యముక్త శుద్ధ చైతన్యాన్ని. అందువల్ల చైతన్యానికి నాశనం లేదు.

కుండ పగిలిపోతే, ఇంక ఘటాకాశం పదానికి ప్రయోజనం లేదు. దానితో ఆ పదాన్ని వాడము. అలాగే జ్ఞాని మోక్షాన్ని పొందితే, ఇంక జీవాత్మ పదానికి ప్రయోజనం లేదు. అందువల్ల ఆ పదాన్ని వాడము. అంతేకాని నిజంగా జీవాత్మ వెళ్ళివెళ్ళి పరమాత్మలో కలుస్తాడు అనుకోకూడదు. ఇదొక సర్వజనీన పొరపాటు. మరణించిన వ్యక్తి విష్ణుపథం పొందాడు లేదా శివపథం పొందాడు అనే నానుడి ఉంది. 'పదుగురాడు మాట పాడియై ధరణిజెల్లు,' అనే లోకోక్తి ఉంది. నలుగురూ ఏదంటే అది నిజంగా చలామణి అవుతుందని దీని అర్థం. దీనికి గొప్ప ఉదాహరణ సూర్యోదయం, సూర్యాస్తమయం. అందువల్ల వీటి లోతుల్లోకి ఎన్నడూ వెళ్ళము. కాని ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన అంశం జీవాత్మకు నాశనం లేదు.

**పొరపాటు 2 - నాశః.**

**కారిక 3.5**

**యథైకస్మిన్ ఘటాకాశే రజోధూమాదిభిర్యుతే ।**
**న సర్వే సంప్రయుజ్యంతే తద్వజ్జీవాస్సుఖాదిభిః ॥**

3. **దోషః** – ఇక్కడ గౌడపాదాచార్యుల వారు మూడవ పొరపాటు గురించి మాట్లాడుతున్నారు. ఆ పొరపాటు దానికి సంబంధిత అనేక పొరపాట్లకు దారితీస్తుంది.

మొదటి పొరపాటు కుండనుంచి దుర్గంధం వస్తుంటే, ఘటాకాశం అశుద్ధమయింది అనుకుంటారు. వాయుకాలుష్యం ఉంటుంది కాని, ఆకాశానికి కాలుష్యం ఎన్నడూ అంటదు. మనకు తెలియక, వాయువు యొక్క కాలుష్యాన్ని ఆకాశానికి మారుస్తాము. అందువల్ల ఒక కుండ దుర్గంధాన్ని వెదజల్లుతుంటే, ఆకాశం అశుద్ధం అయింది అనుకుంటాము.

కాని ఇంకొక కుండలోకి చూస్తే అది చందనం సువాసనను వెదజల్లుతుంది. ఆ సువాసన కూడా ఆకాశానికి చెందినదనుకుని మళ్ళీ పొరపాటు పడతాము.

ఒక కుండనుంచి దుర్గంధం, ఇంకొక కుండనుంచి సుగంధాలు వస్తున్నాయంటే అక్కడ ఎన్ని కుండలు ఉంటే, అన్ని ఆకాశాలు ఉన్నాయని పొరపాటు పడతాము. ఆకాశాలు అనేకం ఉన్నట్టుగా, జీవాత్మలు అనేకం ఉన్నాయి అంటారు సాంఖ్య దార్శనికులు. కొంతమందికి జాలి, దయ ఉండి, ఉన్నతులుగా ఉంటే, మరికొంతమందికి కోపం, ద్వేషం ఉండి, దుర్మార్గులుగా ఉన్నారు అంటే కొందరు మహాత్ములుగా ఉంటే, మరికొందరు దురాత్ములుగా ఉన్నారు. ఒకవేళ వేదాంతం చెప్పిందే నిజమయితే, వారు చాలా పెద్ద సమస్యను ఎదుర్కొంటారు అంటారు వారు. ఎందుకంటే ఆత్మలన్నీ ఒకటే అయితే, ఒకరికి దుఃఖం కలిగితే అందరూ భోరున ఏడవాలి. స్కూల్లో ఈ సన్నివేశం చూస్తాము అప్పుడప్పుడూ. ఒక పిల్లవాడు ఎందుకో ఏడిస్తే, వరుసపెట్టి అందరూ ఏడవటం మొదలుపెడతారు.

కాని నిజజీవితంలో అలా జరగటం లేదు. ఒకరు పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయి ఉంటే, మరొకరు ఆనందంతో చిందులు వేస్తున్నారు; ఒకరు మంచితనానికి మారుపేరుగా ఉంటే, మరొకరు దుర్మార్గానికి దుస్తులు తొడిగినట్టుగా ఉన్నారు. దీన్నిబట్టి జీవాత్మలు అనేకం; ఎన్ని జీవులు ఉంటే అన్ని జీవాత్మలు ఉన్నాయి అంటారు సాంఖ్యదార్శనికులు.

దాన్ని గౌడపాదాచార్యులవారు కూకటివేళ్ళతో పెకలించి వేస్తున్నారు. అసలు జీవాత్మ దుఃఖంగా ఉంది; ఆనందంగా ఉంది; మంచికి మారుపేరుగా ఉంది, దుర్మార్గానికి దుస్తులు తొడిగినట్టుగా ఉంది – ఇవన్నీ పెద్ద పొరపాట్లు. ఇవేవీ జీవాత్మయొక్క లక్షణాలే కాదు. ఇవన్నీ మనస్సు చేసే గారడీలు. మనస్సు అశుద్ధం అవుతుంది; రాగద్వేషాలతో అశుద్ధం చేసుకుంటుంది. ఆ విషయం మనకు తెలియక, మనస్సుయొక్క అశుద్ధాన్ని జీవాత్మకు పొరపాటుగా ఆపాదించి, అదుగో జీవాత్మ దుఃఖంలో ఉంది అంటాము; అంతేకాదు అన్ని జీవాత్మలూ దుఃఖపడాలి అంటాము. అదే పెద్ద పొరపాటు.

దాన్ని నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు కుండలోని ఆకాశాన్ని ఉదాహరణగా తీసుకున్నారు. ఒక ఘటాకాశం అశుద్ధం అయినంత మాత్రాన అన్ని ఘటాకాశాలూ అశుద్ధం అవాలని లేదు. అశుద్ధం గాలిది, కుండది కాని ఆకాశానిది ఎన్నడూ కాదు. ఉన్నదొకటే శుద్ధమైన, సర్వవ్యాపకమైన ఆకాశం. ఇప్పుడు కారిక చూద్దాము.

**యథైకస్మిన్ ఘటాకాశే** – ఒక ఘటాకాశం కనుక

**రజోధూమాదిభిర్యుతే** – ధూళి–పొగ–గంధం మొదలైనవాటితో కూడి ఉంటే,

**న సర్వే సంప్రయుజ్యంతే** – తక్కిన కుండలన్నీ అశుద్ధం అవవు. ఎందుకు? ఎందుకంటే కుండలు అనేకం, భిన్నం కాబట్టి కాదు, ఘటాకాశం అశుద్ధం అవదు కాబట్టి.

**తద్వత్** – అదేవిధంగా ఒక జీవాత్మ పాపంవల్ల అశుద్ధం అయితే, తక్కిన జీవాత్మలన్నీ అశుద్ధం అవవు. ఎందుకు? ఎందుకంటే జీవాత్మలు అనేకం, భిన్నం కాబట్టి కాదు, జీవాత్మ

అశుద్ధం అవదు కాబట్టి. నిజానికి జీవాత్మ పదం కూడా వాడకూడదు. ఎందుకంటే అన్ని శరీరాల్లోనూ ఉన్న ఆత్మ ఒకటే కాబట్టి. ఆ ఆత్మ నిత్యశుద్ధం.

**జీవాస్సుఖాదిభిః** – జీవాత్మకు సుఖదుఃఖాలనే అశుద్ధం అంటదు. గౌడపాదాచార్యులవారు సుఖం పదాన్ని అశుద్ధానికి ఎందుకు వాడుతున్నారు? సుఖం, ఆనందం పదాలు కోశానందానికి చెందుతాయి, అవి అశాశ్వతమైనవి. అంతేకాదు, అవి మనస్సుకు చెందినవి. అటువంటి అశాశ్వతమైన ఆనందం వెళ్ళిపోతే దుఃఖాన్ని కలిగిస్తుంది కాబట్టి అది కూడా అశుద్ధమే అంటుంది వేదాంతం. ఆనందం కూడా అవ్యక్తమైన దుఃఖమే.

**యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే** – గీత 5.22

అనిత్యసుఖం మరింత దుఃఖాన్ని కొనితెస్తుంది. తాత్కాలిక సుఖం కనుమరుగవగానే కలిగే శూన్యభావన ఇంకా దారుణంగా ఉంటుంది. అందువల్ల వేదాంతం లౌకికవిజయాలను కూడా అశుద్ధమే అంటుంది. లౌకికవిజయాల వెంట పరుగులు తీయవచ్చు కాని, అదే అంతిమలక్ష్యగా ఉండకూడదు. ఆత్మానందం పొందేదాకా కోశానందాన్ని పొందవచ్చు, కాని అది కూడా ధార్మికంగానే పొందాలి.

అందువల్ల గౌడపాదాచార్యులవారు సుఖాన్ని అశుద్ధం అంటున్నారు. సుఖం సత్త్వగుణ జన్యం; దుఃఖం రజోగుణ జన్యం; మోహం తమోగుణ జన్యం. ఈ విధంగా సుఖదుఃఖ మోహాలను ఈ మూడు గుణాలూ కలిగిస్తాయి; కాని ఆత్మానందం ఈ మూడు గుణాలకు అతీతమైనది; ఇది చైతన్యానికి చెందినది. దాన్ని వివరంగా భగవద్గీత, అధ్యాయం 14లో చూస్తాము. ఆత్మకు దోషాలను అంటగట్టటం ఇంకొక పొరపాటు.

**పొరపాటు 3 – దోషః.**

**కారిక 3.6**

**రూపకార్యసమాఖ్యాశ్చ భిద్యంతే తత్ర తత్ర వై।**
**ఆకాశస్య న భేదోఽస్తి తద్వజ్జీవేషు నిర్ణయః ॥**

4. **విశేషః** – ఘటాకాశం వేరు, మహాకాశం వేరు అనుకునే పొరపాటు. భిన్నత్వం మూడు విధాలుగా ఉంటుంది. అవి నామం, రూపం, కర్మ.

**నామం** – వాటికి ఉన్న పేర్లు భిన్నంగా ఉంటాయి. కుండలో ఉన్న ఆకాశాన్ని ఘటాకాశం అంటే, అంతటా ఉన్న ఆకాశాన్ని మహాకాశం అంటారు.

**రూపం** – ఆకారంలో, పరిమాణంలో ఉండే భేదం. చిన్నగదిలో తక్కువ ఆకాశం ఉంటే, పెద్ద ఇంట్లో ఎక్కువ ఆకాశం ఉంది అంటాము. నిజానికి, 'గదిలో ఆకాశం ఉంది,' అనే ఈ వాక్యమే తప్పు అంటుంది వేదాంతం. మరి ఏది సరియైన వాక్యం? ఆకాశంలోనే

గదులన్నీ ఉన్నాయి. ఆకాశం సర్వవ్యాపకం, అఖండం. ఏ గోడ కూడా ఆకాశాన్ని భాగాలుగా చేయలేదు. ఆకాశంలోనే గోడ ఉంది. కత్తితో ఆకాశాన్ని భాగాలుగా చేయలేము. సర్వవ్యాపకమైన ఆకాశాన్ని మూడు దశల్లో అర్థం చేసుకుంటాము.

1. ఈ గదిలో ఆకాశం ఉంది.

2. ఈ గదిలోనే కాదు, బయట కూడా ఆకాశం ఉంది.

3. నిజానికి ఆకాశంలోనే గదులన్నీ ఉన్నాయి. ఆకాశం సర్వవ్యాపకం.

ఇదే సూత్రాన్ని ఆత్మకు – శరీరానికి అన్వయిద్దాము.

1. ఈ శరీరంలో ఆత్మ ఉంది.

2. ఈ శరీరంలోనే కాదు, బయట కూడా ఆత్మ ఉంది.

3. నిజానికి ఆత్మలోనే శరీరాలన్నీ ఉన్నాయి. ఆత్మ సర్వవ్యాపకం.

అందువల్ల మంచి, చెడు, అజ్ఞాని, మేధావి గుణాలన్నీ శరీరానికి చెందుతాయి కాని జీవాత్మకు చెందవు.

**కర్మ** – అది చేసే పని. ఉదాహరణకు కుండను నీరు నింపి పెట్టుకోవటానికి వాడతాము.

**రూపకార్యసమాఖ్యాశ్చ** – ఒకే ఆకాశాన్ని ఘటాకాశం, కమండలు ఆకాశం, మఠాకాశం అనే భిన్న పేర్లతో పిలుస్తాము. ఈ ఆకాశం చిన్నగా ఉంది, ఈ ఆకాశం పెద్దగా ఉంది, ఈ ఆకాశం ఇరుకుగా ఉంది అనే భిన్నరూపాలను వర్ణిస్తాము. కుండతో నీళ్ళు తెచ్చుకుంటాము, కమండలంలో నీటిని పట్టి ఉంచుతాము, గదిలో పడుకుంటాము. ఇవి ఈ ఆకాశాలు చేసే పనులు.

**తత్ర తత్ర భిద్యంతే** – ఆయా పరిచ్ఛిన్న ఆకాశాలలో రూపం, కార్యం, నామం అనే భేదాలు నిశ్చయంగా ఉన్నాయి.

**ఆకాశస్య న భేదోఽస్తి** – కాని ఆకాశంలో ఈ భేదాలు లేవు. నిజానికి ఆకాశం అవ్యవహారి. ఏ పనులూ చేయదు కూడా.

**తద్వత్** – అదే విధంగా,

**జీవేషు నిర్ణయః** – జీవాత్మల గురించిన నిర్ణయం కూడా అలాగే ఉంటుంది. అంటే మనకు కనిపిస్తున్న నామరూప కర్మలు శరీరానికి చెందినవి కాని, జీవాత్మకు చెందినవి కావు. నిజానికి జీవాత్మే ఆ పరమాత్మ. పరమాత్మనే అనేక జీవాత్మలుగా పొరపాటు పడుతున్నాము.

జీవాత్మ మళ్ళీ పరమాత్మగా ఎలా మారాలి? ఎవరో అన్నారు, 'పరమాత్మ జీవాత్మగా అవటం వల్ల అశుద్ధం అయ్యాడు. అందువల్ల ఆ మలినాన్ని పోగొట్టాలి.' కాని ఉన్నది

ఒకటే మలినం. నేను అశుద్ధమైన జీవాత్మను అనుకునే మలినం ఒకటే ఉంది. కొంతమంది నేను మాండూక్యోపనిషత్తు సగం నేర్చుకున్నాను కాబట్టి, సగమే శుద్ధి చెందాను. ఇంకా పూర్తిగా మలినం పోలేదు అనుకుంటారు. ముందు అటువంటి మలినమైన ఆలోచనలను వదులుకోవాలి. మీరు అంతకుముందు, ఇప్పుడు, ఇకముందు కూడా శుద్ధ పరమాత్మే!

**పొరపాటు 4 – విశేషః.**

**కారిక 3.7**

**నాకాశస్య ఘటాకాశో వికారావయవౌ యథా ।**
**నైవాత్మనస్సదా జీవో వికారావయవౌ తథా ॥**

5. **సంబంధః** – ఇక్కడ గౌడపాదాచార్యులవారు జీవాత్మ, పరమాత్మల మధ్య సంబంధం గురించి చెబుతున్నారు. ఈ అంశం చాలా ముఖ్యమైనది. దార్శనికులందరూ చర్చించే ముఖ్యమైన అంశం ఇది. వారందరూ ఈ అంశాన్ని చర్చించటమే కాక, వారికి తోచిన సిద్ధాంతాలను కూడా తయారుచేశారు. వాటిలో కొన్నింటిని చూద్దాము.

ఎ) **కార్య–కారణ సంబంధం** – కొంతమంది పరమాత్మ జీవాత్మయొక్క సృష్టికర్త అనీ, జీవాత్మ కార్యం అనీ అంటారు. అందువల్ల పరమాత్మ–జీవాత్మల సంబంధం **కారణ–కార్య సంబంధం** అవుతుంది.

ఈ సంబంధం కూడా ఘటాకాశానికీ, మహాకాశానికీ మధ్య ఉన్న సంబంధంలాగానే ఉందంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఘటాకాశం, మహాకాశాన్నుంచి పుట్టింది అంటారు కొందరు. అదే నిజమైతే, అంటే ఘటాకాశం నిజంగా పుడితే, కుండ సృష్టి జరగకముందు, ఘటాకాశం ఉండి ఉండకూడదు. కాని మనం చూస్తున్నది కుండయొక్క సృష్టినే కాని, ఘటాకాశ సృష్టిని కాదు. కుమ్మరి కుండను తయారుచేస్తాడు కాని, ఆకాశాన్ని కూడా తయారుచేసి కుండలో పెట్టడు. అందువల్ల ఘటాకాశానికీ, మహాకాశానికీ మధ్య కార్యకారణ సంబంధం ఉంది అనుకోవటం ఒక పొరపాటు.

బి) **అంశ–అంశి సంబంధం** – జీవాత్మ పరమాత్మనుంచి పుట్టలేదు, కాని జీవాత్మ పరమాత్మలో ఒక భాగం అంటారు కొందరు. దీన్ని అంశ–అంశి సంబంధం అంటారు. ఒక పెద్ద అగ్నిజ్వాలలో చిన్న నిప్పురవ్వలు ఎలా భాగమో అంటే పెద్ద అగ్నిజ్వాల వంటి పరమాత్మలో చిన్న నిప్పురవ్వలవంటి జీవాత్మ భాగం. ఇదేదో వినటానికి బాగానే ఉంది.

ఘటాకాశం చిన్నది, మహాకాశం పెద్దది. అందువల్ల చిన్న ఆకాశం, పెద్ద ఆకాశంలో ఒక భాగమవ్వాలి కదా. అందులో తప్పేముంది? తప్పేముందో మనం అంతకుముందే చూశాము, మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి అంతే. ఈ వాదన చేసేవారిని ఘటాకాశం

అంటే ఏమిటని అడిగితే, 'కుండలో ఉన్న ఆకాశం,' అంటారు. అలాగే మహాకాశం అంటే, 'కుండ బయట ఉన్న ఆకాశం,' అంటారు.

**జవాబు 1** – వేదాంతం అసలు ఈ నిర్వచనమే తప్పు అంటుంది. మనం మూడు దశల్లో వేదాంతాన్ని నేర్చుకుంటామని చూశాము. ఈ వాదన చేసేవారు మొదటి రెండు దశల్లోనే ఆగిపోయారు. అవి 1. ఈ కుండలో ఆకాశం ఉంది. కుండ బయట కూడా ఆకాశం ఉంది. వేదాంతం మూడవదశకు రమ్మంటోంది. అది 3. నిజానికి ఆకాశంలోనే కుండలన్నీ ఉన్నాయి. ఈ మూడవదశకు రాకపోతే వేదాంతం అర్థం కాదు.

గౌడపాదాచార్యులవారి బోధ పైస్థాయిలో ఉంటుంది. కింద దశలను వదిలివేస్తారు. వాటిని మనం గుర్తు తెచ్చుకుని పైదశకు చేరుకోవాలి. నాలుగైదు ఉపనిషత్తులు నేర్చుకున్నాక, మాండూక్యోపనిషత్తు నేర్చుకుంటారు కాబట్టి, ఈ కింది దశలన్నీ కొట్టిన పిండి అయి ఉండాలి.

ఇప్పుడు వాదన చూస్తే, ఆకాశంలోనే కుండలన్నీ ఉన్నాయి. ఎందుకు? కుండ పుట్టక ముందు కూడా ఆకాశం ఉంది. ఆ ఆకాశంలో అనేక కుండలు పుడుతున్నాయి, అనేక కుండలు లయమవుతున్నాయి. ఖాళీ ప్రదేశంలో ఇల్లు కట్టటం ఊహించుకుంటే, ఈ విషయం బాగా అర్థమవుతుంది. ఆకాశంలోనే ఇళ్ళన్నీ ఉన్నాయి. ఇది మొదటి జవాబు. దీనికి ఇంకొక జవాబు కూడా చెప్పవచ్చు.

**జవాబు 2** – ఆకాశం అఖండం లేదా నిరవయవం. ఆకాశానికి భాగాలు లేవు. ఒక వస్తువుకు భాగాలు ఉన్నాయని ఎప్పుడు చెప్పగలము? అది అనేక భాగాలనుంచి తయారు చేయబడితే. ఒక ఇంట్లోని గోడ అనేక భాగాల నుంచి తయారుచేయబడుతుంది. అందువల్ల వద్దనుకుంటే ఒక గోడను తీసివేయవచ్చు. కాని ఆకాశం విషయంలో అది కుదరదు. ఆకాశానికి భాగాలు లేవు, దాన్ని భాగాల నుంచి కలుపలేము, భాగాలుగా విడగొట్టలేము. భాగం అంటేనే భాగంగా విడగొట్టబడగలిగినది అని అర్థం.

ఆకాశానికి గనుక భాగాలు ఉంటే, కత్తితో కొంతభాగాన్ని కోసి, ఇంటికి తీసుకువెళ్ళవచ్చు. కాని అలా చేయలేము. ఎందుకంటే ఆకాశం నిరవయం. అందువల్ల పూర్తి ఆకాశం, సగం ఆకాశం వంటి పదాలు వాడలేము.

**ఘటాకాశః న వికారః** – వికారం అంటే కార్యం, ఉత్పత్తి చెందటం. న వికారః అంటే కార్యం కాదు. ఘటాకాశం కార్యం కాదు.

**ఆకాశస్య** – మహాకాశంయొక్క. ఇక్కడ ఆకాశం అంటే మహాకాశం అని తీసుకోవాలి. ఘటాకాశం మహాకాశంయొక్క కార్యం కాదు.

**ఘటాకాశః మహాకాశస్య వికారః న భవతి**

ఘటాకాశం, మహాకాశం నుంచి పుట్టలేదు అనటంవల్ల ఒక పొరపాటును పారద్రోలటమైనది.

**(న) అవయవః** – అవయవం అంటే భాగం; న అవయవం అంటే భాగం కాదు. ఏది భాగం కాదు? ఘటాకాశం, మహాకాశంలో భాగం కాదు.

**ఘటాకాశః మహాకాశస్య అవయవః న భవతి**

దీనితో ఘటాకాశం ఒక భాగం అనే రెండవ పొరపాటును కూడా పారద్రోలటమైనది.

**యథా తథా** – అదే విధంగా,

**జీవః** – జీవాత్మ కూడా,

**నైవ వికారః** – ఎన్నడూ పుట్టలేదు; కార్యం కాదు.

**ఆత్మనః** – పరమాత్మ నుంచి పుట్టలేదు. ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మ అని తీసుకోవాలి.

**(న) అవయవః** – పరమాత్మలో ఒక భాగం కూడా కాదు. విశిష్టాద్వైతానికీ, అద్వైతానికీ మధ్య ఇది ఒక ముఖ్యమైన భేదం. విశిష్టాద్వైతం జీవాత్మ, పరమాత్మలో ఒక భాగం అంటుంది; అద్వైతం పరమాత్మకు భాగాలు లేవు, పరమాత్మ నిరవయం అంటుంది.

**పొరపాటు 5 – సంబంధః.**

జీవాత్మ పరమాత్మ నుంచి పుట్టలేదు కాబట్టి పరమాత్మ, జీవాత్మ యొక్క కారణం కాదు కాబట్టి పరమాత్మ (తురీయం) కార్యకారణ విలక్షణం కాబట్టి పరమాత్మ అద్వైతం. ఆ విధంగా అర్థం చేసుకోవాలి.

**కార్యకారణ విలక్షణమ్ అద్వైతమ్**

### కారిక 3.8

**యథా భవతి బాలానాం గగనం మలినం మలైః ।**
**తథా భవత్యబుద్ధానామాత్మాఽపి మలినో మలైః ॥**

ఈ కారికను, కారిక 5తో కలిపి చదవాలి. కారిక ఐదులో గౌడపాదాచార్యులవారు ఒక విషయాన్ని కొంతమేరకు ఒప్పుకున్నట్టుగా అనిపిస్తుంది. ఏమిటది? ఒక ఘటాకాశం అశుద్ధం అయితే, తక్కిన కుండలన్నీ అశుద్ధం అవవు అన్నారు అంటే ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, గౌడపాదాచార్యులవారు ఘటాకాశం అశుద్ధం అవవచ్చు అని అంగీకరించినట్టు అర్థం రావచ్చు.

అందువల్ల తను కొంతమేరకు కూడా ఒప్పుకోలేదని నిరూపించటానికి ఇక్కడ ఇంకొక పదాన్ని వేస్తున్నారు. ఆ పదం **బాలానాం**. అజ్ఞానులకు ఒక ఘటాకాశం అశుద్ధమయినట్టు అనిపించినా కూడా, తక్కిన ఘటాకాశాలు అశుద్ధం కాదు అని ఇక్కడ చెబుతున్నారు.

దీని అర్థం ఒక్క ఘటాకాశం కూడా నిజంగా అశుద్ధం అవలేదు. ఏదైనా మలినం అంటూ ఉంటే, అది కుండలోవున్న వాయువుకు చెందుతుంది కాని, కుండలోవున్న ఆకాశానికి చెందదు.

అదేవిధంగా ఒక జీవాత్మ అశుద్ధం అయితే తక్కిన జీవాత్మలన్నీ అశుద్ధం అవవు అంటే ఒక జీవాత్మ అశుద్ధం అయ్యే అవకాశముంది అని ఒప్పుకున్నట్టు కాదు; అలా అజ్ఞానులు భావిస్తారు అని ఇక్కడ స్పష్టం చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**బాలానాం** – బాల అంటే మామూలు అర్థం బాలుడు. బాలుడు అంటే చదువుకోనివాడు. ఇక్కడ అర్థం అజ్ఞాని. అజ్ఞానులకు,

**గగనం మలైః మలినం భవతి** – ఆకాశం మలినమైనట్టు అనిపిస్తుంది. అజ్ఞానులకు మాత్రమే ఆకాశం మలినమైనట్టు అనిపిస్తుంది. కాని నిజానికి ఆకాశానికి ఏ విధమైన మలినమూ అంటదు. అది నిత్యశుద్ధం. ఒకదానికున్న మలినాన్ని, కుండలోవున్న ఆకాశానికి ఆపాదిస్తున్నారు. దీన్ని వేదాంతంలో అధ్యాస అంటారు.

మీరు రైలులో ప్రయాణిస్తున్నప్పుడు 'హైదరాబాద్ వచ్చింది,' అంటారు. హైదరాబాద్ ఎక్కడికీ కదలదు; రైలే హైదరాబాదుకు వస్తుంది. ఇలా ఒకదాని యొక్క లక్షణాన్ని, ఇంకొక దానికి ఆపాదించటాన్ని అధ్యాస అంటారు. వేదాంతంలో ఇది చాలా ముఖ్యమైన అంశం. అందువల్ల శంకరాచార్యులవారు బ్రహ్మసూత్రాల్లో **అధ్యాస భాష్యం** రాశారు. అందులో సంసారం నిజంగా లేదు. అది అధ్యాస అని నిరూపిస్తారు. అదే ఇక్కడ గౌడపాదాచార్యుల వారు బోధిస్తున్నారు. వస్తువుకున్న సమస్యలను, పొరపాటుగా మనకు ఆపాదించుకుంటున్నాము.

ఉదాహరణకు సినిమా విషయమే తీసుకోండి. ఒక భార్య, భర్త కలిసి సినిమాకు వెళ్ళారు. అందులో హీరోయిన్ అష్టకష్టాలు పడుతుంది. ఆమె భర్త కూడా చనిపోతాడు. ఆమె భోరున ఏడుస్తుంటే, ఇక్కడ సినిమా చూస్తున్న ఇల్లాలు కూడా ఆమెతో కలిసి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. భర్త హాస్యంగా అంటాడు, 'ఎందుకేడుస్తావు? నేనింకా బ్రతికే ఉన్నాను.' తను ఆబ్జెక్టుగా చూస్తున్న హీరోయిన్ కష్టాలను సబ్జెక్టు అయిన తన మీదకు ఆపాదించుకుంటున్నది. అదే విధంగా అనాత్మ ధర్మాలను ఆత్మమీద ఆరోపిస్తున్నాము. అందువల్ల ఆకాశాన్ని శుద్ధి చేయాలి అంటే నిజంగా చేయనవసరం లేదు. ఆకాశం అశుద్ధంగా ఉంది అనే అధ్యాసను తొలగించుకుంటే చాలు.

**యథా తథా** – అదే విధంగా,

**అబుద్ధానామ్** – ఆత్మానాత్మ వివేకం లేని అజ్ఞానులకు,

**ఆత్మాఽపి మలినో మలైః** – ఆత్మకూడా అనేక కర్మల చేత, అనేక రకాల పుణ్యపాపాల చేత, అనేక భిన్న భావోద్రేకాల చేత మలినమైనట్టు అనిపిస్తుంది. ఇక్కడ ఆత్మ అంటే పరమాత్మ కాదు, జీవాత్మ.

నిజానికి జీవాత్మకు మలినం అంటదు. అది శుద్ధ పరమాత్మ. తత్ త్వమ్ అసి.

**కారిక 3.9**

**మరణే సంభవే చైవ గత్యాగమనయోరపి ।**
**స్థితౌ సర్వశరీరేషు ఆకాశేనావిలక్షణః ॥**

జీవాత్మ లక్షణాలు ఏవైతే వర్ణిస్తున్నామో అవన్నీ పొరపాట్లు. అవి సత్యం కాదు. ఈ విషయాన్ని అర్థం చేసుకోవటానికి వాటిని ఘటాకాశంతో పోల్చాలి. మనం ఇంతగా వర్ణిస్తున్న ఆ పొరపాటు లక్షణాలు ఏమిటి?

**మరణే సంభవే చైవ** – సంభవం అంటే జన్మ. ఒక శిశువు తల్లిగర్భంలో రూపుదిద్దుకున్నప్పటి నుంచి ఎంతో ఆర్భాటం చేస్తాము. అనేక దశల్లో అనేక వేడుకలు చేస్తాము. మరణం అంటే చావు. నిజానికి జీవునికి పుట్టుక లేదు, చావూ లేదు.

**గతిః** – ఒక శరీరం నుంచి ఇంకొక శరీరంలోకి వెళ్ళటం. సర్వవ్యాపకమైన చైతన్యం ఒక శరీరాన్ని వదిలి, ఇంకొక శరీరంలోకి ఎలా వెళ్ళగలదు? సర్వవ్యాపకమైన ఆకాశం ఒక కుండను వదిలి, ఇంకొక కుండలో చేరుతుందా? మరి ఏది ప్రయాణిస్తుంది అంటే సూక్ష్మశరీరంతో పాటు మనస్సు ప్రయాణిస్తుంది. మనస్సుయొక్క ప్రయాణాన్ని ఆత్మకు ఆపాదిస్తున్నాము.

**ఆగమన** – తిరిగి రావటం. కొన్ని ఇళ్ళల్లో తాతగారు మరణించిన కొన్ని నెలలకు, ఇంకొక కొత్తజీవి వస్తే, అదుగో తాతగారే మళ్ళీ పుట్టారు, ఆయనకు ఈ మనవడు అంటే ప్రాణం అంటారు. అంతేకాదు, 'చూడండి, వారిద్దరికీ చాలా పోలికలు ఉన్నాయి,' అంటారు. ఇద్దరికీ సాంబారు ఇష్టమనో, ఇద్దరూ ఒక్కలాగే చేయి తిప్పుతున్నారనో ఏవో చూపిస్తారు. కాని గౌడపాదాచార్యులవారు అది అర్థంలేని మాట అంటున్నారు.

**స్థితిః** – అనేక శరీరాలలో ఉండటం. ఈ జీవాత్మ ఈ శరీరంలో కొన్నాళ్ళు అద్దెకుంటుందనీ, కొన్నాళ్ళయ్యాక ఈ శరీరాన్ని వదిలేసి, ఇంకొక శరీరాన్ని వెతుక్కుంటుందనీ కొంతమంది అంటారు. ఇది కూడా పొరపాటే. ఇది ఇందాక మనం చూసిన మూడు దశల్లో మొదటిదశ.

శరీరంలో ఆత్మ ఉంది అని మొదలుపెడతారు. కాని వేదాంతం మూడవదశను బోధిస్తుంది. అది ఆత్మలోనే శరీరాలన్నీ ఉన్నాయి. ఆత్మ సర్వవ్యాపకం.

**అవిలక్షణః** – విలక్షణం అంటే భిన్నంగా ఉండటం. అవిలక్షణం అంటే పోలిక ఉండటం.

ఇంతవరకూ జీవాత్మ యొక్క ఐదు లక్షణాలు చూశాము. అవి – సంభవం, మరణం, గతి, ఆగతి, స్థితి. ఇవన్నీ ఆకాశ లక్షణాలను పోలివున్నాయి.

**ఆకాశేన** – ఘటాకాశంయొక్క లక్షణాలను పోలివున్నాయి. ఘటాకాశం యొక్క సంభవం, మరణం, గతి, ఆగతి, స్థితి నిజంగా లేవు. అలాగే జీవాత్మలోనూ నిజంగా లేవు.

ఏడవమంత్రంలో వివరించిన తురీయ లక్షణాలను గౌడపాదాచార్యులవారు విశ్లేషిస్తున్నారు. తురీయానికి అనేక లక్షణాలను ఆ మంత్రం పేర్కొన్నా గౌడపాదాచార్యుల వారు, ఈ అధ్యాయంలో అద్వైతం పదాన్ని తీసుకున్నారు. అద్వైతం అంటే తురీయం కార్యకారణ విలక్షణం. చతుష్పాద ఆత్మను పరిచయం చేసింది ఉపనిషత్తు. మొదటి రెండు పాదాలనూ కార్యపాదాలనీ, మూడవపాదాన్ని కారణపాదమనీ చెప్పాక, నాలుగవ పాదం అయిన తురీయం కార్యకారణ విలక్షణం అంది.

ఈ కార్యకారణ విలక్షణ అద్వైతం తురీయాన్ని గౌడపాదాచార్యులవారు నొక్కి వక్కాణిస్తున్నారు. వారి వాదనను **అజాతివాదః** అంటారు. దీని అర్థం తురీయంనుంచి ఏమీ పుట్టలేదు. జాతిః అంటే జన్మ. ఇక్కడ జన్మ అంటే సృష్టి. అందువల్ల అజాతివాదన అంటే సృష్టి జరగలేదు అని నిరూపించటం.

మామూలుగా సృష్టి అంటే దాన్ని రెండుగా విభజిస్తాయి. అది జీవుడు, జగత్తు. గౌడపాదాచార్యులవారు ఇటు జీవుడు కాని, అటు జగత్తు కాని నిజంగా పుట్టలేదు అని ఈ అధ్యాయంలో నిరూపిస్తున్నారు. ఆయన జీవసృష్టి నిషేధమూ, జగత్‌సృష్టి నిషేధమూ చేయదలుచుకున్నారు. అది నాలుగు దశల్లో చేస్తున్నారు. అవి –

| | |
|---|---|
| యుక్త్యా జీవసృష్టి నిషేధః | – కారికలు 3–9 |
| యుక్త్యా జగత్‌సృష్టి నిషేధః | – కారిక 10 |
| శ్రుత్యా జీవసృష్టి నిషేధః | – కారికలు 11–14 |
| శ్రుత్యా జగత్‌సృష్టి నిషేధః | – కారికలు 15–30 |

మనం వీటిలో మొదటి అంశాన్ని పూర్తి చేసుకున్నాము. **యుక్త్యా జీవసృష్టి నిషేధః.** తర్కం ద్వారా, జీవసృష్టి నిజంగా జరగలేదు అని నిరూపించారు. దానికి కూడా ఆకాశం ఉదాహరణ తీసుకున్నారు. ఘటాకాశాన్ని, మహాకాశాన్ని తీసుకున్నారు. ఘటాకాశం అంటే కుండలో ఉన్న ప్రదేశం; మహాకాశం అంటే పైన ఉన్న ఆకాశం. జీవాత్మను ఘటాకాశంతోనూ, పరమాత్మను మహాకాశంతోనూ పోల్చవచ్చు.

ఘటాకాశానికి ఐదు అంశాలను తీసుకుని, వాటిని జీవాత్మతో పోలుస్తూ వచ్చారు. అవి,

**ఉత్పత్తిః** – ఘటాకాశం, మహాకాశంనుంచి పుట్టిందనుకుంటారు కాని ఆకాశం సర్వవ్యాపకం. కుండ పుట్టుకను ఆకాశానికి మారుస్తారు. అలాగే జీవాత్మ పుట్టింది అంటే శరీరం పుడుతుంది కాని ఆత్మ ఎన్నడూ పుట్టదు. ఆత్మ అజం.

**నాశః** – కుండ పగిలిపోతే నాశనమయ్యేది కుండే, ఆకాశం కాదు. అలాగే శరీరం మరణిస్తే ఆత్మ మరణించింది అనుకుంటారు కాని ఆత్మ నిత్యం.

**దోషః** – కుండలోని వాయువు దుర్గంధాన్ని వెదజల్లితే, ఆకాశం మలినం అయింది అనుకుంటారు కాని ఆకాశం శుద్ధం. అలాగే శరీరానికీ, మనస్సుకూ ఉన్న మలినాలను ఆత్మకు ఆపాదిస్తున్నారు. ఆత్మ నిత్యశుద్ధం.

**విశేషః** – రూపం. నామరూపాలు కుండవి కాని ఆకాశానికి కాదు. ఆకాశం నిర్గుణం. అలాగే శరీరానికి గుణాలు ఉన్నాయి కాని ఆత్మకు గుణాలు లేవు. ఆత్మ నిర్గుణం.

**సంబంధః** – మహాకాశంనుంచి ఘటాకాశం పుట్టిందనీ, వాటి మధ్య కార్యకారణ సంబంధం ఉందనీ ఒక వాదన. మహాకాశంలో ఘటాకాశం ఒక భాగం అని ఇంకొక వాదన ఉంది. కాని ఆకాశం కుండ పుట్టకముందూ ఉంది. అలాగే ఆకాశానికి భాగాలూ లేవు.

అదే విధంగా జీవాత్మ పరమాత్మనుంచి పుట్టిందనీ, జీవాత్మ–పరమాత్మల మధ్య కార్య–కారణ సంబంధం ఉందనీ ఒక వాదన ఉంది. జీవాత్మ–పరమాత్మలో ఒక భాగం అని ఇంకొక వాదన ఉంది. రెండూ చెల్లవు. ఎందుకంటే పరమాత్మకు వికారాలు లేవు. పరమాత్మ నిర్వికారం; పరమాత్మకు భాగాలు లేవు; పరమాత్మ నిరవయం.

ఆ విధంగా గౌడపాదాచార్యులవారు చావుపుట్టుకలు, రాకపోకలు, గుణాలు ఘటాకాశానికి ఎలా చెందవో, అలా ఆత్మకు చెందవు అని నిరూపించారు.

**ఆకాశ దృష్టాంతేన జీవసృష్టి నిషేధః.**

**కారిక 3.10**

**సంఘాతాస్స్వప్నవత్సర్వే ఆత్మమాయావిసర్జితాః ।**
**అధిక్యే సర్వసామ్యే వా నోపపత్తిర్హి విద్యతే ॥**

బి) **యుక్త్యా జగత్సృష్టి నిషేధః – కారిక 10**

ఈ కారికలో తర్కం ద్వారా జగత్సృష్టి జరగలేదని నిరూపించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. అందులో భాగంగా మనకు రాగల రెండు సందేహాలకు కూడా జవాబులు కూడా వస్తాయి.

ముందు భాగంలో కుండలోని ఆకాశం పుట్టలేదు, కుండ మాత్రమే పుట్టింది అన్నాము. ఈ సూత్రాన్ని అన్వయించి జీవాత్మ పుట్టలేదు, శరీరం మాత్రమే పుట్టింది అన్నాము. శరీరం యొక్క పుట్టుకను పొరపాటుగా ఆత్మకు ఆపాదిస్తున్నాము అనికూడా అన్నాము.

**సందేహం 1** – ఒక తెలివైన విద్యార్థి ఈ ప్రశ్నను వేయవచ్చు. 'సరే, మీ వాదన ప్రకారం ఆత్మ పుట్టలేదు, శరీరమే పుట్టింది అనుకుందాము. శరీరంయొక్క పుట్టుకను ఆత్మకు పొరపాటుగా ఆపాదిస్తున్నాము అనికూడా అనుకుందాము. అంతవరకూ బాగానే ఉంది. కాని శరీరం పుట్టింది అంటే, పంచభూతాలు కూడా పుట్టాయి అని మీరు ఒప్పుకోక తప్పదు. ఎందుకంటే శరీరం పాంచభౌతికం అంటారు మీరే.

శరీరం పుట్టిందని మీరు అంటే, పరోక్షంగా మీరు పంచభూతాల సృష్టిని ఒప్పుకోక తప్పదు. పంచభూతాలు పుట్టాయని ఒప్పుకుంటే, జగత్తుయొక్క సృష్టి కూడా ఒప్పుకోక తప్పదు. జగత్తుయొక్క సృష్టిని ఒప్పుకుంటే పరమాత్మను కారణంగానూ ఒప్పుకోక తప్పదు. అలాంటప్పుడు పరమాత్మ కార్య–కారణ విలక్షణం అని ఎలా చెప్పగలరు?'

**గౌడపాదాచార్యులవారి జవాబు** – నిజమే. ఈ శరీరం, ఈ జగత్తు పరమాత్మనుంచి పుట్టాయని మేము అంటాము కాని, దానికి ఇంకొక విశేషణాన్ని జతచేస్తాము. మిథ్యా జగత్తు అంటాము. అవి పుట్టినట్టుగా ఉంటుంది అంటాము. శరీరం, జగత్తు పరమాత్మ యొక్క మాయాశక్తినుంచి పుట్టాయి. మాయకు మిథ్యాజగత్తును సృష్టించే శక్తి ఉంది. కాబట్టి జగత్తు పుట్టింది అంటే మిథ్యాజగత్తు పుట్టింది అంటాము.

**సందేహం 2** – అలా ఎలా మిథ్యాజగత్తు పుట్టింది అనగలరు?

**గౌడపాదాచార్యులవారి జవాబు** – ఎందుకు పుట్టదు? నిజానికి మీరు రోజూమిథ్యా స్వప్నజగత్తును సృష్టించటం లేదా అని ఎదురు ప్రశ్నిస్తారు. పరమాత్మకు మాయాశక్తి ఉన్నట్టే మనకు నిద్రాశక్తి ఉంది. ఆ నిద్రాశక్తితో మనం ఒక అద్భుతమైన స్వప్నప్రపంచాన్ని, మరొక స్వప్నశరీరాన్ని సృష్టిస్తాము. ఈ జాగ్రద్ శరీరంతో మనం స్వప్నంలో వ్యవహారం నడపలేము. అది ఇక్కడ మంచంమీద హాయిగా నిద్రపోతుంది. స్వప్నప్రపంచం మిథ్యాప్రపంచం కాదా? మనమే మిథ్యాప్రపంచాన్ని సృష్టించగా లేనిది, పరమాత్మ సృష్టించలేడా? అందువల్ల పరమాత్మ నిజంగా కారణం కాదు. మిథ్యాజగత్తు మిథ్యాకార్యం, దాన్ని సృష్టించిన పరమాత్మ మిథ్యాకారణం. అంతేకాని, నిజంగా సృష్టి జరగలేదు. అదే ఈ కారిక అర్థం. ఇప్పుడు కారిక చూద్దాము.

**సంఘాతః** – కార్యకరణ సంఘాతం. శరీరం, ఇంద్రియాలు, మనస్సులను కలిపి కార్యకరణ సంఘాతం అంటారు. దీన్నే ఇంగ్లీషులో బాడీ–మైండ్–సెన్స్ కాంప్లెక్స్ (బి.ఎమ్.ఎస్.) అంటారు. ఈ సంఘాతం జగత్తు మొత్తాన్ని సూచిస్తుంది.

**విసర్జితాః** – అవి పరమాత్మనుంచి సృష్టించబడ్డాయి నిజమే, కాని ఎలా సృష్టించబడ్డాయి?

**మాయావిసర్జితాః** – మాయచేత సృష్టించబడ్డాయి. మాయకే స్వతంత్రంగా ఉనికి లేదు. స్వప్నంలో ఉన్నంతవరకూ స్వప్నం నిజంగానే అనిపించినట్టుగా, ఈ జాగ్రత్ ప్రపంచంలో ఉన్నంతవరకూ మాయాశక్తి సృష్టించిన ఈ ప్రపంచం నిజమే అనిపిస్తుంది. కాని దానికి విడిగా ఉనికి లేదు. కాబట్టి అది కూడా స్వప్నం–2 కిందికి వస్తుంది.

**సందేహం** – పరమాత్మ ఉన్నాడు, మాయ ఉంది; మాయవల్ల ఈ జగత్తు సృష్టించబడింది అంటే ఇప్పుడు ద్వైతం ఉన్నట్టుకాదా? పరమాత్మ, మాయ – ఇద్దరు ఉన్నారు – అప్పుడు దీన్ని 'అద్వైత ప్రకరణం' అని ఎలా చెప్పగలరు?

**జవాబు** – మిథ్యాజగత్తు యొక్క కారణం కూడా మిథ్యే అవుతుంది. సృష్టి గురించి చెప్పేటప్పుడు మాయను బ్రహ్మతో కలుపుకోవాలి. అంటే అక్కడ రెండు ఉన్నట్టు కాదు. నాట్యాచారుడూ, అతని నాట్యశక్తి వచ్చాయి అంటామా? అక్కడ రెండు భిన్నవస్తువులు లేవు. అలాగే మాయ, బ్రహ్మకు భిన్నంగా లేదు. జగత్తును మిథ్యాకార్యంగా కొట్టివేసేటప్పుడు, ఆ మిథ్యాకార్యాన్ని సృష్టించిన మాయను కూడా మిథ్యాకారణంగా కొట్టివేయాలి. దీన్ని బ్రహ్మకు కూడా అన్వయించకూడదు; బ్రహ్మ కూడా మిథ్య అనేయకూడదు.

ఇప్పుడు బ్రహ్మ, మాయ, జగత్తు అనే ఈ మూడింటిలో బ్రహ్మ ఒక్కటే సత్యం; మాయ, జగత్తులు మిథ్య. మిథ్య నిర్వచనం మర్చిపోకూడదు. మిథ్య అంటే అసలు లేదని కాదు అర్థం. మిథ్య అంటే అనుభవంలోకి వస్తుంది కాని, శాశ్వతం కాదు. స్వప్నప్రపంచం అనుభవంలోకి వస్తుంది కాని, లేచాక అది మిథ్యగా తేలిపోతుంది. దాన్ని ప్రాతిభాసిక సత్యం అంటారు. జాగ్రత్‌ప్రపంచం వ్యవహారం నడపటానికి అందుబాటులో ఉంటుంది కాని అది మూడు కాలాల్లోనూ ఉండదు. దాన్ని వ్యావహారిక సత్యం అంటారు. పారమార్థిక స్థాయికి లేస్తే అది కూడా స్వప్నం–2 అవుతుంది. తురీయాన్ని పారమార్థిక సత్యం అంటారు.

ఒకస్థాయి సత్యాన్ని ఇంకొక స్థాయి సత్యంతో కలపలేము. స్వప్నంలో సంపాదించిన డబ్బుతో జాగ్రదావస్థలో ఇల్లు కొనుక్కోలేము. అలాగే వ్యావహారిక సత్యాన్ని, పారమార్థిక సత్యంతో కలపలేము. అందువల్ల మాయచేత, ఈ జగత్తు సృష్టించబడింది నిజమే కాని అది,

**స్వప్నవత్** – స్వప్నప్రపంచం వంటిది. మనం ఇలలో చేయలేని పనులను కలలో చేసి మన కోరికలను తీర్చుకుంటాము అంటారు కొందరు. స్వప్నాన్ని శకునశాస్త్రం అంటారు మరికొందరు. రాబోయే విషయాలు స్వప్నంలో సూచనగా వస్తాయి అంటారు వారు. ఏదెలావున్నా, వేదాంతం తేలిగ్గా నేర్చుకోవటానికి, స్వప్నశాస్త్రం బాగా తోడ్పడుతుంది; ముఖ్యంగా మాండూక్యోపనిషత్తు నేర్చుకోవటానికి.

స్వప్నంలో ఉన్నంతవరకూ ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. దాన్నుంచి లేచాకే అతనికి తెలుస్తుంది. దీనివల్ల మనం గ్రహించాల్సిన అంశం, మనకు అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజమై తీరాలని లేదు. అలాగే జాగ్రత్ ప్రపంచాన్ని అనుభవిస్తాము, అందులో వ్యవహారం నడుపుతాము, అది ప్రయోజనకరంగా ఉంటుంది కాని తురీయానికి లేస్తే, అది సత్యం కాదు. నిజానికి వైతథ్య ప్రకరణమ్ ఈ స్వప్న దృష్టాంతంతోనే మొదలయింది.

**ఆధిక్యే సర్వసామ్యే వా** – సర్వసామ్యం అంటే సమానం; ఆధిక్యే అంటే ఇంకొకదానికన్నా గొప్పవి. అంటే పశుపక్ష్యాదుల దేహాలతో పోలిస్తే దేవతల దేహాలు గొప్పవి. అయినా ఈ శరీరాలన్నీ మిథ్యే.

**న ఉపపత్తిర్హి విద్యతే** – అవి సత్యం అని నిరూపించటానికి తర్కం లేదు. మామూలుగా మనం, 'నేను చూస్తున్నాను కాబట్టి అది సత్యం,' అంటాము కాని గౌడపాదాచార్యులవారు 'మీరు స్వప్నప్రపంచాన్ని కూడా చూస్తున్నారు కాని అది నిజమా?' అంటున్నారు. నిజానికి ఈ విషయం వివరంగా ముందే చూశాము – ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది – ఇవేవీ జాగ్రత్‌ప్రపంచం సత్యం అని నిరూపించలేవు. అందువల్ల జాగ్రత్‌ప్రపంచం మిథ్యా, స్వప్నప్రపంచంలాగా – దీనితో రెండవ అంశం కూడా అయిపోయింది. ఆకాశ దృష్టాంతం ద్వారా జీవసృష్టిని నిషేధిస్తే, స్వప్న దృష్టాంతం ద్వారా జగత్‌సృష్టిని నిషేధించారు.

**ఆకాశదృష్టాంతేన జీవసృష్టి నిషేధః**
**స్వప్నదృష్టాంతేన జగత్‌సృష్టి నిషేధః**

**కారిక 3.11**

**రసాదయో హి యే కోశా వ్యాఖ్యాతాస్తైత్తిరీయకే ।**
**తేషామాత్మా పరో జీవః ఖం యథా సంప్రకాశితః ॥**

### సి) శ్రుత్యా జీవసృష్టి నిషేధః – కారికలు 11–14

శ్రుతి అంటే వేదప్రమాణం. జీవసృష్టి జరగలేదని నిరూపించటానికి ఉపనిషత్‌లోని వాక్యాలను తీసుకుంటారు. ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక తెలివైన మార్గాన్ని ఎన్నుకున్నారు.

**సాధారణ పొరపాటు** – పరమాత్మ కారణం, జగత్ కార్యం. పరమాత్మ అనే కారణంనుంచి జగత్తు, జీవులు వచ్చారనేది మన అభిప్రాయం. ఈ పొరపాటువల్ల పరమాత్మను జగత్ కారణ బ్రహ్మ అంటారు.

**జవాబు** - గౌడపాదాచార్యులవారు పరమాత్మ కారణం కాదు అని నిరూపించాలి. దాన్ని అనేక మార్గాల్లో నిరూపించవచ్చు. కాని గౌడపాదాచార్యులవారు ఒక ప్రత్యేకమైన మార్గాన్ని ఎన్నుకున్నారు. తన వాదనను బలపరచటానికి శ్రుతివాక్యాల కింద మహావాక్యాలను తీసుకున్నారు.

**జీవాత్మ పరమాత్మ ఐక్య బోధక వేదాంత వాక్యాని**

జీవాత్మ-పరమాత్మల ఐక్యాన్ని బోధించే ఏ శ్రుతివాక్యాన్నైనా మహావాక్యం అంటారు. ఉపనిషత్తులో అటువంటి మహావాక్యాలు అనేకం. కాని అవేమిటో తెలియటానికి ఉదాహరణగా నాలుగు మహావాక్యాలను పేర్కొంటారు. అవి -

**తత్త్వమసి - ఛాందోగ్యోపనిషత్**
**ప్రజ్ఞానం బ్రహ్మ - ఐతరేయోపనిషత్**
**అహం బ్రహ్మాస్మి - బృహదారణ్యకోపనిషత్**
**అయమాత్మా బ్రహ్మ - మాండూక్యోపనిషత్**

ఈ వాక్యాలన్నీ జీవాత్మ = పరమాత్మ అంటున్నాయి. పరమాత్మకు చావు, పుట్టుకలు లేవని మనందరికీ తెలుసు. మనమే కాదు, పరమాత్మను నమ్మే వారందరు కూడా పరమాత్మ నిత్యం, పరమాత్మకు చావు, పుట్టుకలు లేవని ఒప్పుకుంటారు. పరమాత్మ పుట్టాడంటే పరమాత్మను ఎవరు పుట్టించారు అనే సందేహం కలుగుతుంది.

జీవాత్మ = పరమాత్మ

పరమాత్మకు పుట్టుక లేదు

కాబట్టి జీవాత్మకు కూడా పుట్టుక లేదు.

జీవాత్మకు పుట్టుక లేదు అంటే జీవాత్మ కార్యం కాదు; జీవాత్మ కార్యం కాకపోతే, పరమాత్మ కారణం కాలేదు. అందువల్ల పరమాత్మ కార్యకారణ విలక్షణమ్. ఇది నిరూపించటానికి ఈ కారికలో తైత్తిరీయోపనిషత్‌ను తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు.

అందులో ఆ ఉపనిషత్ ముందు బ్రహ్మను సత్యం జ్ఞానమనంతం బ్రహ్మగా వర్ణించింది. దాని తర్వాత పంచకోశవివేకం జరిపింది. దాని తర్వాత బాహ్యంగా ఉన్న బ్రహ్మ, అంతరంగా ఉన్న ఆత్మ, రెండూ ఒకటే అని చెప్పింది.

బ్రహ్మ, ఆత్మ రెండూ ఒకటే అయితే రెండు పేర్లు ఎందుకు? బాహ్యంగా బ్రహ్మ సత్ రూపంలో ఉంటే, అంతరంగా బ్రహ్మ చిత్ రూపంలో ఉంటాడు. ఈ భేదం పేర్లలో ఉంది కాని, వస్తువులో లేదు. ఒకే వ్యక్తిని ఆఫీసులో వైస్‌ప్రెసిడెంట్ అంటే, ఇంట్లో భర్త అంటారు. బయట పులిలా ఉన్న వ్యక్తి, ఇంట్లో పిల్లిలా ఉంటాడు.

**తైత్తిరీయకే** – తైత్తిరీయంలోని రెండవ అధ్యాయమైన బ్రహ్మానందవల్లీలో,

**కోశా వ్యాఖ్యాతాః** – పంచకోశ వివేకం జరిగింది. ఆ పంచకోశాలు – అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం.

**రసాదయః** – రసః అంటే అన్నమయకోశం. అన్నమయకోశానికి రసః అని ఎందుకన్నారు. అన్నం పదం వాడి ఉండవచ్చు కదా!

> **ఆకాశాద్వాయుః । వాయోరగ్నిః । అగ్నేరాపః ।**
> **అద్భ్యః పృథివీ । పృథివ్యా ఓషధయః । ఓషధీభ్యోఽన్నమ్ ।**
> **అన్నాత్పురుషః। స ఏవ పురుషోఽ న్నరసమయః।**

ఆ విధంగా అన్నమయకోశాన్ని అన్నరసమయః అంది తైత్తిరీయం. పంచకోశవివేకం చేశాక,

**తేషామాత్మా** – ఈ పంచకోశాలకు అతీతంగా ఉన్నది ఆత్మ అని తెలుసుకున్నాడు శిష్యుడు.

ఆ ఆత్మను ఆనందఆత్మా అనీ, అది బాహ్యంగా ఉన్న బ్రహ్మతో సమానం అనీ అన్నది ఉపనిషత్.

**పరో జీవః** – పరో జీవః అంటే పరమాత్మ. పంచకోశాలలో ఉన్న ఆత్మ ఏదైతే ఉందో, అదే బాహ్యంగా పరమాత్మ రూపంలో ఉంది. బాహ్యంగా ఉన్న పరమాత్మను సత్ అంటాము. పరమాత్మ ఉనికి రూపంలో ఉంటే, వ్యష్టిలో చిత్ రూపంలో ఉంటాడు.

**యథా ఖం** – ఆకాశంలాగా. ఖం అంటే ఆకాశం. ఈ గదిలో ఉన్న ఆకాశం, గది బయట ఉన్న ఆకాశం కూడా ఎలా రెండూ ఒకటేనో, అదే విధంగా జీవిలో ఉన్న జీవాత్మ, బాహ్యంగా ఉన్న పరమాత్మ రెండూ ఒకరే.

> 1. **ఆనంద ఆత్మా । బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా**

ఇది ప్రత్యక్షంగా ఐక్యాన్ని సూచించకపోయినా, ఇది ఒక మహావాక్యం. ఇందులోనే తర్వాత ఇంకొక మహావాక్యం వస్తుంది. అది –

> **స యశ్చాయం పురుషే**

వ్యష్టిలోని చైతన్యం, సమష్టిలోని చైతన్యం ఒకటే. వ్యష్టిలోని చైతన్యాన్ని జీవాత్మ అంటే, సమష్టిలోని చైతన్యాన్ని పరమాత్మ అంటారు.

**సంప్రకాశితః** – ఇది స్పష్టంగా నిరూపించబడింది. ఈ కారిక ప్రత్యక్షంగా జీవాత్మ– పరమాత్మ ఐక్యాన్ని చూపిస్తున్నది. దీన్నుంచి మనం ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి. జీవాత్మ పరమాత్మ ఐక్యం అయితే, పరమాత్మకు పుట్టుక లేకపోతే, జీవాత్మ కూడా పుట్టలేదు. నిజానికి

కూడా అనే పదాన్ని కూడా వాడలేము. రెండు వస్తువులుంటేనే కూడా వస్తుంది. రెండూ ఒకటే అన్నప్పుడు కూడా ఎలా వాడతాము?

అందువల్ల జీవాత్మ పుట్టలేదు. జీవాత్మ పుట్టకపోతే అది కార్యం కాదు; కార్యం లేకపోతే పరమాత్మ కారణం కాదు; పరమాత్మ కారణం కాకపోతే పరమాత్మ **కార్య-కారణ విలక్షణమ్.**

**కారిక 3.12**

**ద్వయోర్ద్వయోర్మధుజ్ఞానే పరం బ్రహ్మ ప్రకాశితమ్ ।**
**పృథివ్యాముదరే చైవ యథాఽఽ కాశః ప్రకాశితః ॥**

ముందు కారికలో తైత్తిరీయోపనిషత్తులోని బ్రహ్మానందవల్లీ గురించి చెప్పాక, ఇక్కడ గౌడపాదాచార్యులవారు శ్రుతిప్రమాణానికి బృహదారణ్యకోపనిషత్తును తీసుకున్నారు. అందులో ఖండాన్ని బ్రాహ్మణమ్ అంటారు. రెండవ అధ్యాయంలో ఐదవ ఖండాన్ని మధుబ్రాహ్మణమ్ అంటారు.

ఈ బ్రాహ్మణమ్‌లో బ్రహ్మను మధువుగా వర్ణిస్తుంది ఉపనిషత్తు. మధుకు అనేక అర్థాలు ఉన్నాయి. అందరికీ తెలిసిన అర్థం తేనె. తేనె ఆనందాన్ని ఇస్తుంది. బ్రహ్మ ఆనంద స్వరూపం కాబట్టి, అందరికీ ఆనందాన్ని ఇస్తుంది కాబట్టి, బ్రహ్మను కూడా మధు అంటున్నది ఉపనిషత్తు. బ్రహ్మ అనే మధు గురించి ఈ ఖండం చెబుతున్నది కాబట్టి దీన్ని మధుబ్రాహ్మణమ్ అంటారు.

ఈ ఖండంలో ఉపనిషత్తు వ్యష్టిపరంగా కొన్ని అంగాలను, సమష్టిపరంగా కొన్ని అంగాలను జతలుగా తీసుకుంది. వ్యష్టిపరంగా అధ్యాత్మికం అంటే సమష్టిపరంగా అధిభూతం. ముందు ఆ జంటలను చూద్దాము.

| **అధిదైవం** | **అధ్యాత్మికం** |
|---|---|
| పృథివీ | శరీరం |
| జలం | రేతస్సు |
| అగ్ని | వాక్కు |
| వాయువు | ప్రాణం |
| ఆదిత్యుడు | చక్షువు |
| దిక్కులు | శ్రోత్రం |
| చంద్రుడు | మనస్సు |

వ్యష్టిలో ఉన్న బ్రహ్మను జీవాత్మ అంటే సమష్టిలో ఉన్న బ్రహ్మను పరమాత్మ అంటారు. పదాలు వేరు కాని వస్తువు ఒకటే. ఒక చిన్న అలలోనూ, పెద్ద సముద్రంలోనూ అధిష్ఠానంగా ఉన్న నీరు ఒకటే. ఇదే అంశాన్ని ఈ జంటల రూపంలో వివరించుకు వస్తుంది ఉపనిషత్తు.

పృథివిలో ఉన్న బ్రహ్మ, శరీరంలో ఉన్న బ్రహ్మ ఒకటే అంటున్నది. పృథివి అధిదైవం అయితే, శరీరం అధ్యాత్మికం.

2. **ఇయం పృథివీ సర్వేషాం భూతానాం మధు। అస్యై పృథివ్యై సర్వాణి భూతాని మధు। యశ్చాయమస్యాం పృథివ్యాం తేజోమయో అమృతమయః పురుషో, యశ్చాయమ్ అధ్యాత్మగ్ంం శారీరః తేజోమయః అమృతమయః పురుషో, అయమేవ సః యోఽయమాత్మా, ఇదమ్ అమృతమ్, ఇదం బ్రహ్మ, ఇదగ్ం సర్వమ్॥ –** బృహదారణ్యకమ్

తేజోమయ పురుషః అంటే సమష్టిలో ఉన్న బ్రహ్మ; శరీరః అంటే శరీరంలో ఉన్న బ్రహ్మ; అయమేవ సః అంటే రెండూ ఒకటే. ఇదే అంశం మనం పైన చూసిన జంటల ద్వారా మళ్ళీమళ్ళీ చెప్పబడింది. దాన్ని ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఉటంకిస్తున్నారు.

**ద్వయోర్ద్వయోః** – ఆ రెండింటి యందు అంటే అధిదైవ–అధ్యాత్మాలు రెండింటియందు. ఉదాహరణకు అధిదైవం ఆదిత్యుడు అయితే చక్షువు అధ్యాత్మికం. ఆదిత్యుడు చక్షువుకు అధిష్ఠానదేవత.

**పరం బ్రహ్మ ప్రకాశితమ్** – ఒక అధిష్ఠాన బ్రహ్మను ఉపనిషత్తు వివరించింది.

**మధు జ్ఞానే** – మధుబ్రాహ్మణమ్‌లో. జ్ఞానే అంటే ఇక్కడ బ్రాహ్మణమ్. గౌడపాదాచార్యులవారు ఈ మధుబ్రాహ్మణమ్ (2.5)లోని ఒక జంటను ఉదాహరణ కింద తీసుకున్నారు. అది పృథివీ – శరీరం జంట.

**పృథివ్యామ్** – సమష్టిలోని పృథివీలో ఉన్న బ్రహ్మ;

**ఉదరే చైవ** – వ్యష్టిలోని పృథివిలో ఉన్న బ్రహ్మ ఒకటే. వ్యష్టిలోని పృథివి అంటే శరీరం. శరీరం కూడా మట్టితో చేయబడింది. ఉదరం అంటే నిజానికి కడుపు. ఇక్కడ దాన్ని శరీరానికి ఉపలక్షణంగా తీసుకోవాలి. ఇప్పుడు ఈ వాక్యం మొత్తం అర్థం చూస్తే పృథివిలో ఉన్న బ్రహ్మ, శరీరంలో ఉన్న బ్రహ్మ ఒకటే.

**యథాఽఽకాశః ప్రకాశితః** – ఎలాగైతే శరీరంలో ఉన్న ఆకాశం, శరీరం బయట ఉన్న ఆకాశం ఒకటేనో, అలాగే శరీరంలో ఉన్న బ్రహ్మ, పృథివిలో ఉన్న బ్రహ్మ ఒకటే. శరీరంలో ఉన్న బ్రహ్మను జీవాత్మ అనీ, పృథివిలో ఉన్న బ్రహ్మను పరమాత్మ అనీ అన్నా రెండింటిలోనూ అధిష్ఠానంగా ఉన్నది ఒకటే బ్రహ్మ.

మళ్ళీ ఆ దశలన్నీ మనం చెప్పుకోవాలి. అందువల్ల జీవాత్మ = పరమాత్మ. పరమాత్మకు పుట్టుక లేదు కాబట్టి జీవాత్మకు కూడా పుట్టుక లేదు; జీవాత్మ కార్యం కాదు కాబట్టి పరమాత్మ కారణం కాదు; పరమాత్మ కారణం కాదు కాబట్టి పరమాత్మ కార్యకారణ విలక్షణమ్; అద్వైతమ్.

**కారిక 3.13**

**జీవాత్మనోరనన్యత్వమభేదేన ప్రశస్యతే ।**
**నానాత్వం నింద్యతే యచ్చ తదేవం హి సమంజసమ్ ॥**

**రాగల సందేహం** – ఇలా మహావాక్యాలను ఉటంకిస్తుంటే, ఎవరికైనా ఒక సందేహం రావచ్చు. వారికి రాగల సందేహాన్ని గౌడపాదాచార్యులవారే ఊహించి, దానికి ముందే జవాబు చెబుతున్నారు.

**సందేహం – ఉపనిషత్తులు బోధించే భేదవాక్యాల మాట ఏమిటి?**

గౌడపాదాచార్యులవారు జీవాత్మ–పరమాత్మల ఐక్యబోధక వాక్యాలను తీసుకుని, తద్వారా పరమాత్మ కార్యకారణ విలక్షణం అని బోధిస్తున్నారు బాగానే ఉంది, కాని అవే ఉపనిషత్తుల్లో అనేక వాక్యాలు జీవాత్మ–పరమాత్మల భేదాన్ని సూచిస్తాయి. అంతేనా? జీవాత్మ పరమాత్మ నుంచి పుట్టింది అనే వాక్యాలు వస్తాయి. వాటికేమంటారు అనవచ్చు ఎవరైనా.

ఉపనిషత్తుల్లోనే అటు ఐక్యవాక్యాలు, ఇటు బేధవాక్యాలూ ఉంటే, మీరు మీకు కావాల్సిన ఐక్యవాక్యాలను మాత్రమే తీసుకుని, మీ వాదనకు సరిపోని భేదవాక్యాలను ఎలా పట్టించుకోకుండా ఉండగలరు? వేదాంతం గురించి చెబితే, మొత్తం వేదాంతం గురించి మాట్లాడండి; లేదా ఏదీ చెప్పకండి. సగం తీసుకుని సగం వదిలేస్తామంటే అది అర్ధ అండన్యాయం అవుతుంది. సగం గుడ్డును పొదుగుతాము, సగం గుడ్డును వండుతాము అనలేరు కదా! ఇదీ అంతే! సగం ప్రమాణం అవుతుంది, సగం కాదు అనలేరు.

జీవాత్మ పరమాత్మల మధ్య భేదాన్ని చూపించే, ద్వైతాన్ని బోధించే వాక్యాలను మేము చెబుతాము చూడండి అని వారు చెప్పి ఈ క్రింది ఉదాహరణలను ఇవ్వవచ్చు. మొట్టమొదటిది ముండకంలో బాగా ప్రసిద్ధి చెందిన మంత్రం –

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
**తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి** – ముండకమ్ 3.1.1

రెండు పక్షులు ఒకే వృక్షం మీద ఉన్నాయి. ఒక పక్షి పిప్పలం పండ్లను తిని రకరకాల రుచులను ఆస్వాదిస్తోంది; ఇంకొకటి తినకుండా సాక్షిగా చూస్తోంది అని దీని అర్థం. ఇందులో పండ్లను తింటున్నది జీవాత్మ – సంసారి; తిననది పరమాత్మ – అసంసారి. ఇక్కడ ద్వైతం స్పష్టంగా తెలుస్తున్నది.

**యథా సుదీప్తాత్పావకాత్ విస్ఫులింగాః సహస్రశః ప్రభవన్తే సరూపాః** – ముండకమ్ 2.1.1

ఎలాగైతే జ్వలిస్తున్న అగ్నినుంచి నిప్పురవ్వలు పుడతాయో, అలాగే పరమాత్మనుంచి జీవాత్మలు పుడతాయి. ఇక్కడ సృష్టి గురించి స్పష్టంగా తెలుస్తున్నది. అంటే జీవాత్మ కార్యమనీ,

పరమాత్మ కారణమనీ స్పష్టంగా ఉపనిషత్తే చెప్పింది. ఈ వాక్యాలను ఎందుకు చూడరు మీరు?

వేదాంతమే తనను తాను ఖండించుకుంటోంది. ఒకచోట జీవాత్మ–పరమాత్మలు ఐక్యం అంటే ఇంకొకచోట ఈ రెండూ భిన్నం అంటున్నది. ఈ భేదాన్ని చిన్న భేదంగా కొట్టి పారేయలేము. రెండూ రెండు భిన్నధృవాలు.

ఉపనిషత్తులే ఇలా భిన్నధృవాలను కలిపి చెబుతుంటే, దేన్ని మనం సత్యంగా స్వీకరించాలి? భేదాన్నా, ఐక్యాన్నా? గొడవెందుకు, రెండింటినీ స్వీకరిద్దామంటే అది మన అజ్ఞానాన్నే వేలెత్తి చూపుతుంది. ఒకవరలో రెండు కత్తులు ఇమడనట్టుగా, ఒకచోట రెండు భిన్న సత్యాలు ఉండలేవు. భేదం సత్యమయితే, అభేదం కుదరదు; అభేదం సత్యమయితే, భేదం కుదరదు.

ఖచ్చితంగా వేదాంతం రెండు సత్యాలను బోధించదు. సారం ఒకటే ఉంటుంది. ఒకటి స్వీకరించామంటేనే, ఇంకొకటి తిరస్కరించినట్టు చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఒక గోడకు దగ్గరగా వెళితే, ఇంకొక గోడకు దూరంగా వెళ్ళినట్టే. అందువల్ల వేదాంతం దేన్ని బోధిస్తోంది? ఐక్యాన్నా, భేదాన్నా? ఇదీ సందేహం.

**గౌడపాదాచార్యులవారి జవాబు** – దీనికి జవాబు శాస్త్రంలోనే దొరుకుతుంది. శాస్త్రం మననేమీ అయోమయంలో పడవేయటం లేదు; కాకపోతే మనమే శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఆత్మజ్ఞానం పొందాలంటే శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

శ్రవణం అంటేనే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన ఒక ఆచార్యుని వద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. ఇందులో ప్రతి ఒక్కపదమూ ముఖ్యమే. అలా ఒక క్రమపద్ధతిలో గురువు ద్వారా నేర్చుకుంటే, ఆ శ్రవణమే చాలామటుకు మన సందేహాలను పారద్రోలుతుంది. అదెలా?

గౌడపాదాచార్యులవారు వివరిస్తున్నారు. ఉపనిషత్తులు ద్వైతం గురించి చెబుతాయి నిజమే కాని, సందర్భం వచ్చినప్పుడల్లా ఉపనిషత్తులు ద్వైతాన్ని తీవ్రంగా విమర్శిస్తాయి, ఒకచోట కాదు, అనేకచోట్ల.

1. **మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి** – కఠ 2.1.10

ఎవరైతే నానాత్వాన్ని చూస్తారో వారు మృత్యువునుంచి మృత్యువుకు వెళతారు అంటే ద్వైతంలో ఉన్నవారికి పునరపి జననం, పునరపి మరణం తప్పదు. అంటే సంసారం తప్పదు.

2. **యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమంతరం కురుతే ।**

**అథ తస్యం భయం భవతి** – తైత్తిరీయమ్

భగవంతునికీ, మీకు మధ్య కాస్త భేదాన్ని చూసినా కూడా, భయం తప్పదు అంటే పూర్తి భద్రతాభావన కలగదు. 'భగవంతునికి నేను అంత గొప్ప భక్తుణ్ణి అయితే, భగవంతుడు భయహేతువు ఎలా అవుతాడు?' అనిపించవచ్చు. భగవంతుడు సృష్టి, స్థితి, కారణమే కాదు లయకారణం కూడా. సమయమాసన్నమయినప్పుడు అదే భగవానుడు నిర్దాక్షిణ్యంగా, నిష్పక్షపాతంగా తీసుకువెళ్ళిపోతాడు.

**సంప్రాప్తే సన్నిహితే కాలే, న హి న హి రక్షతి 'డుకృఞ్కరణే'** ॥ – భజగోవిందమ్

3. **అన్యాం దేవతాం ఉపాస్యే సః న వేద** – బృహదారణ్యకమ్

జీవాత్మకు, పరమాత్మకు మధ్య భేదాన్ని ఎవరైతే చూస్తారో, అతను పశువుతో సమానం అంటున్నది ఉపనిషత్తు. అంటే అతనికి విచక్షణాశక్తి లేదని విమర్శిస్తున్నది.

4. **ఉపాసనాశ్రితో ధర్మో జాతే బ్రహ్మణి వర్తతే**
**ప్రాగుత్పత్తేరజం సర్వం తేనాసౌ కృపణః స్మృతః** । – మాండూక్యమ్ 3.1

ఈ ఉపనిషత్తులోనే, ఈ అధ్యాయంలోనే, మొదటే గౌడపాదాచార్యులవారు ఎవరైతే ద్వైతభావన చూపిస్తారో వారు కృపణులు అన్నారు.

వీటన్నిటి సారం, ఉపనిషత్తులే ద్వైతాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఉపనిషత్తులే ద్వైతాన్ని విమర్శించేటట్టయితే, అసలు ఇన్ని పూజలు, ఉపాసనలను నిర్దేశించటమెందుకు? పూజ, ఉపాసనలంటేనే ద్వైతం రాకతప్పదు. భగవంతుడు దీనబంధువు, నేను దీనుణ్ణి; భగవంతుడు సృష్టికర్త, నేను జీవుణ్ణి; భగవంతుడు కర్మఫలదాత, నేను కర్మఫల భోక్తను; భగవంతుడు నిత్యముక్తుడు, నేను నిత్యబద్ధుడిని అంటారు ద్వైతంలో. ఈ భావనను పదేపదే గుర్తుచేస్తుంది ప్రతి ఒక్క పూజ కూడా. అలాంటప్పుడు అసలు ద్వైతాన్ని ఎందుకు నిర్దేశించాలి శాస్త్రం?

శాస్త్రం ద్వైతాన్ని నిర్దేశించినా, **చివరికి** ద్వైతాన్ని అధిగమించి అద్వైతానికి రమ్మంటుంది. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. చివరికి పదం చాలా ముఖ్యం. మొదట్లో ద్వైతం పాటించినా, దాన్ని దాటి అద్వైతానికి రావాలి. నిజానికి అద్వైతానికి, ద్వైతమనే ద్వారం ద్వారానే రావాలి. అందువల్ల ముందు పూజలు, ఉపాసనలు చేయండి కాని అవే అంతిమ లక్ష్యంగా పొరపాటు పడకండి అంటుంది శాస్త్రం. కర్మకాండలోని కర్మలు, ఉపాసనలు చేసి చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత పొంది, జ్ఞానకాండకు వచ్చి అద్వైత ఆత్మజ్ఞానాన్ని పొందాలి.

కర్మ, ఉపాసనలను సాధనలుగానూ, జ్ఞానాన్ని లక్ష్యంగానూ భావించాలి. వాటిని అంతిమలక్ష్యంగా భావించేవారిని తీవ్రంగా విమర్శిస్తున్నది శాస్త్రం. వారిని బృహదారణ్యకం

పశుః అంటుందని చూశాం. అంటే వారు వారి బుద్ధిని ఉపయోగించటానికి సిద్ధంగా లేరు. వారికి తెలియకపోయినా, గురువు వారిని కర్మకాండకు అతీతంగా ఎదగమని బోధించినా, వారు వినటానికి సిద్ధంగా లేరు. అటువంటివారి విషయంలో గురువు కూడా నిస్సహాయంగా మిగులుతాడు. అటువంటి వారిని తాత్కాలికంగా వదిలివేయటమే దానికి పరిష్కారం. ఇప్పుడు కాకపోతే కొన్ని సంవత్సరాల తర్వాతో, కొన్ని జన్మల తరువాతో అతను అద్వైతానికి రాకతప్పదు అని గురువుకు తెలుసు కాని బలవంతపెట్టడు.

ఆ విధంగా వేదాల సారం ద్వైతం కాదు, అద్వైతమే. ఏ తర్కం ఉపయోగించి చెబుతున్నారు? శాస్త్రం సమయం దొరికినప్పుడల్లా ద్వైతాన్ని విమర్శిస్తున్నది, అద్వైతాన్ని కీర్తిస్తున్నది. ద్వైతంలో ఉన్నవారిని మూఢా అనీ ప్రమూఢా అనీ విమర్శిస్తే, అద్వైతానికి వచ్చినవారిని ధీరా అంటుంది శాస్త్రం. దేన్ని కీర్తిస్తున్నదో అదే సారం అవాలి కాని, దేన్ని నిందిస్తున్నదో అది సారం అవలేదు కదా! ఉదాహరణకు ఒక పక్క అనారోగ్యకరమైన జీవన విధానాన్ని విమర్శిస్తూ, అందువల్ల అనారోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించండి అని చెప్పగలరా ఎవరైనా? ఈ నేపథ్యంతో ఈ శ్లోకాన్ని చూద్దాము.

**జీవాత్మనోరనన్యత్వమ్** – అనన్యత్వమ్ అంటే ఐక్యం. జీవాత్మ పదాన్ని ఇక్కడ రెండుగా విభజించాలి – జీవ, ఆత్మ. జీవ అంటే జీవాత్మ, ఆత్మ అంటే పరమాత్మ. అందువల్ల ఈ వాక్యం పూర్తి అర్థం జీవాత్మ, పరమాత్మల మధ్య ఐక్యం.

**ప్రశస్యతే** – శాస్త్రం చేత ప్రశంసించబడుతున్నది.

**అభేదేన** – అనేక మహావాక్యాల ద్వారా ఈ ఐక్యాన్ని ప్రశంసిస్తున్నది.

**తత్త్వమసి**
**అహం బ్రహ్మాస్మి**

ఇటువంటి అద్వైతజ్ఞానం పొందిన జ్ఞాని జీవితం ఎలా ఉంటుందో వివరిస్తుంది.

**హా 3వు హా 3వు హా 3వు । అహమన్నమహమన్న మహమన్నమ్ ।**
**అహమన్నాదో 3హ మన్నాదో 3ఽ హమన్నాదః** – తైత్తిరీయమ్

జ్ఞాని ఎలా ఆనందంగా సామగానం చేస్తాడో చెబుతున్నది ఇక్కడ.

3. **యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవాఽ ఽ భూద్విజానతః**
**తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః** – ఈశావాస్యమ్

ఎవరైతే ఆత్మ సర్వవ్యాపకత్వాన్ని అర్థం చేసుకుంటారో, వారికి మోహం ఎక్కడిది, శోకం ఎక్కడిది అంటే వారు సంసారాన్ని అధిగమిస్తారు. ఈ విధంగా అద్వైతాన్ని ప్రశంసిస్తున్నది శాస్త్రం.

**నానాత్వం నింద్యతే** – నానాత్వం అంటే జీవాత్మ, పరమాత్మల మధ్య భేదం. ఈ భేదాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నది.

కాని శాస్త్రం ఈ భేదాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నది అనే ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. శాస్త్రం ద్వైతాన్ని పూర్తిగా విమర్శించదు. ద్వైతంలోనే ఆగిపోతే తీవ్రంగా విమర్శిస్తుంది. ఆ మాటకొస్తే శాస్త్రమే ద్వైతాన్ని సాధనగా వాడమంటుంది. దాన్ని లక్ష్యంగా మార్చుకోవద్దంటుంది.

ఒక పిల్లవాడు, కొన్ని సంవత్సరాలు స్కూల్లో విద్యనభ్యసించి, నాకు ఇక్కడే బాగుంది, నేను బయటకు వెళ్ళను అంటే అర్థం లేదు. ఇతను ఒక రకం అజ్ఞాని అయితే, ఇంకొక రకం బృహస్పతి అంటాడు కదా, 'ఎలాగూ నేను స్కూలు నుంచి బయటకు రావాలి కదా, అలాంటప్పుడు వెళ్ళటం ఎందుకు, బయటకు రావటం ఎందుకు? అసలు వెళ్ళనే వెళ్ళను.' రెండు రకాలవారూ మూఢులే. మొదటిరకం మూఢుడు స్కూలుకి వెళ్ళి బయటకు రానంటాడు; రెండవరకం మూఢుడు అసలు వెళ్ళనే వెళ్లనంటాడు. ఇద్దరూ మూఢులయితే, తెలివైన వాడెవరు? తెలివైనవాడు స్కూలుకి వెళ్ళి, విద్యనభ్యసించి, బయటకు రావాల్సిన సమయంలో వచ్చేవాడు.

అందువల్ల భక్తిగా పూజలు, పారాయణం, ఉపాసనలు చేయాలి; కర్మ, ఉపాసనలు చాలా ముఖ్యమైన సాధనలు. అవి చిత్తశుద్ధిని, చిత్త ఏకాగ్రతను ఇస్తాయని చూశాము. అందువల్ల అవి చేయకపోవటం మూఢత్వం. కాని అవి చేయకపోవటం ఎంత మూఢత్వమో, వాటినుంచి బయటకు రాకపోవటం కూడా అంతే మూఢత్వం.

**యత్ చ** – యత్ అంటే యస్మాత్. ఇది ఉపనిషత్ పదప్రయోగం. ఏ విషయమైతే చెప్పబడిందో,

**తద్ ఏవం హి సమంజసమ్** – అది నిశ్చయంగా ఈ విధంగానే సమంజసమ్. ఈ విధంగా నేను చూపించిన సారమే సరియైనది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఏమిటా సారం. వేదాలసారం అద్వైతం – అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందాలి.

### కారిక 3.14

**జీవాత్మనోః పృథక్త్వం యత్ప్రాగుత్పత్తేః ప్రకీర్తితమ్ ।**
**భవిష్యద్వృత్త్యా గౌణం తన్ముఖ్యత్వం హి న యుజ్యతే ॥**

ఈ కారిక కూడా ద్వైతాన్ని విమర్శించి, అద్వైతాన్ని నిలబెడుతున్నది.

**సందేహం** – ద్వైతంవల్లనే సంసారం, పరిమితి, అపూర్ణత్వం ఏర్పడేటట్టయితే, అసలు శాస్త్రం ద్వైతాన్ని ప్రవేశపెట్టటమెందుకు? ఒకేసారి, సరాసరి అద్వైతానికి వచ్చేయవచ్చు కదా! వేదపూర్వభాగం అయిన కర్మకాండను తీసుకుంటే, కర్మకాండ మొత్తం జీవాత్మ– పరమాత్మల

భేదాన్నే చూపిస్తుంది. భగవంతుడు పూజలందుకునే దేవత, నేను భక్తుడిని. నేను చేసే ప్రతి పూజలోనూ నేను నా అల్పత్వాన్ని గుర్తు తెచ్చుకుంటాను; పరమాత్మ సర్వజ్ఞత్వాన్ని కీర్తిస్తాను.

ఉపాసనకాండ కూడా, భేదాన్నే చూపిస్తుంది. భగవంతుడు ఉపాస్యదేవత, నేను ఉపాసకుణ్ణి. ఎక్కడిదాకానో ఎందుకు? వేదాంతంలో కూడా మొదట్లో భేదాన్నే చూస్తాము.

**తత్రాపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వవేదః శిక్షా కల్పో**
**వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషమితి।**

అపరావిద్య అంటే ఏమిటో నిర్వచిస్తున్నది ఈ మంత్రంలో.

తైత్తిరీయోపనిషత్తులోని శీక్షావల్లీలో అనేక ఉపాసనలను చూస్తాము. అవన్నీ ద్వైతాన్నే నిర్దేశిస్తాయి. ఇలా సంసారహేతువైన ద్వైతాన్ని నిర్దేశించటమెందుకు? ఆ తర్వాత దాన్ని తీవ్రంగా విమర్శించటమెందుకు?

**జవాబు** – ఇంతకుముందు చూసిన జవాబే ఇక్కడా వస్తుంది. ద్వైతం, అద్వైతంలోకి అడుగు పెట్టటానికి తోడ్పడుతుంది. ఎవరూ సరాసరి అద్వైతంలోకి రాలేరు.

అద్వైతానికి రానిదే, ద్వైతం అసంపూర్ణం
ద్వైతం లేనిదే, అద్వైతం అసంభవం

ఈ రెండు వాక్యాలూ సరిగ్గా అర్థం చేసుకుంటే మీరు ద్వైతాన్ని బాగా అర్థం చేసుకున్నట్టే. ద్వైతం పాటించాలి; కాని అక్కడే ఆగిపోకుండా వేదఅంతభాగానికి రావాలి. దానికి అనేక ఉదాహరణలు చెప్పవచ్చు.

ఒక ఇల్లు కట్టేటప్పుడు ఆ కట్టడం బలంగా నిలబడటానికి, అనేక స్తంభాలను పెడతారు. పైకప్పు బలం పుంజుకున్నాక, ఆ స్తంభాలను తీసేస్తారు. అక్కడా ఇదే తర్కం. పైకప్పు బలంగా అవటానికి, పాపం ఈ స్తంభాలు తోడ్పడ్డాయి కదా, వాటిని తీసేస్తే ఎలా అంటే, మీరు గృహప్రవేశం ఎలా చేసుకుంటారు? సరే, అవి ఎలాగూ తీసేస్తాం కదా అని, అసలు పెట్టనే పెట్టము అనటం కూడా అర్థం లేనిమాటే. వాటిని పెట్టాలి, మళ్ళీ వాటి అవసరం తీరాక, వాటిని తీసివేయాలి. వాటి మీద ఎటువంటి మమకారమూ పెంచుకోకూడదు. అయ్యో నాకింత తోడ్పడిందే, నేనెలా వదిలేయగలను అని బాధపడకూడదు.

మీరు కొత్తకారులో ఏదో ప్రసంగం వినటానికి గంట ప్రయాణం చేసివెళ్ళారు. పాపం, కొత్తకారు నాకోసం ఇంతసేపు అలసిపోయింది, నేను దీనిలోనే కూర్చుంటాను అంటారా? అలా కూర్చుంటే అంతదూరం వెళ్ళిన ఉద్దేశ్యం తీరదు. ఎలాగూ దాన్ని రోడ్డు మీద నిర్దాక్షిణ్యంగా వదిలివేస్తాను, అందువల్ల నేను కారులో వెళ్ళను అంటే ప్రసంగానికి కూడా వెళ్ళలేరు. కాబట్టి కారులో వెళ్ళాలి, కారుని వదలాలి.

అలాగే అరటిపండు తొక్క. అరటిపండు తొక్కవల్లనే పండుతుంది. తొక్క వల్ల పండింది కదాని తొక్కతో తినలేము. ఎలాగూ తీసేస్తాము కదాని ముందే తొక్కని తీస్తే ఆ పండు పక్వానికి రాదు. అందువల్ల తొక్కని ఉంచాలి, తినేటప్పుడు బుద్ధిమంతునిలా తొక్కని తీసి తినాలి. ఇందులో కృతఘ్నులు కావటం లేదు.

అలాగే కర్మ చేయాలి, చిత్తశుద్ధి పొందాలి; ఉపాసన చేయాలి, చిత్త ఏకాగ్రత పొందాలి; ఈ రెండూ వస్తే జ్ఞానయోగ్యతా ప్రాప్తి వచ్చినట్టే. అప్పుడు కర్మ, ఉపాసనలను వదిలేసి, జ్ఞానకాండకు రావాలి. ఎప్పుడైతే అద్వైతజ్ఞానాన్ని పొందుతారో, అప్పుడే ద్వైతం మిథ్య అని అర్థం చేసుకుంటారు.

గౌడపాదాచార్యులవారు, అందువల్ల శాస్త్రంయొక్క ప్రాథమిక బోధ ద్వైతం కాదు, అద్వైతం అని నిరూపిస్తున్నారు. ద్వైతాన్ని బోధిస్తుంది నిజమే కాని అది ప్రాథమిక బోధ కాదు. అది మిథ్య. మిథ్య అంటే అసలు లేదని కాదు అర్థం; మిథ్య అంటే తాత్కాలికంగా వ్యవహారం నడపటానికి మాత్రమే పనికివచ్చేది అని అర్థం. ఇప్పుడు ఈ కారికను చూద్దాము.

**ఉత్పత్తేః ప్రాగ్** – ఇక్కడ ఉత్పత్తి అంటే అద్వైతబోధ. ప్రాగ్ అంటే ముందు. అంటే ఉపనిషత్తుల్లో వేదాంతబోధ చేసేముందు,

**జీవాత్మనోః పృథక్త్వం ప్రకీర్తితమ్** – పృథక్ అంటే భేదం లేదా ద్వైతం. జీవాత్మ అంటే ఇంతకుముందే చూశాం, జీవ అంటే జీవాత్మ; ఆత్మ అంటే పరమాత్మ. ప్రకీర్తితమ్ ప్రశంసించబడింది. నిజమే అద్వైతబోధ జరగకముందు జీవాత్మ, పరమాత్మల మధ్య భేదం గురించి చెప్పింది కాని,

**తత్ గౌణం భవతి** – అద్వైతబోధ జరగకముందు చెప్పబడిన బోధ అంతిమసత్యం కాదు. అలాంటప్పుడు దాని గురించి చెప్పటం ఎందుకు? తొలిదశలో దాని గురించి చెప్పాలి.

**భవిష్యద్వృత్త్యా**– భవిష్యత్తులో చెప్పబోయే అద్వైతం దృష్ట్యా, ద్వైతబోధ తాత్కాలికంగా సత్యం. ఎప్పుడైతే అద్వైతానికి చేరుకుంటారో, అప్పుడే ద్వైతం అప్రస్తుతం అవుతుంది. స్వప్నంలో ఉన్నంతవరకూ స్వప్నంలో మందులు, స్వప్నంలో ఆహారం, స్వప్నంలో నీరు అవసరం. నిజానికి అవే అవసరం. స్వప్నంలో దాహం వేస్తే, స్వప్నంలో నీరే త్రాగాలి. కాని నిద్రనుంచి లేస్తే, ఇవేవీ ఉపయోగకరం కాదు. అలాగే అద్వైతజ్ఞానానికి ఎదిగితే, ద్వైతం అవసరం లేదు.

**తన్ముఖ్యత్వం హి న యుజ్యతే** – ద్వైతమే ముఖ్యార్థం అని చెప్పటం సబబు కాదు. ముఖ్యత్వం అంటే అంతిమసత్యం; న యుజ్యతే అంటే సబబు కాదు. అంటే ద్వైతమే అంతిమసత్యం అనటం సబబు కాదు. ఇక్కడితో రెండవ విషయంలో మూడవ అంశం అయిపోయింది.

**కారిక 3.15**

**మృల్లోహవిస్ఫులింగాద్యైస్సృష్టిర్యా చోదితాఽన్యథా।**
**ఉపాయస్సోఽవతారాయ నాస్తి భేదః కథంచన ॥**

**డి) శ్రుత్యా జగత్సృష్టి నిషేధః - కారికలు 15, 16, 23 -30**

జగత్ నిజంగా సృష్టింపబడలేదని శ్రుతివాక్యాల ద్వారా నిషేధించటం. శ్రుతిలో బ్రహ్మ కారణం కాదు, జగత్తు కార్యం కాదు అని నిరూపించే వాక్యాలు అనేకం ఉన్నాయి.

**న జాయతే మ్రియతే వా విపశ్చిత్**
**నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్** - కఠ 1.2.18

చైతన్యం దేన్నుంచీ పుట్టలేదు. అది దేనికీ కారణం కాదు. ఇంచుమించు ఇవే పదాలతో గీతలో కూడా చూస్తాము కాని అది స్మృతిలోకి వస్తుంది కాబట్టి ఇక్కడ చెప్పటం లేదు.

**నేహ నానాస్తి కించన** - కఠ 2.1.11

నానాత్వం కొంచెం కూడా లేదు అంటే ఈ ద్వైతప్రపంచం లేదు. స్వప్నంలో ద్వైత ప్రపంచాన్ని చూస్తారు కాని అది సత్యం కాదు. అది మీ వాసనామయ ప్రపంచం మాత్రమే. అలాగే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం-2 మాత్రమే. నిజంగా సృష్టి జరగలేదు.

**పూర్వపక్షి వాదన** - సృష్టి జరగలేదని చెప్పే మంత్రాలనే మీరు ఉటంకిస్తున్నారు కాని శ్రుతిలోనే సృష్టి జరిగిందని చెప్పే మంత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటినెందుకు మీరు చూడటం లేదు. ఇలా మీకు కావాల్సిందే తీసుకోవటం న్యాయంగా లేదు.

**ఓం తదేతత్సత్యం యథా సుదీప్తాత్పావకాత్**
**విస్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపాః**
**తథాఽక్షరా ద్వివిధాః సోమ్యభావాః**
**ప్రజాయన్తే తత్ర చైవాపియన్తి** - ముండకమ్ 2.1.1

అగ్నిజ్వాలల నుంచి నిప్పురవ్వలు పుట్టినట్టుగా, బ్రహ్మనుంచి జీవులు పుట్టారు.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః।**
**ఆకాశద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః**
**ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః ॥** - తైత్తిరీయమ్

ఆ ఆత్మనుంచే ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్నినుంచి నీరు, నీటినుంచి భూమి, భూమి నుంచి వృక్షాలు, వృక్షాలనుంచి అన్నం, అన్నంనుంచి మనుష్యులు పుట్టారు. ఇంత స్పష్టంగా సృష్టి గురించి వస్తే, అసలు సృష్టే జరగలేదని అంత ధైర్యంగా ఎలా ఖండించగలరు?

**జవాబు** – దీనికి కూడా ముందు చెప్పిన జవాబే వర్తిస్తుంది. దీన్ని అధ్యారోప అపవాదం అంటారని చూశాము. ఈ పద్ధతిలో ముందు తాత్కాలికంగా సృష్టిని ప్రవేశపెట్టి, తర్వాత ఆత్మ కార్యకారణ విలక్షణం అని నిరూపిస్తాము. ఉపనిషత్తుల ప్రధానబోధ సృష్టి ప్రకరణం కాదు. అద్వైతమే దాని ముఖ్యాంశం. అద్వైతం అర్థమయ్యాక, సృష్టిని కూడా నిషేధిస్తుంది ఉపనిషత్తు.

**సృష్టిః యా చోదితా అన్యథా**– సృష్టి గురించి ఉపనిషత్తుల్లో రకరకాలుగా చెప్పబడిందని నేనూ ఒప్పుకుంటాను అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఉదాహరణకు తైత్తిరీయోపనిషత్తులో పంచభూతాల సృష్టి గురించి వస్తే, ఛాందోగ్యోపనిషత్తులో మూడు భూతాల సృష్టి మాత్రమే వస్తుంది. ఐతరేయోపనిషత్‌లో అయితే అసలు భూతాల సృష్టి గురించే రాదు. అక్కడ లోకసృష్టి గురించి మాత్రమే వస్తుంది. ఆ విధంగా భిన్నరీతుల్లో చెబుతాయి. అంతేకాదు, సృష్టి ఎలా జరిగిందో చూపటానికి అనేక ఉదాహరణలు కూడా ఇస్తాయి ఉపనిషత్తులు.

ఛాందోగ్యోపనిషత్‌లో మూడు ఉదాహరణలు వస్తాయి. అవి మట్టి–కుండ, బంగారం–ఆభరణాలు, ఇనుము–గోళ్ళ కత్తెర. ఒక మట్టిముద్దనుంచి అనేక కుండలు వస్తాయి; ఒక బంగారం ముద్ద నుంచి అనేక ఆభరణాలు వస్తాయి; ఒక ఇనుపముక్కనుంచి అనేక గోళ్ళ కత్తెరలు వస్తాయి. ముండకోపనిషత్‌లో అగ్నినుంచి నిప్పురవ్వలు వస్తాయని చూశాము. ఈ ఉదాహరణను బృహదారణ్యకంలో కూడా చూస్తాము.

**మృల్లోహ విస్ఫులింగాద్యైః** – మృత్ అంటే మట్టి. లోహ అంటే ఇనుము. విస్ఫులింగా అంటే అగ్నినుంచి వచ్చిన నిప్పురవ్వలు. ఆదిలో బంగారం ఉదాహరణ కూడా కలుపుకోవచ్చు.

గౌడపాదాచార్యులవారి ధైర్యం చూడండి! ఇటువంటి వాక్యాలు ఉపనిషత్తుల్లో ఉన్నా, అవి సత్యం కాదు అంటారు. ఈ శ్రుతివాక్యాలను సత్యంగా తీసుకోనవసరం లేదు. వాటిని అధ్యారోపం కింద తీసుకోవాలి. ఎందుకంటే తర్వాత అపవాదంలో వాటిని కొట్టివేస్తాము. అలా ఎలా చెప్పగలరు? దానికి కూడా శ్రుతిప్రమాణం ఉంది అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. ఇల్లు కట్టాక గోడలను కొట్టివేయరు కాని దాన్ని నిలబెట్టటానికి వాడిన దుంగలను తీసివేస్తారు. అదే విధంగా ముందు ద్వైతాన్ని ప్రవేశపెట్టి, తర్వాత దాన్ని కొట్టివేస్తారు. దుంగలు పెట్టాలి, సమయం వచ్చినప్పుడు తీయాలి. అలాగే సృష్టిని ప్రవేశపెట్టాలి, సమయం వచ్చినప్పుడు కొట్టివేయాలి. సృష్టిప్రకరణం ద్వారానే అద్వైతానికి రాగలము.

**ఉపాయః** – ఉపాయః అంటే పద్ధతి. సృష్టి ప్రకరణం ఒక పద్ధతి. దాన్ని సాంకేతిక పరిభాషలో అధ్యారోప అపవాద న్యాయం అంటారు.

**సః** – సృష్టి ప్రకరణం గురించి చెప్పేది.

**అవతారాయ** – అద్వైతాన్ని బోధించటానికి. అవతారాయం అంటే రామావతారమో, కృష్ణావతారమో కాదు. అవతారం అంటే బోధ శిష్యుని బుద్ధిలో దిగటం. దానికి వాడిన పద్ధతి ఈ సృష్టిప్రకరణం. అధ్యారోప అపవాద న్యాయం అంటున్నాము కదా, అదేమిటో చూద్దాము.

## అధ్యారోప అపవాద న్యాయం

కుండ అనే వస్తువు ఉంది. కుండ దృష్టిని తీసి మట్టి దృష్టిని ప్రవేశపెట్టాలి. దాన్ని నాలుగు దశల్లో చేస్తాము.

1. కుండ ఉత్పత్తి చెందింది. అది కార్యం – కార్యాన్ని పరిచయం చేస్తాము.

2. ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది. కుండకు కారణం మట్టి – కారణాన్ని పరిచయం చేస్తాము.

ఇది అధ్యారోపం

3. మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు – కార్యాన్ని నిషేధిస్తాము.

4. కుండ అనే కార్యాన్ని నిషేధిస్తే మట్టికి కారణత్వ హోదా లేదు – కారణత్వాన్ని నిషేధిస్తాము (కారణం లేదు అనకూడదు).

చివరికి మిగిలింది కార్యకారణ విలక్షణ మట్టి మాత్రమే.

ఇది అపవాదం.

ఆ విధంగా కుండ దృష్టి నుంచి మట్టి దృష్టికి వచ్చాము. కుండకు – మట్టికి కార్యకారణ సంబంధం వాడలేము ఎందుకంటే, మట్టి లేకుండా, కుండకు విడిగా ఉనికి లేదు, ఉన్నదొక్కటే మట్టి అన్నాము. సంబంధం ఉండాలంటే రెండు వస్తువులు ఉండాలి.

ఈ అధ్యారోప అపవాదం కార్యకారణ విలక్షణ మట్టిని చేరుకునేలా చేస్తుంది.

ఇప్పుడు కుండ బదులు జగత్తు, మట్టి బదులు బ్రహ్మ వాడి ఈ అధ్యారోప అపవాద న్యాయాన్ని చూద్దాము. 'నేను జగత్తును చూస్తున్నాను కాని, దాన్ని సృష్టించిన బ్రహ్మను ఎలా చూస్తాను? బ్రహ్మ దర్శనం కావటానికి నేను ఎన్ని సంవత్సరాలు తపస్సు చేయాలి?' అని ఎవరైనా అడిగితే, వేదాంత గురువు తనలో తను నవ్వుకుని ఈ అధ్యారోప అపవాద న్యాయం బోధిస్తాడు.

1. జగత్తు ఉత్పత్తి చెందింది. అది కార్యం – కార్యాన్ని పరిచయం చేస్తాము.

2. ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది. జగత్తుకు కారణం బ్రహ్మ – కారణాన్ని పరిచయం చేస్తాము. **ఇది అధ్యారోపం**

3. బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు – కార్యాన్ని నిషేధిస్తాము.

4. జగత్తు అనే కార్యాన్ని నిషేధిస్తే బ్రహ్మకు కారణత్వ హోదా లేదు – కారణత్వాన్ని నిషేధిస్తాము (కారణం లేదు అనకూడదు).

చివరికి మిగిలింది కార్యకారణ విలక్షణ బ్రహ్మ. **ఇది అపవాదం.**

ఆ విధంగా జగత్తు దృష్టి నుంచి బ్రహ్మ దృష్టికి వస్తాము. జగత్తుకు బ్రహ్మకు కూడా కార్య–కారణ సంబంధం వాడలేము ఎందుకంటే ఉన్నదొక్కటే బ్రహ్మ. కాని ఈ ఉన్నదొకటే బ్రహ్మను చేరుకోవటానికి సృష్టి నుంచే రావాలి. అందువల్ల సృష్టి గురించి చెబుతున్నాయి ఉపనిషత్తులు. ఇలా సృష్టిని ప్రవేశపెట్టి, మళ్ళీ దాన్ని నిషేధించే పద్ధతిని అర్థం చేసుకోవటానికి ఆచార్యులు ఒక ఉదాహరణ చెబుతుంటారు.

కేరళలో ఒక తండ్రికి 17 ఏనుగులు ఉన్నాయి. ఆయనకు ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఆ తండ్రి మరణిస్తూ తన ఏనుగులను తన ముగ్గురు కొడుకులూ ఎలా పంచుకోవాలో వీలునామా రాశాడు. అందులో ఈ విధంగా ఉంది. పెద్ద కొడుకుకి ఏనుగుల్లో సగం (1/2) వాటా, రెండవ కొడుకుకి మూడవ వంతు వాటా (1/3), మూడవ కొడుకుకి తొమ్మిదవ వంతు వాటా (1/9) రావాలి. కాని ఏనుగులను కోయకూడదు. ఈ నిబంధనలను పాటిస్తూ ఆ 17 ఏనుగులను ఎలా పంచాలో అర్థం కాక ఊరిపెద్దలు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.

ఆ ఊరి రాజుకి ఈ విషయం తెలిసింది. ఆయన తన ఏనుగు మీద అక్కడికి వచ్చి, ఆ సమస్యను తను పరిష్కరిస్తానన్నాడు. రాజు తన ఏనుగును వారికి దానం చేస్తానన్నాడు, తన ఏనుగుమీద కూర్చుని ఉండే. అలా ఎలా దానం చేయగలడు? వివరాలు చూద్దాము.

చనిపోయిన తండ్రికి 17 ఏనుగులు ఉన్నాయి కదా! రాజు ఇచ్చే ఏనుగును కలుపుకుంటే 17+1=18 అవుతాయి.

| | | |
|---|---|---|
| పెద్ద కొడుకుకి | 1/2 వాటా | – 18 ÷ 2 = 9 |
| రెండవ కొడుకుకి | 1/3 వాటా | – 18 ÷ 3 = 6 |
| మూడవ కొడుకుకి | 1/9 వాటా | – 18 ÷ 9 = 2 |
| మొత్తం ఏనుగులు | | =17 |

తండ్రి ఏనుగులను కొడుకులకు, తండ్రి కోరుకున్నట్టుగా, ఏనుగులకు హాని జరగకుండా పంచాడు రాజు. అది ఎలా చేశాడు? తన ఏనుగును ప్రవేశపెట్టాడు, సమస్య పరిష్కరించాడు, తన ఏనుగు మీదే తాను వెళ్ళిపోయాడు. వేదాంతం చేసేది కూడా అదే. సృష్టిని ప్రవేశపెడుతుంది, సమస్యను పరిష్కరిస్తుంది, సృష్టిని తాను వెనక్కి తీసేసుకుంటుంది.

**న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।**
**న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥** – 2.32

అద్వైతానికి ఎదిగితే ప్రళయం లేదు, ఉత్పత్తి లేదు, బద్ధజీవి లేదు, సాధకుడు లేదు, మోక్షాన్ని కోరేవాడు లేదు, ముక్తపురుషుడూ లేదు.

అంతకుముందూ, ఇప్పుడూ, తర్వాత కూడా ఉండేది బ్రహ్మే. మధ్యలో ఏమైనా ఉంటే అది అయోమయం తప్ప ఏమీ కాదు. కొంచెం కూడా భేదం లేదు.

**సజాతీయ విజాతీయ స్వగత భేదః న సంతి**

**కారిక 3.16**

**ఆశ్రమాస్త్రివిధా హీనమధ్యమోత్కృష్టదృష్టయః ।**
**ఉపాసనోపదిష్టేయం తదర్థమనుకంపయా ॥**

**సందేహం** – వేదాంతం సృష్టి లేదు, ద్వైతం లేదు, కారణ పరమాత్మ లేదు, కార్యజీవాత్మ లేదు అనేటట్టయితే, వేదం పరమాత్మ ఉపాసన గురించి ఎందుకు బోధిస్తున్నది? పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు, సర్వవ్యాపకుడు అని పరమాత్మ గురించి గొప్పగానూ, జీవాత్మ అల్పజ్ఞుడు, అల్పశక్తివంతుడు, దేశకాల పరిచ్ఛిన్నుడు అని బోధిస్తుంది. జీవాత్మ అనాథ అనీ, పరమాత్మ అనాథనాథుడు అనీ; జీవాత్మ పశువు అనీ, పరమాత్మ పశుపతి అనీ; అందువల్ల జీవాత్మ పరమాత్మ ధ్యానం చేయాలనీ చెబుతుంది. మనుష్యులు పొరపాటు పడ్డారంటే అర్థం ఉందికానీ, వేదమే ఉపాస్య–ఉపాసక భేదం గురించి ఎందుకు బోధిస్తున్నది? సృష్టే లేకపోతే సృష్టికర్త అయిన ఉపాస్యదేవత గురించీ, సృష్టించబడిన ఉపాసకుని గురించీ ఎందుకు చెబుతున్నది?

**జవాబు** – దీనికీ అంతకుముందు చెప్పిన జవాబే వర్తిస్తుంది. సృష్టికర్త–జీవుడు; పరమాత్మ–జీవాత్మ; ఉపాస్యదేవుడు–ఉపాసకుడు; ఈ భేదాలన్నీ తాత్కాలికంగా చెప్పబడ్డాయి. అద్వైతాన్ని స్వీకరించటానికి మనస్సు సంసిద్ధతను చూపేటంతవరకూ. అద్వైతం చాలా లోతైన బోధ. అది అందరికీ అంత తేలికగా అర్థం కాదు. కొంతమంది అయితే అర్థం చేసుకోవటానికి ఇష్టపడరు కూడా. వారు ఈ బోధను త్వరగా స్వీకరించలేరు, వారి మనస్సు అంగీకరించదు. అందులోనూ మాండూక్యోపనిషత్ ఇంకా పైస్థాయిలో ఉంటుంది. గౌడపాదాచార్యులవారి బోధ చాలా ఉన్నతస్థాయిలో ఉంటుంది. ఆయన ఈశ్వరుణ్ణి, జీవుణ్ణి, కర్మను, ఉపాసనను, సృష్టినీ – అన్నింటినీ నిషేధిస్తారు. ఆయనది అజాతివాదన. అందువల్లనే మొట్టమొదటే మాండూక్యోపనిషత్‌కు రాకూడదు. కనీసం నాలుగైదు ఉపనిషత్తులను అధ్యయనం చేశాక దీనికి వస్తే, ఇది తేలిగ్గా అర్థమవుతుంది.

95% మనుష్యులు వేదాంతాన్ని అంత తేలికగా స్వీకరించరని వేదాంతానికి ముందే తెలుసు. అలాంటివారికి వేదాంతం వేరే మార్గం చెబుతుంది.

**ఆశ్రమాస్త్రివిధాః** – మూడు రకాల అధికారులు ఉన్నారు. ఈ ముగ్గురూ తక్కువస్థాయికి చెందినవారు. నాలుగవ రకం వారు ఉత్తములు. వారు అహం బ్రహ్మాస్మి అని స్పష్టంగా అర్థం చేసుకుంటారు. కాని తక్కువస్థాయివారు అర్థం చేసుకోలేరు. వారిలో కూడా తారతమ్యాలు ఉన్నాయి. వారు మూడు స్థాయిల్లో ఉన్నారు. ఆశ్రమా అంటే ఇక్కడ ఆధ్యాత్మిక సాధకులు.

**హీనమధ్యమోత్కృష్టదృష్టయః** – హీనులు అంటే మంద అధికారులు, మధ్యమ అంటే మధ్యమ అధికారులు, ఉత్కృష్ట అంటే ఉత్తమ అధికారులు. దృష్టి అంటే బుద్ధి. వారి బుద్ధి ఈ స్థాయిల్లో ఉంది. వారు అద్వైతజ్ఞానానికి సిద్ధంగా లేరు. అటువంటివారికి ఉపనిషత్ ఉపాసనను సూచిస్తుంది, అది కూడా స్థాయీభేదాలనుబట్టి సూచిస్తున్నది.

**తదర్థమ్** – అద్వైతాన్ని ఇష్టపడని లేదా అర్థంకాని ఆ తక్కువస్థాయి అధికారులకు.

మనస్సు పరిపక్వం చెందిందో లేదో ఎలా తెలుస్తుంది? అద్వైతాన్ని అర్థం చేసుకోలేక పోయినా లేదా అద్వైతాన్ని స్వీకరించలేకపోయినా, మనస్సు పరిపక్వత చెందనట్లే అర్థం. దానికి భిన్నంగా మనస్సు పరిపక్వత చెందిన వ్యక్తికి అద్వైతం అర్థమవుతుంది, నిజానికి అద్వైతమే నచ్చుతుంది.

**అనుకంపయా** – ఇటువంటి తక్కువస్థాయి అధికారులమీద ఉపనిషత్తు కోపం తెచ్చుకోదు; అద్వైతాన్ని వారి నెత్తిమీద బలవంతంగానూ రుద్దదు. ఒక చిన్నపిల్లవాడు బెలూన్ కోసం మారాం పెడితే తల్లి అతని మీద కోపగించుకోదు. వెయ్యి రూపాయలు కావాలా, బెలూన్ కావాలా అంటే అతను బెలూనే కావాలంటాడు. అతనే వయస్సు పెరిగేకొద్దీ బెలూన్ మీద మోజు తగ్గించుకుంటాడని తల్లికి తెలుసు.

అలాగే ఉపనిషత్తుకు కూడా తెలుసు; ఇవాళ రాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు అతను వేదాంతానికి రాకపోడని. అందువల్ల ఈ శిష్యులమీద కోపం తెచ్చుకోదు. అనుకంపయా అంటే జాలి చూపిస్తుంది. జాలికొద్దీ సరే మీరు అద్వైతానికి రాలేకపోతే, ఇంకా ఎక్కువ పూజలు చేయండి, ఇంకా ఎక్కువ ఉపాసనలు చేయండి అంటుంది.

వారివారి స్థాయీభేదాలనుబట్టి ఉపాసనల్లో కూడా స్థాయిభేదాలు ఉన్నాయి. కొంతమంది ఏకరూప ఈశ్వరధ్యానం చేస్తారు. వారి ఇష్టదైవాన్ని కొలుస్తారు. అది కృష్ణుడవచ్చు, రాముడవచ్చు, సుబ్రహ్మణ్యస్వామి అవచ్చు, దేవి అవచ్చు. ఇంకొక దేవుణ్ణి వారు స్వీకరించలేరు. వారు కొలిచే దేవునికి ఆలనా, పాలనా చేస్తారు. నీరు పోస్తారు, ఆహారం పెడతారు, పక్క

ఏర్పాటు చేస్తారు, దోమతెర కూడా పెడతారు, కష్టం సుఖం దేవునితో చెప్పుకుంటారు. అటువంటివారికి పోయి సగుణ ఈశ్వరుడు మిథ్య అంటే కొట్టినంత పని చేస్తారు. నిజానికి అద్వైతం కూడా అటువంటివారి జోలికి పోదు.

రెండవదశ అనేకరూప ఈశ్వరధ్యానం. అన్నింటిలోనూ ఈశ్వరుణ్ణి చూస్తారు. కాని అందులో కూడా ద్వైతమే ఉంటుంది.

మూడవదశలో అరూప ఆకాశ ఉపాసన చేస్తారు. ఆకాశంలాగా పరమాత్మకు రూపం లేదని అర్థం చేసుకుంటాడు. దీనికి పరిపక్వత కావాలి.

నాలుగవ దశలో అహంగ్రహ ఉపాసన చేస్తారు. భగవంతుణ్ణి తనలోనే ఆవాహన చేస్తారు. ఇందులో జీవ–ఈశ్వర ఐక్యజ్ఞానం ఉండదు కాని జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకుని ధ్యానం చేస్తారు. దీన్ని అభేదధ్యానం అంటారు.

**అరుణాం కరుణాతరంగితాక్షీం**
**ధృతపాశాంకుశ పుష్పబాణచాపామ్**
**అణిమాదిభిరావృతాం మయూఖైః**
**అహమిత్యేవ విభావయే భవానీమ్** – లలితా సహస్రనామం

నేను ఆ భవానిని అని ఊహించుకుని చేసే ధ్యానం. ఇది ఊహ మాత్రమే. నేను ఆ పరమాత్మను అనే అంశాన్ని తేలిగ్గా స్వీకరించలేరు. స్వీకరించినా జీర్ణించుకోలేరు. అటువంటి వారు 95% ఉంటారు. కాని ఎన్నాళ్ళు అక్కడే ఆగిపోతారు అంటుంది ఉపనిషత్తు.

**ఉపాసనాశ్రితో ధర్మో జాతే బ్రహ్మణి వర్తతే ।**
**ప్రాగుత్పత్తేరజం సర్వం తేనాసౌ కృపణః స్మృతః ॥** – 3.1

ఇలా ఉపాసనలోనే ఉండిపోయేవారిని కృపణులు అని ఈ అధ్యాయం మొదట్లోనే గౌడపాదాచార్యులవారు అన్నారు. ఎందుకంటే కర్మ, ఉపాసనలు సంసారంలోకే వస్తాయి. చివరికి తురీయానికి చేరుకోవాలి. అది అంతిమలక్ష్యం అవాలి కాని, ఉపాసన కాదు.

**ప్రసంగవశాత్ ద్వైతత్వమిథ్యాత్వమ్– కారికలు 17–22**

కారికలు 17–22ల్లో గౌడపాదాచార్యులవారు కొంచెం పక్కకి వెళుతున్నారు ప్రధాన అంశం నుంచి. పూర్తిగా అప్రస్తుతం కాదు, ఈ సందర్భానికి పనికివచ్చే అంశమే అది. ఈ కారికల్లో శిష్యుడు గురువుతో సహకరించాలని చెబుతున్నారు. ద్వైతాన్ని అద్వైతం అనే లక్ష్యానికి చేరుకునే మార్గంగా తీసుకోవాలి కాని, దాన్నే అంతిమ లక్ష్యంగా భావించకూడదు. 'నేను ద్వైతం వాడతాను కాని, దాన్నించి అద్వైతానికి ఎదుగుతాను అనగలగాలి.' అలా శిష్యుడు అనలేకపోతే కలిగే నష్టమేమిటో ఈ కారికల్లో వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

ఈ కారికలు (17-22) లేకపోయినా, గౌడపాదాచార్యులవారు చెబుతున్న అంశంలో ఏమీ లోటు ఉండదు. 16 నుంచి 23వ కారికకు సరాసరి వెళ్ళిపోయినా, ఆలోచనా ప్రవాహంలో లోటు ఉండదు.

కాని ఈ కారికలు కూడా చూస్తే, ద్వైతంలో నిలబడిపోతే అతను నష్టపోయేదేమిటో తెలుస్తుంది. కొంతమంది, 'నాకు అద్వైతం వద్దు, నాకు వేదాంతం వద్దు, నాకు మోక్షం కూడా వద్దు, నా ఇష్టదైవాన్ని నేను మనసారా ఆరాధిస్తాను, అది చాలు నాకు ఈ జన్మకు,' అంటారు. మహా అయితే వారు పూజించే దైవం ఉన్న లోకానికి వెళ్ళాలని వారు కోరుకుంటారు.

అలా నేను ద్వైతంలోనే నిలిచిపోతాను అంటే నష్టపోయేది ఎవరు? ఉపనిషత్తు కాదు, గురువు కాదు, ఆ శిష్యుడే. అందువల్ల అలా పూజలోనో, కర్మలోనో, ఉపాసనలోనో, ఇష్టదేవతా ప్రార్థనలోనో నిలిచిపోయేవారిని గౌడపాదాచార్యులవారు ఇక్కడ విమర్శిస్తున్నారు. ద్వైతంలోనే నిలిచిపోతే కలిగే సమస్యలను వివరిస్తున్నారు.

**మనస్సుపరమైన సమస్య** – ముందుగా రాగద్వేషాలలో కూరుకుపోతారు. ద్వైతంలో ఉంటే, భక్తి ఏర్పడ్డాక కూడా రాగద్వేషాలు పోవు. అద్వైతానికి రాకపోతే, ఒక దేవుని మీద విపరీతమైన భక్తి, ఇంకొక దేవుని మీద ద్వేషానికి దారితీస్తుంది. అటువంటివారు అద్వైతగురువు దగ్గరికి రావటానికి ఇష్టపడరు కూడా. అద్వైతగురువు శివవిష్ణుల మధ్య భేదం లేదంటాడు కాని శివభక్తుడు విష్ణుమూర్తిని కొలవలేడు, విష్ణుభక్తుడు శివుణ్ణి కొలవలేడు.

ఇంత తీవ్ర రాగద్వేషాలు ఎందుకు ఏర్పడతాయి అంటే అతను ప్రమాతృ, ప్రమేయ, ప్రమాణ త్రిపుటిలో ఉంటాడు. కాని అద్వైతం నేర్పించేది –

**ప్రమాతృ ప్రమేయ ప్రమాణ విలక్షణ తురీయమ్ అహమస్మి**

ప్రమాత అంటే ఒక విషయజ్ఞానాన్ని పొందే వ్యక్తి. అతను ఒక ప్రమాణాన్ని ఉపయోగించి, ఒక ప్రమేయం గురించి నేర్చుకుంటాడు. కాకపోతే ఒక ప్రమాత వాడిన ప్రమాణాన్నే ఇంకొక ప్రమాత వాడడు కాబట్టి ఇద్దరి జ్ఞానంలో భిన్నాభిప్రాయాలు ఉంటాయి. ఉదాహరణకు చక్షుప్రమాణం వాడే ప్రమాత దృష్టిలో ప్రపంచం అంతా రంగులమయం. రంగు, రూపు తప్ప ఏమీ కనబడవు అతనికి. కాని శ్రోత్ర ప్రమాణాన్ని వాడే అతనికి ప్రపంచమంతా శబ్దమయంగా ఉంటుంది. అతనికి రంగు, రూపు కనబడవు.

అలా ఏ ప్రమాతకు అందే జ్ఞానం ఆ ప్రమాతకే పరిమితమవుతుంది. అతను ఒక విషయాన్ని అర్థం చేసుకునే తీరుకు అనేక కారణాలు తోడవుతాయి. అతని మనస్సు, అతని బుద్ధి, అతను పెరిగిన వాతావరణం, అతను పెరిగిన తీరు, అతని పూర్వజన్మ

వాసనలు – ఇలా అనేక కారణాలు చెప్పవచ్చు. కాని ఎవరికి వారు నేను చెప్పిందే సత్యం అనుకుంటారు. గుడ్లగూబ చూసే ప్రపంచం వేరు, మనిషి చూసే ప్రపంచం వేరు, చీమలు చూసే ప్రపంచం వేరు. అంతదాకా ఎందుకు? ఒకే సంఘటనను స్త్రీ ఒక కోణంలోంచి చూస్తే, పురుషుడు ఇంకొక కోణంలోంచి చూస్తాడు. అందువల్ల స్త్రీకి చాలా ముఖ్యమైన అంశం పురుషునికి కాకపోవచ్చు, అలాగే పురుషునికి చాలా ముఖ్యమైనది స్త్రీకి చాలా అనవసరమైనదిగా అనిపించవచ్చు.

ద్వైతంలో ఉన్నంతవరకూ, అంతిమసత్యాన్ని పట్టుకోలేరు. అది ఆపేక్షిక సత్యం మాత్రమే అవుతుంది. దాన్ని వ్యావహారిక సత్యం అంటారు. వీరిలో ఎవరిది ఒప్పు, ఎవరిది తప్పు? ఎవరి కోణంలోంచి చూస్తే వారిదే ఒప్పు.

సాంఖ్యదార్శనికులు సృష్టి ఏకంనుంచి అనేకం వచ్చింది అంటారు. నైయాయికులు అనేకం నుంచి ఏకం వచ్చింది అంటారు. ఎవరి వాదన సరియైనది? ఇద్దరిదీ సబబే! అలా ఎలా కుదురుతుంది? సృష్టిని విత్తనంనుంచి చెట్టుపరంగా చూస్తే, ఒక్క విత్తనంనుంచి ఒక చెట్టు వస్తుంది. ఆ చెట్టుకి అనేక విత్తనాలు వస్తాయి. అనేక విత్తనాలు ఇంకా అనేక చెట్లకు కారణం అవుతాయి. ఆ విధంగా సాంఖ్యులు చెప్పినట్టుగా సృష్టి – ఏకంనుంచి అనేకం.

నైయాయికులేమో అనేకంనుంచి ఏకం అంటారు. అదీ సబబే. దానికి ఆధునిక ఉదాహరణ చూస్తే అనేక భాగాల మేలుకలయిక వల్ల ఒక్క కారు తయారు చేయబడుతుంది. ఇద్దరూ సబబే అయినా ఒకరి వాదన ఇంకొకరు ఒప్పుకోరు.

అద్వైత వేదాంతి మాత్రమే అటు సాంఖ్యులు, ఇటు నైయాయికులు ఇద్దరూ సబబే అని చెప్పగలడు. ఎందుకంటే రెండూ ఆపేక్షిక సత్యాలు మాత్రమే. అది తెలియక ద్వైతవాదులు వారిలో వారు కలహించుకుంటారు. ద్వైతవాదికి తన ఆపేక్షిక సత్యమే అంతిమసత్యం అని పొరపాటు పడతాడు. అందువల్ల ఇంకొక సత్యం ఉందనే ఆలోచననే భరించలేడు అతను. అందువల్ల తీవ్ర రాగద్వేషానికి గురి అవుతాడు. దానికి భిన్నంగా అద్వైత సిద్ధాంతి పారమార్థిక సత్యాన్ని తెలుసుకున్నాడు కాబట్టి అతనికి తక్కినవన్నీ వ్యావహారిక సత్యాలే.

**కారిక 3.17**

**స్వసిద్ధాంతవ్యవస్థాసు ద్వైతినో నిశ్చితా దృఢమ్ ।**
**పరస్పరం విరుధ్యంతే తైరయం న విరుధ్యతే ॥**

**స్వసిద్ధాంతవ్యవస్థాసు** – ద్వైతవాదులు, దార్శనికులు అందరూ ఎవరికి వారే వారిదే సరియైనది అనుకుంటారు. వ్యవస్థ అంటే వారి సిద్ధాంతం. ఆ సిద్ధాంతం వారి దర్శనానికి వారిని దారితీస్తుంది. అద్వైతసిద్ధాంతి వారి భావాలను చూసి తనలో తను నవ్వుకుంటాడు.

అన్ని మతాలు ఒకటే లక్ష్యానికి దారి తీస్తాయా? దయానందస్వామీజీ అసలు ఈ ప్రశ్నే తప్పు అంటారు. ఎందుకంటే ఏ మతంయొక్క లక్ష్యం ఆ మతానిదే. మోక్షం యొక్క నిర్వచనమే భిన్నంగా ఉంటుంది; అంటే అంతిమ లక్ష్యమే ఒకటి కానప్పుడు, అన్ని మతాలూ ఒకే లక్ష్యానికి దారితీసే ఆస్కారం ఎక్కడుంది?

**ద్వైతినః నిశ్చితా దృఢమ్**- ద్వైతవాదులు, దార్శనికులు వారి దర్శనమే సరియైనదనే ఉన్మాదంలో ఉంటారు. ఈ ఉన్మాదంవల్ల

**పరస్పరం విరుధ్యన్తే** - ఒకరిని ఒకరు తీవ్రంగా ఖండించుకుంటారు. అద్వైతసిద్ధాంతి ఏమంటాడు?

**తైరయం న విరుధ్యతే** - వాటిలో ఏమీ భేదాలు లేవు అంటాడు. మేము అన్ని దర్శనాలనూ స్వీకరిస్తాము, కాకపోతే దాన్ని వ్యావహారిక సత్యం అంటాము అంటాడు. ఓం ప్రథమంగా మొదలు పెట్టేటప్పుడు ఏకరూప ఈశ్వరభక్తి ఉంటుంది. భగవంతుణ్ణి ఏదో ఒక రూపంలో కొలుస్తారు. అది విష్ణురూపం కావచ్చు, శివరూపం కావచ్చు. కాని అక్కడే ఆగిపోకుండా, పారమార్థిక సత్యంలో భగవంతునికి ఒక రూపం కాదు, అసలు రూపమే ఉండదు. పారమార్థిక సత్యం - నిర్గుణబ్రహ్మ, నిరాకార బ్రహ్మ. ప్రమాతృ ప్రమాణ ప్రమేయ త్రిపుటి లేని జ్ఞానం అది.

అద్వైతబోధలో ఏ విధమైన భేదాలూ లేవు. అందరు దేవుళ్ళనూ అద్వైతం స్వీకరిస్తుంది. అందువల్ల అద్వైతంలో సమస్య లేదు.

**కారిక 3.18**

**అద్వైతం పరమార్థో హి ద్వైతం తద్భేద ఉచ్యతే ।**
**తేషాముభయథా ద్వైతం తేనాయం న విరుధ్యతే ॥**

అద్వైత సిద్ధాంతికి ఎందుకు ఏ సమస్యా లేదు? వ్యావహారిక సత్యంలో దేని విలువ దానిదే అని అతనికి తెలుసు. వైద్యరంగంలోనే ఒక్కొక్కరకం వైద్యం ఒక్కొక్కలాగా ఉంటుంది. హోమియోపతి పద్ధతిలో చికిత్స ఒకలాగా ఉంటే, ప్రాణిక్ హీలింగ్‌లో ఇంకొకలాగా ఉంటుంది. అలాగే ఆయుర్వేదంలో వైద్యం ఒకలాగా ఉంటే, సంఖ్యాశాస్త్రంలో ఇంకొకలాగా ఉంటుంది. వాస్తుశాస్త్రజ్ఞుడు చెప్పేది వీటన్నిటికీ భిన్నం. సమస్య ఒకటే! పరిష్కారాలు అనేకం!

చిన్న జలుబు చేస్తే ఇన్ని రకాల వైద్యాలు ఉన్నాయి. వాస్తు శాస్త్రజ్ఞుడు మీ ఇంట్లో ఫలానా చోట, అంటే ఉండకూడని చోట కిటికీ ఉండటంవల్లనే మీకు జలుబు చేస్తున్నది అంటాడు. ఇందులో ఏది సరియైనది? ఎవరి మనస్తత్వానికి సరిపోయినది వారికి సరియైనది. కొందరికి నాడీవైద్యం మీద నమ్మకం ఉంటే, మరికొందరికి వాస్తుమీద నమ్మకం ఉంటుంది. అందువల్ల అన్నీ విలువైనవే. వాటిని పాటించండి, తప్పు లేదు కాని వాటిలోనే కూరుకుపోకండి.

**అద్వైతం హి పరమార్థతః** – అద్వైత తురీయం ఒక్కటే పారమార్థిక సత్యం. అలాగైతే అద్వైతం ప్రకారం అనారోగ్యకారణం ఏమిటి? అద్వైత సిద్ధాంతి 'నీకసలు శరీరం ఉంటే కదా, అనారోగ్యం చేసేది. నీకు శరీరమే లేదు, నువ్వు ఆత్మవు,' అంటాడు. అందువల్ల సంసారసమస్యే లేదు అతనికి.

**ద్వైతం తద్భేద ఉచ్యతే** – ద్వైతం ఉన్నట్టుగా కనిపిస్తున్నది అంతే. ఎలాగైతే జాగ్రత్ పురుషుని మనస్సే స్వప్న ఇల్లుగా, స్వప్న శరీరంగా, స్వప్న జలంగా, స్వప్నరైలుబండిగా కనిపిస్తుందో, అలాగే ఒకటే బ్రహ్మ ప్రమాతగా, ప్రమాణంగా, ప్రమేయంగా కనిపిస్తాడు వ్యవహారంలో. అందువల్ల అద్వైత సిద్ధాంతికి దేన్ని వ్యావహారిక సత్యంగా తీసుకోవాలో, దేన్ని పారమార్థిక సత్యంగా అర్థం చేసుకోవాలో బాగా తెలుసు.

మనం ఒక సినిమాకు డబ్బు ఖర్చు పెట్టుకుని మరీ వెళ్ళి చూస్తాము. సినిమాకి వెళ్ళక ముందు అది సత్యం కాదు, మిథ్య అని తెలుసు. అందులో ఒకవేళ హీరో చనిపోయినా, నిజంగా చనిపోడని తెలుసు. ఇన్ని తెలిసినా సినిమా జరుగుతున్నంతసేపు అది మిథ్య, కేవలం తెరమీద ఆడే బొమ్మ మాత్రమే అనే విషయం మర్చిపోయి, ఆ కథలో, ఆ పాత్రల్లో మమేకం చెందుతాము. హీరోతో కలిసి నవ్వుతాము, అతను బాధపడితే మనమూ బాధపడతాము. అతను చనిపోతే, కన్నీరు కూడా కారుస్తాము. కాని అది ఎంతసేపు? సినిమా ఆడుతున్నంతసేపు మాత్రమే. ఒకసారి సినిమానుంచి బయటకు వచ్చాక, హీరో చాలా బాగా నటించాడు అంటాము కాని, అయ్యో అతను మరణించాడే అని ఏడుస్తూ ఇంటికి వెళ్ళము.

జ్ఞాని చేసేది కూడా అదే. అతను తోటివారి కష్టాలతో పాలు పంచుకుంటాడు, అవసరమైతే వారితో పాటు తనూ విలపిస్తాడు, అవసరమైన చోట సలహాలు కూడా ఇస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, తోటివారు చేసే పనులన్నీ అతను కూడా చేస్తాడు. కాకపోతే మనం సినిమా నుంచి బయటకి రాగానే హీరో సమస్యలు మనం మర్చిపోయినట్టుగానే, జ్ఞాని ఆ సన్నివేశం నుంచి బయటకు వచ్చాక, ఆ సమస్యను మర్చిపోతాడు. కాని ద్వైతవాది అంత తేలికగా దాన్నించి బయటపడలేడు.

**తేషామ్ ఉభయథా ద్వైతమ్** – తేషామ్ అంటే ద్వైతవాదికి. ద్వైతవాదులకు ద్వైతమే ఆత్యంతిక సత్యం. వారికసలు వ్యావహారిక స్థాయికి పైన ఇంకొకస్థాయి ఉందనీ, దాన్ని పారమార్థిక స్థాయి అంటారనీ తెలియదు. అందువల్ల వారి సమస్యలు ఆత్యంతిక సమస్యలు. ఉభయతః అంటే రెండూ. అంటే వారి దృష్టిలో పారమార్థిక సత్యం, వ్యావహారిక సత్యం – రెండూ ద్వైతమే. వారికి సంసారం, మోక్షం రెండూ ద్వైతమే. అందువల్ల మోక్షం గురించిన వారి నిర్వచనం భిన్నంగా ఉంటుంది.

వారి ఉద్దేశ్యంలో జీవుడు వేరు, పరమాత్మ వేరు. మోక్షంలో జీవుడు పరమాత్మకు సేవ చేస్తాడు. ఇన్నాళ్ళూ భూలోకంలో తోటి మనుష్యులకు దాసునిగా సేవ చేశాడు. ఇప్పుడు, మరణించాక, భగవంతునికి దాసునిగా మారతాడు.

అంతేకాదు, వారి సిద్ధాంతం ప్రకారం మోక్షంలో తారతమ్యాలు ఉంటాయి. ముక్త జీవులందరికీ ఒకేచోట కూర్చునే అవకాశం దొరకదు. కొందరికి భగవంతునికి అతి సమీపంగా కూర్చునే అవకాశం ఉంటుంది. కొంతమందికి సమీపంలో కూర్చోవటం దేవుడెరుగు, పక్కగదిలో కూర్చోవాల్సి ఉంటుంది. అక్కడ్నుంచి దేవుణ్ణి చూడలేరు, ఆయన గొంతు వినగలరు, అంతే. అందువల్ల అక్కడ కూడా ఈర్ష్య, అసూయ, నిరాశానిస్పృహలు తప్పవు. అందువల్ల మోక్షంలో తారతమ్యాలు తప్పవు. అదే అద్వైత సిద్ధాంతిని అడగండి, అతనికి ఈ బాధలేదు. నేను దేవునికి దగ్గరగా ఉన్నాను, దూరంగా ఉన్నాను అనడు. ఎందుకంటే అతనికి, తను దేవునికి భిన్నంగా లేడని తెలుసు.

**తేన అయం న విరుధ్యతే** – అలాగని మనం ద్వైతవాదులతో వాదన పెట్టుకోము. మీరు ఏ లోకానికి వెళతారనుకుంటే, ఆ లోకానికి వెళ్ళండి, ఏం ఫర్వాలేదు. ఎందుకంటే ఈ తారతమ్యాలు చూస్తే అక్కడ కూడా మీకు వైరాగ్యం రాకతప్పదు. ఇవాళ కాకపోతే, రేపైనా రాకతప్పదు; వచ్చే జన్మలోనైనా రాకతప్పదు. అందువల్ల వారిని విమర్శించము. వారి సిద్ధాంతంవల్ల వారు చిత్తశుద్ధి పొందుతారు అని చెబుతాము.

ఈ అంశాన్ని బ్రహ్మసూత్రాల్లో చూస్తాము. అన్ని రకాల పూజలూ ఫలాన్ని ఇచ్చేవే. తామసికగుణం ఉన్నవారికి తామసిక పూజలే కావాలి. వాటినే చేయనీయండి, ఫర్వాలేదు. వారే నెమ్మదిగా పైకి ఎదుగుతారు.

**తేనయం న విరుధ్యతే** – అందువల్ల అద్వైత సిద్ధాంతి ఏ పూజను కాని, యజ్ఞాన్ని కాని విమర్శించడు.

## కారిక 3.19

**మాయయా భిద్యతే హ్యేతన్నాన్యథాఽజం కథంచన ।**
**తత్త్వతో భిద్యమానే హి మర్త్యతామమృతం వ్రజేత్ ॥**

**బుద్ధిపరమైన సమస్య** – అద్వైతంలోనే సృష్టి గురించి రెండు వాక్యాలు చూస్తాము.

ద్వైతవాదులందరూ జగత్తు సత్యం అంటారు. కాని అద్వైతంలోనే జగన్మిథ్యా అని అర్థం చేసుకుంటారు.

- బ్రహ్మనుంచి నిజంగా జగత్తు రాలేదు
- బ్రహ్మనుంచి జగత్తు వచ్చినట్టుగా ఉంది.

జగత్తు వచ్చినట్టుగా ఉంది అంటే అర్థం ఏమిటి? నిజంగా జగత్తు రాలేదనే! నువ్వు తెలివైనవాడిలాగా ఉన్నావు అంటే, నీకు తెలివి లేదని మర్యాదగా చెప్పినట్టు అవుతుంది.

నిజంగా సృష్టి జరిగింది అని చెప్పేవారిని తీవ్రంగా విమర్శిస్తున్నారు గౌడపాదాచార్యుల వారు. వారు రెండు రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అంటున్నారు. అవి మనస్సుపరమైన సమస్య, బుద్ధిపరమైన సమస్య. మనస్సుపరమైన సమస్యను ముందు రెండు మంత్రాల్లో చూశాము. ద్వైతంలో ఉన్నంతవరకూ రాగద్వేషాలు తప్పవు. వాటిని దేవుళ్ళ విషయంలో కూడా వదలరు. తను పూజించే దేవుడే గొప్ప అంటాడు. తమాషా ఏమిటంటే – ఎవరికి వారే తన సిద్ధాంతమే గొప్పది అంటారు. ఎందుకంటే వారు చూసేది వారి ప్రమాణం పరంగా. ప్రమాణం మారితే సత్యం మారుతుంది.

అద్వైత సిద్ధాంతి అలా కాదు. అతని దృష్టిలో అందరు దేవుళ్ళూ ఒకరే. పూజకోసం ఒక దేవుణ్ణి ఎన్నుకున్నా, తక్కిన దేవుళ్ళు లేరనడు. కాని తను కొలిచే దేవుడే శ్రేష్ఠం అని ఎవరైనా అంటే అతనిలో అద్వైత అజ్ఞానం చోటు చేసుకుందని గట్టిగా తెలుస్తున్నది.

ఇప్పుడు బుద్ధిపరంగా వచ్చే సమస్య ఏమిటో వివరిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. ఏమిటది?

ద్వైతవాదులు కూడా పరమాత్మ అనంతం అంటారు. అనంతం అంటే దేశకాల అతీతం. దేశకాల అతీతం అంటే వికారం చెందనిది. వికారం అంటే మార్పు చెందటం. కాలం తీసుకువస్తుంది మార్పును. కాని అనంతం నిర్వికారం. ఏదైతే నిర్వికారమో అది కారణం కాలేదు. ఎందుకంటే కారణం అవాలంటే, అది మార్పుకు లోనవ్వాలి. అంటే సవికారం అవాలి.

**అనంతం అంటే నిర్వికారత్వం**
**కారణం అంటే సవికారత్వం**

రెండూ, రెండు భిన్న లక్షణాలు. అవి ఒక పరమాత్మలో ఉండలేవు. వెలుగు, చీకటి ఒకచోట ఎలా ఉండలేవో అలా నిర్వికారత్వం, సవికారత్వం ఒక బ్రహ్మలో ఉండలేవు. నిమిత్తకారణం కూడా మార్పు చెందాలి. అంటే కర్మ చేయాలి. కుమ్మరి కుండను తయారు చేయాలి. అందువల్ల తర్కపరంగా పరమాత్మను కారణం అనలేము. అందువల్ల మనస్సు మిథ్యాస్వప్న ప్రపంచాన్ని సృష్టించినట్టుగా, పరమాత్మ మిథ్యా జాగ్రత్‌ప్రపంచాన్ని సృష్టించినట్టుగా అనిపిస్తుంది. ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**ఏతత్** – ఈ నిర్వికార బ్రహ్మ

**భిద్యతే** – అనేకంగా అయినట్టుగా అనిపిస్తుంది.

**మాయయా** – కాని నిజంగా కాదు. అది ఎందుకంటే బ్రహ్మ అనంతం కాబట్టి నిర్వికారం కాబట్టి, అది కారణం కాలేదు. దానికి దేశ, కాల పరిమితులు లేవు. అందువల్ల ఒకవేళ కారణం అనిపించినా అది కారణం అయినట్టుగా అర్థం చేసుకోవాలి.

**అజాయమానో బహుధా విజాయతే** – పురుషసూక్తమ్

నిజంగా సృష్టి చేయకుండా, జగత్తును సృష్టించినట్టుగా చేస్తున్నాడు భగవంతుడు. మీకేదైనా సందేహం ఉంటే, ఇంద్రజాలకుని సృష్టిని చూడండి. ఆయన ఏమీ సృష్టించకుండా సృష్టించినట్టు చేస్తాడు, దేన్నీ నిజంగా కోయకుండా కోసినట్టు చేస్తాడు, దేన్నీ నిజంగా మాయం చేయకుండా మాయం చేస్తాడు. అలా ఆయన చేసినంతసేపూ మాయాజాలం, కనికట్టు విద్య జరుగుతూనే ఉంటుంది. ఒక మామూలు ఇంద్రజాలికుడే అంత మాయను చూపించగా లేనిది, ఈశ్వరుడు ఈ మాయాజగత్తును సృష్టించలేడా? ఈ మాయాజగత్తునే మాయయా భిద్యతే అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**తత్త్వతో భిద్యమానే హి** – ఒకవేళ బ్రహ్మ నిజంగా అనేకం అయేటట్టయితే, అది తార్కికంగా కుదరదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అమృతం మర్త్యతాం వ్రజేత్** – ఎందుకంటే అమృతమైన అద్వయ ఆత్మ మరణించే లక్షణాన్ని పొందుతుంది. మార్పులేనిది మార్పు పొందుతుంది; కాలాతీతమైనది కాలంలో వస్తుంది. శాశ్వతమైనది అశాశ్వతమవుతుంది. ఇది తార్కికంగా చెల్లదు. ఎందుకంటే శాశ్వతం అంటేనే అది అశాశ్వతమవదు అని అర్థం.

**న కర్మణా వర్ధతే నో కనీయాన్** – బృహదారణ్యకమ్

ఏదైతే పెరగదు, తరగదో అది బ్రహ్మ అని బృహదారణ్యకోపనిషత్తు నిర్వచించింది. అందువల్ల కాలాతీతమైన బ్రహ్మ కాలంలోకి ఎలా వస్తుంది?

**కారిక 3.20**

**అజాతస్యైవ భావస్య జాతిమిచ్ఛంతి వాదినః ।**
**అజాతో హ్యమృతో భావో మర్త్యతాం కథమేష్యతి ॥**

ఇంత చిన్న తార్కికదోషాన్ని తక్కిన దార్శనికులు ఎందుకు గ్రహించలేకపోతున్నారో అర్థం కావటం లేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. భగవంతుడు ఈ జగత్తును సృష్టించాడు అనటమే పెద్ద దోషం. అలా అంటే, పరిమితి లేని బ్రహ్మ పరిమితిలోకి వచ్చినట్టు అవుతుంది. మార్పులేని బ్రహ్మకు మార్పును ఆపాదించినట్టు అవుతుంది. దేశ, కాలాతీత బ్రహ్మకు దేశకాల పరిధులు విధించినట్టవుతుంది. ఇది పెద్ద అపోహ.

సర్వవ్యాపకమైన బ్రహ్మ స్వర్గంలో ఉన్నాడు అన్నట్టు అవుతుంది. భగవంతుడు స్వర్గంలో ఉన్నాడు అంటే తప్పేం లేదు, కాని దాని పక్కన సర్వవ్యాపకుడైన పరమాత్మ స్వర్గంలో ఉన్నాడు అంటేనే వస్తోంది చిక్కు. కనీసం సర్వవ్యాపకమైన పరమాత్మ స్వర్గంలో **కూడా** ఉన్నాడు అంటే ఏ సమస్యా లేదు. కాని ఈ ద్వైతవాదులు అలా అనరు. సర్వవ్యాపకమైన పరమాత్మ వైకుంఠంలో ఉన్నాడు, నేను మరణించాక, ప్రయాణం చేసి వైకుంఠానికి చేరుకోవాలి అంటారు. అక్కడే వస్తుంది సమస్య అంతా.

**వాదినః** – ఈ ద్వైతవాదులు,

**ఇచ్ఛంతి** – వాదిస్తారు. ఏమని?

**అజాతస్యైవ భావస్య జాతిమ్** – అక్షరాలా జాతి అంటే పుట్టుక. పుట్టుక అనేది షడ్వికారాల్లో ఒకటి. అందువల్ల జాతిని వికారంగా తీసుకుందాము. భావస్య అంటే బ్రహ్మ. అంటే వికారాలు లేని బ్రహ్మకు వికారాలు ఆపాదిస్తున్నారు ఈ ద్వైతవాదులు. జాతి అంటే పుట్టుక, అజాతి అంటే పుట్టుక లేనిది. జాతిని వికారంగా తీసుకున్నాం కాబట్టి అజాతి అంటే వికారాలు లేని బ్రహ్మ. వికారాలు లేని బ్రహ్మ వికారాలు పొందుతున్నాడని వాదిస్తున్నారు వారు. కాకపోతే ఈ మాటను వారు ఇంత స్పష్టంగా చెప్పటం లేదు కాని దాని అర్థం అదే. బ్రహ్మ జగత్తును సృష్టిస్తున్నాడు అని అంటేనే, వికారాలు లేని బ్రహ్మ వికారాలు చెందినట్టు అర్థం; కాలాతీత బ్రహ్మ కాలానికి లోబడినట్టు అర్థం. ఇదే భావాన్ని గౌడపాదాచార్యులవారు రెండవ పాదంలో ఇంకొక కోణంలోంచి చెబుతున్నారు.

**కథం మర్త్యతామ్ ఏష్యతి** – మర్త్యతాం అంటే అసలు అర్థం మరణం. మరణం అంటే పరిమితి ఉన్నది. పరిమితి వికారాన్ని సూచిస్తుంది. పరిమితి లేని ఇన్ఫినిట్ బ్రహ్మ, పరిమితి ఉన్న ఫైనైట్‌గా ఎలా మారతాడు?

**అజాతః అమృతః భావః** – ఇక్కడ భావః అంటే బ్రహ్మ లేదా తురీయ బ్రహ్మ అని మర్చిపోకూడదు. ఎటువంటి బ్రహ్మ? అజాతః అంటే పుట్టుక లేని, అమృతః అంటే మరణం లేని. శరీరానికి పేర్కొనే షడ్వికారాలలో పుట్టుక, మరణం రెండు వికారాలు. శరీరానికి వికారాలు ఉన్నాయి కాని ఆత్మకు లేదా బ్రహ్మకు వికారాలు లేవు. బ్రహ్మ నిర్వికారం; కాలాతీతం. నిర్వికారమైన, కాలాతీతమైన బ్రహ్మ వికారాలున్న, కాలానికి లోబడిన జీవ, జగత్తులుగా ఎలా మారతాడు? ఎంత గొప్ప ఊహాలోకంలో కూడా ఇది సాధ్యం కాదు. ఇన్ఫినిట్ ఎన్నటికీ ఫైనైట్ కాలేదు; ఫైనైట్ ఎన్నటికీ ఇన్ఫినిట్ కాలేదు.

పరమాత్మ సర్వవ్యాపకం అని చెప్పటానికి పురాణగాథలు కూడా ఉన్నాయి. బ్రహ్మ, విష్ణుమూర్తులు శివలింగం యొక్క ఆది, అంతాలు కొలవటానికి ప్రయత్నించి

విఫలమయ్యారు అంటే దాని అర్థం ఈశ్వరుడు సర్వవ్యాపకుడు. ఇది శివభక్తుల కోసం చెప్పబడింది. విష్ణుభక్తులకు, యశోదాదేవి చిన్ని కృష్ణుణ్ణి రోలుకు తాడువేసి కట్టటానికి ప్రయత్నించిన ఉదంతం వస్తుంది. యశోదాదేవి ఎంత తాడు వాడినా అది రెండు అంగుళాలు తక్కువ అయ్యేదిట.

**స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులమ్** – పురుషసూక్తమ్

పురుషసూక్తంలో బ్రహ్మను ఎంత కొలిచినా పది అంగుళాలు తక్కువే అవుతుంది అని వస్తుంది. ఏ రూపంలో చెప్పినా దాని అర్థం భగవంతుణ్ణి కొలవలేము, ఆయన దేశాతీతుడు.

**కథం మర్త్యతామ్ ఏష్యతి** – పరిమితి ఉన్న బ్రహ్మగా ఎలా మారతాడు అనేది చూడటానికి ప్రశ్నలా ఉంది కాని అది ప్రశ్న కాదు. జవాబు. దాని అర్థం బ్రహ్మ పరిమితి ఉన్న బ్రహ్మగా మారదు అని అర్థం.

### కారిక 3.21

**న భవత్యమృతం మర్త్యం న మర్త్యమమృతం తథా ।**
**ప్రకృతేరన్యథాభావో న కథంచిద్భవిష్యతి ॥**

ఇవన్నీ చాలా ముఖ్యమైన శ్లోకాలు. నిదిధ్యాసనానికి తోడ్పడే శ్లోకాలు. ఈ శ్లోకాల అర్థాన్ని జీర్ణించుకుంటేనే చాలు, మోక్షం అంటే ఏమిటో స్పష్టమైన అవగాహన కలుగుతుంది. అంతేకాదు జ్ఞానం యొక్క విలువ కూడా తెలుస్తుంది.

ఇన్ఫినిట్ (శాశ్వతమైనది) ఎన్నటికీ ఫైనైట్ (అశాశ్వతమైనది) కాలేదు, ఫైనైట్ ఎన్నటికీ ఇన్ఫినిట్ కాలేదు. ఇది ప్రకృతిసూత్రం. ఒకవేళ శాశ్వతమైనది అశాశ్వతమైనది కావాలంటే, అది మార్పుకు లోనవ్వాలి. కాని శాశ్వతమైనది అంటేనే దేశకాలాలకు అతీతమైనదని అర్థం. అశాశ్వతమైనది ఎన్నటికీ శాశ్వతం కాలేదు. అశాశ్వతం + అశాశ్వతం = అశాశ్వతం.

**తథా** – అదే విధంగా,

**అమృతం మర్త్యం న భవతి** – శాశ్వతమైనది, అశాశ్వతం ఎన్నటికీ కాలేదు.

మన సాధన దేనికోసం? మోక్షం పొందటానికి. మోక్షం నిర్వచనం నిత్యం, శాశ్వతం. అందువల్ల మన సాధన అమృతత్వం పొందటానికి.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక ప్రశ్న వేస్తున్నారు. అశాశ్వతమైనది శాశ్వతమవుతుందా, శాశ్వతమైనది అశాశ్వతమవుతుందా? రెండూ సాధ్యం కాదంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఎందుకు? అశాశ్వతమైనది ఎంత సాధన చేసినా కూడా, ఎన్నటికీ శాశ్వతం కాలేదు. సరే, శాశ్వతం శాశ్వతం అవుతుందా? శాశ్వతం శాశ్వతంగా మారనవసరం లేదు, అశాశ్వతం శాశ్వతంగా మారలేదు. అలాంటప్పుడు మోక్షం కోసం సాధన చేయటం ఎందుకు? మోక్షం

అంటే నేను ముందే నిత్యముక్త పురుషుణ్ణి, మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు అని తెలుసుకోవటమే.

**ప్రకృతే రన్యథాభావః** – ఇక్కడ ప్రకృతి అంటే స్వస్వరూపం. ఒక వస్తువు యొక్క స్వస్వరూపం ఎన్నటికీ మారదు. అన్యథాభావః అంటే మార్పు లేదా వికారం.

**న భవిష్యతి** – ఎన్నటికీ సాధ్యం కాదు. అంటే స్వస్వరూపం ఎన్నటికీ మారదు. అశాశ్వతం అని మీరు నమ్మితే, అమృతత్వం కోసం ఎన్నడూ ప్రయత్నించకండి. వృథా కాలయాపన అవుతుంది అది. మీరు నిత్యం అని అర్థం చేసుకుంటే, నిత్యత్వం కోసం సాధన చేయనవసరం లేదు. ఒకవేళ సాధన చేసి తీరాలనుకుంటే, మోక్షం కోసం సాధన చేయనవసరం లేదు అని అర్థం చేసుకోవటానికి సాధన చేయాలి. 'నేను నిత్యముక్తుడిని,' అని పదేపదే గుర్తు చేసుకోవాలి. దీని అర్థం నిత్యబ్రహ్మ అనిత్య జగత్తును, జీవిని సృష్టించలేదు. అందువల్ల బ్రహ్మ కారణం కాదు.

ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక వస్తువుయొక్క స్వరూపం ఎన్నటికీ మారదు అనే విషయాన్ని చెబుతున్నారు. ఒకవేళ అది మారితే, అది స్వస్వరూపం అవదు, అది తెచ్చి పెట్టుకున్న లక్షణం అవుతుంది. అలా తెచ్చిపెట్టుకున్న లక్షణాన్ని ఆగంతుకం అంటారు. రెండు లక్షణాలు ఉంటాయి. అవి స్వరూప లక్షణం, ఆగంతుక లక్షణం. కాఫీ వేడిగా ఉంది అంటే, ఆ వేడి కాఫీ స్వరూపలక్షణం కాదు, ఆగంతుక లక్షణం. దాన్ని అగ్నిమీద వేడి చేయటం వల్ల ఆ వేడిని అరువు తెచ్చుకుంది. అందువల్ల ఆగంతుక లక్షణం అయింది. అరువు తెచ్చుకున్నది ఎంతసేపు ఉంటుంది? శాశ్వతంగా ఉండదు. కాసేపటికే కాఫీ చల్లారిపోతుంది; కాని దానికి వేడి గుణాన్ని అరువిచ్చిన అగ్ని మాత్రం ఎప్పుడూ వేడిగానే ఉంటుంది. మంచుప్రాంతంలో కూడా అగ్ని వేడిగానే ఉంటుంది. అంటే అగ్ని యొక్క ఉష్ణం దాని స్వస్వరూపం; కాఫీయొక్క ఉష్ణం ఆగంతుకం. అదే విధంగా బ్రహ్మ స్వస్వరూపం నిత్యత్వం. నిత్యం బ్రహ్మ అనిత్యం ఎన్నటికీ అవలేదు.

### కారిక 3.22

**స్వభావేనామృతో యస్య భావో గచ్ఛతి మర్త్యతామ్ ।**
**కృతకేనామృతస్తస్య కథం స్థాస్యతి నిశ్చలః ॥**

ఇంత గట్టిగా బ్రహ్మ నిత్యం, శాశ్వతం బ్రహ్మ అనిత్యం, అశాశ్వతం అవలేదని వాదించి కూడా, ఈ కారికలో వాదన కోసం, బ్రహ్మ స్వస్వరూపం మార్పు చెందింది అనుకుందాం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. దీన్ని అభ్యుపేద్య వాదన అంటారు. ఎదుటివారి వాదనను ఒప్పుకున్నట్టే ఒప్పుకుని, దానిలోని లొసుగుని ఎత్తి చూపుతారు. బ్రహ్మ మార్పు చెందుతాడు అనుకున్నా, అది సరికాదు అంటున్నారు. అదెలాగో చూద్దాము.

కొంతమంది వాదన ఇలా ఉంటుంది. మనం అంతకుముందు నిత్యమైన పరమాత్మలోనే ఉన్నాము. ఒకరోజు ఆ పరమాత్మనుంచి విడివడి, కిందికి వచ్చిపడ్డాము. అందువల్ల అనిత్య జీవులం అయ్యాము. ఇక్కడ, భూమ్మీద సాధన చేసి, మళ్ళీ నిత్యపరమాత్మ అవాలి అంటారు వారు.

వేడి చేసిన కాఫీ చల్లారిపోతే ఏం చేస్తాము? మళ్ళీ వెచ్చబెడతాము. అవునా? అదే విధంగా, అశాశ్వతమైన మనం సాధన ద్వారా మళ్ళీ శాశ్వతమైన బ్రహ్మగా మారాలి. ఇదీ వారి వాదన.

కాని ఈ వాదనలోని లొసుగు ఏమిటి? వారన్నదే నిజమనుకుందాం కాసేపు. జీవాత్మ సాధన చేసి, ఒక మంచిరోజున పరమాత్మ అయింది అనుకుందాం. కాని దానిలోని సమస్య ఏమిటి? భవిష్యత్తులో ఒకరోజు మీరు నిత్యమైన పరమాత్మగా **మారితే**, ఆ నిత్యత్వం భవిష్యత్తులో జరిగే ఒక సంఘటన అవుతుంది. అయితే ఏం? మోక్షం భవిష్యత్తులో జరిగే ఒక సంఘటన అయితే, అది నిత్యత్వం అనిపించుకోదు.

**జాతస్య హి ధృవో మృత్యుః** – గీత

పుట్టిన ప్రతిదానికీ మరణం తప్పదు. ఒక కాలంలో పుట్టిన మోక్షం నిత్యం అవలేదు. ఫర్వాలేదు. మోక్షం అంటే నిత్యం కానవసరం లేదని మీరంటే అది కుదరదు అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. మోక్షం అంటేనే నిత్యం అని అర్థం. అందువల్ల అనిత్యమోక్షం పదం వాడలేము. అది పరస్పర విరుద్ధం అవుతుంది. సంసారంనుంచి శాశ్వతంగా విముక్తినిచ్చేది మోక్షం. నిజానికి మోక్షశాస్త్రానికి వచ్చేదే శాశ్వతమైన ముక్తిని పొందటంకోసం. స్వర్గలోకానికి వెళ్ళటం కూడా శాశ్వతఫలం కాదని తెలుసుకున్నాకే, మోక్షశాస్త్రానికి వస్తారు ఎవరైనా. ఇప్పుడు మోక్షం కూడా శాశ్వతం కాకపోతే, ఇంక మోక్షంయొక్క ప్రత్యేకత ఏముంది? ఇటువంటి తార్కిక లొసుగును అనిర్మోక్ష ప్రసంగః అంటారు.

ద్వైతవాదులందరూ మోక్షాన్ని భవిష్యత్తులో వచ్చే సంఘటనగా నిర్వచిస్తారు. వారి ఉద్దేశ్యంలో మోక్షం అంటే మరణించాక, శుక్లగతి ద్వారా ప్రయాణం చేసి, స్వర్గలోకానికి చేరుకోవటమే. నిజానికి ఇది ఎన్నటికీ మోక్షం కాలేదు.

**యస్య** – ద్వైతవాదికి. ఇక్కడ ద్వైతవాదికి అంటే తక్కిన ఆస్తిక దార్శనికులందరినీ కలుపుకోవాలి అని అర్థం చేసుకోవాలి.

**భావః మర్త్యతామ్ గచ్ఛతి** – నిత్యమైన బ్రహ్మ అనిత్యం అవుతున్నాడు. భావః అంటే బ్రహ్మ లేదా ఏడవమంత్రంలో చెప్పబడిన తురీయబ్రహ్మ అనే విషయం మర్చిపోకూడదు. నిజానికి ఈ అధ్యాయం మొత్తం అందులో చెప్పబడిన తురీయంమీద వ్యాఖ్యానం.

**స్వభావేన అమృతః** – ఈ బ్రహ్మయొక్క స్వభావం అమృతత్వం లేదా నిత్యత్వం. కాని ఈ దార్శనికులు బ్రహ్మ అనిత్య జగత్తు, అనిత్య జీవాత్మగా మారాదు అంటున్నారు. అందువల్ల మీరు సాధన చేసి, నిత్యబ్రహ్మ అవాలి అంటున్నారు. వారి భాషలో నిత్యత్వాన్ని సాధన ద్వారా పొందాలి.

**కృతకేన అమృతః** – కృతం అంటే ఒక సమయంలో, సాధన ద్వారా పొందిన అమృతత్వం. ఇప్పుడు నువ్వు సంసారి జీవివి, నువ్వు సాధన చేసి అసంసారి బ్రహ్మ అవాలి అంటారు వారు.

కాని ఈ వాదన శిష్యుణ్ణి తప్పుదారి పట్టిస్తుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అలాంటి తప్పుడు బోధ చేయకూడదు గురువు. ఎప్పుడో భవిష్యత్తులో మోక్షం పొందుతావు అని చెప్పకూడదు. ఎందుకంటే నువ్వు ఇప్పుడే ముక్తపురుషుడివి, ఇప్పుడే బ్రహ్మవు. తత్ త్వమ్ అసి. అసి అంటే ఇప్పుడే అయివున్నావు. ఇప్పుడు భోరున ఏడుస్తున్నా కూడా, నువ్వు ఆనందస్వరూపుడివి. ఇది చెప్పాలి గురువు. కాని ద్వైతవాదులకు ఇది తెలియదు. అందువల్ల కృతకేన అమృతః అంటారు వారు.

**కథం నిశ్చలః స్థాస్యతి** – అలా ఒక కాలంలో వచ్చిన నిత్యత్వం శాశ్వతంగా ఎలా ఉంటుంది అనటంలో అర్థంలేదు. ఒకకాలంలో వచ్చిన మోక్షం శాశ్వతం అయితే, ఒకకాలంలో పొందిన స్వర్గలోకఫలం కూడా శాశ్వతం అవాలి కదా. కాని స్వర్గలోకఫలం శాశ్వతం కాదు అంటాము. స్వర్గలోకఫలం శాశ్వతం కాకపోతే, మోక్షఫలం కూడా శాశ్వతం కాకూడదు.

కాని ఈ ద్వైతవాదులు మోక్షం శాశ్వతం అని ఒప్పుకోవాలి అంటారు. ఎక్కడెక్కడ వారి వాదన తర్కానికి అందదో, అక్కడ ఈ ద్వైతవాదులు నీ బుద్ధిని పక్కన పెట్టేయి అంటారు. వారు మనని నియంత్రించటానికి చూస్తారు. బుద్ధి నీ పెద్ద శత్రువు అంటారు. ఎందుకంటే వారి సిద్ధాంతం – మోక్షం భవిష్యత్తులో వచ్చే సంఘటన, మోక్షం నిత్యం. ఈ రెండూ పరస్పర విరుద్ధ వాక్యాలు. మన బుద్ధి వాటిని బుద్ధిగా ఒప్పుకోదు. వారు దానికి జవాబు చెప్పలేరు. అందువల్ల బుద్ధిని అణగద్రొక్కుతారు. గురువు చెప్పినదాన్ని బుద్ధిగా ఒప్పుకోవాలి, ఆయనను ఎదురు ప్రశ్నించకూడదు అంటారు. పైగా అద్వైతం జోలికి వెళ్ళొద్దు అని వారిస్తారు కూడా.

కాని అద్వైతం ఎన్నడూ మీ బుద్ధిని అణగద్రొక్కుకోండి అని చెప్పదు. బ్రహ్మ గురించి శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా నేర్చుకోవాలని బోధిస్తుంది. మననం అంటే **సంశయ నివృత్తి**. మీకున్న సంశయాలను మననం స్థాయిలో పారద్రోలి, నిశ్చయజ్ఞానాన్ని పొందాలి. మోక్షం భవిష్యత్తులో వచ్చే సంఘటన అయితే, అది శాశ్వతంగా ఎలా ఉంటుందని

అద్వైతంలో అడగవచ్చు. అద్వైతం మీ సందేహాన్ని తీరుస్తుంది కూడా. మోక్షం అంటే భవిష్యత్తులో వచ్చే సంఘటన కాదు, మోక్షం అంటే నేను ముందే ముక్తపురుషుణ్ణి అని పొందే జ్ఞానం అంటుంది. మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు అంటుంది.

నిత్యమోక్షం ద్వైతంలో నమ్మకం అయితే, నిత్యమోక్షం అద్వైతంలో సత్యం.

ఈ విధంగా కారికలు 17-22లో గౌడపాదాచార్యులవారు, తను చేస్తున్న బోధనుంచి కొంచెం పక్కకి వెళ్ళి ద్వైతవాదుల ఖండన చేశారు. నిజానికి ఆయన ప్రాథమిక లక్ష్యం ద్వైతవాద ఖండన కాదు, అద్వైత స్థాపన. కాని అది నిలబెట్టాలంటే తక్కిన వాదనల్లోని లొసుగులను కూడా ఎత్తిచూపక తప్పదు.

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు నిరూపించిన అంశం మోక్షం అంటే ద్వైతం నుంచి ద్వైతానికి ప్రయాణం కాదు. ద్వైతం అంటేనే బంధం. ఎందుకంటే ఎక్కడైతే ప్రమాత-ప్రమేయం విభజన ఉంటుందో, అక్కడంతా దేశ, కాల పరిమితులు లేకుండా ఉండవు. దేశకాల పరిమితులు వస్తే, అనిత్యత్వం వస్తుంది. అనిత్యత్వం వస్తే అభద్రతా భావన వచ్చి తీరుతుంది. అభద్రతాభావననుంచి స్వేచ్ఛ పొందటమే మోక్షం అంటే. కాని ద్వైతంలో ఉన్నంతవరకూ ఈ అభద్రతాభావన పోదు.

అంతేకాదు ఎక్కడైతే ద్వైతం ఉంటుందో, అక్కడ తప్పనిసరిగా రాగద్వేషాలు కూడా ఉంటాయి. రాగద్వేషాలు కూడా బంధకత్వానికి దారితీస్తాయి. ఇంకొక అంశం, ద్వైతం ఉన్నచోట, ఒకదానితో ఒకటి పోల్చుకోవటం వస్తుంది. ఎక్కడ పోల్చుకోవటం వస్తుందో, అక్కడ ఈర్ష్య చోటుచేసుకుంటుంది. ఈర్ష్య కూడా బంధకత్వానికి దారి తీస్తుంది. ఎక్కడ ద్వైతం ఉంటే అక్కడ భయం, రాగం, ద్వేషం, అసూయలు రాజ్యమేలుతాయి. వీటన్నింటినీ కలిపి సంసారం అంటారు.

ద్వైతవాదులు చెప్పినట్టుగా మోక్షం అంటే వైకుంఠానికో, కైలాసానికో వెళ్ళటం మోక్షం అయితే అక్కడ కూడా ఈ ద్వైతం ఉంటూనే ఉంటుంది. కాకపోతే మనం ఇహలోక ద్వైతాన్నుంచి పరలోక ద్వైతానికి ప్రయాణం చేస్తాము అంతే. అందువల్ల సబ్జెక్ట్-ఆబ్జెక్ట్ విభజన ఉన్నన్నాళ్ళూ, ద్వైతం, దానితోపాటు సంసారం తప్పవు. అంటే మూడు విషయాలు కుదరవు. అవి -

1. మోక్షం అంటే ద్వైతం నుంచి ద్వైతానికి ప్రయాణం కాదు. సాధకుడు ఈ విషయాన్ని 200% జీర్ణించుకోవాలి. మోక్షం అంటే స్వర్గలోకానికి ప్రయాణం చేసి, భగవంతుని సమక్షంలో స్వర్గసుఖాలను అనుభవించటం కాదు.

2. మోక్షం అంటే ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం. అద్వైతంలోనే మరణం లేదు, విభజన లేదు, రాగద్వేషాలకు తావులేదు, కామక్రోధాలకు ఆస్కారమే లేదు. దీనికి గొప్ప ఉదాహరణ మన సుషుప్తి అవస్థే. సుషుప్తిలో రాగద్వేషాలు, కామక్రోధాలు ఉండవు.

3. ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం శారీరకంగా కాదు, మానసికంగా. అద్వైతం అంటే ఎక్కడో దూరాన ఉన్న ప్రాంతం కాదు. అలా అద్వైతం ఎక్కడో ఉంటే, అది కూడా దేశకాల పరిమితుల్లోకి వస్తుంది. అందువల్ల ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం చేయాలంటే శారీరకంగా కాదు, ఆ ప్రయాణం అజ్ఞానం నుంచి జ్ఞానానికి చేసే ప్రయాణం.

స్వప్నంలో స్వాప్నికుడు ద్వైతాన్ని చూస్తాడు. ఆ ద్వైతం ఎలా పోతుంది? తను తన ఉన్నతస్థితి అయిన జాగ్రదావస్థకి మేలుకుంటే పోతుంది. అలాగే జాగ్రదావస్థలో ద్వైతాన్ని చూస్తాడు జాగ్రద్ పురుషుడు. అది ఎలా పోతుంది? తను తన ఉన్నతస్థితి అయిన పారమార్థిక స్థాయికి మేలుకుంటే పోతుంది.

**ఉత్తిష్ఠః జాగ్రత ప్రాప్యవరాన్ నిబోధత** – కఠ

యమధర్మరాజే తన కోరల్లో చిక్కుకోకుండా తప్పించుకునే మార్గాన్ని సూచిస్తున్నాడు. 'నేను నిన్ను బంధించకూడదు అనుకుంటే, నీ ఉన్నతస్థాయికి లే,' అంటున్నాడు. ఈ అంశాన్ని ముక్తాయింపుగా కారిక 22లో మళ్ళీ చెప్పారు గౌడపాదాచార్యులవారు. అద్వైతం కూడా ఒకకాలంలో వచ్చేదైతే, ఇంకొకకాలంలో పోతుంది అంటున్నారు. 'నేను కొన్ని రోజులు శాశ్వతంగా ఉన్నాను,' ఎంత హాస్యాస్పదంగా ఉంటుంది ఈ వాక్యం! 'నేను ధ్యానంలో కొన్ని నిముషాలు నిత్యంగా ఉన్నాను!' ఈ వాక్యంలోని భిన్న అంశాలు గమనించ లేకపోతే, అది ఎన్నటికీ అద్వైతం కాలేదు.

**కారికలు 3.23 - 3.26: ఉపోద్ఘాతం**

ఉపనిషత్తుల్లో వచ్చిన బ్రహ్మలక్షణాలు నేర్చుకుంటుంటే ఒక సమస్య ఎదురవుతుంది. కొన్ని లక్షణాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. వాటిలో ముఖ్యమైన విరుద్ధ లక్షణాలు – బ్రహ్మ నిర్వికారం, బ్రహ్మ జగత్కారణం. ఈ రెండు లక్షణాలకూ పొత్తు కుదరదు.

నిర్వికారం అంటే వికారాలు లేనిది, దేశకాలాతీతమైనది. అంతవరకూ బాగానే ఉంది. కాని వెంటనే ఉపనిషత్తు బ్రహ్మ జగత్ కారణం, అందులోనూ ఉపాదాన కారణం అంటుంది. ఉపాదాన కారణం అనగానే, దాని నియమం గుర్తుకు రాకతప్పదు. ఉపాదాన కారణం కార్యంగా అవటానికి మార్పు చెందుతుంది. విత్తనం చెట్టుగా మారుతుంది; పాలు పెరుగుగా మారతాయి; బంగారం ఆభరణాలుగా మారుతుంది. బంగారం విషయంలో ఆ మార్పు రసాయనకంగా కాదు కాని ఆకారంలో మార్పు చెందుతుంది. అంటే కారణానికి ఏదో ఒక విధంగా మార్పు తప్పదు. అందువల్ల జగత్ కారణం అంటే సవికారం.

ఉపనిషత్తు బ్రహ్మ నిర్వికారం, బ్రహ్మ జగత్కారణం అంటుంది. కారణం పదాన్ని తీసి సవికారం వేస్తే బ్రహ్మ నిర్వికారం, బ్రహ్మ సవికారం కూడా అన్నట్టు అవుతుంది. ఇంత స్పష్టంగా ఉపనిషత్తు చెప్పకపోయినా దాని అర్థం అదే. బ్రహ్మ నిర్వికారం అయితే సవికారం అవలేదు; సవికారం అయితే నిర్వికారం అవలేదు. ఒకే వస్తువులో రెండు భిన్నలక్షణాలు ఇమడలేవు.

రాముడు సన్నగా ఉన్నాడు, లక్ష్మణుడు లావుగా ఉన్నాడు అనగలం కాని రాముడు సన్నగా, లావుగా ఉన్నాడు అనలేము. అలాగే ఒక వస్తువు బరువుగా, తేలికగా ఉంది అనలేము. అలాంటప్పుడు బ్రహ్మ నిర్వికారం, సవికారం అని ఎలా చెప్పగలము?

అలాగని ఏదో ఒక లక్షణాన్ని కూడా తీసుకోలేము. ఎందుకు? రెండు లక్షణాలూ ఒకే వేదం నుంచి వచ్చాయి. మనకు నచ్చిన లక్షణాన్నే మనం ఎన్నుకుంటే, నాకు నచ్చిన లక్షణాన్ని నేను ఎన్నుకుంటాను అంటాడు పూర్వపక్షి. అలా ఎవరికి తోచిన లక్షణం వారు ఎన్నుకుని, తక్కిన లక్షణాలను త్రోసిపుచ్చితే బ్రహ్మకు ఏ లక్షణమూ లేకుండా పోతుంది. అందువల్ల రెండు లక్షణాలనూ తీసుకోక తప్పదు.

దీనికి ఒకటే మార్గం ఉంది అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. రెండు భిన్న లక్షణాలు ఒక వస్తువులో ఉండి తీరాలంటే, దానికి ఒకే మార్గం ఉంది. ఒకటి సత్య లక్షణం, ఇంకొకటి మిథ్యా లక్షణం అయివుండాలి; ఒకటి ఉన్నతస్థాయికి చెందిన సత్యం, ఇంకొకటి తక్కువస్థాయికి చెందిన సత్యం అయివుండాలి. నేను స్వప్నంలో ఊరంతా తిరిగివస్తాను, కాని మంచం మీద చలనం లేకుండా పడుకుని ఉన్నాను. అది సాధ్యమే! ఎందుకంటే

స్వప్నప్రపంచం ప్రాతిభాసిక సత్యానికి చెందితే, జాగ్రద్ పురుషుడు వ్యావహారిక సత్యానికి చెందిన వాడవుతాడు. దాన్ని సత్తాభేదం లేదా స్థాయీభేదం అంటారు. అందువల్లనే పడుకునే ముందు కడుపునిండా తిని, హాయిగా సొమ్మసిల్లి పడుకుంటే, స్వప్నంలో ఆకలికి అలమటించి పోతాడు.

ఈ భిన్నలక్షణాలను స్వీకరించాలంటే ఒకటి సత్యం, ఇంకొకటి మిథ్య అవాలి. నిర్వికారమో, సవికారమో మిథ్య అవాలి. మిథ్యా పదాన్ని వాడటం ఇష్టం లేకపోతే వ్యావహారిక సత్యం అనవచ్చు. ఈ రెండింటిలో ఒకటి పారమార్థిక సత్యం అయితే, ఇంకొకటి వ్యావహారిక సత్యం అవుతుంది. ఇదొక్కటే మార్గం.

కాని ఇంకా సమస్య అలాగే ఉంది. ఈ రెండింటిలో ఏది సత్యం, ఏది మిథ్య? గౌడపాదాచార్యుల వారు నిర్వికారాన్ని సత్యంగానూ, సవికారాన్ని మిథ్యగానూ తీసుకోవాలి అంటున్నారు. బ్రహ్మ సవికారత్వం మిథ్య అయితే, సహజంగానే సవికారత్వాన్ని సూచించే కారణహెూదా కూడా మిథ్యే అవాలి. అంటే బ్రహ్మ నిజంగా సృష్టి కారణం కాదు.

బ్రహ్మ నిజంగా సృష్టికారణం కాదు అంటే, బ్రహ్మ మిథ్యా కారణం అవుతాడు. మనం ఒక్కొక్కమెట్టు ఎక్కుతూ వెళుతున్నాము.

1. బ్రహ్మ నిజం కారణం కాదు సృష్టికి.

2. బ్రహ్మ నిజం కారణం కాకపోతే, బ్రహ్మనుంచి వచ్చిన ఈ జగత్తు కూడా నిజంగా కార్యం కాదు. మిథ్యాకారణం, మిథ్యా జగత్తునే సృష్టించగలదు. మిథ్యా స్వప్నతండ్రి మిథ్యా స్వప్నపుత్రునికే జన్మను ఇవ్వగలదు. అందువల్ల జగత్తు మిథ్య, బ్రహ్మ మిథ్యాకారణం కాబట్టి, దాన్నించి పుట్టిన జగత్తు కూడా మిథ్యే అవాలి. దీనికి ఏమిటి ఆధారం? ఉపనిషత్తే!

జగత్ సృష్టిని, జీవసృష్టిని గౌడపాదాచార్యులవారు ఒక క్రమపద్ధతిలో నాలుగు విధాలుగా ఖండించుకుంటూ వచ్చి, వాటి యొక్క మిథ్యాత్వాన్ని నిరూపించుకుంటూ వస్తున్నారు.

| | |
|---|---|
| ఎ) యుక్త్యా జీవసృష్టి నిషేధః | – కారికలు 3–9 |
| బి) యుక్త్యా జగత్సృష్టి నిషేధః | – కారిక 10 |
| సి) శ్రుత్యా జీవసృష్టి నిషేధః | – కారికలు 11–14 |
| డి) శ్రుత్యా జగత్సృష్టి నిషేధః | – కారికలు 15, 16, 23 –30 |

(అందులో కారికలు 17–22 నుంచి ద్వైతవాద ఖండన చూశాము)

ఇప్పటివరకూ పైమూడు నిషేధాలు అయ్యాయి. అంటే యుక్తిపరంగా జీవసృష్టి, జగత్ సృష్టి నిషేధం జరిగింది; శ్రుతిపరంగా జీవసృష్టి నిషేధం జరిగింది. ఇప్పుడు శ్రుతి పరంగా జగత్ సృష్టి నిషేధం జరుగుతున్నది కాని మధ్యలో ప్రసంగవశాత్ అంటారు, ప్రసంగవశాత్

ద్వైతవాదన ఖండన చేశారు గౌడపాదాచార్యులవారు. ఇప్పుడు మళ్ళీ వెనక్కి వచ్చి శ్రుతిపరంగా ద్వైతవాదన ఖండనను కొనసాగిస్తున్నారు.

శ్రుతి కూడా నిజంగా సృష్టి జరగలేదు అంటుంది అంటారు గౌడపాదాచార్యులవారు. కాని ఇలా శ్రుతిపరంగా జగత్‌సృష్టిని నిషేధించేటప్పుడు విద్యార్థికి రాగలిగే సందేహాన్ని ఊహించుకుని దానికి సమాధానం చెబుతున్నారు.

**సందేహం** – ఒకవేళ నిజంగా సృష్టి జరగలేదు అని మీరనేది నిజమైతే, ఒక్కొక్క ఉపనిషత్తూ, సృష్టిప్రకరణం పదేపదే ఎందుకు చెబుతుంది? దశ ఉపనిషత్తుల్లో సృష్టి గురించి లేనిది ఒక కేనోపనిషత్తులోనే. తక్కిన అన్ని ఉపనిషత్తులూ సృష్టి గురించి ఒక క్రమపద్ధతిలో చెప్పుకు వస్తాయి. ఒక్క ఉపనిషత్తులో రాకపోయినా, తక్కిన ఉపనిషత్తులన్నీ ఏక కంఠంతో సృష్టి గురించి చెబుతూనే ఉంటే, అసలు సృష్టే జరగలేదు పొమ్మనటానికి మీరెవరు? ఇదీ సందేహం.

**జవాబు** – దానికి జవాబునే ఈ కారికల్లో చూస్తాము. నిజానికి ఈ విషయం ఇంతకు ముందు కూడా చెప్పారు కాని, ఇక్కడ మళ్ళీ నొక్కి వక్కాణిస్తున్నారు. ఆయన జవాబేమిటి?

నిజమే, ఉపనిషత్తులు సృష్టి గురించి బోధిస్తాయి కాని, ఉపనిషత్తులు ఆ సృష్టిని సత్యంగా తీసుకుంటున్నాయా, మిథ్యగా కొట్టివేస్తున్నాయా అనేది ఎక్కడా స్పష్టంగా చెప్పవు. సృష్టిని ముందు ప్రవేశపెట్టి తర్వాత కొట్టివేస్తుందా, లేకపోతే సృష్టిని సత్యంగా స్వీకరిస్తుందా అనేది తేల్చిచెప్పవు. నిజానికి ఉపనిషత్తులు అది మిథ్యాసృష్టా, సత్యసృష్టా అనేది ఎక్కడా చెప్పవు. సృష్టి జరిగింది అని చెబుతాయి అంతే.

మనం అంటే అద్వైతులం కూడా సృష్టి జరిగింది అనే అంశాన్ని నిరాకరించము. మనమూ సృష్టిని స్వీకరిస్తాము, కాకపోతే దానికొక కొసమెరుపు కలుపుతాము. స్వప్న ప్రపంచం ఎలా సత్యం కాదో, ఈ సృష్టి కూడా అలా సత్యం కాదని చెబుతాము. అంటే నిజంగా సృష్టి జరగలేదు, మిథ్యాజగత్తు మాత్రమే అంది అంటాము. ద్వైతవాదులు జగత్తు సత్యం అంటారు.

ఇప్పుడు వివాదాంశం ఇది – బ్రహ్మ నుంచి సత్యజగత్తు వచ్చిందా, మిథ్యాజగత్తు వచ్చిందా?

మిథ్యాజగత్తు వచ్చింది అంటే, అసలు నిజంగా జగత్తు రాలేదు అని అర్థం. 'నువ్వు తెలివైనవాడిలా కనిపిస్తున్నావు,' అని అంటే దాని అర్థం, 'నువ్వు నిజంగా తెలివైనవాడివి కాదు.' 'నువ్వు అలంకరణ చేసుకుంటే అందంగా ఉన్నావు,' అంటే దాని అర్థం, 'నువ్వు అలంకరణ చేసుకోకపోతే అందంగా లేవు.' ఆ సూత్రం ప్రకారం అద్వైతసిద్ధాంతి, 'మిథ్యా జగత్తు వచ్చింది,' అంటే దాని అర్థం, 'నిజంగా జగత్తు రాలేదు.'

అద్వైత సిద్ధాంతి ఏమో, మిథ్యాజగత్తు వచ్చింది అంటాడు. ద్వైతవాది ఏమో, నిజంగా వచ్చింది అంటాడు. శ్రుతివాక్యాలు అద్వైతాన్నీ బలపరచవు, ద్వైతాన్నీ బలపరచవు. శ్రుతి కేవలం సృష్టిప్రకరణం చెబుతుంది అంతే.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః**

అని చెప్పుకొస్తుంది అంతే. శ్రుతి దేన్నీ అవుననీ, కాదనీ అనకపోతే శ్రుతివాక్యాన్ని ఎలా తీసుకుంటాము? శ్రుతి, సృష్టి గురించి చెప్పిన వాక్యాన్ని మాత్రం బయటకు తీసి, శ్రుతే చెప్పింది కదా అనకూడదు. ఆ వాక్యం ముందు వెనకలు కూడా చూడాలి. అంటే ఆ అధ్యాయం మొత్తం అర్థం చేసుకోవాలి. దీనికొక ఉదాహరణ చూద్దాము.

తైత్తిరీయోపనిషత్తులో పంచకోశ వివేకం చూస్తాము. అక్కడ ఒక్కొక్క కోశాన్నీ తీసుకుని ముందు ఆకోశం ఆత్మ అని చెప్పి, మళ్ళీ ఈ కారణాలవల్ల ఈకోశం ఆత్మ కాదు, తర్వాత కోశం ఆత్మ, ఇది అనాత్మ అంటుంది. అలాంటి సందర్భంలో ప్రాణమయకోశం ఆత్మ అన్న మాట తీసుకుని, 'అదుగో శ్రుతే ప్రాణమయకోశం ఆత్మ అంది,' అనకూడదు. ఎందుకంటే తర్వాత అనువాకంలోనే అదే శ్రుతి, 'అన్యోంతర ఆత్మా మనోమయః' అంటుంది. అంటే ప్రాణమయం అనాత్మ అయింది, మనోమయం ఆత్మ అయింది. అందువల్ల చెదురు మదురుగా వాక్యాలని ఏరి, శ్రుతే చెప్పింది అని వాదించకూడదు. శ్రుతి ఆ విషయం గురించి ఏం చెప్పిందో, పూర్తిగా చూడాలి. సృష్టి ప్రకరణం గురించి ఉన్న కాస్త మంత్రాన్ని మాత్రమే తీసుకోకూడదు. దాని ముందు, వెనకలు కూడా చూడాలి. అంటే మొత్తం సందర్భాన్ని చూడాలి. దీన్ని మీమాంస అంటారు. ఈ నేపథ్యంతో ఈ కారికలు చూద్దాము.

**కారిక 3.23**

**భూతతోఽ భూతతో వాఽ పి సృజ్యమానే సమా శ్రుతిః ।**
**నిశ్చితం యుక్తియుక్తం చ యత్తద్భవతి నేతరత్ ॥**

**శ్రుతిః** – శ్రుతిః అంటే శ్రుతి చెప్పే సృష్టివాక్యం.

**సృజ్యమానే సమాః** – సృష్టి గురించి శ్రుతి చెప్పే వాక్యం నిష్పక్షపాతంగా ఉంటుంది. అది ద్వైతాన్నీ సమర్థించదు; అద్వైతాన్నీ సమర్థించదు.

**భూతతః అభూతతో వా అపి** – భూతతః అంటే సత్యం; అభూతతో అంటే మిథ్య. శ్రుతి అది సత్యమనీ చెప్పదు, మిథ్య అనీ చెప్పదు. ప్రాణమయం గురించి చెప్పిన వాక్యంతో ఆగకుండా, ముందుకు సాగినట్టే, ఇక్కడ కూడా సృష్టిప్రకరణంతో ఆగకుండా ముందుకు సాగాలి.

**నిశ్చితం** – ఈ సందర్భాన్ని చూసి, బోధను అర్థం చేసుకోవటాన్నే మీమాంసా అంటారు. దీన్నే సమన్వయం అని కూడా అంటారు. బ్రహ్మసూత్రాల్లో మొదటి అధ్యాయాన్ని సమన్వయ

అధ్యాయం అంటారు. అక్కడ వ్యాసాచార్యులవారు శాస్త్రంలో ఏ భాగాన్నీ సగమే అధ్యయనం చేయవద్దని, అలా అక్కడక్కడా అధ్యయనం చేస్తే అపోహలు కలుగుతాయని నిరూపిస్తారు.

నిజానికి మన శాస్త్రం ఎంత విస్తారంగా ఉంటుంది అంటే, ఎవరికీ శాస్త్రాన్ని పూర్తిగా అధ్యయనం చేసే తీరికా, ఓపికా ఉండదు. అందువల్ల ఏదో వారికి తోచిన భాగం మాత్రమే చదువుతారు. చదివి ఊరుకుంటే ఫర్వాలేదు, ఆ అరకొర జ్ఞానంతో శాస్త్రాన్ని దుయ్యబడతారు. రాముడు సీతను అడవులకు పంపటం మాత్రమే చదువుతారు. నిందుచూలాలిని నిర్దాక్షిణ్యంగా అడవులకు పంపాడని రాముణ్ణి నిందిస్తారు. నిజానికి రాముణ్ణి భర్తగా చూడాలంటే అరణ్యకాండ చదవాలి. సీతా వియోగానికి ఎంతగా విలపించాడో అక్కడ తెలుస్తుంది కాని అది వారికి అనవసరం.

నిజానికి మన పురాణాలను స్వయంగా అధ్యయనం చేయకూడదు. అవి ఇలాగే పెద్ద అయోమయంలో పడేస్తాయి. అందులోనూ పురాణాల అనువాదాలు అసలు చదవకూడదు. అవి చదివితే పురాణాల మీద మనకు ఉన్న గౌరవం కూడా పోతుంది. అందువల్ల పురాణాలను గురువు ద్వారా అధ్యయనం చేయాలి.

ఒక్కొక్క సంఘటనను ఎలా అర్థం చేసుకోవాలో తెలియాలి. రచయిత చెప్పదలుచుకున్న అంశాన్ని సరిగ్గా గ్రహించాలంటే మీమాంసాశాస్త్రం తెలిసివుండాలి. కాని, దురదృష్టవశాత్తూ నేటి యువత ఈ పురాణాల మీద వచ్చిన అనువాదాలను చదువుతున్నారు. అందువల్ల వారికి పురాణాలమీద ఎన్ని సందేహాలు వస్తున్నాయంటే, వాటిమీద గౌరవం కూడా పోతున్నది. శాస్త్రంమీద సంపూర్ణ అవగాహన కలిగేలా చదవాలి అంటే షడ్లింగ విచారణ చేయాలి. ఆరు అంశాల ద్వారా నిజంగా సృష్టి జరిగిందా లేదా అనేది ఈ షడ్లింగ విచారణలో తెలుస్తుంది.

ఈ విచారణ చేస్తే శ్రుతి సృష్టిని సత్యంగా భావించదు అని అర్థమవుతుంది. ప్రాణమయం ఆత్మ అని ఒకచోట శ్రుతి చెబితే అక్కడే ఆగిపోకూడదు అనీ, చివరిదాకా వస్తే, పంచకోశవివేకం చేసి శ్రుతి; ఆత్మ పంచకోశాతీతం అని విశ్లేషించిందని అర్థమవుతుంది అనీ ఇంతకుముందు చూశాము. అలాగే సృష్టి గురించి శ్రుతి చెప్పింది విని అక్కడే ఆగిపోకూడదు. ఇంకా ముందుకు సాగితే, శ్రుతే దాన్ని నిషేధిస్తుంది. ఇలా చదవటానికి మీమాంసాశాస్త్రం తోడ్పడుతుంది.

**యుక్తి యుక్తం చ** – అంతేకాదు తర్కం కూడా ఉపయోగించాలి. శాస్త్రాన్ని మనకు ఇష్టం వచ్చినట్టుగా అర్థం చేసుకోకూడదు. దాన్ని తర్కంతో కలిపి అర్థం చేసుకోవాలి.

స్వర్గం అనే లోకం ఒకటి ఉంటే, అది దేశ, కాల పరిమితులకు లోబడి ఉంటుంది. అటువంటి లోకానికి ప్రయాణం చేసి వెళితే కలిగే ఫలం నిత్యం ఎలా అవుతుంది? తర్కం

కూడా అలా ఒక కాలంలో వచ్చిన ఫలాన్ని నిత్యఫలంగా స్వీకరించలేదు. అద్వైత సిద్ధాంతం స్వర్గఫలం నిత్యఫలం అనేది ఒప్పుకోదు. శాస్త్రం చెప్పింది తర్కం ఒప్పుకునేలా ఉంటుంది. అది మన బుద్ధి స్వీకరించేదిగా ఉంటుంది.

జ్ఞానం కలిగేది బుద్ధిలో; బుద్ధి తర్కానికి లొంగినదాన్నే స్వీకరిస్తుంది. అందువల్లనే గురువైనా సరే, ఒక గులాబీపువ్వును చూపించి, 'ఇదుగో ఈ ఏనుగును చూడండి,' అంటే గురువుమీద ఎంత గౌరవం ఉన్నాకూడా ఒప్పుకోరు మీరు. మీ కళ్ళు దాన్ని గులాబీగా చూస్తున్నాయి. అందువల్ల జ్ఞానం ఏర్పడాలంటే అది తార్కికంగా ఉండాలి. దాన్నే నిశ్చితం అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

నిశ్చితం పదం శ్రవణాన్ని సూచిస్తే, యుక్తియుక్తం పదం మననాన్ని సూచిస్తుంది.

**యత్ భవతి** – ఏ తత్త్వాన్నైతే పూర్తి విచారణ తర్వాత అర్థం చేసుకుంటారో,

**తదేవ (భవతి)** – దాన్ని మాత్రమే స్వీకరించాలి.

**న ఇతరత్** – దానికంటే భిన్నం (ద్వైతం) ఎన్నటికీ శ్రుతి తాత్పర్యం కాలేదు.

పూర్తి విచారణ ద్వారా అర్థం చేసుకోవాలి అన్నారు గౌడపాదాచార్యులవారు. దాన్ని రెండు రకాలుగా చేయాలి అన్నారు. అవి మీమాంసా, తర్కం. వీటిని ఎలా చేయాలి? ఆ పని కూడా మనకు గౌడపాదాచార్యులవారే చేసిపెట్టబోతున్నారు రాబోయే కారికల్లో.

**కారిక 3.24**

**నేహ నానేతి చామ్నాయాదింద్రో మాయాభిరిత్యపి ।**
**అజాయమానో బహుధా మాయయా జాయతే తు సః ॥**

కారికలు 24–26లో, గౌడపాదాచార్యులవారు మీమాంసా శాస్త్రాన్ని ఎలా ఉపయోగించాలో చూపిస్తారు. ఇంకో విధంగా చెప్పాలంటే ఈ మీమాంసనే శ్రవణం అనీ, తాత్పర్య నిర్ణయం అనీ అంటారు.

శ్రుతి నిజంగా సృష్టి జరిగిందో లేదో స్పష్టంగా చెప్పలేదు. శ్రుతి ప్రత్యక్షంగా చెప్పినదాన్ని మనం పరోక్షంగా అర్థం చేసుకోవాలి. దీన్ని శ్రుతి అర్థాపత్తి ప్రమాణం అంటారు. అంటే నిశ్చయం ఎలా చేయాలో ఇక్కడ చూపిస్తే, తర్కం ఎలా చూపించాలో కారికలు 27–30లో చూపిస్తారు. శ్రుతి ఎన్నడూ తనను గుడ్డిగా నమ్మమని చెప్పదు. దీన్నే టూకీగా చూస్తే –

కారికలు 24–26 – 23వ కారికలోని నిశ్చితం పదవిచారణ

కారికలు 27–30 – 23వ కారికలోని యుక్తియుక్తం పదవిచారణ

అదెలా చేయాలో ముందే చూశాము. సగం సగం చదవకూడదు. పంచకోశ వివేకం చేసేటప్పుడు, శ్రుతి ఒక్కొక్క కోశాన్ని తీసుకుని, అది ఆత్మ అని ముందు చెప్పి, తర్వాత అది ఆత్మ కాదు అని నిరూపిస్తుంది. చివరిదాకా వస్తే కాని, ఆత్మ ఈ పంచకోశాలకి అతీతం అని అర్థం కాదు. అలా చివరిదాకా రాకుండా ప్రాణమయకోశం దగ్గరే ఆగిపోతే ప్రమాదం.

అలాగే సృష్టి గురించి చెప్పింది విన్నాక, 'ముందుకు సాగండి,' అంటారు గౌడపాదాచార్యులవారు. ముందుకు సాగితే, మనను నిర్భ్రాంతపరచే వాక్యాలను చెబుతుంది ఉపనిషత్తు. ఎందుకంటే తర్వాత వచ్చే వాక్యాలు సృష్టిని నిషేధం చేస్తాయి. గౌడపాదాచార్యులవారు ఇక్కడ ఉటంకించకపోయినా, మనం కైవల్యోపనిషత్తును దృష్టాంతంగా తీసుకుందాము. దానిలో మనకు ఈ విషయం చాలా స్పష్టంగా అర్థమవుతుంది.

**ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ ।**
**ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ ॥** – కైవల్యమ్ 15

ఈ మంత్రంలో బ్రహ్మనుంచి పంచభూతాలు పుట్టాయి అని రెండవ పాదంలోనూ, బ్రహ్మనుంచే ప్రాణం, మనస్సు, ఇంద్రియాలు పుట్టాయని మొదటి పాదంలో వస్తుంది. ఇది సృష్టి ప్రకరణం. బ్రహ్మనుంచి పంచభూతాలు పుట్టాయి అంటే మన ఎదురుగా పంచభూతాలు ఉండాలి కదా. కాని వెంటనే వీటన్నిటినీ నిషేధిస్తుంది.

**న జన్మ దేహేంద్రియ బుద్ధిరస్తి** – కైవల్యమ్ 22
**న భూమిరాపో న చ వహ్నిరస్తి**
**న చాఽనిలో మేఽస్తి న చాంబరం చ** – కైవల్యమ్ 23

నాకు శరీరం లేదు, మనస్సు లేదు, బుద్ధి లేదు అంటే కార్యకరణసంఘాతమే లేదు అంటుంది. అలాగే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం లేవు అని పంచభూతాలను కూడా నిషేధిస్తుంది.

ఆ విధంగా ఉపనిషత్తే జీవసృష్టి, జగత్సృష్టి గురించి ముందు చెప్పి, తరువాత నిషేధిస్తే, దాని అర్థం ఏమిటి? నిజంగా సృష్టి జరగలేదని అర్థం. మిథ్యాసృష్టి జరిగింది; మిథ్యా జగత్తు ఉన్నా లేనట్టే. స్వప్నంలో లక్షలు సంపాదించినా, ఆ డబ్బు లేనట్టే.

ఆ విధంగా ఉపనిషత్తు ముందు సృష్టి గురించి చెప్పినా, తర్వాత దాన్ని నిషేధించటం ద్వారా నిజంగా సృష్టి జరగలేదని చెప్పకనే చెబుతున్నది. దీన్ని అధ్యారోప అపవాద ప్రక్రియ అంటారు. అధ్యారోపంలో సృష్టి జరిగిందని చెప్పి, అపవాదంలో దాన్ని నిషేధిస్తారు. మిథ్యాసృష్టి జరిగినా జరగనట్టే అర్థం. మీమాంస ద్వారా విచారణ చేసి తెలుసుకున్నది –

**మిథ్యాసృష్టిః అస్తి – సత్యసృష్టిః నాస్తి**

ఈ వాక్యం కేవలం కైవల్య ఉపనిషత్తు తాత్పర్యం మాత్రమే కాదు, అన్ని ఉపనిషత్తుల తాత్పర్యం కూడా. అది చూపించటానికి గౌడపాదాచార్యులవారు అనేక ఉపనిషత్తుల నుంచి కొన్ని వాక్యాలను ఉటంకిస్తున్నారు.

ఈ కారికలో ఈ క్రింది పదాల ద్వారా మూడు ఉపనిషత్తుల వాక్యాలను ఉటంకిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. అవి –

1. **నేహ నానేతి** – కఠ 2.1.11
2. **ఇంద్రో మాయాభిరిత్యపి** – బృహదారణ్యకమ్ 2.5.19
3. **అజాయమానో బహుధా విజాయతే** – పురుషసూక్తమ్ 21

ఈ మంత్రాల సారం – నిజంగా సృష్టి జరగలేదు. వీటిని వివరంగా చూద్దాము.

1. **నేహ నానేతి** – దీన్ని విడదీస్తే న ఇహ నానా ఇతి అని వస్తుంది. ఇతి అంటే ఇక్కడితో కఠవాక్యం ముగిసింది అని అర్థం. నిజానికి ఈ వాక్యం పూర్తిగా లేదు. మనం కఠ వాక్యం చూద్దాము.

**నేహ నానాస్తి కించన మృత్యోస్స మృత్యుం గచ్ఛతి**
**య ఇహ నానా ఇవ పశ్యతి** – కఠ 2.1.11

ఇది చాలా ముఖ్యమైన మంత్రం. దీని అర్థం అసలు ద్వైతం లేదు, సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన లేదు. కించన అంటే ఏ కొంచెం కూడా విభజన లేదు అని అర్థం.

మనం గమనించాల్సిన ఇంకొక ముఖ్యవిషయం – ఈ వాక్యం న ఇహ నానా అస్తి లో అస్తి వర్తమానకాలంలో ఉంది. సృష్టికి ముందు నానాత్వం లేదు అనటం లేదు ఉపనిషత్తు. ఇప్పుడు మీ కంటి ఎదురుగా భిన్నత్వాన్ని చూస్తున్నా కుర్చీలు, మనుష్యులు, గురువు, బల్ల– కంటికి కనబడుతున్నా భిన్నత్వం అంతిమసత్యం కాదు అంటున్నది. ఎలాగైతే స్వప్నప్రపంచంలో కనబడే ద్వైతం, స్వప్నంనుంచి లేస్తే ఎలా నిజంకాదో, అలాగే జాగ్రద్ ప్రపంచంలో కనబడే ద్వైతం కూడా తురీయానికి లేస్తే నిజం కాదు.

తాడు–పాము విషయంలో పాము లేదు అని అంటే, మీరు పాముగా చూస్తున్నది నిజం పాము కాదు, అది తాడు గురించిన మూర్తీభవించిన మీ అజ్ఞానమే అని అర్థం. అలాగే జాగ్రదావస్థలో చూసే ద్వైతప్రపంచం నిజం ప్రపంచం కాదు, అది అద్వైతాన్ని గురించిన మూర్తీభవించిన అజ్ఞానమే అని అర్థం.

**అద్వైత అజ్ఞానమేవ ద్వైతరూపేణ భాసతే**

మూర్తీభవించిన అజ్ఞానం ద్వైతం! దీన్ని జీర్ణించుకోవటం చాలా కష్టం. ఎదురుగా ఉన్న వస్తువు ఏమిటి? మూర్తీభవించిన అజ్ఞానం. పదార్థం ఏమిటి? మూర్తీభవించిన అజ్ఞానం. మరయితే సత్యం ఏమిటి? చైతన్యం ఒక్కటే సత్యం. దాన్ని జీర్ణించుకోవటం కష్టమే అయినా చివరికి ఈ అంతిమసత్యానికి రాకతప్పదు.

ఈ అజ్ఞానంనుంచి నిద్ర లేవమంటుంది కఠోపనిషత్తు. జాగ్రద్ పురుషుని దృష్ట్వా స్వప్నప్రపంచం మిథ్య; తురీయం దృష్ట్వా జాగ్రద్ ప్రపంచం మిథ్య. శరీరం దృష్ట్వా జాగ్రద్ ప్రపంచం మహాసత్యం; మనస్సు దృష్ట్వా జాగ్రద్ ప్రపంచం మహాసత్యం; కాని తురీయం దృష్ట్వా అది మిథ్య. అందువల్ల న ఇహ నానా అస్తి కించన అంది ఉపనిషత్తు.

2. **ఇంద్రో మాయాభిరిత్యపి** - ఇతి అపి అంటే ఈ బృహదారణ్యకం వాక్యం కూడా పరమేశ్వరుడు మాయచే అనేక రూపాలు ఉన్నట్టుగా భాసిస్తున్నాడు అంటున్నది.

**రూపగ్ం రూపం ప్రతిరూపో బభూవ తదస్య**
**రూపం ప్రతిచక్షణాయ। ఇంద్రో మాయాభిః**
**పురురూప ఈయతే యుక్తా హి అస్య హరయః**
**శతా దశ ఇతి।** - బృహదారణ్యకమ్ 2.5.19

ఈ మంత్రం సారాంశం ఏమిటి?

**ఇంద్రః** - ఇక్కడ ఇంద్రః అంటే దేవతలకు రాజైన ఇంద్రుడు కాదు. ఇక్కడ ఇంద్రః అంటే పరబ్రహ్మ.

**పురురూప ఈయతే** - ఈ పదాలు మాండూక్య కారికలో లేవు కాని మనం బృహదారణ్యకం నుంచి తెచ్చుకుంటున్నాము. పురురూపః అంటే నానాత్వం, అనేక రూపాలు; ఈయతే అంటే ధరిస్తున్నాడు. రూపం లేని బ్రహ్మ జగత్తులోని అనేక రూపాలుగా అవుతున్నాడు. ఎలా?

**మాయయా** - మాయ ద్వారా. మాయ అంటే ఇంద్రజాలం. ఇంద్రజాలం అంటే సత్యం కానిది. మీరు చూసే ఇంద్రజాల ప్రదర్శనలు గుర్తు తెచ్చుకోండి. ఇంద్రజాలికుడు అనేక మాయలు చేస్తాడు. ఒక స్త్రీని రెండు భాగాలుగా చేసి, రక్తం కారేలా చేసి, మళ్ళీ ఆమెను కలుపుతాడు. ఆమె నవ్వుతూ లేచి కూర్చుంటుంది. నిజంగా ఆమెను రెండుగా కోసి ఉంటే, మళ్ళీ ఆమె నవ్వుతూ లేవటం జరిగే పనేనా? దీన్నే మాయ అంటారు.

మీరు ఒక సాధారణ ఇంద్రజాలికుని మాయను స్వీకరించటానికి సిద్ధమవగా లేనిది మహా ఇంద్రజాలికుడు అయిన పరమాత్మ చేసే మహామాయను స్వీకరించలేరా? ఈ మహా మాయాశక్తివల్ల భగవంతుడు అనేకంగా అయ్యాడు. నిజానికి ఆకాశం, వాయువు, అగ్ని, పద్నాలుగు లోకాలు, మీ శరీరం, మీ భార్య, ఈ గది - ఏమీ లేవు. మరి అయితే ఏం ఉంది? బ్రహ్మ, బ్రహ్మ, బ్రహ్మ మాత్రమే. నమ్మలేకుండా ఉంటే స్వప్నప్రపంచాన్ని గుర్తు తెచ్చుకోండి. అది ఎంత నిజంగా అనిపించినా, మిమ్మల్ని భయపెట్టి పరుగులు తీయించినా, మీరు నిద్రనుంచి లేస్తే, అది గాలికి ఎగిరిపోతుంది.

**3. అజాయమానో బహుధా జాయతే** – పుట్టుకలేని బ్రహ్మ అనేక వస్తువులను సృష్టించాడు అంటుంది పురుషసూక్తం. **అజాయమానో బహుధా విజాయతే** – పురుషసూక్తమ్

**బహుధా విజాయతే** – బ్రహ్మ పదం ఇక్కడ రాలేదు, మనం కలుపుకుంటాము. బహుధా అంటే నానాత్వం; విజాయతే అంటే సృష్టించాడు; అజాయమానః అంటే సృష్టించకుండానే. అంటే బ్రహ్మ సృష్టించకుండానే నానాత్వం ఉన్న ఈ జగత్తును సృష్టించాడు. దీని అర్థం సృష్టించాడు కాని నిజంగా కాదు అని. అదెలా సాధ్యం? జాగ్రద్ పురుషుడు స్వప్నంలో పిల్లవాడికి తండ్రి అయితే, అతను నిజంగా తండ్రి అయినట్టు ఎలా కాదో, అలా బ్రహ్మ జాగ్రద్ ప్రపంచాన్ని సృష్టించినా, నిజంగా సృష్టించినట్టు కాదు.

వీటన్నిటి సారాంశం బ్రహ్మ నిజం సృష్టి చేయలేదు; నిజం జగత్తు రాలేదు. అదెలా సాధ్యం? మీరు సృష్టించిన స్వప్నప్రపంచం నిజం ప్రపంచమా? మీ శక్తిని ఒకసారి పరిశీలించండి! మీరు దేశాన్ని, కాలాన్ని, వస్తువులను సృష్టిస్తారు – అది కూడా సంకల్ప మాత్రం చేతనే. అవన్నీ ఎలా వచ్చాయి? మీ నిద్రాశక్తివల్ల. మీ నిద్రాశక్తికి రెండు శక్తులు ఉంటాయి. అవి ఆవరణశక్తి, విక్షేపశక్తి. ఆవరణశక్తి మీరు మంచంమీద పడుకుని ఉన్నారనే నిజాన్ని కప్పివేస్తుంది. మీ ఆవరణశక్తి ఆ నిజాన్ని కప్పివేశాక, విక్షేపశక్తి అందుకుంటుంది. అదీ మీ మనస్సులో నిక్షిప్తమై ఉన్న వాసనలను మేల్కొల్పి, మీరు ఒక స్వప్నప్రపంచాన్ని సృష్టించేలా చేస్తుంది. అది కాల్పనిక జగత్తు.

వ్యష్టిగా మీ నిద్రాశక్తికి విక్షేపశక్తి ఉంటే సమష్టిగా ఈశ్వరునికి మాయాశక్తి ఉంది. ఆ మాయాశక్తికి ఉన్న విక్షేపశక్తి వల్ల ఈశ్వరుడు ఈ జగత్తును సృష్టిస్తాడు.

ఇక్కడ అప్రస్తుతం అయినా ఒక భేదాన్ని గమనించాలి. వ్యష్టిలో ఆవరణశక్తి, విక్షేపశక్తి రెండూ పనిచేస్తే, భగవంతుని విషయంలో ఆవరణశక్తి పనిచేయదు, విక్షేపశక్తి మాత్రమే పనిచేస్తుంది.

### కారిక 3.25

**సంభూతేరపవాదాచ్చ సంభవః ప్రతిషిధ్యతే ।**
**కో న్వేనం జనయేదితి కారణం ప్రతిషిధ్యతే ॥**

కారిక 24లో మూడు ఉపనిషత్ వాక్యాలను చూశాము. ఇక్కడ ఇంకొక రెండు వాక్యాలను చూస్తాము. ఈ వాక్యాలు కారిక 23లోని **నిశ్చితం** పదం యొక్క విశ్లేషణ అని మర్చిపోకూడదు. ఈ వాక్యాలను సరిగ్గా అర్థం చేసుకోవాలి.

4. **సంభూతేః అపవాదాచ్చ** – అపవాదః అంటే నిషేధం. దేనియొక్క నిషేధం? సంభూతిః – హిరణ్యగర్భయొక్క నిషేధం.

**సంభవః ప్రతిషిధ్యతే** – హిరణ్యగర్భను నిషేధించటం ద్వారా మొత్తం జగత్తునే నిషేధిస్తున్నది ఉపనిషత్తు. సంభవః అంటే సృష్టి; ప్రతిషిధ్యతి అంటే నిషేధించబడుతున్నది. హిరణ్యగర్భ నింద ద్వారా జగత్తును నిందిస్తున్నది ఈశావాస్యోపనిషత్. నింద అంటే నిషేధం అని తీసుకోవాలి.

**అంధం తమః ప్రవిశంతి యేఽ సంభూతిముపాసతే।**
**తతో భూయ ఇవ తే తమః యః ఉ సంభూత్యాగ్ం రతాః** – ఈశావాస్యమ్ 12

ఎవరైతే ప్రకృతి ఉపాసన చేస్తారో వారు చీకటిలోకాలకు వెళతారు; ఎవరైతే హిరణ్యగర్భ ఉపాసన చేస్తారో వారు ఇంకా చీకటిలోకాలకు వెళతారు అంటున్నది ఈశావాస్యోపనిషత్తు. దీని ద్వారా జగత్తు మిథ్య అని ఎలా తెలుస్తుంది?

హిరణ్యగర్భ ఉపాసనను నిందించటం ద్వారా, హిరణ్యగర్భను నిందించినట్టు వస్తుంది. హిరణ్యగర్భను నిందిస్తే మొత్తం జగత్తునే నిందించినట్టు అవుతుంది. అదెలా?

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్య కర్తా భువనస్య గోప్తా ॥** – ముండకమ్ 1.1.1

ఈ ముండక మంత్రం హిరణ్యగర్భ అందరిలోకీ ముందు పుట్టాడు అని అంటున్నది. అంటే హిరణ్యగర్భ మొట్టమొదటి కార్యం. మొట్టమొదటి కార్యాన్నే నిషేధిస్తే, ఆ తర్వాత వచ్చిన జగత్తును ప్రత్యేకించి నిషేధించాల్సిన అవసరం ఏముంది? ఎందుకు ఉపనిషత్తు హిరణ్యగర్భను కాని, మొత్తం జగత్తును కాని నిషేధిస్తున్నది? ఎందుకంటే హిరణ్యగర్భ కాని, జగత్తు కాని సత్యం కాదు కాబట్టి. హిరణ్యగర్భ మిథ్యావస్తువు కాబట్టి, హిరణ్యగర్భ ఉపాసన చేయకుండా సత్యబ్రహ్మజ్ఞానాన్ని పొందండి అంటుంది ఉపనిషత్తు.

ఈ మంత్రంనుంచి మనం గ్రహించాల్సిన సారాంశం ఇది. హిరణ్యగర్భను ఈ మంత్రంలో ఉపనిషత్తు విమర్శిస్తున్నదీ అంటే, హిరణ్యగర్భ మిథ్య; హిరణ్యగర్భ మిథ్య కాబట్టి మొత్తం జగత్తు మిథ్య; మొత్తం జగత్తు మిథ్య కాబట్టి నిజం సృష్టి జరగలేదు. ఎంత చుట్టూ తిరిగి వచ్చామో చూశారా?

5. **కో న్వేనం జనయేదితి** – జీవాత్మ పుడితే, జీవాత్మ అనే కార్యానికి కారణం ఏమిటి? ఇది మామూలు ప్రశ్న కాదు, దీన్ని ఇంగ్లీషులో రిటారికల్ క్వశ్చన్ అంటారు. అంటే కారణం లేదు అనే అర్థం వస్తుంది. ఈ రిటారికల్ క్వశ్చన్‌లో జవాబు ఇమిడివుంటుంది. ఇది బృహదారణ్యకంలోని వాక్యం.

**జాత ఏవ న జాయతే కో న్వేనం జనయేత్పునః** – బృహదారణ్యకం 3.9.28.7

ఈ వాక్యం అర్థం జీవాత్మ ఎన్నడూ పుట్టలేదు. మనం జనన మరణాలకు లోనవుతాము అనే పొరపాటులో ఉన్నాము. ఆ పొరపాటు ఆత్మ అజ్ఞానం వల్ల వచ్చింది. నిజానికి జీవాత్మ నిజంగా పుట్టలేదు. కోను ఏనం జనయేత్ అంటే ఒకవేళ నిజంగా జీవాత్మ పుడితే, దానికి కారణం ఎవరు? అంటే కారణం లేదు అని పరోక్షంగా చెబుతున్నది ఈ ఉపనిషత్తు. అందువల్ల జీవసృష్టి నిజంగా జరగలేదు.

మరి మన ఎదురుగా కనిపిస్తున్న ఈ జగత్తు ఏమిటి? అది పొరపాటు మాత్రమే. స్వప్నప్రపంచం – స్వప్నం 1 అయితే జాగ్రద్ ప్రపంచం స్వప్నం 2 అంతే. ఈ విధంగా కారణాన్ని నిషేధిస్తున్నది ఉపనిషత్తు.

**కారిక 3.26**

**స ఏష నేతి నేతీతి వ్యాఖ్యాతం నిహ్నుతే యతః ।**
**సర్వమగ్రాహ్యభావేన హేతునాఽజం ప్రకాశతే ॥**

6. **స ఏష నేతి నేతీతి** – నేతి నేతి పద్ధతి ద్వారా బృహదారణ్యకోపనిషత్ మూర్తామూర్తా ప్రపంచాన్ని ఇది ఆత్మ కాదు, ఇది ఆత్మ కాదు అని నిషేధిస్తున్నది. ఇది చాలా ముఖ్యమైన మంత్రం.

ఆత్మ లక్షణాన్ని తెలుసుకునే ముఖ్యమైన పద్ధతి ఈ నేతి నేతి పద్ధతి.

**స ఏష నేతి నేత్యాత్మాఽగృహ్యో న హి గృహ్యతేఽశీర్యో న హి శీర్యతేఽ సంగో**
**న హి సజ్యతేఽసితో న వ్యథతే న రిష్యతి** – బృహదారణ్యకమ్ 3.9.26

**స ఏష నేతి నేత్యాత్మా** – న ఇతి న ఇతి ఆత్మా అంటూ అన్నింటినీ నిషేధించుకుంటూ వస్తుంది ఉపనిషత్తు. బృహదారణ్యకోపనిషత్ ముందు జగత్తును మూర్తప్రపంచంగానూ, అమూర్తప్రపంచంగా పరిచయం చేస్తుంది. మూర్తప్రపంచం అంటే కంటికి కనబడే, ప్రత్యక్ష ప్రపంచం. అంటే ఎదురుగా కనబడే జగత్తు, వ్యష్టి శరీరం. అమూర్తప్రపంచం అంటే కంటికి కనబడని, సూక్ష్మ ప్రపంచం. ఉదాహరణకు తిరిగే ఫ్యాను కనబడుతుంది కాని దాని వెనకనుండి దాన్ని తిప్పే విద్యుచ్ఛక్తి కనబడదు.

అలాగే కనబడే మన శరీరం వెనక, కనబడని మనస్సు, ఆలోచనలు, భావోద్రేకాలు ఉన్నాయి కాని అవి కనబడవు. జ్ఞానం కూడా కనబడదు.

గౌడపాదాచార్యులవారి ఈ కారికలు మీకు అర్థం అవుతున్నాయో లేదో ఎదుటివారికి కనబడదు, తెలియదు.

దీన్నే సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే స్థూలశరీరం + స్థూలప్రపంచం మూర్తప్రపంచం; సూక్ష్మశరీరం + సూక్ష్మప్రపంచం, కారణశరీరం+కారణప్రపంచం అమూర్తప్రపంచం; అగ్ని, జలం, పృథివి మూర్తప్రపంచం; ఆకాశం, వాయువు అమూర్తప్రపంచం.

బృహదారణ్యకోపనిషత్ ఈ మూర్తామూర్త ప్రపంచాలను పరిచయం చేసి, ఇవి సత్యం కాదు అని కొట్టివేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అనుభవంలోకి వచ్చేది ఏదీ - అది మూర్తం అయినాసరే, అమూర్తం అయినా సరే - ఆత్మ కాదు.

స ఏష నేతి నేత్యాత్మా - స ఏష అంటే ఈ ఆత్మ. మొదటి న ఇతి మూర్తప్రపంచాన్ని, రెండవ న ఇతి అమూర్త ప్రపంచాన్ని నిషేధిస్తాయి. ఆబ్జెక్టుగా కనబడేది ఏదీ ఆత్మకాదు; అనుభవంలోకి వచ్చేది ఏదీ ఆత్మకాదు. నిర్వికల్ప సమాధిలో అనుభవంలోకి వచ్చే అసాధారణ అనుభవం కూడా ఆత్మకాదు. ఎందుకు? అది అసాధారణమే అయినా, అనుభవంలోకి వచ్చింది కాబట్టి ఆత్మకాదు. ఏ అనుభవమైనా సరే అది ఒకకాలంలో వస్తుంది; ఒకకాలంలో పోతుంది. 'నాకు నిర్వికల్పసమాధిలో ఆనందం **కలిగింది**,' అని భూతకాలం పదం వాడతారు మీరు. అలా భూతకాల అనుభవం ఆత్మకాదు.

అలా అనుభవంలోకి వచ్చినదేదీ ఆత్మ కాకపోతే, ఆత్మ అనుభవం ఎలా పొందాలి? **సర్వమగ్రాహ్యభావేన హేతునా** - ఆత్మ అనుభవంలోకి వచ్చేది కాదు. బృహదారణ్యకంలోని పదాలు చూద్దాము.

**అగృహ్యో న హి గృహ్యతే** - ఆత్మ అగృహ్యం. ఎందుకంటే ఆత్మ గ్రహించబడటం లేదు, ఎందుకంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి. అంటే ఆత్మ సర్వప్రమాణ అగోచరం.

**అశీర్యో న హి శీర్యతే** - ఆత్మ శిథిలమవదు. అపక్షీయరహితం. ఆత్మ నిర్వికారం.

**అసంగో న హి సజ్యతే** - ఆత్మ అసంగం.

**న వ్యథతి** - ఆత్మ దేశకాలాతీతం.

**న రిష్యతి** - ఆత్మకు మరణం లేదు, ఆత్మ నిత్యం.

ఆత్మ అగ్రాహ్యం- ఆత్మ ఆబ్జెక్టు కాదు కాబట్టి, అనుభవంలోకి రాదు. అనుభవించే నువ్వే ఆత్మవు.

### అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ

ఆత్మ అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు, అలా అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టులన్నింటినీ నేతి, నేతి అంటూ ఉపనిషత్తు నిషేధించుకుంటూ వస్తుంది. అనుభవంలోకి వచ్చేవన్నింటినీ నిషేధించుకుంటూ వస్తే మిగిలేది ఏమిటి? శూన్యం అనకూడదు. శూన్యం ఉంది అని

ఒకదానికి తెలుస్తున్నది. శూన్యాన్ని చూడగలుగుతున్నదే, ఆబ్జెక్టు కాని చైతన్యం. అదే **సాక్షిచైతన్యం**.

అందువల్ల శూన్యంలో వెతకకూడదు. నిర్వికల్పసమాధిలో మనస్సును శూన్యం చేస్తే ఆత్మ అనుభవం కలుగుతుంది అనుకుంటారు. శూన్యం చేస్తే ఆత్మ అనుభవం కలగదు. శూన్యం ఉంది అని దేనికైతే తెలుస్తున్నదో అది ఆత్మ. టార్చ్‌లైట్‌ను చేతిలో పట్టుకుని, దానికోసం ఎలా వెతకలేరో, అలా శూన్యంలో ఆత్మకోసం వెతకలేరు. ఎందుకంటే ఆత్మను ఆబ్జెక్టుగా చూడలేరు, ఆబ్జెక్టును చూసే సబ్జెక్టే ఆత్మ కాబట్టి.

**అజం ప్రకాశతే** – అజం అంటే ఆత్మతత్త్వం. అజం అంటే పుట్టుక లేనిది. పుట్టుకలేని, శాశ్వతమైన ఆత్మతత్త్వం ఎప్పుడూ ఉంటుంది. ఆబ్జెక్టును ఒకకాలంలోనే చూడగలము, కాని ఆ ఆబ్జెక్టును చూసే సబ్జెక్టు ఎప్పుడూ ఉంటుంది, చైతన్యంగా ఎప్పుడూ ఉంటుంది.

మీరు స్వామీజీ బోధ వింటున్నప్పుడు, ఎవరైనా మిమ్మల్ని క్లాసులో ఉన్నావా అని అడిగితే, మీరు క్షణం కూడా ఆలోచించకుండా ఉన్నానని చెబుతారు. మీరు ఉన్నారో లేదోననే సందేహమే రాదు మీకు. స్వామీజీ బోధ చేసే ఆ గంటసేపూ మీ ఆలోచనలు స్వామీజీ బోధకే అంకితమయిపోతాయి, మీ గురించి ఆలోచించవు. మీరు ఉన్నారో లేదో ఆలోచించకుండా మీకు తెలియజేసేదాన్ని స్వయంప్రకాశక చైతన్యం అంటారు. అజం, స్వయంప్రకాశక చైతన్యం ప్రకాశతే – అన్ని దశల్లోనూ ఉంటుంది ఈ చైతన్యం. ఏడవ మంత్రంలో దీన్నే **ఏకాత్మప్రత్యయసారం**గా చూశాము.

**కారిక 3.27**

**సతో హి మాయయా జన్మ యుజ్యతే న తు తత్త్వతః ।**
**తత్త్వతో జాయతే యస్య జాతం తస్య హి జాయతే ॥**

**యుక్త్యా జగత్ సృష్టి నిషేధః కారికలు 24-26** – తన అజాతివాదనను సమర్థిస్తూ, గౌడపాదాచార్యులవారు ఆరు శ్రుతివాక్యాలను ఉటంకించారు. ఇప్పుడు 27-30ల్లో తర్కం ద్వారా నిరూపించబోతున్నారు.

**సతో హి మాయయా జన్మ (భవతి)** – జన్మ అంటే జగత్తుయొక్క సృష్టి. సతః అంటే బ్రహ్మనుంచి. బ్రహ్మనుంచి ఈ జగత్తుయొక్క సృష్టి జరిగింది అనాలంటే, దానికి ఒక్కటే మార్గం ఉంది.

మాయయా – సృష్టి నిజంగా జరగలేదు, జరిగినట్టుగా ఉంది అనాలి.

**న తు తత్త్వతః** – బ్రహ్మనుంచి నిజం సృష్టి అసలు సాధ్యం కాదు.

బ్రహ్మనుంచి నిజం సృష్టి సాధ్యం కాదు అని ఒకపక్క అంటూనే, వాదన కోసం నిజంగా సృష్టి జరిగింది అనుకుందాం అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఒకవేళ నిజంగా జరిగితే, దాని పర్యవసానం ఏమిటి? జగత్తు నిజంగా కార్యమయితే, బ్రహ్మ నిజంగా కారణమవ్వాలి. ముందేమన్నాము? బ్రహ్మ నిజం కారణం కాదు కాబట్టి, నిజం కార్యం, బ్రహ్మనుంచి రాలేదు అన్నాము. ఇప్పుడేమంటున్నాము? ఒకవేళ జగత్తు నిజం కార్యమయితే, అప్పుడు బ్రహ్మ నిజం కారణమవాలి. అయితే ఏమిటి సమస్య?

గౌడపాదాచార్యులవారు బ్రహ్మ నిజం కారణమయితే, బ్రహ్మ మార్పులకు లోనవ్వాలి అంటున్నారు. ఎందుకంటే కారణం నుంచి కార్యం వచ్చినప్పుడు, కారణం మార్పుకు లోనవుతుంది. ఉదాహరణకు విత్తనం నుంచి చెట్టు వచ్చినప్పుడు, విత్తనం మారుతుంది. ఒక తల్లిగర్భంలో శిశువు ఉన్నప్పుడు, ఆమె గర్భం దాల్చినప్పటినుంచి ఆమె అనేక మార్పులకు లోనవుతుంది. ఆమె లావెక్కుతుంది, పొట్ట పెరుగుతుంది; పాలు పెరుగుగా మారినప్పుడు పాలు మారుతాయి. అలా ఏ కారణం తీసుకున్నా అది మార్పుకు లోనవుతుంది. దాన్ని సవికారం అంటారు.

కారణం సవికారం అయితే, జగత్తు అనే కార్యానికి బ్రహ్మ కారణం అయితే, ఈ నియమం ప్రకారం బ్రహ్మ కూడా సవికారం అవాలి. సవికారం అయితే షడ్వికారాలకు లోనవాలి. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. ఈ షడ్వికారాలలో ఒక వికారం జాయతే – అంటే పుట్టటం. అంటే బ్రహ్మ పుట్టాలి. తక్కిన కారణాలు ఇంకొక కారణం నుంచి పుడతాయి. బిడ్డకు జన్మనిచ్చే తల్లి, ఇంకొక తల్లి నుంచి పుడుతుంది. చెట్టుకు కారణమయిన విత్తనం, ఇంకొక చెట్టునుంచి వస్తుంది. ఆ సూత్రం ప్రకారం బ్రహ్మ కారణమయితే, బ్రహ్మ కూడా కార్యమవాలి.

**బ్రహ్మ కార్యం కారణత్వాత్ మాతృవత్**

ఎక్కడ నుంచి ఎక్కడికొచ్చామో చూశారా? బ్రహ్మ కారణమయితే, బ్రహ్మకు జన్మ ఉండాలి. బ్రహ్మ కూడా కార్యం అవాలి. ఆ కారణం మళ్ళీ ఇంకొక కారణంనుంచి వచ్చిన కార్యమవాలి. అలా అనంతంగా సాగుతుంది. దానికి అంతూపొంతూ ఉండదు. అంతేకాదు, బ్రహ్మకు కూడా పుట్టుక ఉంటే, మరణమూ ఉంటుంది. సంసారబంధమూ ఉంటుంది.

మనమేమో ఈ జననమరణాల వృత్తం ఒక్క మానవజాతికే ఉందనుకుంటున్నాము కాని ఈ బృహస్పతి బ్రహ్మను కూడా మహాసంసారిని చేస్తున్నాడు. బ్రహ్మ ఈ చావు, పుట్టుకల వృత్తానికి అతీతంగా ఉండాలంటే, బ్రహ్మ కారణం కాలేదు అని అర్థం చేసుకోవాలి. లేదు బ్రహ్మకు కారణం హోదా ఇచ్చితీరాలంటే, ఇవ్వండి, కాని మిథ్యాకారణం అని పక్కన కలపండి.

**తత్త్వతో జాయతే యస్య** – ఒకవేళ బ్రహ్మ నిజంగా సృష్టి చేస్తే, బ్రహ్మే,

**జాతం తస్య హి జాయతే** – కార్యం అవాలి. జాతం అంటే కార్యం. అందువల్ల బ్రహ్మ కారణం అనేది తార్కికంగా చెల్లదు.

### కారిక 3.28

**అసతో మాయయా జన్మ తత్త్వతో నైవ యుజ్యతే ।**
**వంధ్యాపుత్రో న తత్త్వేన మాయయా వాఽపి జాయతే ॥**

ముందు కారికలో ఏమన్నారు? సత్ బ్రహ్మ నిజం సృష్టి చేయలేదు, ఒకవేళ సత్‌బ్రహ్మ సృష్టి చేశాడు అంటే, అది మిథ్యాసృష్టి అవుతుంది అన్నారు.

ఇప్పుడు, ఈ కారికలో, అసత్ వస్తువునుంచి, నిజం సృష్టీ రాలేదు, మిథ్యాసృష్టీ రాలేదు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. సత్‌వస్తువు నుంచి మిథ్యాసృష్టి అన్నా వస్తుంది కాని, అసత్ వస్తువునుంచి అది కూడా రాలేదు.

**అసతః** – అసత్‌నుంచి.

ఈ వాదన శూన్యవాదుల వాదనను ఖండిస్తుంది. ఈ శూన్యవాదులు జగత్తు బ్రహ్మ నుంచి రాలేదు, శూన్యంనుంచి వచ్చింది అంటారు. వీరు బౌద్ధమతంలో ఒక తెగకు చెందినవారు. ఉనికి లేని వస్తువునుంచి,

**జన్మ నైవ యుజ్యతే** – జగత్‌యొక్క సృష్టి ఎన్నటికీ సాధ్యం కాదు. ఎటువంటి సృష్టి?

**మాయయా (వా) తత్త్వతః (వా)** – మాయయా అంటే మిథ్యాసృష్టి; తత్త్వతః అంటే నిజం సృష్టి. ఉనికి లేని వస్తువునుంచి మిథ్యాసృష్టి రాలేదు, నిజం సృష్టీ రాలేదు. దానికొక ఉదాహరణ చెబుతున్నారు.

**వంధ్యాపుత్రో న తత్త్వేన మాయయా వాఽపి జాయతే** – వంధ్యాపుత్రుడు అంటే గొడ్రాలి కొడుకు. గొడ్రాలుకు కొడుకు నిజంగానూ పుట్టలేదు, మిథ్యగాను పుట్టలేదు. అలాగే, కారణం సత్ అన్నా, అసత్ అన్నా నిజం సృష్టి సత్‌బ్రహ్మనుంచీ రాలేదు, అసత్ వస్తువునుంచీ రాలేదు.

అందువల్ల నిజం సృష్టి జరగలేదు అనాలి లేదా సృష్టి నిజంగా జరగలేదు అనాలి. దీన్ని **అజాతివాదము** అంటారు.

### కారిక 3.29

**యథా స్వప్నే ద్వయాభాసం స్పందతే మాయయా మనః ।**
**తథా జాగ్రద్ద్వయాభాసం స్పందతే మాయయా మనః ॥**

గౌడపాదాచార్యులవారు, మనం చూస్తున్న ఈ జగత్తు, బ్రహ్మనుంచి వచ్చిన ఈ జగత్తు మిథ్య అని తార్కికంగా నిరూపించారు.

**సందేహం –** గౌడపాదాచార్యులవారు నిజం సృష్టి జరగలేదని, అంతకుముందు శ్రుతి ద్వారానూ, ఇప్పుడు తార్కికంగానూ నిరూపించినా మన బుద్ధి దాన్ని అంత తేలికగా స్వీకరించలేదు. ఎందుకంటే ఈ జగత్తు కంటికి ఎదురుగా కనిపిస్తున్నది, స్పష్టంగా ఉంది, ప్రయోజనకరంగా ఉంది, సమస్యలను కూడా సృష్టిస్తున్నది. ఇంత స్పష్టంగా కనబడుతూ, ప్రయోజనకరంగా ఉంటే, సుఖదుఃఖాలను కలుగజేస్తున్న జగత్తును మిథ్యగా ఎలా త్రోసిపుచ్చగలము? దీన్ని అంత తేలికగా జీర్ణించుకోలేము. మనలాంటి మామూలు మనుష్యులే కాదు, గొప్ప దార్శనికులు కూడా జీర్ణించుకోలేరు. ఇదంతా కాల్పనికం అంటారు.

**జవాబు –** గౌడపాదాచార్యులవారు వీరి వాదనను ఒప్పుకోరు. జగత్తు స్పష్టంగా, ప్రయోజనకరంగా, సుఖదుఃఖాలను కలిగించేదిగా ఉన్నా కూడా దాన్ని సత్యంగా తీసుకోలేము అంటున్నారు. ఎందుకంటే మిథ్యాజగత్తు కూడా స్పష్టంగా, ప్రయోజనకరంగా, సుఖదుఃఖాలను కలుగజేసేదిగా ఉండవచ్చు. ఈ విషయం రెండవ అధ్యాయంలో కూడా చూశాము. జగత్తుకు ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది అందువల్ల జగత్తు సత్యం అని రెండవ అధ్యాయంలో చేసిన వాదనను స్వప్నప్రపంచతో పోల్చి కొట్టివేయటం జరిగింది.

స్వప్నప్రపంచానికి కూడా, స్వప్నంలో ఉన్నంతసేపూ ఈ నాలుగు లక్షణాలూ ఉంటాయి. దానికి కూడా ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది. నిజానికి స్వప్నప్రపంచంలో, స్వప్నప్రపంచంలోని వస్తువులే ఉపయోగపడతాయి, జాగ్రద్ ప్రపంచంలోని వస్తువు కాదు. అక్కడ దాహం వేస్తే, స్వప్నంలోని నీళ్ళే తాగాలి, జాగ్రద్ ప్రపంచంలో మంచం పక్కన నీళ్ళున్నా త్రాగలేరు. అలాగే స్వప్నప్రపంచంలో జ్వరం వస్తే, అక్కడి మందులే వేసుకోవాలి, జాగ్రద్ ప్రపంచంలోవి కాదు.

స్వప్నప్రపంచం కూడా సుఖదుఃఖాలను కలుగజేస్తుంది. అంతమాత్రాన అది నిజం అని చెప్పలేము. ఇదే సూత్రం జాగ్రద్ ప్రపంచానికి కూడా వర్తిస్తుంది. జాగ్రద్ ప్రపంచం జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ సత్యంగా ఉంటుంది. కాని ఒకసారి స్వప్నంలోకి జారుకుంటే జాగ్రద్ ప్రపంచం మిథ్య అవుతుంది. స్వప్నం నుంచి లేస్తే స్వప్నప్రపంచం మిథ్య అవుతుంది. అంటే ఏ అవస్థలో ఉంటే ఆ ప్రపంచమే సత్యం. జాగ్రద్ పురుషునికి స్వప్నం మిథ్య; స్వాప్నికునికి అసలు జాగ్రద్ ప్రపంచం అనేది ఒకటుందనే తెలియదు. సుషుప్తిలోకి జారుకుంటే, ఈ రెండు ప్రపంచాలూ మిథ్య అవుతాయి.

**యథా స్వప్నే** – ఎలాగైతే స్వప్నావస్థలో,

**మనః ద్వయాభాసం స్పందతే** – మనస్సు మిథ్యాద్వైతాన్ని చూస్తుందో,

**మాయయా** – ఈ ద్వైతాన్ని తన నిద్రకున్న మాయాశక్తివల్ల చూస్తుంది. స్వప్నప్రపంచంలో ఉన్నంతసేపు సత్యమే అనుకుంటుంది. దాన్నుంచి లేచాక అది నిజంకాదని తెలుసుకుంటుంది.

**తథా** – అదే విధంగా. స్వప్నంలో ఎలా జరుగుతుందో, జాగ్రదావస్థలో కూడా అదే కథ కొనసాగుతుంది అంటున్నారు గౌడపాదాచార్యులవారు. ఛానెల్ మారుతుందంతే. ఛానెల్ ఒకటి – స్వప్నప్రపంచం; ఛానెల్ రెండు – జాగ్రద్ ప్రపంచం.

**జాగ్రద్** – జాగ్రదావస్థలో కూడా

**మనః స్పందతే** – మనస్సు చూస్తుంది. దేన్ని?

**ద్వయాభాసమ్** – ద్వైతాన్ని చూస్తుంది. ఎలా?

**మాయయా** – మాయవల్ల చూస్తుంది.

ఈ స్వప్న, జాగ్రదావస్థలు కాకుండా, ఇంకొక అవస్థ ఉందనుకుందాము. కొంతమంది మోక్షం అంటే స్వర్గలోకానికి వెళ్ళటం అనుకుంటారు. అందువల్ల స్వర్గలోకంలో ఇంకొక శరీరంతో, ఇంకొక దేశంలో, ఇంకొక కాలంలో ఉన్నాకూడా అక్కడ కూడా ద్వైతాన్నే చూస్తారు. అలాగే కైలాసంలో కూడా ద్వైతాన్నే చూస్తారు.

ఏ ద్వైత అనుభవం సత్యం? ఈ ప్రశ్న వేశారంటేనే, మీరు ఈ బోధను సరిగ్గా వినలేదని అర్థం. ముందు వాక్యంలో ఏమన్నాం? ద్వైత అనుభవాలన్నీ మిథ్య అన్నాము. ఇది విని కూడా వైకుంఠంలోని అనుభవం సత్యమా, మిథ్యా అని అడిగితే, దానికి జవాబు చెప్పకుండా, మీరు వారిని ఎదురు ప్రశ్నించాలి. వైకుంఠంలోని అనుభవం ద్వైతమా, కాదా? వైకుంఠం అనుభవం ద్వైతం అయితే, అది మిథ్యే! కైలాసం మాటేమిటి? దానికీ ఇదే జవాబు. ఆ మాటకొస్తే బ్రహ్మలోకానికి కూడా ఇదే జవాబు. ఈ సత్యాన్ని జీర్ణించుకోవటం కష్టమే అయినా, గౌడపాదాచార్యులవారి కారికలను అర్థం చేసుకోవాలంటే, దీన్ని జీర్ణించుకోకతప్పదు. అందువల్ల ఏ ద్వైత అనుభవం సత్యం అనే ప్రశ్నే తప్పు.

> **యత్ర నాన్యత్ పశ్యతి నాన్యత్ శృణోతి**
> **నాన్యత్ విజానాతి స భూమా** – ఛాందోగ్యమ్ 7.24.1

అద్వైతం మాత్రమే సత్యం. మరి అయితే ఈ అద్వైతాన్ని అనుభవించటం ఎలా? ఇంకొక ప్రశ్న. ఒకవేళ మీరు నాకు నిర్వికల్ప సమాధిలో బ్రహ్మ అనుభవం కలిగింది, అని చెబితే అది కూడా ద్వైతమే. ఎందుకంటే అద్వైతంలో సబ్జెక్ట్–ఆబ్జెక్ట్ విభజన లేదు. అందువల్ల బ్రహ్మ ఆబ్జెక్టుగా అనుభవంలోకి వచ్చే వస్తువు కాదు. అద్వైతం అంటే ద్వైతాన్ని త్రోసిపుచ్చటమే!

ద్వైత మిథ్యాత్వ నిశ్చయః ఏవ అద్వైత ప్రాప్తిః

అందువల్ల బ్రహ్మ అనుభవం కోసం అర్రులు చాచకండి! బ్రహ్మను ఆబ్జెక్టుగా చూడలేరు. ఒకవేళ ఆబ్జెక్టుగా చూశాము అంటే – అది ద్వైతం అవుతుంది కాని బ్రహ్మ అవదు. అన్ని ద్వైత అనుభవాలూ మిథ్య మాత్రమే – స్పందతే మాయయా మనః.

**కారిక 3.30**

**అద్వయం చ ద్వయాభాసం మనస్స్వప్నే న సంశయః ।**
**అద్వయం చ ద్వయాభాసం తథా జాగ్రన్న సంశయః ॥**

ద్వైత మిథ్యాత్వ నిశ్చయాన్ని ఈ కారికతో ముగిస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

**అద్వయం మనః (ఏవ)** – అద్వయ మనస్సే,

**ద్వయాభాసం స్వప్నే** – స్వప్నంలో ద్వైతంగా భాసిస్తోంది. స్వప్నప్రపంచంలో మనం చూసే ప్రతిదీ ఆలోచన తప్ప ఏమీ కాదు; ఆలోచన మనస్సు తప్ప ఏమీ కాదు. అంటే ఒకటే మనస్సు అనేకంగా భాసిస్తోంది. ఒకే మనస్సునుంచి స్వప్నసముద్రం, స్వప్నపులి, స్వప్నవృక్షం అన్నీ వచ్చాయి. అవి నిజంగా వచ్చాయా? నిజంగా మనస్సు వాటిగా మారితే, మనం మళ్ళీ మర్నాడు పొద్దున్న లేవలేము. మనం నిద్ర లేవగానే అవన్నీ మనలో లయమయిపోతాయి. అంత పెద్ద సముద్రం కూడా మనస్సులో లయమయిపోతుంది. అంటే అది మనస్సునుంచి వచ్చిన ఒక ఆలోచన మాత్రమే. అద్వయ మనః (ఏవ) ద్వయాభాసం స్వప్నే – స్వప్నంలో ద్వైతంగా కనబడుతుంది.

**న సంశయః** – ఇందులో ఏమాత్రం సందేహం లేదు. ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే,

**అద్వయం (ఏవ)** – అద్వయ బ్రహ్మే,

**తథా జాగ్రద్ ద్వయాభాసం** – జాగ్రత్ప్రపంచంలోని ద్వైతంగా భాసిస్తున్నాడు.

**న సంశయః** – అందులో ఏమాత్రం సందేహం లేదు.

దీనితో నాలుగవ అంశం అయిపోయింది. ఈ అంశంలో జీవ, జగత్తులను శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా నిషేధించుకు వచ్చారు గౌడపాదాచార్యులవారు.

ఈ రెండవ అంశం సారం టూకీగా చూస్తే, సృష్టిగానీ, జగత్సృష్టి గానీ నిజంగా జరగలేదు. దీన్ని ఇంకా కుదించితే అసలు సృష్టే జరగలేదు. అంటే కార్యమే లేదు; కార్యమే లేదు అంటే బ్రహ్మ కారణమే కాదు. బ్రహ్మ కారణమే కాకపోతే, ఏమిటి?

**కార్యకారణ విలక్షణం బ్రహ్మ**

ఈ కార్యకారణ విలక్షణ బ్రహ్మనే అద్వైతం అనీ, తురీయం అనీ ఉపనిషత్తు ఏడవ మంత్రంలో అంది. అందులో తురీయాన్ని **చతుర్థం మన్యన్తే** అంది.

అద్వైతం = కార్యకారణ విలక్షణమ్.

ఇక్కడితో అద్వైతసిద్ధి అయిపోయింది. ఇప్పుడు ఇంకొక అంశంలోకి అడుగు పెట్టబోతున్నాము.

**కారిక 3.31**

**మనోదృశ్యమిదం ద్వైతం యత్కించిత్సచరాచరమ్ ।**
**మనసో హ్యమనీభావే ద్వైతం నైవోపలభ్యతే ॥**

3. **ఆత్మజ్ఞానం – కారికలు 31–39**

ఇప్పుడు గౌడపాదాచార్యులవారు సంసారకారణాన్ని, దాని పరిష్కారాన్ని చర్చించ బోతున్నారు. **దశ 1 – ద్వైతదర్శనం – సంసారం అంటే ఏమిటి?**

అద్వైతం సత్యం, ద్వైతం మిథ్య అనే విషయం తెలియక, ద్వైతాన్ని సత్యంగా తీసుకోవటమే సంసారం. అద్వైతదర్శనం చేయకుండా, ద్వైతదర్శనం చేయటమే సంసారం.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

రెండవది ఉంటే భయం వేస్తుంది అని ఉపనిషత్తులన్నీ ఘోషిస్తున్నాయి. ద్వైతం ఉంటే సంసారం ఉంటుంది. ఎందుకంటే రాగ–ద్వేషాలు వస్తాయి; ప్రవృత్తి–నివృత్తులు వస్తాయి.

మనకు రాగం ఉన్న వస్తువు వైపు పరుగులు తీస్తాము. దాన్ని ప్రవృత్తి అంటారు. మనకు ద్వేషం పుట్టించే వస్తువునుంచి దూరంగా పారిపోతాము. దాన్ని నివృత్తి అంటారు. మన జీవితమంతా ఎటో అటు పరుగులు తీయటంతోనే సరిపోతుంది. ఈ పరుగులు అనేక కర్మలకు దారితీస్తాయి. కర్మలు, వాటిని వెన్నంటే కర్మఫలాలను తోడ్కొని వస్తాయి. ఇదంతా కలిపి సంసారానికి ఒక మార్గం.

ఇంకొక మార్గం చూస్తే ద్వైతం ఉన్నచోట విభజన ఉంటుంది. విభజన ఉన్నచోట దేశ, కాల పరిచ్ఛేదం ఉంటుంది. దేశకాల పరిచ్ఛేదం ఉన్నచోట అశాశ్వతత్వం ఉంటుంది; అశాశ్వతత్వం ఉన్నచోట అభద్రతాభావన ఉంటుంది. అభద్రతాభావన అంటే సంసారం.

సంసారం అంటే ఆ విధంగా రాగద్వేషాలు అనవచ్చు; ప్రవృత్తి–నివృత్తి అనవచ్చు; జనన–మరణ వృత్తం అనవచ్చు; దేశకాల పరిమితులు అనవచ్చు. నిర్వచనం ఏదైనా వీటన్నిటికీ మూలకారణం – ద్వైతదర్శనం. ఈ ద్వైతదర్శనం ఎందుకు అవుతోంది? అద్వైత అజ్ఞానంవల్ల.

ఈ ద్వైతదర్శనం స్వప్నంలో కూడా అవుతుంది. అందువల్ల స్వప్నం కూడా భయపెడుతుంది.

**ద్వైతదర్శనం – సంసారకారణం; అద్వైతదర్శనం – మోక్షకారణం**

జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో ద్వైతదర్శనం అవుతున్నది. ఈ రెండు అవస్థలూ మనను భయపెడుతున్నాయి, పరుగులు తీయిస్తున్నాయి. కాని సుషుప్తిలోకి జారుకునేసరికి, ద్వైత దర్శనం కూడా మాయమవుతుంది. అక్కడ ఉన్నది అద్వైతమే. అక్కడ సంసారం లేదు.

**అహరహర్ బ్రహ్మ గమయతి** అంటుంది బృహదారణ్యకం. ప్రతిరాత్రీ ఆనందాన్ని అనుభవిస్తాము సుషుప్తిలో. మనకు మోక్షంలో కలిగే ఆనందాన్ని చవిచూసేలా చేస్తుంది సుషుప్తి. అంటే ద్వైతం ఉంటే సంసారం ఉంటున్నది; ద్వైతం లేకపోతే సంసారం లేదు కాబట్టి, **ద్వైతమే సంసారకారణం** అని తెలుస్తున్నది.

**దశ 2 – మనసే కారణం**

ముందేమన్నాం? ద్వైతదర్శనమే సంసారకారణం అన్నాము. ఇప్పుడు దీన్ని ఇంకా లోతుగా విశ్లేషిస్తే, ద్వైతదర్శనం మనస్సు పనిచేస్తున్నప్పుడే అవుతున్నదని అర్థం అవుతుంది. జాగ్రదావస్థలో మనస్సు పూర్తిగా విచ్చుకున్న పువ్వులాగా ఉంటుంది. అన్ని ఇంద్రియాల సహాయంతో జాగ్రద్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతుంది. స్వప్నావస్థలో మనస్సు సగం విచ్చుకున్న పువ్వులా ఉంటుంది. అంటే ఇంద్రియాలు పనిచేయవు కాని మనస్సుయొక్క చిత్తం పనిచేస్తుంది. ఆ చిత్తంలో నిక్షిప్తమై ఉన్న వాసనల ద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తుంది. కాని సుషుప్తికి వచ్చేసరికి మనస్సు మొగ్గలా ఉంటుంది. అంటే మనస్సు కూడా పడుకుంటుంది. మనస్సుయొక్క చిత్తం, మనస్సు, బుద్ధి అహంకారం – ఏదీ పనిచేయవు.

దీన్నిబట్టి మనకు అర్థమైనది ఏమిటి? సుషుప్తిలో మనస్సు కూడా పడుకున్నప్పుడు ద్వైతప్రపంచమూ లేదు, దానివల్ల ఏర్పడిన సంసారమూ లేదు. కాని మనస్సు పనిచేస్తున్న జాగ్రత్, స్వప్నావస్థల్లో ద్వైతమూ ఉంది, సంసారమూ ఉంది. దీనివల్ల మనం ఏర్పరచే ఉపసిద్ధాంతం – మనస్సు మేలుకుని ఉంటే సమస్య ఉంది, మనస్సు పడుకుని ఉంటే సమస్య లేదు. అందువల్ల **మనస్సే సంసారానికి కారణం.**

**మనః ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః –** అమృతబిందు ఉపనిషత్ 2

అందువల్ల పాపం జగత్తును నిందించి లాభం లేదు. మీరు గాఢనిద్రలో ఉండగా, మీ పక్కన కొండచిలువ ఉన్నాకూడా మీకు భయమేయదు.

ఎక్కడ మనస్సు ఉంటే అక్కడ ద్వైతం, సంసారం ఉంది. ఎక్కడ మనస్సు లేదో అక్కడ ద్వైతమూ లేదు, సంసారమూ లేదు. **మనోనాశేసతి ద్వైతం నైవ ఉపలభ్యతే.**

అందువల్ల మోక్షం పొందాలనుకుంటే, మీ మనస్సును నియంత్రించుకోవాలి. మీరు జగత్తును నియంత్రించనవసరం లేదు; మీ పిల్లలను నియంత్రించనవసరం లేదు; మీ క్రింద ఉన్న ఉద్యోగులను నియంత్రించనవసరం లేదు. మీ పనివారిని నియంత్రించనవసరం లేదు. ఇవన్నీ సాధ్యమయ్యే పనులు కూడా కాదు. మోక్షం అంటే మనోజయం. మనోనాశనం వేరు, మనోజయం వేరు. మనోజయం అంటే మనస్సు మిథ్య అని అర్థం చేసుకోవటం. ఈ నేపథ్యంతో ఈ శ్లోకం చూద్దాము.

**యత్కించిత్ సచరాచరమ్** – ఈ ద్వైతప్రపంచంలో ఉన్న చర, అచర వస్తువులన్నీ. చర, అచర అంటే కదిలేవీ, కదలనివీ; చైతన్యమైనవీ, జడమైనవీ. ఇవన్నీ.

**మనోదృశ్యమ్ ఇదం ద్వైతమ్** – మనస్సు చూపించే ద్వైతప్రపంచం మాత్రమే.

మనస్సు ద్వైతప్రపంచాన్ని పరిచయం చేయటం ద్వారా, వెన్నంటి వచ్చే సంసారం గురించి కూడా చెప్పకనే చెబుతున్నది.

**మనసో హి అమనీభావే** – ఆ మనస్సు లేనప్పుడు. మనస్సు లేనప్పుడు అంటే మనస్సు లయమయినప్పుడు లేదా నాశనమయినప్పుడు. అందువల్ల అమనీభావే అంటే మనోనాశనం అని చెప్పవచ్చు. అలా మనస్సు లేనప్పుడు,

**ద్వైతం న ఏవ ఉపలభ్యతే** – ద్వైతం ఉండదు. దీనికి ఉదాహరణ మన సుషుప్తే. సుషుప్తిలో మనస్సు లయమవుతుంది. మనస్సు లయమయితే, మనస్సు చూపించే ద్వైతం లేదు; ద్వైతం లేకపోతే సంసారమూ లేదు. అందువల్ల ఈ తర్కాన్ని కొంచెం కొనసాగిస్తే – మనోనాశనమయితే ద్వైతం ఉండదు. సంసారం ఉండదు అని తెలుస్తుంది.

మనస్సే కారణహేతువు కాబట్టి మనోనాశనం లేదా అమనీభావం చేయాలి. మనోనాశనం ఎలా చేయాలి? అదికూడా గౌడపాదాచార్యులవారే రాబోయే శ్లోకాల్లో వివరిస్తారు.

### కారిక 3.32

**ఆత్మసత్యానుబోధేన న సంకల్పయతే యదా ।**
**అమనస్తాం తదా యాతి గ్రాహ్యాభావే తదగ్రహమ్ ॥**

అమనీభావం లేదా మనోనాశనం పదం అర్థాన్ని అక్షరాలా తీసుకుంటే అది అమోమయంలో పడవేయవచ్చు మనని. అందువల్ల గౌడపాదాచార్యులవారు దీని అర్థాన్ని వివరించదలుచుకున్నారు. మనోనాశనానికి వేదాంత అర్థం వేరే ఉంది. అది మనస్సును మిథ్యగా అర్థం చేసుకోవటం.

ఆత్మ కాకుండా తక్కినదంతా అనాత్మే. అనాత్మలన్నీ మిథ్యే. మనస్సు కూడా అనాత్మలోకే వస్తుంది. అన్నమయకోశం, ప్రాణమయకోశాలతో పాటు మనోమయకోశం కూడా అనాత్మే.

కోశాలు మిథ్య, వాటికి విడిగా ఉనికి లేదు; ఈ జ్ఞానాన్నే మిథ్యాత్వ నిశ్చయం అంటారు. మనోనాశనం అంటే మిథ్యాత్వనిశ్చయం అని చెప్పవచ్చు.

దీనికి ఉదాహరణగా కుండని నాశనం చేయటం తీసుకోవచ్చు. మామూలుగా కుండని నాశనం చేయటం అంటే కుండను పగులగొట్టటం. కాని వేదాంత పరిభాషలో, కుండను నాశనం చేయటమంటే, దాని అర్థం వేరు. అంటే కుండ మిథ్య అని బుద్ధిలో తెలుసుకుంటాము. దాన్ని జ్ఞాననాశనం అంటారు. జ్ఞాననాశనం అంటే జ్ఞానాన్ని నాశనం చేయటం కాదు, జ్ఞానం ద్వారా కుండను నాశనం చేయటం.

కుండను జ్ఞానం ద్వారా ఎలా నాశనం చేస్తాం? మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదని అర్థం చేసుకోవటం ద్వారా. కుండ పైభాగంలో, మధ్యభాగంలో, అంత్యభాగంలో కూడా ఉన్నది మట్టే. ఉన్నదొకటే పదార్థం. అది మట్టి మాత్రమే. కుండ అనేది కేవలం నామ, రూపాలు మాత్రమే. ఇలా కుండను అది ఒక పదార్థం కాదనీ, అది కేవలం నామ రూపాలు మాత్రమే అనీ అర్థం చేసుకోవటమే కుండను నాశనం చేయటం. ఈ జ్ఞానం పొందాక, కుండ పుట్టకముందూ మట్టి ఉంది; కుండలోనూ మట్టి ఉంది; కుండ నాశనమయ్యాక కూడా మట్టి ఉంది అని అర్థం చేసుకుంటాము. మధ్యలో కుండ ఆకారం వచ్చినా, అది పదార్థం కాదు, నామరూపాలు మాత్రమే.

ఇదే విధంగా, వేదాంతంలో జగత్తును జ్ఞానం వల్ల నాశనం చేయవచ్చు. జగత్తు అంతటా ఉన్నది దానికి ఉపాదాన కారణమైన బ్రహ్మ మాత్రమే. జగత్తు అనేది కేవలం నామరూపాలు మాత్రమే. ఇలా జగత్తును, అది ఒక పదార్థం కాదనీ, అది కేవలం నామ రూపాలు మాత్రమే అనీ అర్థం చేసుకోవటమే జగత్తును నాశనం చేయటం. ఈ జ్ఞానం పొందాక, జగత్తు పుట్టకముందూ బ్రహ్మే ఉన్నాడు; జగత్తులోనూ బ్రహ్మే ఉన్నాడు; జగత్తు లయమయ్యాక కూడా బ్రహ్మే ఉన్నాడు అని అర్థమవుతుంది. మధ్యలో జగత్తు ఆకారం వచ్చినా, అది పదార్థం కాదు, నామరూపాలు మాత్రమే.

జగత్తులోకి మన మనశ్శరీరాలు కూడా వస్తాయి. అందువల్ల జగత్తు నామరూపాలు మాత్రమే అంటే, మనస్సు కూడా నామరూపాలు మాత్రమే. ఈ మనస్సు పదార్థం కాదు, నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకోవటాన్నే మనోనాశనం అంటారు.

కుండను జ్ఞానం ద్వారా నాశనం చేశాక కూడా - కుండను వాడతాము. దానిలోంచి నీళ్ళు తాగుతాము. తమాషా ఏమిటంటే, కుండను చేతిలో పట్టుకునే, కుండ అనే పదార్థం లేదు అంటాము. అలాగే జ్ఞానికూడా జగత్తును ప్రత్యక్షంగా చూస్తూనే జగత్తు అనే పదార్థం లేదు అంటాడు. అతనికి ఆ జ్ఞానం కలిగాక, బాహ్యప్రపంచం ఏమీ మారదు. అది అలాగే

ఉంటుంది; పరిస్థితులు అలాగే ఉంటాయి. కాకపోతే, ఇతని దృక్పథం మారుతుంది. జగత్తు మిథ్య అని అర్థం చేసుకుంటాడు.

అందువల్ల మనోనాశనం పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు.

1. **ద్వైతమిథ్యాత్వ నిశ్చయః –** మనస్సును (బుద్ధిని) ఉపయోగించి, జ్ఞానం ద్వారా ఎదురుగా కనబడే జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం అని అర్థం చేసుకోవటం.

2. **మనోమిథ్యాత్వనిశ్చయః –** అనాత్మ ప్రపంచంలోకి జగత్తు, శరీరం, మనస్సు కూడా వస్తాయి కాబట్టి మనస్సు కూడా మిథ్య అని అర్థం చేసుకోవటం.

కుండ మిథ్య అని తెలిశాక కూడా కుండను వాడినట్టుగా, మనస్సు మిథ్య అని తెలిశాక కూడా మనస్సును వాడుతాడు జ్ఞాని. కాని చాలామంది మనోనాశనం అంటే జ్ఞాని మనస్సును నాశనం చేస్తాడు అనుకుంటారు. ఇది సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అపోహలకు దారితీస్తుంది.

జ్ఞానికి మనస్సు లేదంటారు వారు. మరి జ్ఞాని ఎలా మాట్లాడుతున్నాడు అని అడిగితే, మనస్సు లేకుండానే మాట్లాడతాడు అంటారు. ఎదుటివారిమీద ప్రేమ ఎలా చూపిస్తాడు అని అడిగితే, అది కూడా మనస్సు లేకుండానే చూపిస్తాడు అంటారు. కాని అది పెద్ద పొరపాటు. నిజానికి మనస్సును అక్షరాలా నాశనం చేయకూడదు, చేయలేము, చేయనవసరం లేదు కూడా

**ఎ) మనస్సును నాశనం చేయకూడదు** – ఒకవేళ మనస్సును అక్షరాలా నాశనం చేశామనుకోండి, అప్పుడు మోక్షం పొందినవారంతా మనస్సు లేకుండా ఉంటారు. మనస్సు లేకపోతే ఆ బండరాయికీ, జ్ఞానికీ మధ్య ఏమీ భేదం ఉండదు. బండరాయికి మనస్సు ఉండదు కదా. అంటే ఇంత కష్టపడీ సాధనలు చేసినది ఇలా బండరాయిగా మారటానికా?

గీతలో జ్ఞానం పొందిన, జ్ఞాననిష్ఠలో నిలబడిన స్థితప్రజ్ఞుని లక్షణాలను చూస్తాము.

**నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥** – గీత 2.71

జ్ఞాని ప్రేమకు , దయకు, పూర్ణత్వానికి, మంచితనానికి మారుపేరు అంటుంది శాస్త్రం. అటువంటిది జ్ఞాని అక్షరాలా మనస్సును నాశనం చేస్తే, ఈ విలువలన్నీ ఎక్కడ ఉంటాయి? ఆత్మలోనా? ఆత్మ నిర్గుణం. శరీరంలోనా? శరీరం జడం. అందువల్ల జ్ఞానికి దయ, ప్రేమలతో కూడిన మనస్సు ఉంటుందని గుర్తుంచుకోండి. మనస్సును నాశనం చేసే ప్రసక్తే లేదు.

అంతేకాదు, జ్ఞాని మనస్సు నాశనమవుతుంది అంటే, ఈ సూత్రం ప్రకారం, మనస్సు ఎవరికి ఉంటే వారు అజ్ఞానులు. అవునా? గురువుకు మనస్సు ఉండాలా, వద్దా? గురువుకు మనస్సు ఉండకపోతే, జ్ఞానాన్ని బోధించలేరు. కాబట్టి గురువుకు మనస్సు ఉండాలి. కాని

పైసూత్రం ప్రకారం మనస్సు ఉన్నవారు అజ్ఞానులు. అంటే గురువులు అజ్ఞానులా? అజ్ఞానంలో ఉన్న గురువులు వారి శిష్యులకు ఏం నేర్పిస్తారు? అజ్ఞానాన్నే నేర్పిస్తారు.

మనోనాశనం అక్షరాలా చేస్తాడు జ్ఞాని అంటే అందులో లొసుగులు చూశారా? అందువల్ల ఈ పదాన్ని అక్షరాలా తీసుకోకండి. మనస్సు ఉండాలి, ఆ మనస్సులోనే జాలి, దయ, ప్రేమానురాగాలు చూపాలి.

**బి) మనస్సును నాశనం చేయలేము** – మనస్సును అక్షరాలా నాశనం చేయలేము, ఎందుకంటే, అది మనకు అనాదిగా వస్తున్నది. మరణంలో కూడా మనోనాశనం అవదు. ఇప్పటికే మనం ఎన్నో జన్మలు ఎత్తివుంటాము, ఎన్నిసార్లో మరణించి ఉంటాము. కాని ఏ జన్మలో కూడా మనస్సు నాశనమవలేదు. ఒకవ్యక్తి మరణించినప్పుడు అతని స్థూలశరీరం పడిపోతుంది. అతని సూక్ష్మశరీరం, కారణశరీరాలు ప్రయాణం చేస్తాయి. సూక్ష్మశరీరంలో ముఖ్యంగా ప్రయాణం చేసేది మనస్సు. కొత్త జన్మలో, కొత్త స్థూలశరీరంలోకి సూక్ష్మ, కారణ శరీరాలతో పాటు మనస్సు ప్రవేశిస్తుంది. ప్రళయంలో కూడా మనస్సు నాశనమవదు. అది అవ్యక్తంగా ఉంటుంది.

మరణం నాశనం చేయలేని మనస్సును, ప్రళయం కూడా నాశనం చేయలేని మనస్సును మీరెలా నాశనం చేయగలరు? మనోనాశనం అంటే అక్షరాలా మనస్సును నాశనం చేయటం కాదని గ్రహించండి.

**సి) మనస్సును నాశనం చేయనవసరం లేదు** – మనస్సును నిజానికి నాశనం చేయాల్సిన అవసరం లేదు కూడాను. వేదాంతం పదేపదే చెబుతున్నది ఒకటే – ఆత్మకాక, తక్కినదంతా మిథ్య. మిథ్యావస్తువు ఉన్నా లేనట్టే అర్థం. దానికి ఉనికి ఉన్నట్టుగా ఉంటుంది అంతే. ఉనికి ఉన్నట్టుగా ఉన్న మనస్సును పనిగట్టుకుని నాశనం చేయటం ఎందుకు?

తాడు-పాము అధ్యాసలో పామును కర్రపెట్టి చంపటానికి ప్రయత్నించినట్టు ఉంటుంది ఇది. అక్కడ లేని పామును ఎలా చంపుతారు? అక్కడ పాము లేదని, అది ఉందని భ్రమ పడ్డారని అర్థం చేసుకుంటే చాలు. మనస్సు విషయం కూడా అంతే. అసలు లేనేలేని మనస్సును ఎలా నాశనం చేస్తారు? మనస్సు ఉందని, మనస్సే నేనని భ్రమపడ్డారు, కాని వేదాంతానికి వచ్చాక మనస్సు మిథ్య అని, నేను ఆత్మనని అర్థం చేసుకుంటారు. మనస్సు మిథ్య అని అర్థం చేసుకున్నాక, ఇంక ప్రత్యేకించి విడిగా చేయాల్సింది ఏమైనా ఉందా? లేదు, అది అర్థం చేసుకుంటే చాలు.

ఆ విధంగా మనస్సును నాశనం చేయకూడదు, మనస్సు నాశనం చేయలేము, మనస్సును నాశనం చేయనవసరం లేదు. ఎందుకంటే అక్కడ నిజంగా మనస్సనేది లేనేలేదు. మరయితే ఏం చేయాలి? మనస్సు మిథ్య అని అర్థం చేసుకుంటే చాలు. వేరే ఏమీ చేయనవసరం

లేదు. మనస్సుయొక్క మిథ్యాత్వాన్ని అర్థం చేసుకోవటమే మనోనాశనం. ఎవరంటున్నారు ఈ మాట? గౌడపాదాచార్యులవారు అంటున్నారు. ఇప్పుడు శ్లోకం చూద్దాము.

**ఆత్మ సత్యానుబోధేన** – మనస్సును నాశనం చేయాలంటే, మనస్సు జోలికి వెళ్ళనవసరం లేదు. దానికి అధిష్ఠానం అయిన ఆత్మవైపు తిరిగితే చాలు. స్వప్నప్రపంచాన్ని నాశనం చేయాలంటే, స్వప్నంలో కనబడే ఒక్కొక్క వస్తువునూ సుత్తితో కొడుతూ రానవసరం లేదు. స్వప్నంనుంచి లేస్తే చాలు. స్వప్నంయొక్క అధిష్ఠానం జాగ్రద్ పురుషుడు. మీరు జాగ్రద్ పురుషునిగా లేస్తే, స్వప్నం దానంతట అదే మాయమయిపోతుంది. స్వప్నప్రపంచాన్ని ఏమీ చేయనవసరం లేదు – స్వప్నప్రపంచానికి అధిష్ఠానం అయిన జాగ్రద్ పురుషుని స్థాయికి లేస్తే చాలు.

ఆత్మ సత్య అనుబోధేన అంటే అదే అర్థం. మనస్సును పనిగట్టుకుని నాశనం చేయనవసరం లేదు. మనస్సుకి అధిష్ఠానం అయిన ఆత్మ గురించి తెలుసుకుంటే చాలు. ఎటువంటి ఆత్మ? సత్య ఆత్మ. ఎలాగైతే జాగ్రద్ పురుషుడు, మిథ్యా స్వప్నప్రపంచానికి సత్య అధిష్ఠానమో అలాగే ఆత్మ మిథ్యా మనస్సుకు సత్య అధిష్ఠానం. జాగ్రద్ పురుషుని స్థాయికి లేస్తే, స్వప్నప్రపంచం ఎలా మిథ్యగా తేలిపోతుందో, అలా ఆత్మస్థాయికి లేస్తే అలా మనస్సు మిథ్యగా తేలిపోతుంది.

ఆత్మ గురించి ఎలా తెలుసుకుంటాము? అనుబోధేన అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. అనుభోద అంటే శాస్త్ర ఉపదేశాన్ని గురువు ద్వారా పొందటం. జ్ఞానం దానంతట అది ఏర్పడదు. కళ్ళు మూసుకుంటే జ్ఞానం రాదు; ఆలోచనలను లేకుండా మనస్సును శూన్యం చేస్తే జ్ఞానం రాదు. అంతకుముందు ఆలోచనలు ఉన్న అజ్ఞాని అయితే, ఇప్పుడు ఆలోచనలు లేని అజ్ఞాని అవుతారు. అంతే భేదం. అందువల్ల ధ్యానంలో జ్ఞానం వస్తుందని పొరపాటు పడకూడదు.

మీ కళ్ళు ఎంత సూదంటురాయిలా ఉన్నా, వాటిని మీరు స్వయంగా చూసుకోలేరు. వాటిని అద్దంలోనే చూసుకోవాలి. అలాగే జ్ఞానాన్ని గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే పొందాలి. అప్పుడు అజ్ఞానంలో ఉన్న మనస్సు జ్ఞానం పొందుతుంది. జ్ఞానం పొందిన మనస్సు ఏం చేస్తుంది?

**న సంకల్పయతే** – నిజమైన ద్వైతాన్ని చూడదు. జ్ఞాని ద్వైతాన్ని చూస్తాడు కాని అదే నిజమనే భ్రమలో ఉండదు.

సూర్యోదయం ఉదాహరణ గుర్తుంచుకోండి. సైన్సులో నేర్చుకోకముందు సూర్యోదయాన్ని చూసి, సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు, ప్రయాణం చేసి, పడమరన అస్తమిస్తాడు అని చూస్తారు. కాని సైన్సులో భూమే సూర్యుని చుట్టూ తిరుగుతుంది, దానివల్ల సూర్యోదయం, సూర్యాస్తమయం అవుతాయని నేర్చుకుంటారు. అలా నేర్చుకున్నా కూడా సూర్యోదయం, సూర్యాస్తమయం పదాలను వాడటం మానరు. కాని మీకు దాని వెనకనున్న సత్యం తెలుసు.

అలాగే నీలాకాశం అంటారు కాని ఆకాశానికి రంగు లేదని తెలుసు మీకు; నీలి సముద్రం అంటారు కాని నీరు నీలంగా ఉండదని తెలుసు మీకు; భూమి స్థిరంగా ఉన్నట్టు అనిపిస్తుంది కాని భూమి స్థిరంగా ఉండదని తెలుసు మీకు. అందువల్ల మీకు అనుభవంలోకి వచ్చే విషయాలేవీ మారవు, కాని ఆ అనుభవాలన్నీ మిథ్య అని మీకు తెలుసు.

అదే విధంగా, జ్ఞానియొక్క మనస్సు ద్వైతాన్నే చూస్తుంది కాని ద్వైతంతో మమేకం చెందదు; అది మిథ్య అని అర్థం చేసుకుంటుంది. మిథ్యాజగత్తు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. మిథ్యాద్వైతం అన్నా ద్వైతం లేదు అన్నా ఒకటే అర్థం. మనః న సంకల్పయతే అంటే మనస్సు ద్వైతాన్ని చూడదు.

**అమనస్తాం తదా యాతి** – జ్ఞానికి అలా ద్వైతాన్ని చూడని మనస్సు ఉన్నా లేనట్టే అర్థం. ఎందుకంటే అది అతనికి సంసారాన్ని కలుగజేయదు. అజ్ఞాని మనస్సు ద్వైతాన్ని చూసి, దానివల్ల సంసారంలో పడవేస్తే, జ్ఞాని మనస్సు ద్వైతాన్ని చూడదు కాబట్టి, సంసారంలో పడవేయదు. జ్ఞానం పొందిన మనస్సు తేలికగా ఉంటుంది.

ఎవరో అన్నారు, 'మీ కాలికి బూట్లు సరిగ్గా సరిపోయినప్పుడు, బూట్లు వేసుకున్నట్టే తెలియదు.' ఈ సూత్రం శరీరానికి కూడా వర్తిస్తుంది. శరీరం ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అది ఉన్నట్టే తెలియదు; ఏ మోకాలి నొప్పో మొదలయినప్పుడు, శరీరం నేను ఉన్నానని ప్రతి ఐదు నిముషాలకూ గుర్తుచేస్తూనే ఉంటుంది. గట్టిగా అరగంట కూడా కుదురుగా కూర్చోలేరు.

అదేవిధంగా జ్ఞాని మనస్సు ఆరోగ్యకరమైన మనస్సు. మనస్సు ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అది ఉన్నట్టే తెలియదు; అది ఏ బాధనూ కలుగజేయదు కాబట్టి నేను ఉన్నానని ప్రతి ఐదు నిముషాలకూ గుర్తుచేయదు. అందువల్ల అటువంటి ఆరోగ్యకరమైన మనస్సు ఉన్నట్టే తెలియదు కాబట్టి అమనీభావం అన్నారు.

**గ్రాహ్యాభావే తదగ్రహమ్** – చూడబడే దృశ్యాన్ని మిథ్యగా కొట్టివేస్తున్నాము కాబట్టి, చూసే మనస్సుకు దృక్ హోదా ఉండదు.

మనస్సు చూస్తోంది కాని చూడటం లేదు. మనస్సు చూస్తోంది కాని చూడటం లేదు అంటే చూస్తున్నదాన్ని సత్యంగా భావించటం లేదు. ప్రమేయాన్ని కొట్టివేస్తే, ప్రమాత హోదా కూడా ఉండదు. అందువల్ల మనస్సును ప్రమాత అనలేము. అప్పుడది సంసారాన్ని కలుగజేయలేదు. నిజానికి ప్రతిజ్ఞాని కూడా సమస్యలను సృష్టించే, అజ్ఞానమైన మనస్సును నాశనం చేస్తాడు. అందువల్ల మనోనాశనం అంటే అజ్ఞానమైన మనస్సును నాశనం చేసి, జ్ఞానంతో నిండిన మనస్సును పెంపొందించుకోవటం.

ద్వైత మిథ్యాత్వ నిశ్చయం, అజ్ఞాన నాశనం కలిసి అమనీభావం అని వస్తుంది.

**కారిక 3.33**

**అకల్పకమజం జ్ఞానం జ్ఞేయాభిన్నం ప్రచక్షతే ।**
**బ్రహ్మ జ్ఞేయమజం నిత్యమజేనాజం విబుధ్యతే ॥**

ముందు కారికలో ఆత్మజ్ఞానం పొందితే, మనోనాశం అవుతుందని చెప్పారు గౌడపాదాచార్యులవారు. ఇక్కడ ఆత్మజ్ఞానం యొక్క ప్రత్యేకతను వివరిస్తున్నారు. లౌకిక విద్యలో త్రిపుటి ఉంటుంది – ప్రమాత, ప్రమేయం, ప్రమాణం ఉంటాయి. ప్రమాత అంటే తెలుసుకునే నేను; ప్రమేయం అంటే తెలుసుకోబోయే వస్తువు; ప్రమాణం అంటే దానికి ఉపయోగించే పరికరం. మనస్సు, ఇంద్రియాలు ప్రమాణంలోకి వస్తాయి.

కాని ఆత్మజ్ఞానం విషయానికి వచ్చేసరికి ఈ త్రిపుటి ఉండదు. ప్రమేయం ఏమిటి? తెలుసుకునే ప్రమాత అయిన నేనే. అంటే ప్రమేయం, ప్రమాత రెండూ ఒకటే. తురీయం అయిన నేను, నా గురించే తెలుసుకుంటాను. ప్రమాణం మాట ఏమిటి? ఆత్మ అప్రమాణం. ఏ ప్రమాణానికీ అందదు. అందువల్ల ప్రమాతా, ప్రమేయం, ప్రమాణం – మూడూ ఆత్మే.

ఈ హాలులో ఫలానా రామారావు ఉన్నారా అని ఎవరైనా అడిగితే, హాలంతా కలయజూసి ఉన్నారని చెబుతారు మీరు. అంటే ప్రమాత అయిన మీరు, ప్రమేయం అయిన రామారావు గురించి తెలుసుకోవటానికి ప్రమాణం అనే కన్నును వాడతారు. ఇప్పుడు 'ఈ హాలులో మీరు ఉన్నారా?' అని ఎవరైనా అడిగితే, 'చూసి చెబుతాను,' అని కళ్ళతో హాలంతా వెతుకుతారా? పోనీ తర్కం వాడతారా? 'ఇక్కడ ఒక గురువు ప్రసంగం చేస్తున్నాడు. వినేవారు లేకపోతే ఆయన ప్రసంగం ఎలా చేస్తాడు? కాబట్టి నేను ఈ హాలులో ఉండే ఉంటాను అంటారా?' లేదా 'శాస్త్రం చెబుతున్నది కాబట్టి నేను ఉన్నాను అంటారా?'

నేను ఉన్నాను అని చెప్పటానికి ప్రత్యక్ష ప్రమాణం అవసరం లేదు, యుక్తి (తర్క) ప్రమాణం అవసరం లేదు, శ్రుతి ప్రమాణం అవసరం లేదు. **నా గురించి నాకు నా ద్వారానే తెలుసు.** నేను స్వయంప్రకాశకం.

**(అజః) అజేన అజం విబుధ్యతే** – ఈ కారికలో సంస్కృత పదప్రయోగం చాలా క్లిష్టంగా ఉంటుంది. ఇందులో నాలుగుసార్లు అజం పదం వస్తుంది. ఈ వాక్యం అర్థం ఆత్మ తన గురించి తన ద్వారానే తెలుసుకుంటుంది. తెలుసుకుంటుంది అంటే ఆత్మ భవిష్యత్తులో తెలుసుకుంటుంది అనికాదు అర్థం. అది ఒక సంఘటన కాదు.

**అజం నిత్యమ్** – అజం అంటే పుట్టుక లేనిది. ఇక్కడ అర్థం ఆత్మ. ఆత్మ నిత్యం.

**బ్రహ్మ జ్ఞేయమ్** – ప్రమేయంగా తెలుసుకోవాల్సిన బ్రహ్మ,

**జ్ఞాయాభిన్నమ్** – ఆత్మకు భిన్నంగా లేదు.

**ప్రచక్షతే** – అంటారు.

**అజం జ్ఞానమ్** – అందువల్ల ఆత్మజ్ఞానం,

**అకల్పకమ్** – ప్రమాతృ, ప్రమేయ, ప్రమాణ భేదాలు లేనిది.

ఇవన్నీ కలిపితే అర్థం నిత్యమైన ఆత్మ, బ్రహ్మకు భిన్నంగా లేదు అని మహాత్ములు చెబుతున్నారు. అందువల్ల ఆత్మ తన గురించి తానే స్వయంగా తెలుసుకుంటుంది. తెలుసుకుంటుంది అంటే అది కొత్తగా తెలుసుకునేది కాదు, స్వయంప్రకాశకం. ఎవరికి? అందరికీ! ఆత్మ చైతన్యతత్త్వంగా ఎవరికి వారికే తెలుసు. అంటే కొత్తగా ఆత్మజ్ఞానం పొందనవసరం లేదు.

కొత్తగా ఆత్మజ్ఞానం పొందనవసరం లేదు అంటే అది సందేహాలకు దారితీస్తుంది.

**సందేహం 1.** ముందే ఆత్మజ్ఞానం ఉంటే, శాస్త్రాన్ని నేర్చుకోవటం ఎందుకు, అదికూడా గురువు ద్వారానే నేర్చుకోవటం ఎందుకు? శాస్త్రం ఆత్మజ్ఞానాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా పొందాలని చెబుతుంది.

**సందేహం 2.** ఆత్మజ్ఞానం అంటే ఏమిటి?

**జవాబు** – ముందు రెండవ ప్రశ్నకు జవాబు చూద్దాము. ఆత్మజ్ఞానం అంటే ఏమిటి? ఆత్మజ్ఞానం అంటే ఏమిటో సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఆత్మజ్ఞానం అంటే స్వయంప్రకాశక ఆత్మ గురించి ఉన్న అపోహలను తొలగించుకోవటం. ఆత్మనైన నేను, స్వయంప్రకాశకం, నేను చైతన్యస్వరూపం. కాని ఇది తెలియక ఆత్మ గురించి అపోహలు ఉన్నాయి.

నేను పరిమితి ఉన్న శరీరాన్ని అని ఒక అపోహ ఉంది; నేను పరిమితి ఉన్న మనస్సును అని ఇంకొక అపోహ ఉంది. ఈ అపోహలను తొలగించటమే ఆత్మజ్ఞానం.

1. **గురుశాస్త్ర ఉపదేశం ఎందుకు?** – ఆత్మ గురించిన ఈ అపోహలను పోగొట్టటానికి గురుశాస్త్ర ఉపదేశం కావాలి. గురువు ఆత్మ గురించి బోధించదు; శాస్త్రం ఆత్మ గురించి బోధించదు; గురువు, శాస్త్రం ద్వారా ఆత్మ గురించి ఉన్న అపోహలను తొలగిస్తాడు.

దీనికి సరియైన ఉదాహరణ కర్ణుడు. కుంతీదేవి వెళ్ళి కర్ణునికి నువ్వు సూతపుత్రుడివి కాదు, కుంతీపుత్రుడివి అని చెప్పింది. అప్పుడు కర్ణుడు కొత్త వ్యక్తిగా మారాడా? అతని ఆకారం, రూపురేఖలు, జుట్టు ఏమీ మారలేదు. మరి ఏం మారింది? కర్ణునికి తన గురించి ఉన్న అపోహ తొలగింది. ఇప్పుడు అతను క్షత్రియుడనని తెలుసుకున్నాడు. ఇన్నాళ్ళూ అతను క్షత్రియుడు కానందువల్ల ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాడు. ఇప్పుడు ఆ పొరపాట్లు తొలగిపోతాయి. అందువల్ల 'కొత్త కర్ణుడు పుట్టాడు,' అన్నట్టుగా ఉంటుంది.

కుంతి, కర్ణునికి అతని కొత్త హోదా పరిచయం చేసినట్టుగా, గురువు శాస్త్రం ద్వారా మీ కొత్త హోదాను పరిచయం చేస్తాడు. తద్వారా మీకున్న పొరపాట్లను తొలగిస్తాడు.

నేను స్థూలశరీరం కాదు, నేను సూక్ష్మశరీరం కాదు, నేను కారణశరీరం కాదు; నేను ఈ మూడు అవస్థలకూ అతీతంగా ఉన్న చైతన్యాన్ని అని నేర్చుకుంటారు. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే, నేను విశ్వ కాదు, నేను తైజస కాదు, నేను ప్రాజ్ఞ కాదు, నేను తురీయ చైతన్యాన్ని అని అర్థం చేసుకుంటారు. వందలాది స్థూలశరీరాలు వస్తాయి, పోతాయి; వేలాది సూక్ష్మ, కారణ శరీరాలు వస్తాయి, పోతాయి; కాని చైతన్యమైన నాకు రాకపోకలు లేవు. నేను శరీరత్రయ విలక్షణ తురీయాన్ని. ఈ విధంగా గురువు నేర్పిస్తాడు.

నేను ఉన్నాను అని తెలుసుకోవటానికి గురువు కాని, శాస్త్రం కాని అవసరం లేదు; కాని ఆ నేను ఎవరో తెలుసుకోవటానికి గురుశాస్త్ర ఉపదేశం కావాలి.

**కారిక 3.34**

**నిగృహీతస్య మనసో నిర్వికల్పస్య ధీమతః ।**
**ప్రచారస్స తు విజ్ఞేయస్సుషుప్తేఽన్యో న తత్సమః ॥**

జ్ఞాని మనస్సు ద్వైతాన్ని చూడదు, అతనికి అద్వైతదర్శనం అవుతుంది అని చూశాము.

**సందేహం** – జ్ఞాని మనస్సు ద్వైతంనుంచి విడివడుతుంది నిజమే. కాని సుప్తపురుషుని మనస్సు కూడా ద్వైతాన్ని చూడదు. అంతేకాదు సమాధిస్థితిలో ఉన్న యోగికి కూడా ద్వైత దర్శనం అవదు. మరి అయితే జ్ఞానికీ, వీరికీ మధ్య భేదం ఏమిటి?

**జవాబు** – చాలా పెద్ద భేదమే ఉంది అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. సుషుప్తిలో ఉన్న సుప్తపురుషుడు ద్వైతాన్ని చూడదు నిజమే కాని అది తాత్కాలికం. సుషుప్తిలో కూడా ద్వైతం ఉంది, కాకపోతే అది అవ్యక్తంలో ఉంది. ఎలా తెలుసు? అతను నిద్ర లేస్తూనే ద్వైతానికి లేస్తాడు. అతని సమస్యలు, అతని కుటుంబసభ్యులు, అతను వేసే పాత్రలు అన్నీ దూసుకు వస్తాయి. అందువల్ల అప్పుడు అతను అనుభవించేది తాత్కాలిక అద్వైతం మాత్రమే.

ఇదే నియమం ధ్యానంలో ఉన్న యోగికి కూడా వర్తిస్తుంది. అతనికి కూడా ద్వైతం అవ్యక్తంలో ఉంటుంది. అతను సమాధి నుంచి లేవగానే షరా మామూలే! అతని సమస్యలు అతన్ని చుట్టుముడుతాయి. అందువల్ల సుప్తపురుషుడు కాని, యోగి కాని అనుభవించేది అసలైన అద్వైతాన్ని కాదు. వారు దాన్ని తాత్కాలికంగా అనుభవిస్తారు.

దానికి భిన్నంగా, ద్వైతం మిథ్య, అద్వైతం మాత్రమే సత్యం అని అర్థం చేసుకున్న జ్ఞాని, ద్వైతాన్ని చూస్తున్నా కూడా, తను చూస్తున్నది నిజం కాదని తెలుసుకుంటాడు. ఈ విషయం అతను గురుశాస్త్ర ఉపదేశం ద్వారా నేర్చుకుని, బుద్ధిలో అర్థం చేసుకుంటాడు. అందువల్ల

జ్ఞానికి అజ్ఞానం ఉండదు. కాని సుప్తపురుషుడు కాని, యోగి కాని అజ్ఞానంలోనే ఉంటారు. వారికి అజ్ఞానజనిత పొరపాటు ఉండదు, శాస్త్రజనిత జ్ఞానమూ ఉండదు – పైగా వారు అనుభవించిన అద్వైతం ఆ స్థితిలో ఉండగా వారికి తెలియదు. వారికి ద్వైతం అనుభవంలోకి రాదు, అద్వైతం అనుభవంలోకి వచ్చిందని అప్పుడు తెలియదు.

జ్ఞానికి ద్వైతప్రపంచం అనుభవంలోకి వస్తుంది కాని అనుభవంలోకి వచ్చినంత మాత్రాన అది నిజం కాదని తెలుసు. దానికి గొప్ప ఉదాహరణ సూర్యోదయమే. సూర్యోదయం ప్రతిరోజూ అనుభవంలోకి వస్తుంది కాని, అది నిజం కాదని తెలుసు. అలాగే జ్ఞానికి ద్వైతం కనిపిస్తుంది కాని దానితో మమేకం చెందదు. ద్వైత అనుభవంవల్ల అతని అద్వైత జ్ఞానం చెక్కు చెదరదు.

అద్దం మీ ఎదురుగా ఉంటే మీ ప్రతిబింబ ముఖం ఉంటుంది. అద్దాన్ని తీసేస్తే, మీ ప్రతిబింబ ముఖం కనబడదు, కాని మీ అసలు ముఖం మీ భుజాలమీద భద్రంగానే ఉంది. జ్ఞానికి ఆ విషయం బాగా తెలుసు.

అందువల్ల జ్ఞాని బాహ్యప్రపంచాన్ని తప్పించుకోవటానికి కళ్ళు మూసుకుని కూర్చోనవసరం లేదు. రజ్జు–సర్ప భ్రాంతిలో ఎవరైనా ముందు తాడుని చూసి పాముగా పొరపాటు పడతారు. కాని తర్వాత అది పాము కాదు, తాడు అని తెలుసుకుంటారు. ఈ విషయం తెలిశాక కూడా, ఎవరైనా 'అది పాము కాదు, తాడు అని నాకు అర్థమయింది కాని ఎందుకైనా మంచిది దానికి దూరంగా ఉంటాను,' అంటే ఎలా ఉంటుంది? అదే విధంగా జ్ఞాని కూడా 'నాకు ప్రపంచం మిథ్య అని తెలిసింది కాని, ఎందుకైనా మంచిది దానికి దూరంగా ఉంటాను,' అంటే కూడా అలాగే ఉంటుంది. అంటే ఈ ఇద్దరికీ వారు పొందిన జ్ఞానం వంటబట్టలేదన్నమాట.

ఈ భావనను వివరించటానికి చిన్మయానంద స్వామీజీ ఒక కథ చెబుతారు. ఒకవ్యక్తికి తను ఒక పురుగునని, అతనిని ఏదో ఒక పక్షి వచ్చి తినేస్తుందనీ ఒక భయం బాగా పట్టుకుంది. అతన్ని ఒక డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆ డాక్టరు అతన్ని పక్షులు వచ్చే ఆస్కారం లేని ఒక గదిలో పెట్టి, వివరంగా చెప్పుకు వచ్చారు. అతను పురుగు కాదనీ, తనలాగే మనిషనీ చెప్పారు. అద్దం తెప్పించి, అద్దంలో పురుగునీ చూపి, అతన్నీ చూపి, అతను పురుగులా లేడని నిర్ధారించారు. అలాగే అద్దంలో డాక్టరు అతని మొహం, తన మొహం చూపించి, ఇద్దరూ ఒక్కలాగే ఉన్నారనీ, ఇద్దరూ మనుష్యులేనని నిర్ధారించారు. ఈ బోధ ఒక్కరోజు కాదు, రెండు రోజులు కాదు, కొన్ని నెలలు నిర్విరామంగా సాగింది. అతనికి బాగా అర్థమయిందని డాక్టరుకు నమ్మకం కుదిరాక, అతన్ని తన ఆసుపత్రినుంచి బయటకు పంపాడు.

ఆ వ్యక్తి బాహ్యప్రపంచంలోకి వచ్చాడు. అతను బయటకు రాగానే చూసిన మొట్టమొదటిది ఏమిటనుకున్నారు? భీతిగొలిపే నల్లకాకి. కావు కావుమంటూ అతనికేసి చూస్తోంది. ఇంకేముంది? 'డాక్టర్,' అంటూ లోపలికి ఒక్క గెంతు గెంతాడు. 'బయట కాకి ఉంది!' అన్నాడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని. డాక్టరు అన్నాడు, 'నీకెందుకు కాకి అంటే భయం? నువ్వు మనిషివి కదా! ఇన్ని నెలలుగా ఈ విషయం నేర్చుకున్నావు కూడానూ!' 'నేను నేర్చుకున్నాను సరే, కాకి నేర్చుకోలేదు కదా. అలాంటప్పుడు కాకికి నేను పురుగును కాదని ఎలా తెలుస్తుంది?' అన్నాడు అమాయకంగా.

అద్వైతం నేర్చుకుని కూడా, ద్వైతప్రపంచాన్ని చూసి భయపడితే, ఇదుగో ఈ అమాయక చక్రవర్తి ప్రవర్తనలాగానే ఉంటుంది మన ప్రవర్తన కూడా. ఈ నేపథ్యంతో ఈ కారికను చూద్దాము.

**(మనసః) ప్రచారః** – ప్రచారః అంటే ప్రవర్తన. దేని ప్రవర్తన? దాని ముందు మనసః మనం కలుపుకోవాలి. మనస్సుయొక్క ప్రవర్తన. ఎవరి మనస్సు?

**ధీమతః** – జ్ఞానియొక్క మనస్సు. ఎటువంటి జ్ఞాని?

**నిగృహీతస్య** – తన మనస్సును అదుపులో పెట్టుకున్న జ్ఞాని లేదా వేదాంతాన్ని జీర్ణించుకున్న జ్ఞాని.

**నిర్వికల్పస్య** – నిర్వికల్ప సమాధి కాదు ఇక్కడ. వికల్పం అంటే పొరపాటు. నిర్వికల్పం అంటే పొరపాటు లేని. ఏమిటా పొరపాటు? బాహ్యప్రపంచం సత్యం అనుకునే పొరపాటు. ఈ పొరపాటు జ్ఞాని మనస్సును నుంచి తొలగిపోతుంది. అందువల్ల అతను ద్వైతాన్ని చూస్తాడు, ద్వైతాన్ని చూడడు. అంటే ద్వైతాన్ని చూస్తాడు కాని దాన్ని సత్యంగా భావించడు. అదీ జ్ఞానియొక్క మనఃస్థితి.

ఈ జ్ఞాని మనస్సును, సుప్తపురుషుని మనస్సుతో పోలుస్తున్నారు ఇక్కడ గౌడపాదాచార్యులవారు. సుప్తపురుషునితో పాటు సమాధిస్థితిలో ఉన్న యోగిని కూడా తీసుకోవచ్చు. సుషుప్తిలోనూ, నిర్వికల్ప సమాధిలోనూ ఆనందాన్ని అనుభవిస్తారు కాని ఆ ఆనందం తాత్కాలిక ఆనందమే. ఫోను చిన్నగా మ్రోగితేనే, ప్రశాంతత చెదిరిపోతుంది. అంటే అతన్ని అద్వైతం నుంచి ద్వైతానికి తీసుకువస్తుంది. కాని జ్ఞాని ద్వైతాన్ని చూస్తూనే ఉంటాడు కాని, దానికి భయపడడు. ద్వైతం వ్యావహారిక సత్యమని, అద్వైతం పారమార్థిక సత్యం అనీ జీర్ణించుకుంటాడు. వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యాన్ని ఎలా భయపెట్టగలదు?

**సః** – జ్ఞాని మనస్సు గురించీ, సుప్తపురుషుని మనస్సు గురించీ,

**విజ్ఞేయః** – స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

**సుషుప్తే అన్యః** – సుషుప్తిలో ఉన్న మనస్సు, జ్ఞాని మనస్సుకన్నా భిన్నంగా ఉంటుంది.

**న తత్సమః** – సుషుప్తిలో ఉన్న మనస్సును, జ్ఞాని మనస్సుతో ఎన్నడూ సరిపోల్చలేము. సుప్తపురుషుడు అద్వైతంలో ఉన్నట్టుగా ఉంటాడు కాని అది అవ్యక్తంలో ఉన్న ద్వైతం మాత్రమే. ఈ విషయాన్ని గౌడపాదాచార్యులవారే ఇంకా లోతుగా వివరిస్తారు. అందువల్ల ఇవన్నీ చాలా ముఖ్యమైన కారికలు.

**కారిక 3.35**

**లీయతే హి సుషుప్తే తన్నిగృహీతం న లీయతే ।**
**తదేవ నిర్భయం బ్రహ్మ జ్ఞానాలోకం సమంతతః ॥**

ఈ కారిక ద్వారా యోగం వేరు, వేదాంతం వేరు అని స్పష్టంగా తెలుస్తుంది. చాలామంది ఈ రెండూ ఒకటే అనుకుంటారు. కాని అవి పూర్తి భిన్నం, రెండూ ఒకటే అనుకోవటం పెద్ద పొరపాటు.

పడుకున్న మనస్సుకూ, జ్ఞానం పొందే మనస్సుకూ మధ్య ఉన్న భేదం ఏమిటి?

**లీయతే సుషుప్తౌ** – సుషుప్తిలో మనస్సు అవ్యక్తంలోకి వెళుతుంది. అందువల్ల ద్వైతం కూడా అవ్యక్తంగా ఉంటుంది. ద్వైతం పూర్తిగా మాయమవదు, ద్వైతం తాత్కాలికంగా ఉండదు. ఇంకో విధంగా చెప్పాలంటే సమస్యకు పరిష్కారం కాదు, సమస్యనుంచి పారిపోవటం అవుతుంది. కొంతమంది సమస్యనుంచి పారిపోవటానికి మద్యం లేదా మత్తుపదార్థాలు తీసుకుంటారు, కాని అది తాత్కాలిక ఉపశమనమే అవుతుంది. దాని ప్రభావం పోగానే, సమస్య మళ్ళీ దూసుకువస్తుంది. అలాగే సుషుప్తి కూడా తాత్కాలిక ఉపశమనమే.

**తద్ నిగృహీతం లీయతే** – అదే జ్ఞానం పొందిన మనస్సుకు ఇలా ద్వైతం అవ్యక్తంలోకి వెళ్ళదు. అది తాత్కాలిక ఉపశమం కాదు. మరి అయితే, జ్ఞాని మనస్సు ఎలా ఉంటుంది?

**తదేవ నిర్భయం బ్రహ్మ** – జ్ఞానికి, మనస్సు బ్రహ్మే అవుతుంది. ఈ వాక్యం అయోమయంలో పడవేయవచ్చు. మనస్సు నెమ్మదిగా మార్పు చెందుతుందనో, జీవాత్మ క్రమేపీ మారి పరమాత్మ అవుతుందనో పొరపాటు పడకూడదు. జ్ఞాని, బ్రహ్మ అవుతాడు అని కొందరి అపోహ.

ఇవన్నీ శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటం వల్ల కలిగే అపోహలు. జ్ఞాని మనస్సు బ్రహ్మ అవుతుంది అంటే దాని అర్థం, జ్ఞాని తన మనస్సు గురించి అది బ్రహ్మ + నామ రూపాలు అని అర్థం చేసుకుంటాడు. జగత్తు మొత్తమే బ్రహ్మ + నామరూపాలు అంటే, జగత్తులో ఒక చిన్న భాగమైన మనస్సు సంగతి ఏమిటి? అది కూడా బ్రహ్మ + నామరూపాలే. అందువల్ల జ్ఞాని మనస్సు బ్రహ్మ అయింది అంటే, జ్ఞాని తన మనస్సు కూడా బ్రహ్మ అని అర్థం చేసుకున్నాడు అని అర్థం.

జ్ఞానికి కుండ మట్టి అయింది అని చెప్పినట్టుగా ఉంటుంది ఈ వాక్యం. కుండ మట్టి అయింది అంటే, కుండ జ్ఞానికోసం ప్రత్యేకంగా మట్టిగా మారదు; జ్ఞాని దృక్పథంలో మార్పు వస్తుంది. తను ఎదురుగా చూస్తున్నది కుండనే అయినా, ఆ కుండ మట్టికాక వేరే ఏమీకాదు. కుండ = మట్టి+నామరూపాలు అని అర్థం చేసుకుంటాడు.

అంతకుముందు కుండను చూస్తున్నాననుకున్నాడు, ఇప్పుడు మట్టిని చూస్తున్నానని అర్థం చేసుకున్నాడు. బరువు కుండది కాదు, మట్టిది; తను ముట్టుకున్నది కుండను కాదు, మట్టిని అని అర్థం చేసుకున్నాడు. అదేవిధంగా జ్ఞానికి తన మనస్సు మనస్సు కాదు, బ్రహ్మ+నామరూపాలు అని అర్థం అవుతుంది.

తదేవ అంటే అదేవిధంగా. మనస్సు బ్రహ్మగా మారదు, జ్ఞాని దృక్పథం మారుతుంది. కుండ మట్టిగా మారింది అంటే ఆ మార్పు అర్థం చేసుకోవటంలో వచ్చిన మార్పు అని చూశాము. అలాగే మనస్సు బ్రహ్మగా అయింది అంటే ఆ మార్పు అర్థం చేసుకోవటంలో రావాలి.

ఎందుకిలా దృక్పథంలో మార్పు రావాలి? దానికి జవాబు చెప్పకుండా, ఎదురు ప్రశ్నిస్తాము. తాడును తాడుగా చూడటానికీ, తాడును చూసి పాముగా పొరపాటు పడటానికీ మధ్య ఉన్న భేదం ఏమిటి అని మనం తిరిగి ప్రశ్నిస్తాము. తాడును తాడుగా చూస్తే ఏ భయమూ లేదు; తాడును పాముగా చూస్తేనే భయం ముంచుకువస్తుంది; వళ్ళంతా చెమటలు పడతాయి.

అదేవిధంగా మనస్సును బ్రహ్మగా చూస్తే ఏ భయమూ లేదు. ద్వైతాన్ని ద్వైతంగా చూస్తే భయం వేస్తుంది; ద్వైతాన్ని అద్వైతంగా చూస్తే ఏ విధమైన భయమూ ఉండదు. ఉన్నదొకటే వస్తువు. దాన్ని సరిగ్గా చూడకపోతే భయం వేస్తుంది; సరిగ్గా చూస్తే భయమేయదు. అద్వైత ఆత్మను అద్వైత ఆత్మగా చూస్తే భయం వేయదు; ద్వైతంగా చూస్తేనే భయం వేస్తుంది.

నిర్భయం బ్రహ్మ – భయహేతు కాదు. నిజానికి భద్రతకు ఆధారం. ఈ విధంగా అవనీభావః పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు. అవి –

1. నేను, నన్ను సంసారంలో పడవేసే మనస్సు కాదు.
2. మనస్సు బ్రహ్మ అని తెలుసుకోవటం.

మనస్సు మిథ్య అని తెలుసుకుంటే, మనోనాశనం చేసినట్టే అర్థం.

### కారిక 3.36

**అజమనిద్రమస్వప్నమనామకమరూపకమ్ ।**
**సకృద్విభాతం సర్వజ్ఞం నోపచారః కథంచన ॥**

జ్ఞాని జగత్తును తురీయంగా అర్థం చేసుకుంటాడు. ఈ తురీయమే మూడు వేషాలు వేసుకుందని మాండూక్య ఉపనిషత్తులో చూశాము.

| | | | |
|---|---|---|---|
| స్థూల ఆత్మ | - విశ్వ | -విరాట్ | - ప్రథమపాదం |
| సూక్ష్మ ఆత్మ | - తైజస | -హిరణ్యగర్భ | - ద్వితీయపాదం |
| కారణ ఆత్మ | - ప్రాజ్ఞ | -ఈశ్వర | - తృతీయపాదం |

తురీయం పాదత్రయ విలక్షణం, తురీయం స్థూలశరీరం కాదు, సూక్ష్మశరీరం కాదు, కారణశరీరం కాదు. ఆ అర్థాన్నే చూస్తాము ఈ మంత్రంలో.

**అజమ్** - అజమ్ అంటే పుట్టుకలేనిది. పుట్టుక ఉన్నది స్థూలశరీరానికి. అందువల్ల అజమ్ అంటే తురీయం, స్థూలశరీరం కాదు. స్థూలశరీరాన్ని విశ్వ అంటారు కాబట్టి తురీయం, విశ్వకాదు.

**అస్వప్నమ్** - స్వప్నాన్ని చూసేది సూక్ష్మశరీరానికి చెందిన మనస్సు. అస్వప్నమ్ అంటే తురీయం, సూక్ష్మశరీరం కాదు. సూక్ష్మశరీరాన్ని తైజస అంటారు కాబట్టి తురీయం, తైజస కాదు.

**అనిద్రమ్** - నిద్ర అంటే సుషుప్తి. సుషుప్తి కారణశరీరానికి చెందినది. అనిద్రమ్ అంటే తురీయం, కారణశరీరం కాదు. కారణశరీరాన్ని ప్రాజ్ఞ అంటారు కాబట్టి తురీయం, ప్రాజ్ఞ కాదు.

ఏడవమంత్రంలో ఈ మూడింటిని వరుసగా న బహిష్ప్రజ్ఞం నాంతఃప్రజ్ఞం న ప్రజ్ఞానఘనమ్ అని చూశాము.

**అవస్థాత్రయ విలక్షణమ్ అహమస్మి**
**శరీరత్రయ విలక్షణమ్ అహమస్మి**
**పాదత్రయ విలక్షణమ్ అహమస్మి**

అవస్థాత్రయం, శరీరత్రయం, పాదత్రయం - మిథ్యానామరూపాలు, నేను సత్య అధిష్ఠానమైన తురీయాన్ని.

**అనామకమ్** - స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం అనేవి నామాలు మాత్రమే. అనామకం అంటే నామరహితం.

ఆత్మయొక్క నాలుగు పాదాలను, ఓంకారంయొక్క నాలుగు మాత్రలతో పోల్చిచూశాము అంతకుముందు.

| | |
|---|---|
| విశ్వ | - అకారం |
| తైజస | - ఉకారం |

ప్రాజ్ఞ - మకారం
తురీయం - అమాత్ర

అమాత్ర అంటే నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని వివరించలేము కాబట్టి అనామకం. తురీయం ఆ విధంగా అనామకం.

**అరూపకమ్** - రూపం అంటే రంగు, రూపు. అవి గుణాలను సూచిస్తాయి. అందువల్ల అరూపకం అంటే గుణాతీతం. ఏడవమంత్రంలోని అవ్యపదేశ్యమ్ పదాన్ని ఇక్కడ అనామకమ్, అరూపకమ్‌గా వివరించారు గౌడపాదాచార్యులవారు. ఇటువంటి తురీయంయొక్క స్వరూపం ఏమిటి?

**సకృద్విభాతమ్** - నిత్యప్రకాశకం. జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థలన్నింటిలోనూ చైతన్యం తెలుస్తుంది. నిజానికి ఈ చైతన్యంవల్లనే ఆ మూడు అవస్థల్లో వ్యవహారం జరుగుతున్నది. అందువల్ల సకృద్విభాతమ్ అంటే సదా స్వయంప్రకాశకం.

**సర్వజ్ఞమ్** - సర్వజ్ఞమ్ పదాన్ని సర్వం+జ్ఞమ్‌గా విడదీయవచ్చు. సర్వం అంటే మొత్తం జడప్రపంచం; జ్ఞమ్ అంటే మొత్తం చేతనప్రపంచం.

**సర్వం చ తత్ చైతన్యం చ సర్వజ్ఞమ్**

ఈ సందర్భంలో సర్వజ్ఞంయొక్క అర్థం ప్రత్యేకంగా ఉంది. మామూలుగా సర్వజ్ఞం అంటే అన్నీ తెలిసినవాడు అని అర్థం కాని ఇక్కడ జడప్రపంచం, చేతనప్రపంచం అంతటా ఉంది తురీయం అని అర్థం.

వేదాంతం, జడపదార్థం కూడా చైతన్యం + నామరూపం అంటుంది. మనం జడపదార్థం విడిగా ఉంది అనుకున్నా కూడా, వేదాంతం అందులో కూడా చైతన్యం ఉంది అంటుంది. దీన్ని వివరంగా నాలుగవ అధ్యాయంలో చూస్తాము.

జడపదార్థాన్ని చైతన్యం అని ఎలా అంటారని ఎవరైనా అడిగితే, విజ్ఞానశాస్త్రం కనబడని శక్తే, కనబడే పదార్థంగా మారుతుంది అనదా అంటాము. వేదాంతం వారికన్నా ఒక అడుగు ముందుకు వేస్తుంది అంతే. కనబడని శక్తి, కనబడే పదార్థం రెండూ కూడా చైతన్యమే అంటుంది. అందువల్ల సర్వజ్ఞం అంటే చైతన్యం సర్వవ్యాపకం. అటువంటి చైతన్యంలో ఇంకొక ప్రత్యేకత ఉంది.

**న ఉపచారః కథంచన** - అటువంటి చైతన్యంలో కొంచెం కూడా వ్యవహారాలు జరగవు. వ్యవహారం నడపాలి అంటే, ద్వైతం ఉండాలి. జాగ్రదావస్థలో వ్యవహారాలు జరుగుతున్నాయి అంటే అక్కడ జాగ్రద్‌పురుషుడు + జాగ్రత్‌ప్రపంచం అనే ద్వైతం ఉంది. అలాగే స్వప్నావస్థలో స్వప్నపురుషుడు + స్వప్నప్రపంచం అనే ద్వైతం ఉంది. కారణావస్థలో ద్వైతం కనబడదు

కాని అది అవ్యక్తంలో ఉంది. అందువల్ల అవ్యక్త వ్యవహారం ఉంది. తురీయంలో వ్యక్తద్వైతమూ లేదు, అవ్యక్తద్వైతమూ లేదు.

వ్యవహారాలు రెండు రకాలు – లౌకిక వ్యవహారాలు, మతపరమైన వ్యవహారాలు. మతపరమైన వ్యవహారాలు మళ్ళీ రెండు రకాలు. అవి కర్మవ్యవహారాలు, ఉపాసన వ్యవహారాలు. కర్మవ్యవహారంలో షోడశోపచార పూజలు జరుగుతాయి. భక్తుడు–భగవంతుడు అనే ద్వైతం ఉంటుంది. ఉపాసనలో మానసికధ్యానం ఉంటుంది. ఉపాసకుడు–ఉపాస్య దేవత అనే ద్వైతం ఉంటుంది. కాని తురీయంలో ఉన్నదొకటే అద్వైతం కాబట్టి ఈ ద్వైతం ఉండదు. ద్వైతం ఉండదు కాబట్టి వ్యవహారం కుదరదు. అందువల్ల తురీయం సర్వవ్యవహార అతీతం.

**కారిక 3.37**

**సర్వాభిలాపవిగతస్సర్వచింతాసముత్థితః ।**
**సుప్రశాంతస్సకృజ్జ్యోతిస్సమాధిరచలోఽభయః ॥**

తురీయంలో వ్యవహారం ఉండదని చెప్పటానికి ఏడవమంత్రంలో ప్రపంచోపశమనమ్ పదం వేసింది ఉపనిషత్తు. ప్రపంచోపశమనమ్ అంటే ప్రపంచం లేదు.

తురీయంలో వ్యవహారాలు ఎందుకు లేవు? తురీయంలో వ్యవహారాలు నడిపే ప్రమాణాలు కూడా లేవు.

**సర్వ అభిలాపః విగతః** – అభిలాపః అంటే వాగింద్రియం. సర్వపదం వచ్చింది కాబట్టి అన్ని ఇంద్రియాలు అని అర్థం చేసుకోవాలి. అంటే పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు; విగతః అంటే లేదు అని అర్థం. అన్నీ కలిపితే తురీయంలో పది ఇంద్రియాలు లేవు.

పది ఇంద్రియాలు లేవు అంటే, ఆ మాటను అక్షరాలా తీసుకోకూడదు. అంటే తురీయం ఉంది కాని, ఇంద్రియాలు మాయమైపోయాయి అనుకోకూడదు. ఇంద్రియాలు ఉంటాయి, అవి అనుభవంలోకి వస్తాయి కాని వాటిని అనాత్మగా అర్థం చేసుకుంటాము కాబట్టి, అనాత్మ మిథ్య కాబట్టి, అవి ఉన్నా లేనట్టే.

సినిమా తెర ఉదాహరణ చూస్తే, తెరమీద సినిమా ఆడుతున్నా, ఈ సినిమాను మిథ్యగా అర్థం చేసుకున్నప్పుడు, దానిమీద పాత్రలు వచ్చిపోతున్నా కూడా, జ్ఞానికి అవి ఉన్నా, లేనట్టే అనిపిస్తుంది. అదే విధంగా జ్ఞాని జగత్తును చూస్తున్నా, జగత్తుతో వ్యవహారం నడుపుతున్నా కూడా జగత్తు లేదనే అంటాడు. లేదా జగత్తు మిథ్య, తురీయం సత్యం అంటాడు. ఎందుకంటే జగత్తు వ్యావహారిక సత్యం అయితే, తురీయం పారమార్థిక సత్యం. ఆ విధంగా తురీయంలో పది బాహ్య ఇంద్రియాలు లేవు. అంతేకాదు తురీయంలో ఆంతర అంగాలు కూడా లేవు.

**సర్వచింతాసముత్థితః** – మామూలుగా చింత అంటే ఆలోచన. కాని ఇక్కడ ఆలోచించే పరికరం అంటే బుద్ధి. ఏ భాషలోనైనా కూడా ఇలా ఒకే పదానికి అనేక అర్థాలు వస్తాయి. అలా చింత అంటే ఆలోచనాతీరు అవవచ్చు లేదా ఆలోచించే పరికరం అవవచ్చు. ఇక్కడ పరికరం. మొత్తం అంతఃకరణంగా తీసుకోవాలి. అంతఃకరణంలో మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం – నాలుగూ వస్తాయి. ఇందాక వాక్కు అంటే ఎలా పది ఇంద్రియాలూ తీసుకున్నామో, అలా చింత అంటే నాలుగు అంతఃకరణాలూ తీసుకోవాలి. సముత్థితః అంటే విముక్తి పొందినది అని అర్థం. అంటే అతీతం. తురీయం బాహ్యఇంద్రియాలకు, అంతఃకరణకూ అతీతం.

బాహ్యఇంద్రియాలు లేవు కాబట్టి తురీయాన్ని బాహ్యంగా పూజించలేము; అంతఃకరణ లేదు కాబట్టి మానసికంగా ఉపాసన చేయలేము. అందువల్ల ఎవరైనా నేను తురీయధ్యానం చేశాను, నాకు తురీయదర్శనం అయింది, తురీయం ఒక మెరుపులా మెరిసి మాయమయింది అని అంటే, వారికి తురీయం గురించి సరిగ్గా అర్థం కాలేదని అర్థం. సర్వాభిలాపవిగతః, సర్వచింతాసముత్థితః వాక్యం నోపచారః కథంచన పదానికి వివరణ. అంగాలు లేవు కాబట్టి ఎటువంటి పూజగాని, ధ్యానం కాని చేయలేము.

అందువల్లనే శంకరాచార్యులవారు నిర్గుణ మానసపూజను వర్ణించారు. పూజ చేయలేమని సూచించటానికి నిర్గుణ మానసపూజను వివరించారు. షోడశోపచారపూజలో ఒక్కొక్క అంగాన్ని తీసుకుని, అది కుదరదు అని ఖండించుకుంటూ వస్తారు. దీన్ని పరాపూజ అంటారు.

**ధ్యాయామి** – గుణాలు లేని బ్రహ్మ యొక్క ఏ గుణం మీద ధ్యానం చేస్తాము? అందువల్ల ధ్యానం చేయలేము.

**ఆసనం సమర్పయామి** – సర్వ అధిష్ఠాన బ్రహ్మకు ఏ ఆసనం అని వేస్తాము? అందువల్ల ఆసనం సమర్పించలేము.

**అర్ఘ్యం సమర్పయామి** – అంగాలు లేని బ్రహ్మకు చేతులు ఎలా కడుగుతాము? అందువల్ల అర్ఘ్యం సమర్పించలేము.

**పాద్యం సమర్పయామి** – అంగాలు లేని బ్రహ్మకు పాదాలు ఎలా కడుగుతాము? అందువల్ల పాద్యం సమర్పించలేము.

అలా షోడశోపచారాల్లో ఒక్కొక్కదాన్ని ఖండించుకుంటూ వస్తారు శంకరాచార్యులవారు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి, నిజానికి మనం షోడశోపచారపూజ పేరిట, షోడశ అపచారాలు చేస్తున్నాము అంటున్నారు. ఉపచారాన్ని అపచారంగా చూడగలగటమే ఉపచారం. అందువల్ల న ఉపచారః కథంచన.

ఈ అంగాలేమీ లేకపోతే తురీయం ఏమిటి? **సుప్రశాంతః,సకృజ్జ్యోతిః, సమాధిః, అచలః,అభయః.**

**సుప్రశాంతః** – చాలా శాంతంగా ఉంటుంది. అన్ని శబ్దాలకూ, అన్ని ఆలోచనలకూ అతీతంగా ఉంటుంది. ఏడవమంత్రంలోని **శాంతం శివమద్వైతమ్** పదాన్ని గుర్తుకు తెస్తుందీ పదం.

**సకృజ్జ్యోతిః** – నిత్యం ప్రకాశిస్తుంది. ఈ జ్యోతి వల్లనే తక్కినవన్నీ అనుభవంలోకి వస్తున్నాయి. ముందు కారికలోని సకృద్విభాతం అర్థమే ఈ పదం అర్థం కూడా.

**సమాధిః** – దీనికి రెండు అర్థాలు ఉన్నాయి. దీన్ని పక్కన పెట్టి ముందు, దాని తరువాత పదాలను చూద్దాము.

**అచలః** – చలనం లేనిది. చలనం ఉండాలి అంటే దానికి దేశపరిమితి ఉండాలి. ఆకాశానికే చలనం లేనప్పుడు, సర్వవ్యాపకమైన తురీయానికి చలనం ఎలా ఉంటుంది?

**అభయః** – భయం లేనిది. విశ్వగా జాగ్రద్ ప్రపంచం అంటే భయం; కాలం కోరల్లో చిక్కుకుంటాము. ప్రారబ్ధకర్మ ఎప్పుడూ భయపెడుతూ ఉంటుంది. తైజసగా పీడకలలను చూసి భయపడుతుంటాము. ప్రాజ్ఞలో తాత్కాలికంగా భయం ఉపశమించినా అది టైమ్‌బాంబ్ లాంటిది. ప్రస్తుతం సమస్య లేకపోయినా, ఎప్పుడు పేలుతుందో తెలియదు. ప్రాజ్ఞలో కూడా అవ్యక్తంగా సంచితకర్మ ఉండనే ఉంటుంది. అందువల్ల మూడు అవస్థల్లోనూ భయం ఉండనే ఉంటుంది. ఒక్క తురీయంలోనే భయం ఉండదు.

తురీయం దాకా అవసరం లేదు, వేరే వాటివల్ల అభయం పొందవచ్చు అంటే గౌడపాదాచార్యులవారు మిమ్మల్నేమీ ఊదరగొట్టరు. నిక్షేపంగా వెళ్ళిరండి అంటారు. ఎందుకంటే, మీ అనుభవమే ఇవాళ కాకపోతే రేపైనా నేర్పుతుంది. ధనం, హోదా, అనుబంధాలు – ఇవేవీ శాశ్వతమైన భద్రతను ఇవ్వలేవని జీవితంలో ఎదురుదెబ్బలు తిన్నాక, మీరే గ్రహించుకుంటారు. ఎప్పుడు గ్రహిస్తే అప్పుడే రండి. ఈ జన్మలో కాకపోయినా, వచ్చే జన్మలోనైనా రాకతప్పదు. తురీయం ఒక్కటే మీక్కావాల్సిన అభయాన్నివ్వగలదు. ఎవరంటున్నారీ మాటను? గౌడపాదాచార్యువారు. ఇప్పుడు మనం ఇందాక వదిలేసిన సమాధి పదానికి వెళదాము.

**సమాధి** – దీనికి రెండు అర్థాలు చెప్పవచ్చని చూశాము. 1. సర్వ అధిష్ఠానం, 2. చిత్తైకాగ్రత.

1. **సర్వ అధిష్ఠానం – సమాధీయతే అస్మిన్ ఇతి వా సమాధిః** – సమాధీయతే అంటే అన్నింటికీ ఆధారం. తురీయం మూడు ప్రపంచాలకు, మూడు శరీరాలకు అధిష్ఠానం. తార్కికంగా చూసినా కూడా తురీయం మాత్రమే సత్యం, తక్కినదంతా మిథ్య. మిథ్యావస్తువుకు

అధిష్ఠానంగా సత్యవస్తువే ఉండాలి. అధిష్ఠానాన్ని ఇక్కడ సమాధి అంటున్నారు. తాడు–పాములో పాముకు సమాధి తాడు; స్వప్నప్రపంచానికి సమాధి జాగ్రద్‌పురుషుడు. అలాగే మిథ్యాజగత్తుకు సమాధి తురీయం. సమాధి ఒక అర్థం సర్వ అధిష్ఠానం.

2. **చిత్తైకాగ్రత** – ఇది అందరికీ తెలిసిన అర్థం. ఏకాగ్రత ఉన్న మనస్సు.

తురీయాన్ని ఏకాగ్రత అని ఎలా అనగలము? ఎందుకంటే ఏకాగ్రత ఉన్న మనస్సుతోనే తురీయజ్ఞానాన్ని పొందగలము. వేదాంతశిష్యునికి ఉండాల్సిన లక్షణాలలో ఇది ఒకటి. తత్త్వబోధలో ఈ లక్షణాన్ని సమాధానం అంటారు. జ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హతను సాధన చతుష్టయసంపత్తి అంటారు. అవి వివేకం, వైరాగ్యం, శమాదిషట్కసంపత్తి, ముముక్షుత్వం. శమాదిషట్కసంపత్తిలో శమము, దమము, ఉపరమము, తితీక్ష, శ్రద్ధ, సమాధానము వస్తాయి. ఆ సమాధానమే ఈ సమాధి. సమాధి రెండవ అర్థం – ఏకాగ్రతతో నేర్చుకునేది. ఇక్కడ ఏకాగ్రత అంటే ఒంటరిగా ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చోవటం కాదు. ఏకాగ్రతతో వేదాంతశ్రవణం చేయటం.

సమాధి రెండు అర్థాలూ టూకీగా మళ్ళీ చూస్తే –

1. తురీయం అంటే అన్నింటికీ అధిష్ఠానం.
2. తురీయం అంటే ఏకాగ్రతతో వేదాంత శ్రవణం ద్వారా నేర్చుకునేది.

**కారిక 3.38**

**గ్రహో న తత్ర నోత్సర్గశ్చింతా యత్ర న విద్యతే ।**
**ఆత్మసంస్థం తదా జ్ఞానమజాతి సమతాం గతమ్ ॥**

కారిక 35 రెండవపాదంలో తురీయవర్ణన ఈ విధంగా మొదలుపెట్టారు.

**తదేవ నిర్భయం బ్రహ్మ జ్ఞానాలోకం సమన్తతః** – 35

అది ఈ కారికలో మొదటిపాదం వరకూ కొనసాగుతున్నది.

**గ్రహో న తత్ర నోత్సర్గశ్చింతా యత్ర న విద్యతే** – 38

ఈ పాదం అర్థం వ్యవహారం నడిపే పరికరాలు – బాహ్యంగా కాని, ఆంతరంగా కాని లేవు కాబట్టి, తురీయంలో ఆలోచనలు లేవు.

**చింతా** – ఇక్కడ చింతా అంటే ఆలోచనలు. న తత్ర చింతా అంటే తురీయంలో ఆలోచనలు లేవు. ముందు కారికలో చింత అంటే ఆలోచనలు చేసే పరికరం (బుద్ధి) అన్నాము. ఇక్కడ చింత అంటే ఆలోచనలే.

**న విద్యతే** – తురీయంలో ఆలోచనలు లేవు. సూక్ష్మశరీరం ఉంటేనే ఆలోచనలు వస్తాయి.

**న గ్రహః న ఉత్సర్గః** – పట్టుకోవటం లేదు, విడిచిపెట్టటం లేదు. అంటే వ్యవహారం లేదు. దీన్నే ముందు కారికలో న ఉపచారః అని చూశాము. ఇక్కడ కూడా వ్యవహారాలు లేవు అని వస్తున్నది.

వ్యవహారాలను రెండు రకాలుగా చేస్తాము – ఇచ్చి, పుచ్చుకోవటం అంటాము. గ్రహము అంటే పుచ్చుకోవటం, ఉత్సర్గము అంటే ఇవ్వటం. ఇక్కడ తురీయంలో పుచ్చుకోవటం లేదు, ఇవ్వటం లేదు అంటే వ్యవహారం లేదు అని అర్థం.

లలితాసహస్రనామంలో తుర్య అని వస్తుంది. తుర్య అంటే తురీయం; సర్వావస్థ వివర్జిత అంటే అవస్థాత్రయ విలక్షణం. రెండూ కలిపితే అవస్థాత్రయ విలక్షణ తురీయం. లలితా సహస్రనామంలో చాలా పదాలు మాండూక్యం నుంచి వచ్చాయి. తమాషా చూడండి, ఇష్టదేవతామూర్తికి అంటే ఏకరూప ఈశ్వరునికి చేసే స్తోత్రంలో అరూప ఈశ్వరవర్ణన వస్తున్నది. గ్రహః ని ఉపాదనం అనీ ఉత్సర్గః ని హానం అనీ అంటారు.

హానోపాదాన నిర్ముక్తా – లలితా త్రిశతి

హేయోపాదేయ వర్జితా – లలితా సహస్రనామం

వీటన్నిటిలోనూ ఒకటే భావం. ఇవ్వటం లేదు, తీసుకోవటం లేదు. న గ్రహః న ఉత్సర్గః అంటే ఇదీ అర్థం. అంటే తురీయంలో వ్యవహారం లేదు. దీన్నే అవ్యవహార్యమ్ అని ఏడవ మంత్రంలో చూశాము.

**తదా** – జ్ఞానకాలే, జ్ఞానం పొందిన సమయంలో

**జ్ఞానమ్ ఆత్మసంస్థమ్** – ఈ జ్ఞానం తురీయ ఆత్మ యందు, అంటే స్వస్వరూపంలో నిలిచి ఉండే జ్ఞానం. **అహం తురీయమ్ అస్మి** జ్ఞానం ఇది. ఇలా తురీయజ్ఞానంలో నిలిచి ఉండేదాన్ని అఖండాకారవృత్తి లేదా జ్ఞానవృత్తి అంటారు. తురీయం అన్నా, ఆత్మ అన్నా, బ్రహ్మ అన్నా ఒకటే.

**అజాతి సమతాం గతమ్** – ఇది చాలా సూక్ష్మమైన అంశం. జ్ఞానం పొందినప్పుడు, జ్ఞానిగా నేను అన్నింటినీ బ్రహ్మగా చూస్తాను. అనేక నామరూపాలున్నా కూడా, అంతటా ఉన్నది బ్రహ్మే. మిథ్యా నామరూపాలు అనేకం, కాని సత్యవస్తువు ఒకటే. అది తురీయబ్రహ్మ.

ఈ జ్ఞానం మనస్సులో, వృత్తిరూపంలో కలుగుతుంది. ఆ మాటకొస్తే ఏ జ్ఞానమైనా వృత్తిరూపంలోనే కలగాలి. ఘటజ్ఞానం ఘటాకారవృత్తి; పటజ్ఞానం పటాకారవృత్తి అయితే తురీయజ్ఞానం తురీయాకారవృత్తి. దీన్నే వృత్తిజ్ఞానం అంటారు.

జ్ఞానం పొందాక మనస్సు, శరీరం, జగత్తు, నేను ఇలా అనేకం ఉండవు. అన్నీ తురీయమే. మనస్సు తురీయం, శరీరం తురీయం, జగత్తు తురీయం, నేను తురీయం. భేదం ఉంటే ఇవన్నీ తురీయం + నామరూపం మాత్రమే.

అజాతి – అంటే తురీయం. అన్నీ తురీయమే. నేను తురీయం అనే జ్ఞానం కూడా తురీయమే.

సమతాం గతమ్ – ఎన్నటికీ మారని బ్రహ్మ. అజాతి పదానికి సమతాం గతమ్ విశేషణం. అందువల్ల సమతాం గతమ్ అజాతి అంటే మార్పులేని తురీయం. అందువల్ల నేను బ్రహ్మను అని నేను చెబితే, ఈ జ్ఞానం కూడా తురీయమే. భేదం ఉన్నది మిథ్యా నామరూపాల్లో మాత్రమే. దీన్నే **ఆత్మ సత్యానుబోధ** అంటారు.

**కారిక 3.39**

**అస్పర్శయోగో వై నామ దుర్దర్శస్సర్వయోగిభిః ।**
**యోగినో బిభ్యతి హ్యస్మాదభయే భయదర్శినః ॥**

ఈ కారికతో ఈ అంశాన్ని ముగిస్తున్నారు గౌడపాదాచార్యులవారు. కారిక 32లో ఆత్మజ్ఞానాన్ని **ఆత్మ సత్యానుబోధ** అన్నారు. ఇప్పుడు ఇదే ఆత్మజ్ఞానాన్ని **అస్పర్శయోగం** అంటున్నారు.

అస్పర్శః అంటే అసంగ ఆత్మ, తురీయ ఆత్మ. స్పర్శః అంటే సంగః; అస్పర్శః అంటే అసంగః. అసంగః అంటే బంధకత్వం లేనిది. బంధకత్వం లేనిది తురీయం కాబట్టి, అస్పర్శః తురీయాన్ని సూచిస్తుంది; యోగః అంటే జ్ఞానం. కాబట్టి అస్పర్శ యోగః అంటే తురీయజ్ఞానం.

జాగ్రదావస్థలో విశ్వ, జాగ్రద్ శరీరంతో జాగ్రద్ ప్రపంచంతో సంబంధం పెట్టుకుంటాడు; స్వప్నావస్థలో తైజస, స్వప్నశరీరంతో స్వప్నప్రపంచంతో సంబంధం పెట్టుకుంటాడు. సుషుప్తి అవస్థలో ప్రాజ్ఞకు ప్రత్యక్షంగా ద్వైతం ఉండదు కాని, అది అవ్యక్తావస్థలో ఉంటుంది. ఒక్క తురీయంలోనే ద్వైతప్రపంచం ఉండదు; ద్వైతసంబంధాలు ఉండవు. ఉన్నదొకటే తురీయం కాబట్టి అది అసంగం.

**న మృత్యుర్న శంకా న మే జాతి భేదః**
**చిదానందరూపః శివోఽహం శివోఽహమ్**

నాకు తండ్రి లేదు, తల్లి లేదు, పుత్రుడు లేదు, పుత్రిక లేదు, గురువు లేదు, శిష్యుడు లేడు. మరి అయితే నేను ఎవరు? చిదానందరూపః శివోఽహం శివోఽహమ్. ఈ జ్ఞానం పొందటాన్నే అస్పర్శయోగం అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అస్పర్శయోగో వై నామ** – ఈ జ్ఞానం అస్పర్శయోగంగా ప్రసిద్ధి చెందింది. నామ అంటే ప్రసిద్ధి చెందింది. ఈ జ్ఞానం పొందిన వ్యక్తి నేను సంబంధాలకు అతీతుణ్ణి అని అర్థం చేసుకుంటాడు.

కాని ఇది అంత గొప్ప జ్ఞానమైనా కూడా, దీన్ని అందరూ అంత తేలికగా అర్థం చేసుకోలేరు.

**దుర్దర్శః** – అర్థం చేసుకోవటం చాలా కష్టం. సాధకులందరికీ అందుబాటులో లేదు.

**సర్వయోగిభిః** – ఇక్కడ యోగి అంటే సాధకుడు. ఇది చాలా సూక్ష్మమైన జ్ఞానం కాబట్టి, అందరికీ అంత తేలికగా అర్థం కాదు. అర్థం కాదు సరికదా, చాలామంది ఈ జ్ఞానం పొందటానికి భయపడతారు.

తమాషా ఏమిటంటే, ఆత్మజ్ఞానం భయవిముక్తులను చేస్తుందని శాస్త్రం చెబితే, ఆత్మజ్ఞానం పొందటానికి భయపడతారు చాలామంది. భయం లేని దీనిలో భయాన్ని దర్శించి, భయపడతారు.

**యోగినో బిభ్యతి హి అస్మాత్** – సాధకులు ఆత్మజ్ఞానం పొందటానికి భయపడతారు. ఆత్మజ్ఞానం పొందితే అన్ని అనుబంధాలను వదులుకోవాలనే భ్రమలో ఉంటారు.

మామూలుగా మనిషి ఆలోచనలు ఎలా ఉంటాయంటే, ఎంతమంది తన చుట్టూ ఉంటే, తనకు అంత భద్రత ఉంటుంది అనుకుంటాడు. అలాంటి వ్యక్తి వేదాంతం నువ్వు అసంగుడివి అంటే అసంగత్వం పెంపొందించుకోవాలేమో, మనుష్యుల నుంచి దూరం తొలగాలేమో అని అపార్థం చేసుకుని, తురీయంతో అసంగత్వం పెంచుకుంటాడు. అటువంటి వ్యక్తి ద్వైతభావనలోనే సుఖముంది అనుకుంటాడు.

వేదాంతబోధకూ, సగటు మానవుని ఆలోచనకూ మధ్య చాలా దూరం ఉంది. బంధాలు లేకపోతే, జీవితం శూన్యం అనిపిస్తుంది సగటు మానవునికి. సన్న్యాసం స్వీకరించాలన్నా అందుకే భయపడతాడు. సన్న్యాసికి నా అనేవారు ఉండకూడదు. భగవంతునితో కూడా అనుబంధం ఉండదు అతనికి. అటువంటి ఒంటరి జీవితాన్ని ఊహించుకోలేడు మనిషి. అందువల్లనే ఏ తల్లిదండ్రులకు కూడా వారి పిల్లలు సన్న్యాసం స్వీకరించటం ఇష్టముండదు. తక్కిన సన్న్యాసులను గౌరవిస్తారు, పూజిస్తారు, భిక్షకు ఆహ్వానిస్తారు కాని వారి పిల్లలు సన్న్యాసం స్వీకరిస్తారేమోననే తలంపునే భరించలేరు.

వేదాంతం బంధుత్వం ఉంటే అది బంధకత్వం అయిపోతుంది అంటుంది. అందుకే చుట్టాలను బంధువులు అంటుంది. బంధువులంటే సంసారం అంటే బంధంలో పడవేసే వ్యక్తులు. ఎందుకు?

బ్రహ్మచారిగా ఉన్నప్పుడు మనిషి తన ఒక్కడి గురించే బెంగపడితే, పెళ్ళి అయ్యాక భార్య బరువు బాధ్యతలను అందుకుంటాడు కాబట్టి, ఆమె గురించీ, ఆమె వైపు వారి గురించీ కూడా బెంగపడతాడు. కొంతమంది అయితే బెంగల్లోనే జీవిస్తారు. ఆ జంటలో ఒకరు

ముందు చనిపోతే, రెండవవారి భవిష్యత్తు ఏమిటని బెంగపడతారు; దాని గురించి సుదీర్ఘంగా చర్చించుకుంటూ ఉంటారు కూడా. అలా మనిషి బెంగల్లో మునిగి తేలుతూ ఉంటాడు. అందువల్ల బంధుత్వం ఉంటే సంగత్వం అవుతుందనీ, సంగత్వం ఉంటే అది సంసారం అవుతుందనీ అంటుంది. అందువల్ల ద్వైతం, సంగత్వం సంసారంలోకి వస్తాయి. అద్వైతం, అసంగత్వం మోక్షంలోకి వస్తాయి.

ఈ విషయం తెలియని సగటు మానవుడు ద్వైతం, సంగత్వం ఉంటే భద్రత అనీ, అద్వైతం, అసంగత్వం ఉంటే అభద్రత అనీ భ్రమపడటమే కాక, ఆ భ్రమలోనే జీవిస్తాడు. అందువల్ల చాలామంది అద్వైతానికి రారు. ఒకవేళ వచ్చినా కూడా, అద్వైతం నేర్చుకుంటారు కాని, బంధకత్వాన్ని వదులుకోవటానికి ఇష్టపడరు. అదే అంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**అభయే భయదర్శినః** – భయం లేని దీనిలో వారు భయాన్ని దర్శిస్తూ భయపడుతున్నారు. అందువల్ల వేదాంతం వర్ణించే మోక్షానికి మొగ్గు చూపించరు. వారి ఉద్దేశ్యంలో మోక్షం అంటే స్వర్గలోకానికి వెళ్ళటం. ఎందుకంటే అక్కడ తనతో పాటు తన ఆత్మీయులు ఉంటారు. అటువంటివారు ఇక్కడ, భూలోకంలో కూడా, ఒక్కక్షణం కూడా ఒంటరిగా ఉండలేరు. ఒకవేళ అలా ఉండాల్సివస్తే ఏ టీవీనో మ్రోగిస్తారు.

ఇలా అద్వైతం గురించి భయపడేటట్టయితే, వారికి మార్గం ఏమిటి? వారు బాగుందనుకున్న ద్వైతంలోనే కొనసాగి, ఎదురుదెబ్బలు తిన్నాక, వారే వస్తారు. కాకపోతే ఆ రావటం ఈ జన్మలోనే రావచ్చు లేదా కొన్ని జన్మలు పట్టవచ్చు. కాని ఎప్పుడైనా సరే, ఏ జన్మలోనైనా సరే అద్వైతానికి రాకతప్పదు. అదొక్కటే మోక్షమార్గం.

**సమ్యక్ బంధః సంబంధః** సంబంధాలు బంధాల్లో పడవేస్తాయని గ్రహిస్తే కాని వారికి అద్వైతంమీద శ్రద్ధ ఏర్పడదు. అద్వైతంమీద శ్రద్ధ ఏర్పడితే కాని, అద్వైత ప్రకరణం అనే ఈ అధ్యాయం అర్థం కాదు. ఇక్కడితో ఆత్మజ్ఞానం అనే అంశాన్ని ముగిస్తున్నారు.

### 4. నిదిధ్యాసనం – కారికలు 40–47

ముందు కారికల్లో (31–39) ఆత్మజ్ఞానం శ్రవణ, మననాల ద్వారా ఎలా పొందాలో వివరించారు. శ్రవణ, మననాల పదాలు ప్రత్యేకించి గౌడపాదాచార్యులవారు ఉపయోగించక పోయినా, ఆత్మ సత్యానుబోధ శ్రవణ, మననాల ద్వారానే సాధ్యం అని మనకు తెలుసు. ఇటువంటి ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం మోక్షం. ఇక్కడ వాడిన పదం అమనీభావః. అమనీభావం అంటే మనస్సు ఇంక సంసారంలో పడవేయదు అని అర్థం.

ఇప్పుడు కారికలు 40–47లో నిదిధ్యాసనం గురించి వివరించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. ఇందులో మొదటి రెండు కారికలు ఉపోద్ఘాత కారికలు.

ఆత్మజ్ఞానం పొందితే రెండు ఫలాలు కలుగుతాయి. అవి ముఖ్యఫలం, అవాంతరఫలం.

**ముఖ్యఫలం** – ముఖ్యఫలం ఆత్మజ్ఞానమే. నేను తురీయ చైతన్యం, నేను సత్యం, నేను అసంగం, నేను శరీరత్రయవిలక్షణం. సత్యతురీయమైన నన్ను మిథ్యాశరీరాలు, వాటి సమస్యలు బాధించవు. అందువల్ల మిథ్యాశరీరాలకు ఏమైనా, సత్యతురీయమైన నన్ను అవి బాధించలేవు. ఇంకో విధంగా చెప్పాలంటే నేను నిత్యవిదేహాన్ని. విదేహః అంటే దేహత్రయరహితః.

జనక మహారాజును విదేహరాజు అని కూడా అంటారు. ఎందుకంటే అతను శరీరత్రయ విలక్షణమైన తురీయాన్ని నేను అనే జ్ఞానంలో రమిస్తాడు కాబట్టి. మిథ్యాశరీరం ఉన్నా లేనట్టే జ్ఞానికి. విదేహముక్తి అంటే జ్ఞాని మరణం తర్వాత పొందుతాడు అని మామూలు అర్థం; కాని జ్ఞాని మరణం గురించి కూడా ఆలోచించడు. జీవించి ఉండగానే, శరీరత్రయాలకు అతీతంగా ఎదుగుతాడు. నేను నిత్యవిదేహుడిని అంటాడు. ఈ ఫలం జ్ఞానం పొందగానే కలుగుతుంది. దీనికోసం ఏ కర్మకూడా చేయనవసరం లేదు.

జ్ఞాని సంసారం నుంచి విడివడి, మోక్షం పొందుతాడు అంటే మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే ఫలం కాదు. పూర్ణత్వం నా స్వరూపం, నేను నిత్య, ముక్త, శుద్ధ తురీయ చైతన్యాన్ని అని అర్థం చేసుకోవటమే మోక్షం.

**అవాంతరఫలం** – ఆత్మజ్ఞానం కూడా తక్కిన జ్ఞానాల్లాగా బుద్ధిలో కలుగుతుంది. ఈ జ్ఞానం ఎంత శక్తివంతమైనది అంటే, బుద్ధిలో కలిగిన జ్ఞానం ద్వారా మనస్సులో రేగే భావోద్రేకాలను అదుపులో పెట్టగలదు. అంటే మనస్సులో శాంతి, అభయం, సమత్వం వంటి మంచి గుణాలను నెలకొనేలా చేస్తుంది. ఆ విధంగా ఆత్మజ్ఞానం మనస్సును దృఢపరుస్తుంది; మనస్సును సంస్కరిస్తుంది; మనస్సును శాంతిపరుస్తుంది. ఇది అవాంతర ఫలం.

దీన్ని అవాంతరఫలం అని ఎందుకు అంటున్నామంటే, వేదాంతం ప్రధాన ఉద్దేశ్యం మీ మనస్సును ఎలా దృఢపరచాలో నేర్పించటం కాదు, మీరు అసలు మనసే కాదు అని నేర్పించటం. ఈ రెండింటి మధ్యనున్న భేదాన్ని గమనించారా? మీ మనస్సును దృఢపరచుకోవటం కన్నా, మీరు మనస్సే కాదు అని అర్థం చేసుకోగలిగితే మనస్సు మాట వినదు అని మీరు బాధపడనవసరం లేదు. అలాగని మనస్సును దృఢపరచుకోవటాన్ని పూర్తిగా నిర్లక్ష్యమూ చేయదు వేదాంతం. దీన్నే జీవన్ముక్తి అంటుంది. దీన్ని అవాంతరఫలంగా పేర్కొంటుంది.

తమాషా ఏమిటంటే వేదాంతం దీన్ని అవాంతరఫలం అన్నాకూడా, చాలామంది ఈ ఫలానికే మొగ్గు చూపుతారు. వారు కోరుకునేది మానసిక ప్రశాంతత, రాగద్వేషాలను పారద్రోలి దయ, ప్రేమ, శాంతి పెంపొందించుకోవాలనుకుంటారు. అందువల్ల వీటి గురించి

కూడా వస్తుంది శాస్త్రంలో. నిజానికి కృష్ణపరమాత్మ ఈ జీవన్ముక్తి ఫలాన్ని అనేక చోట్ల ప్రస్తావించాడు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥** – గీత 12.13

క్షమాగుణం మనస్సుదా, ఆత్మదా? మనస్సుదే. ఈ అవాంతరఫలం పొందిన మనస్సు అరోగ్యకరంగా, దృఢంగా ఉండటం వల్ల మనస్సు తేలికగా ఉంటుంది. ఈ ఫలాన్ని జీవన్ముక్తి అంటారు.

కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వేదాంతం నేర్చుకున్న విద్యార్థులందరికీ జీవన్ముక్తిఫలం సమానంగా ఉండదు. అంటే మనస్సు అందరికీ ఒకే విధంగా దృఢపడదు. శాంతి, అభయం వంటివి కొంతమంది ఎక్కువగా అనుభవిస్తే, కొంతమందికి చాలా తక్కువగా ఉంటుంది. అంటే ఈ జీవన్ముక్తి ఫలంలో స్థాయీభేదాలు ఉంటాయి.

అందరికీ ఒకే స్థాయిలో ఫలం ఎందుకు కలుగదు? ఈ ఫలం రానివారిని వారి కుటుంబ సభ్యులు విమర్శిస్తారు కూడా. ఇంత వేదాంతం నేర్చుకుని కూడా కోపం, చిరాకు, నిరాశ, భయం, ఆందోళన ఏమాత్రం తగ్గలేదు అని వారిని విమర్శించటమే కాకుండా, శాస్త్రాన్నీ, గురువునూ కూడా విమర్శిస్తారు.

ఎక్కడ ఉంది లోపం? అందరు పొందే జ్ఞానం ఒకటే. అర్థం చేసుకునేది ఒకటే.

**అహం శరీర విలక్షణః అవస్థాత్రయ సాక్షీ, సచ్చిదానంద స్వరూపః**

ఈ నిర్వచనాలన్నీ చక్కగా నేర్చుకుంటారు, అదికూడా కొన్ని సంవత్సరాలపాటు. తర్వాత వాటిని చిలకలా వల్లిస్తారు కూడా. వారు పొందిన జ్ఞానం సమానమైతే, వారు పొందే ఫలం ఎందుకు సమానంగా లేదు? లోపం గురువులో ఉందా, శాస్త్రంలో ఉందా, ఆత్మలో ఉందా? అందరిలోనూ ఉన్నది ఒకటే సర్వవ్యాపకమైన ఆత్మ. శాస్త్రం చెప్పేదీ అదే. గురువు చెప్పేదీ అదే! మరి ఎక్కడ పొరపాటు జరుగుతున్నది?

శాస్త్రం, వేదాంతబోధ చేసేముందు, సాధన చతుష్టయసంపత్తి అని ఒక విషయాన్ని పేర్కొంటుంది. ఈ సాధన చతుష్టయసంపత్తి శాస్త్రం నేర్చుకునే శిష్యునికి ఉండాల్సిన అర్హతను సూచిస్తుంది. అది ఉంటేనే శిష్యుడు వేదాంతం నేర్చుకోవటానికి అధికారి అవుతాడు. దాన్ని వివరంగా తత్త్వబోధలో నేర్చుకుంటాడు శిష్యుడు. కాని దాన్ని అంతగా పట్టించుకోడు శిష్యుడు. అందువల్ల దాన్ని తత్త్వబోధలోనే మర్చిపోతాడు.

సాధన చతుష్టయ సంపత్తి ఎంత బాగా ఉంటే, అంత ఎక్కువగా జీవన్ముక్తి ఫలాన్ని అనుభవిస్తాడు శిష్యుడు. కాబట్టి జీవన్ముక్తి ఫలంలో హెచ్చుతగ్గులు ఉండటానికి కారణం,

అర్హతలో హెచ్చుతగ్గులు ఉండటమే. ఈ హెచ్చుతగ్గులను బట్టి, విద్యార్థులను మూడు తెగలుగా విభజించింది శాస్త్రం. వారిని మంద, మధ్యమ, ఉత్తమ అధికారులుగా పేర్కొంటుంది. ఇక్కడ గౌడపాదాచార్యులవారు వారికి వాడిన పదాలు వరుసగా హీన, మధ్యమ, ఉత్కృష్ట. ఈ పదాలను వివరంగా చూద్దాము.

**ఉత్తమ అధికారి** - వేదాంత శ్రవణంలోనే ఉత్తమ అధికారికి ఇటు జ్ఞానమూ, అటు జ్ఞానఫలమూ కలుగుతాయి. జ్ఞానం పొందగానే ఉత్తమ అధికారి కేనోపనిషత్‌లోని శిష్యునిలా గర్జిస్తాడు,

**నాహం మన్యే సువేదేతి నో న వేదేతి వేద చ**
**యోనః తద్వేద తద్వేద నో న వేదేతి వేద చ** - కేన 2.2

నాకు బ్రహ్మ తెలుసునని చెప్పను, నాకు బ్రహ్మ తెలియదని చెప్పను. నాకు తెలుసు, నాకు తెలియదు అంటాడు. దాని అర్థం నాకు తెలుసు బ్రహ్మ ఆబ్జెక్టు కాదని. నాకు తెలుసు బ్రహ్మ సబ్జెక్టని.

అంతేకాదు, అతను జీవన్ముక్తి ఫలాన్ని కూడా అనుభవిస్తాడు.

**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే** - గీత 2.56

రాగం, భయం, క్రోధాలనుంచి విడివడతాడు. ఇటువంటి ఉత్తమ అధికారి గురించి మనం పట్టించుకోనవసరం లేదు. అతను మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణుడవుతాడు.

**మంద అధికారి** - మధ్యమ అధికారిని వదిలేసి మంద అధికారికి వెళదాము. మంద అధికారిలో సాధన చతుష్టయ సంపత్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల అతను వేదాంతబోధను కూడా సరిగ్గా అర్థం చేసుకోలేడు. అతను కుటుంబసభ్యులతో అవస్థలు పడుతుంటాడు. అటువంటి వ్యక్తికి వేదాంతంలో వచ్చే నిమిత్తకారణం, ఉపాదానకారణం, సత్యం, మిథ్య, ఆత్మ పదాలు ఏ మాత్రమూ తలకెక్కవు. పైపెచ్చు ఇవి నేర్చుకుంటే నాకేమిటి లాభం, నా కూతురు పెళ్ళి అవుతుందా, నా నీళ్ళ సమస్య తీరుతుందా అని ఎదురు ప్రశ్నిస్తాడు. అతనికి వేదాంతం ఆచరణలో పెట్టటానికి వీలులేని జ్ఞానం అనిపిస్తుంది; ముఖ్యంగా మాండూక్యంలోని ఈ మూడవ అధ్యాయం.

ఒక్కమాటలో చెప్పాలంటే అతనికి వేదాంతం వంటబట్టదు. అతనిలో సాధన చతుష్టయ సంపత్తి అనే ఇంధనం ఇంచుమించుగా శూన్యం. అది ఎర్రరంగులోకి వెళ్ళిపోతుంది. ఇటువంటి మంద అధికారి ముందుకు సాగాలంటే, ముందు సాధన చతుష్టయ సంపత్తి అనే ఇంధనాన్ని పోయించుకోవాలి. ఆ ఇంధనం కర్మయోగం, ఉపాసనయోగం ద్వారా వస్తుంది. అంటే అతని దృష్టిని కర్మయోగం, ఉపాసనయోగం వైపు మరల్చాలి. అలాగని

పూర్తిగా వేదాంత శ్రవణం మాననవసరం లేదు. తన లక్ష్యాన్ని గుర్తు చేసేందుకు వేదాంత శ్రవణం కూడా చేసినా, ఎక్కువగా కర్మ, ఉపాసనలమీద ఏకాగ్రత చూపాలి.

నిజానికి ఈ విషయం మనం అతనికి విడమర్చి చెప్పనవసరం లేదు. ఎందుకంటే అతను వేదాంత శ్రవణంవల్ల లాభం పొందకపోతే, అతనే మానేస్తాడు. నిజానికి అతను మాననవసరం లేదు కూడా. వేదాంత శ్రవణమే ఒక విధమైన కర్మయోగం అని చెప్పవచ్చు. అంటే ఈ మంద అధికారికి వేదాంత శ్రవణం జ్ఞానయోగంగా కాకుండా, కర్మయోగంగా పనిచేస్తుంది.

**మధ్యమ అధికారి** – మధ్యమ అధికారికి కొంతమేరకు సాధన చతుష్టయ సంపత్తి ఉంటుంది. అందువల్ల అతనికి వేదాంతం మీద శ్రద్ధ ఏర్పడుతుంది. జ్ఞానం కూడా బాగానే అబ్బుతుంది. అంటే అతనికి ముఖ్యఫలం కలుగుతుంది కాని అవాంతరఫలమైన జీవన్ముక్తి కలగదు. అంటే జ్ఞానం ఉంది కాని, జ్ఞానఫలం అనుభవించలేడు. ఆత్మ లక్షణం బాగానే అర్థమయింది, అవసరమైతే నలుగురికి బోధ కూడా చేయగలడు కాని, ఆ కానీ దగ్గరే ఆగిపోతాడు. 'నా బెంగలను, కోపాన్ని, ఆందోళనలను పారద్రోలలేకపోతున్నాను,' అంటాడు. అతని విషయంలో జ్ఞానమూ, సంసారమూ కూడా విజయవంతంగా కలిసివుంటాయి. ఇది చాలా ప్రత్యేకమైన పరిస్థితి.

టూకీగా చెప్పాలంటే, ఉత్తమ అధికారి జ్ఞానమూ, జ్ఞానఫలమూ పొందితే; మంద అధికారి జ్ఞానాన్నే పొందలేడు. అందువల్ల జ్ఞానఫలాన్ని కూడా అనుభవించలేడు. అందువల్ల వీరి గురించి పట్టించుకోనవసరం లేదు. మధ్యమ అధికారి మధ్య దశలో ఉంటాడు. అంటే అతను జ్ఞానం పొందుతాడు కాని జ్ఞానఫలాన్ని అనుభవించలేడు. ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఈ మధ్యమ అధికారికి జ్ఞానఫలం పొందే మార్గాన్ని సూచిస్తున్నారు.

ఈ మధ్యమ అధికారికి బుద్ధిలో కలిగిన జ్ఞానం మనస్సులోకి ఇంకక పోవటానికి కారణం ఎక్కడో ఏదో అడ్డం తగులుతోంది. ఉదాహరణకు మీరు, మీ ఇంట్లో కుళాయి తిప్పితే మీకు నీరు రావటం లేదనుకుందాం. పైన ట్యాంకులో నీళ్ళు లేవేమో అనుకోవటానికి, మీరే స్వయంగా కింద సంపులోంచి పైకి నీళ్ళు ఎక్కించారు. నీళ్ళుండి, కుళాయి తిప్పితే నీరు రాకపోతే, దానికి ఒకటే కారణాన్ని ఊహించవచ్చు. కుళాయిగొట్టంలో ఎక్కడో ఏదో అడ్డుకుంటోందన్నమాట. మీరు ఇంకా నీళ్ళు నింపినా లాభంలేదు, ఉన్న అడ్డంకి తొలగించాలి.

ఇక్కడ మీ మనస్సు విషయంలో కూడా పరిస్థితి అంతే. బుద్ధిలో జ్ఞానం ఉంది, కాని మనస్సులోకి దిగటం లేదు అంటే ఇక్కడ కూడా ఏదో అడ్డంకి ఉంది. దాన్ని జ్ఞాన అయోగ్యత అంటారు. అంటే సాధన చతుష్టయ సంపత్తి పూర్తిగా లేదు. వివేకం బదులు అవివేకం; వైరాగ్యం బదులు రాగం (అవైరాగ్యం అనకూడదు); శమాది షట్కసంపత్తి బదులు అశమాది

షట్కసంపత్తి; ముముక్షుత్వం బదులు అముముక్షుత్వం ఉన్నాయన్నమాట. ఈ అధికారీ లోపమే రాగద్వేషాలను పారద్రోలకుండా అడ్డుపడుతోంది.

ఉత్తమ అధికారికి ఏ సాధనా అవసరం లేదు; మంద అధికారి కర్మయోగం, ఉపాసన యోగం పాటించాలి. శ్రవణం కూడా ఒక విధమైన కర్మయోగమే. మధ్యమ అధికారి సాధన చేయాలి కాని, కర్మ, ఉపాసన చేయనవసరం లేదు. అతను నిదిధ్యాసనం సాధన చేయాలి. ఈ నిదిధ్యాసనం మధ్యమ అధికారిని ఉత్తమ అధికారిగా చేస్తుంది. మధ్యమ అధికారి నిదిధ్యాసనం ఎలా చేయాలో చూపిస్తున్నారు గౌడపాదాచార్యులవారు ఈ కారికల్లో. ఈ నేపథ్యంతో ఈ కారికలను చూద్దాము.

**కారిక 3.40**

**మనసో నిగ్రహాయత్తమభయం సర్వయోగినామ్ ।**
**దుఃఖక్షయః ప్రబోధశ్చాప్యక్షయా శాంతిరేవ చ ॥**

**మనసో నిగ్రహాయత్తమ్** – జ్ఞానం, జ్ఞానఫలం పొందాలంటే మనోనిగ్రహంమీద ఆధారపడి ఉంటాయి. ఆయత్తం అంటే ఆధారపడి ఉండటం. తత్త్వబోధలో జ్ఞానం, జ్ఞానఫలం పొందాలంటే సాధన చతుష్టయ సంపత్తి ఉన్న వ్యక్తే అధికారి అవుతాడు అని నేర్చుకుంటాము. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపత్తి, ముముక్షుత్వం. శమాది షట్కసంపత్తి అంటే శమము, దమము, ఉపరమము, తితీక్ష, శ్రద్ధా, సమాధానము. శమము అంటే మనోనిగ్రహం.

ఇక్కడ మనోనిగ్రహం పదం వేశారు గౌడపాదాచార్యులవారు. మనోనిగ్రహం శమాన్ని సూచిస్తే, శమం మొత్తం సాధన చతుష్టయం సంపత్తికే ప్రతీక. అందువల్ల ఇక్కడ మనోనిగ్రహం మీద జ్ఞానం, జ్ఞానఫలం ఆధారపడి ఉన్నాయంటే, సాధన చతుష్టయసంపత్తి మీద ఆధారపడి ఉన్నాయని అర్థం.

**ప్రబోధః** – ప్రబోధః అంటే జ్ఞానం. నేను విశ్వ, తైజస, ప్రాజ్ఞ కాదు; నేను తురీయాన్ని అనే జ్ఞానం. ఈ జ్ఞానం పొందాలంటే సాధన చతుష్టయసంపత్తి ఉండాలి. జ్ఞానం పొందటానికే కాదు, జ్ఞానఫలాన్ని అనుభవించటానికి కూడా సాధన చతుష్టయసంపత్తి ఉండాలి.

ఏమిటా జ్ఞానఫలం? దాన్నే జీవన్ముక్తి అంటారు. జీవన్ముక్తి అంటే భావోద్రేకాలను అదుపులో పెట్టుకోగలగటం. ఏమిటా భావోద్రేకాలు? గౌడపాదాచార్యులవారు వాటిలో కొన్నింటిని పేర్కొంటున్నారు.

ఎ) **అభయమ్** – అభద్రతాభావన నుంచి విముక్తి. ఎవరినైనా నిరంతరం భయపెట్టేది ముందేమవుతుందోననే అభద్రతా భావన. అది తన గురించే కాకుండా, తన వారి గురించి కూడా భయపెడుతుంది. ఈ భయాన్ని పారద్రోలుతుంది జ్ఞానఫలం. అభయం – జ్ఞానఫలం–1.

**అభయం ప్రతిష్ఠాం విందతే** – తైత్తిరీయమ్

బి) **దుఃఖక్షయః** – దుఃఖంనుంచి విముక్తి. నిరంతరం దుఃఖంలో మునిగి తేలుతుంటారు కొందరు. ఆ దుఃఖాన్ని పారద్రోలుతుంది జ్ఞానఫలం. దుఃఖక్షయం – జ్ఞానఫలం 2.

సి) **అక్షయా శాంతిః** – వినాశం లేని శాంతి కలుగుతుంది. వినాశం లేని శాంతి అని ఎందుకన్నాము? మనకు అప్పుడప్పుడూ శాంతి కలుగకపోదు, కాని ఆ శాంతి కాసేపట్లోనే మటుమాయమయిపోయి, మనను అశాంతికి గురిచేస్తుంది. ఇటువంటి శాంతిని రెండు పెద్ద సమస్యల మధ్య తాత్కాలికంగా వచ్చే విరామం అని నిర్వచించవచ్చు. కాని వినాశం లేని శాంతిని కలుగజేస్తుంది జ్ఞానఫలం. అక్షయశాంతి – జ్ఞానఫలం 3.

అభయం, దుఃఖక్షయం, అక్షయశాంతి – ఈ మూడింటినీ కలిపి జీవన్ముక్తి అంటారు. అది జ్ఞానఫలం. ప్రబోధః అంటే జ్ఞానం. అందువల్ల జ్ఞానం, జ్ఞానఫలం రెండూ కూడా సాధన చతుష్టయ సంపత్తిమీద ఆధారపడతాయి.

కొన్ని కోర్సులు నేర్చుకోవటానికి కొన్ని మినహాయింపులు ఉంటాయి కొన్ని వర్ణాల వారికి. అలా ఇక్కడ సాధన చతుష్టయసంపత్తిలో నాలుగూ పొందకుండా, ఏ రెండో నేర్చుకుంటే చాలా? అది కుదరదంటున్నారు గౌడపాదాచార్యులవారు.

**సర్వయోగిణామ్** – అందరు శిష్యులూ ఈ సాధన చతుష్టయ సంపత్తిని పొందితీరాలి. యోగి అంటే ఇక్కడ వేదాంతాన్ని నేర్చుకునే శిష్యుడు. అతను ఏ వర్ణానికి చెందినా, ఏ ఆశ్రమానికి చెందినా కూడా ఈ నాలుగు లక్షణాలనూ పొందితీరాలి. నాలుగు లక్షణాలనూ పొందితీరాలంటే అతను పొందాడో లేదో చూడటానికి ఏమైనా మార్గం ఉందా? విమానాశ్రయాల్లో మనుష్యులను, సామాన్లను తనిఖీ చేసినట్టుగా, మనస్సును కూడా తనిఖీ చేసే మార్గం ఏమైనా ఉందా?

పూర్వకాలంలో శిష్యులు గురువుతో పాటు గురుకులంలో ఉండి విద్యనభ్యసించేవారు కాబట్టి అక్కడ గురువు, శిష్యులను దగ్గరగా పరిశీలించే అవకాశం ఉండేది. ప్రశ్నోపనిషత్‌లో ఆరుగురు శిష్యులు, గురువు పిప్పలాదను కొన్ని సందేహాలకు జవాబు చెప్పమని కోరితే, ఆ గురువు వారిని తన ఆశ్రమంలో ఒక సంవత్సరంపాటు ఉండమన్నాడు. ఆ సంవత్సరం అయ్యాక, ఆ ప్రశ్నలకు తనకు జవాబులు తెలిస్తే అప్పుడు జవాబు చెబుతానన్నాడు. ఎందుకు? ఆ సంవత్సరకాలంలో వారు జ్ఞానాన్ని పొందటానికీ, జ్ఞానఫలాన్ని అనుభవించటానికీ అర్హులో కాదో తెలుసుకోవచ్చని అలా అన్నాడు.

ఇప్పుడు అలా గురుకులమూ లేదు, గురువు దగ్గర ఉండి శుశ్రూష చేసే పద్ధతీ లేదు. అందువల్ల శిష్యునిలో సాధన చతుష్టయ సంపత్తి ఉందో లేదో గురువుకు తెలిసే అవకాశం

లేదు. మరి అయితే ఎవరికి తెలుస్తుంది? శిష్యుడే తనను తాను పరీక్షించుకోవాలి. అదెలా చేయాలంటే అసలు ముందు సాధన చతుష్టయ సంపత్తి అంటే ఏమిటో తెలియాలి.

**కారిక 3.41**

**ఉత్సేక ఉదధేర్యద్వత్కుశాగ్రేణైకబిందునా ।**
**మనసో నిగ్రహస్తద్వద్భవేదపరిఖేదతః ॥**

ముందు కారికలో గౌడపాదాచార్యులవారు జ్ఞానం, జ్ఞానఫలం పొందాలంటే సాధన చతుష్టయ సంపత్తి ఉండాలని, మనోనిగ్రహం పదం ద్వారా సూచించారు.

మనోనిగ్రహం ఎలా పొందాలి? మనస్సు నిర్వచనం ఆలోచనల ప్రవాహం – ఆలోచనను వృత్తి అంటారు. ఆలోచనల సాంద్రతనుబట్టి మనస్సుయొక్క నాణ్యతను నిర్ణయిస్తారు. నిజానికి ఇటుకల అమరికతో ఎలా భవంతి ఏర్పడుతుందో, అలా ఆలోచనల అమరికతో మనస్సనే భవంతి ఏర్పడుతుంది.

ఇటుకలను ఒక పద్ధతిలో పేర్చటంవల్ల, ఆ భవంతి ఏర్పడుతుంది. ఆ భవంతిలో ఒక గోడను అటునుంచి తీసి, ఇటువైపు పెట్టాలనుకుంటే అక్కడ ఇటుకలను తీసి, ఇటువైపు మళ్ళీ ఒక పద్ధతిలో పెట్టుకురావాలి. అలాగే ఆలోచనాతీరునుబట్టే మీ మనస్సు ఉంటుంది కాబట్టి, మీ ఆలోచనలను మీరు నియంత్రించుకోవాలి. మీ ఆలోచనలను నియంత్రించు కోవాలంటే, మీ ఆలోచనల తీరును మీరు జాగ్రత్తగా గమనించుకోవాలి. నిజానికి మీ మనస్సులో ఏ ఆలోచనలు రేగుతున్నాయో, ఎదుటివారికి తెలియదు. అందువల్లనే కొందరు మంచివారుగా చెలామణి అయినా కూడా, వారి ఆలోచనల్లో చెడు తలంపులు ఉండవచ్చు. అందువల్ల ముందు మీకు మీరు నిజాయితీగా ఉండటం నేర్చుకోండి. మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకోకండి.

వేదాంతానికి వచ్చారంటే, ముందు మీ ఆలోచనా తీరును గమనించటం నేర్చుకోండి అంటుంది శాస్త్రం. ఆలోచనలను మీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా తెలుసుకోవచ్చు. పరోక్షంగా అంటే మీరు మాట్లాడే మాటల ద్వారా తెలుసుకోవచ్చు. మీ మాటలను గమనించినవారు, మీ సూక్ష్మమైన ఆలోచనలను గ్రహించవచ్చు. ఎందుకంటే ఆలోచనలు రూపుదిద్దుకుంటే, మాటల రూపంలో వెలువడుతాయి. అందువల్ల ముందు మీ ఆలోచనలను గమనించండి, తరువాత మీ పదాలను గమనించండి. మూడవదశ మీరు చేసే పనులు. మీ మాటలు ఏం చెబితే, ఆ పనులను చేస్తారు మీరు. అంటే రూపుదిద్దుకున్న ఆలోచనలే కర్మల రూపంలో బయటకు వస్తాయి.

**స యథాకామో భవతి తత్ క్రతుర్భవతి యత్ క్రతుర్భవతి తత్ కర్మ కురుతే యత్ కర్మ కురుతే తత్ అభిసంపద్యతే** – బృహదారణ్యకమ్

**స యథా కామో భవతి తత్ క్రతుర్భవతి** – ఏ కోరికలైతే ఉన్నాయో అవే, సంకల్పంగా రూపుదిద్దుకుంటాయి.

**యత్ క్రతుర్భవతి తత్ కర్మ కురుతే** – సంకల్పం ఎలా ఉంటే, దానికి తగ్గట్టుగా కర్మలు చేస్తారు.

**యత్ కర్మ కురుతే తత్ అభిసంపద్యతే** – అందువల్ల ఎదుటివారు మీరు చేసే కర్మలనుబట్టి, మీరు మాట్లాడే మాటలనుబట్టి పరోక్షంగా, మీ ఆలోచనా తీరును గమనిస్తారు.

ప్రత్యక్షంగా మీరు మాత్రమే తెలుసుకోగలరు. మీరు మీ ఆలోచనలను గమనించటం ద్వారా తెలుసుకోగలరు. ఆ విధంగా మీ ఆలోచనలను మీరే ప్రత్యక్షంగా గమనించుకోవటం ద్వారానో; మీ మాటల ద్వారా, మీ కర్మల ద్వారా మీ ఆలోచనలను గమనించుకోవటం ద్వారానో, మీ ఆలోచనలను తెలుసుకోగలరు. ఇది తెలుసుకున్నాక, మీ ఆలోచనలను నియంత్రించుకోవాలి. ఇది మీరు చేసి తీరాల్సిన ముఖ్యమైన విషయం. దీన్నే మనోనిగ్రహం అంటారు.

మనస్సును ఎలా నియంత్రించుకోవాలి? కృష్ణపరమాత్మ దీని గురించి పదహారవ అధ్యాయంలో చెప్పాడు. దాన్ని దైవాసుర సంపద్విభాగయోగము అంటారు.

> **దంభో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।**
> **అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్ ॥** – గీత 16.4

దంభం, దర్పం, అభిమానం, క్రోధం, పౌరుషం, అజ్ఞానం, ఆసురీసంపత్తిలోకి వస్తాయి అన్నాడు కృష్ణపరమాత్మ. అలాగే అహింస, సత్యం, త్యాగం వంటి గుణాలను దైవీసంపత్తిలోకి వస్తాయి అన్నాడు. ఇప్పుడు ఏ గుణాలు ఏ సంపత్తిలోకి వస్తాయో తెలుసుకుని, మీ ఆలోచనలను ఒక్కొక్కటిగా గమనించుకుంటూ రండి. వాటిని ఏ విభాగంలో వేస్తారో చూడండి. వీటినే ఇంకో పేరుతో చెప్పాలంటే శుభవాసనలు, అశుభవాసనలు. మీ ఆలోచనలను ఈ రెండు తెగలుగా విభజించండి. ఇది మొదటిదశ.

ఇలా విభజించాక, తరువాత దశకు రండి. దైవీసంపత్తిలోకి లేదా శుభవాసనలలోకి వచ్చిన దాన్ని పెంచి పోషించండి. ఆసురీ సంపత్తిలోకి వచ్చినదాన్ని రానివ్వండి. ఒక చెడు ఆలోచన రాకుండా ఆపలేరు. ఎందుకంటే అది మీ గతం నుంచి వస్తుంది. కాని దాన్ని పెంచి పోషించకండి. మొదటి ఆలోచన రాకుండా ఆపటం మీ చేతిలో లేదు కాని దాన్ని పెంచి పోషించకుండా ఉండగలగటం మీ చేతిలో ఉంది. ఒక తోటమాలి తన తోటలోంచి జాగ్రత్తగా, కలుపు మొక్కలని ఏరివేసినట్టుగా మీరు కూడా మీ మనస్సనే తోటలోంచి, ఆ ఆసురీ సంపత్తిని లేదా అశుభవాసనలను ఏరిపారేయండి.

ఈ చెడు ఆలోచనలు ఎన్ని ఉన్నాయి? నిజానికి ఈ ప్రశ్నను అటు తిప్పి వేయాలేమో! అంటే ఎన్ని మంచి ఆలోచనలు ఉన్నాయి అనుకోవాలి మొదట్లో. శంకరాచార్యులవారు, సౌందర్యలహరిలో మనస్సును అద్భుతంగా వర్ణిస్తారు. నిజానికి శంకరాచార్యులవారికి అటువంటి పరిస్థితి లేదు కాని, అది ఆయన లోకసంగ్రహం కోసం చేస్తున్నారు.

**మా గచ్ఛ త్వమితస్తతో గిరిశ భో మయ్యేవ వాసం కురు**
**స్వామిన్నాదికిరాత మామక మనః కాన్తారసీమాన్తరే**
**వర్తన్తే బహుశో మృగాః మదజుషో మాత్సర్యమోహాదయః**
**తాన్ హత్వా మృగయా వినోదరుచితాలాభం చ సమ్ప్రాప్స్యసి**–శివానందలహరి 43

కైలాసవాసా, ఆది కిరాతా, స్వామీ, నువ్వు అటూ ఇటూ పోవద్దు. నాయందే ఉండు. మనస్సు ఒక మహారణ్యం. అందులో మదమాత్సర్యమోహాదులనే మృగాలు అనేకం ఉన్నాయి. నువ్వు వీటిని చంపి వినోదంగా వేటాడటంలోని మోజు అనే లాభం కూడా పొందగలవు.

ఈ పద్ధతిని మనోనిగ్రహం అంటారు. మనోనిగ్రహం పొందటం అంత తేలికైనదేమీ కాదు, చాలా సమయం కూడా పడుతుంది. కొన్ని సంవత్సరాలుగా దాన్ని ఇష్టారాజ్యానికి మనస్సును వదిలివేశాము మరి. ఇప్పుడు రాత్రికి రాత్రి మారిపొమ్మంటే మారుతుందా? కొన్ని ఇళ్ళలో చూడండి, కొన్ని గదులను వాడకుండా తాళం వేసి ఉంచుతారు. కొన్నాళ్ళ తర్వాత, ఆ తాళం తెరచి చూస్తే ఆ గదులన్నీ బూజులతో నిండిపోయి ఉంటాయి. బొద్దింకలు, బల్లులు స్వైరవిహారాలు చేస్తుంటాయి. వాటన్నింటినీ పారద్రోలాలంటే కొన్ని రోజులు పడుతుంది. ఒక్కరోజులో అవదు. మనస్సు కూడా అంతే. అందులో కొన్ని సంవత్సరాలుగా, ఇంకా మాట్లాడితే, కొన్ని జన్మలుగా అశుభవాసనలు చోటు చేసుకుని, రాజ్యమేలుతున్నాయి. వాటిని పారద్రోలాలంటే, కొన్ని రోజులో, సంవత్సరాలో కూడా పడతాయి.

గౌడపాదాచార్యులవారు మనస్సును నియంత్రించటం ఎంత కష్టమో, నిరూపించటానికి ఒక ఉదాహరణను కూడా ఇస్తున్నారు. ఒక పెద్ద సముద్రంలో ఎంత నీరు ఉంటుంది? ఒక పక్షి ఒక చిన్న గడ్డిపోచతో ఆ సముద్రాన్ని ఖాళీ చేయాలనుకుంటే అది సాధ్యమయే పనేనా? అలా చిన్న గడ్డిపోచతో మహాసముద్రాన్ని ఖాళీ చేయాలంటే ఎంత ఓపిక కావాలి, ఎంత సమయం కావాలి! ఈ రెండూ ఉంటే చాలదు, దానికి ఈశ్వరానుగ్రహం కూడా తోడవ్వాలి. అందువల్ల వెంటనే మీ ప్రయత్నానికి స్వీకారం చుట్టాలి. ఇప్పుడు కారికను చూద్దాము.

**యద్వతు** – ఏ విధంగా అయితే,

**ఉత్సేక ఉదధేః** – ఉత్సేకః అంటే ఖాళీ చేయటం; ఉదధేః అంటే సముద్రాన్ని. ఎలా?

**ఏక బిందునా** – ఒక్కొక్క బిందువు చొప్పున.

**కుశాగ్రేణ** – దర్భకొనతో.

ఒక గడ్డిపోచ చివరికొనతో సముద్రంలోని ఒక్కొక్క బిందువు చొప్పున సముద్రాన్ని ఖాళీ చేయటం ఎంత ఓర్పుతో చేయాలో,

**తద్వత్** – అదే విధంగా,

**అపరిఖేదతః** – ఓర్పుతో. పరిఖేదః అంటే అలసట; అపరిఖేదః అంటే అలుపెరుగని దృఢనిశ్చయంతో,

**మనసో నిగ్రహః** – మనస్సును నిగ్రహించవచ్చు.

ఈ సన్నివేశాన్ని వివరించే పురాణగాధ ఒకటి ఉంది. సముద్రంలోని అలలు ఇంతెత్తున ఎగసిపడటంతో ఒక పక్షి గుడ్లు సముద్రంలో కలిసిపోయాయి. ఆ పక్షికి సముద్రరాజు మీద చాలా కోపం వచ్చింది. తన గుడ్లను వెనక్కి తెచ్చుకోవటానికి, సముద్రంలోని నీళ్ళను ఇంకిపోయేలా చేయాలనుకుంది. అది కూడా ఎలా? కుశాగ్రేణ – దర్భ కొనతో. అంత చిన్న దర్భతో అంత పెద్ద సముద్రాన్ని ఖాళీ చేయటం అసాధ్యం. అయినా మొక్కవోని పట్టుదలతో, అకుంఠిత దీక్షతో ఆ పక్షి తన ప్రయత్నాన్ని కొనసాగించటం చూసిన గరుడ భగవానుడు జాలిపడి, తన పక్షిజాతికి చెందిన పక్షికి సహాయం చేయటానికి ముందుకు వచ్చాడు.

గరుడ భగవానుడు తన రెక్కలను అల్లలాడిస్తే, ఆ రెక్కల శక్తికి సముద్రం ఇంకిపోయింది. పక్షి తన గుడ్లను వెనక్కి తెచ్చుకుంది. ఎక్కడ పట్టుదల, దీక్ష ఉంటుందో అక్కడ తప్పకుండా భగవంతుని అండదండలు, సహాయ సహకారాలు ఉంటాయని ఈ కథ అంతరార్థం. అందువల్ల మనోనిగ్రహం కూడా చాలా అసాధ్యంలా అనిపించినా, మీరు కూడా అదే పట్టుదల, దీక్షతో చేపడితే, భగవంతుని కృపాకటాక్షాలు తోడయి, అసాధ్యం సాధ్యం అవుతుంది.

మనోనిగ్రహం అంటే శమము అనీ, శమము శమాది షట్కసంపత్తిలో ఒకటనీ, శమాది షట్కసంపత్తి సాధన చతుష్టయ సంపత్తిలో ఒకటనీ మర్చిపోకూడదు. ఇలా అన్నీ చెప్పకుండా ఒక అంశాన్నే చెప్పటాన్ని ఉపలక్షణం అంటారు. అందువల్ల మనోనిగ్రహం పొందగలరు. అంటే సాధన చతుష్టయ సంపత్తి పొందగలరు అని అర్థం.

**కారికలు 42-46 ఉపోద్ఘాతం**

ముందు రెండు కారికల్లో సాధన చతుష్టయ సంపత్తియొక్క ఆవశ్యకతను గురించి వివరించారు గౌడపాదాచార్యులవారు.

ఇప్పుడు నిదిధ్యాసనంలోకి అడుగుపెట్టబోతున్నాము. ఇందులో అడుగు పెట్టేముందు ఈ నిదిధ్యాసనం మధ్యమ అధికారికి అనే విషయం మర్చిపోకూడదు. మధ్యమ అధికారి అంటే జ్ఞానం పొందాడు కాని జ్ఞానఫలం అనుభవించలేకపోతున్నాడు. దానికి కారణం - అతనికి సాధన చతుష్టయ సంపత్తి పూర్తిగా లేదు. జ్ఞానం పొందటానికి మాత్రమే సరిపడేటంత సాధన చతుష్టయ సంపత్తి ఉంది కాని, జ్ఞానఫలం పొందేటంత యోగ్యత లేదు. ఇటువంటి అధికారి మళ్ళీ కర్మకు, ఉపాసనకు పోనవసరం లేదు. అతను నిదిధ్యాసనం చేస్తే చాలు. ఇదంతా ఇంత వివరంగా గౌడపాదాచార్యులవారు స్పష్టంగా చెప్పలేదు, మనమే అర్థం చేసుకోవాలి.

నిదిధ్యాసనం నిర్వచనం - జ్ఞాననిష్ఠలో నిలబడటం. పొందిన జ్ఞానాన్ని పదేపదే తలచుకుంటూ ఉండాలి; వీలున్నంత లోతుగా జీర్ణించుకోవాలి; వీలున్నంత ఎక్కువసేపు జ్ఞానంలో నిలబడాలి. జ్ఞానంలో నిలబడాలి అంటే వేదాంతజ్ఞానంలో నిలబడాలి; కర్మకాండ, ఉపాసన కాండల్లో నేర్చుకున్న అంశాలలో కాదు. జీవ-ఈశ్వర ఐక్యబోధక వాక్యంలో రమించాలి. ఆ జ్ఞానాన్ని ఉపనిషత్తులు, ప్రకరణగ్రంథాలు కూడా ఇస్తాయి. ఇలా జ్ఞానంలో నిలబడటాన్ని నిదిధ్యాసనం అంటారు. నిదిధ్యాసనం అనేక విధాలుగా చేయవచ్చు. అవి-

ఎ) **శ్రవణం** - పదేపదే శ్రవణం చేయవచ్చు. శ్రవణం చేసేటప్పుడు ఏకాగ్రచిత్తంతో వింటారు. మనస్సు శాస్త్రం మీద ఏకాగ్రత చూపుతుంది కాని నీటి సమస్య మీద కాదు.

బి) **పఠనం** - గురువు చేసిన బోధనుంచి మీరు రాసుకున్న నోట్సును లేదా ఇటువంటి పుస్తకాలను పదేపదే పఠించవచ్చు.

సి) **రాత** - మీరు విన్నదాన్ని వివరంగా రాసుకుంటే కూడా మనస్సు బోధ మీదే నిలబడుతుంది.

డి) **చర్చ** - తోటి సత్సంగసభ్యులతో మీరు నేర్చుకున్న అంశాలను చర్చించవచ్చు.

ఇ) **బోధ** - మీరు నేర్చుకున్న విద్యను మీరు మరో నలుగురికి నేర్పించవచ్చు.

**తత్ చింతనం తత్ కథనం అన్యోన్యమ్**
**తత్ ప్రబోధనం ఏతదేవ పఠనం చ**
**బ్రహ్మాభ్యాసం విదుర్బుధః**

నిదిధ్యాసనాన్ని బ్రహ్మాభ్యాసం అంటున్నది శాస్త్రం.

శాస్త్రమే వీటిల్లో ఏదైనా చేయవచ్చు అని చెబుతున్నది. నిదిధ్యాసనానికీ, ధ్యానానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది. ధ్యానంలో నిటారుగా కూర్చోవాలి, సుఖాసీనులై ఉండాలి, అంటే ధ్యానం శరీరప్రధానంగా ఉంటుంది. నిదిధ్యాసనం ఎలాగైనా చేయవచ్చు, ఎక్కడైనా చేయవచ్చు; సముద్రపుటొడ్డున నడుస్తూ కూడా చేయవచ్చు. ఇది మనస్సు ప్రధానంగా ఉంటుంది.

ఇవన్నీ కాక శాస్త్రం ఇంకొక నిదిధ్యాసన పద్ధతిని కూడా సూచిస్తుంది. దాన్ని సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం అంటారు. పతంజలి యోగశాస్త్రంలో చెప్పబడిన అష్టాంగయోగంలో చెప్పబడిన దశలు కొన్ని ఇక్కడ కూడా వస్తాయి. అష్టాంగయోగంలో చెప్పబడిన ఎనిమిది దశలు – యమనియమాలు, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి. యమనియమాలను వదిలేసి తక్కిన ఆరు దశలను తీసుకుంది శాస్త్రం. అందువల్ల సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం అని దీనికి పేరు.

దీన్ని ఇంగ్లీషులో వేదాంతిక్ మెడిటేషన్ అంటారు. ఇది అందరూ చేసితీరాలనే నియమం లేదు. పైన పేర్కొన్న పద్ధతుల్లో ఏది వీలైతే దాన్ని పాటించవచ్చు. ఈ సమాధిరూప నిదిధ్యాసనం చేసి, సానుకూల ఫలితాలు పొందుతున్నట్లైతే, ఇది చేయవచ్చు.

**పతంజలి యోగసూత్రాల్లోని అష్టాంగయోగం –**

ఎ, బి) **యమనియమాలు** – యమ అంటే హింసవర్జనం, అసత్యవర్జనం, స్తేయవర్జనం, మైథునవర్జనం, పరిగ్రహవర్జనం. నియమం అంటే శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ప్రణిధానం.

సి) **ఆసనం** – ఒక ఆసనంలో కదలకుండా, స్థిరంగా కొంతసేపు కూర్చోగలగాలి.

డి) **ప్రాణాయామం** – శ్వాసను క్రమబద్ధీకరణం చేయాలి.

ఇ) **ప్రత్యాహారం** – ఇంద్రియ నిగ్రహం. బాహ్యముఖంగా ఉన్న ఇంద్రియాలను బాహ్యవస్తువుల నుంచి విడదీసి అంతర్ముఖం చేయటం.

ఎఫ్) **ధారణ** – ధారణ అంటే ఏకాగ్రత చూపటం. బాహ్యప్రపంచం నుంచి దృష్టి మరల్చి, ధ్యానం చేసే వస్తువు మీద దృష్టి నిలపటం. ఇక్కడ వేదాంతబోధను గుర్తు తెచ్చుకోవాలి.

జి) **ధ్యానం** – ధ్యానం అంటే ధ్యానవస్తువు మీద మనస్సును నిలపటం. ధారణ, ధ్యానం ఇంచుమించు ఒకటే. ధారణ అంటే ఒక వస్తువు మీద దృష్టి పెట్టటం; ధ్యానం అంటే ఆ పెట్టిన దృష్టిని దానిమీదే నిలపటం. మనస్సు జారిపోతుంటుంది. జారిపోతున్న మనస్సును వెనక్కి లాగటమే ధ్యానం. ఫ్రీవిల్ ఉపయోగించి ప్రయత్నపూర్వకంగా ఆలోచనలను వెనక్కి లాగి, మొదట్లో ఓడిపోయినా, మళ్ళీ వెనక్కి లాగాలి.

హెచ్) **సమాధి** – చంచలంగా పరుగులు తీస్తున్న మనస్సును ధ్యానవస్తువుమీద నిలబెట్టటం ధ్యానం అని చూశాము. సమాధిలో ధ్యానవస్తువులో సహజంగా స్థిరపడటం జరుగుతుంది. ధ్యానంలో మనస్సుతో చిన్న యుద్ధం చేయాలి. సమాధిలో యుద్ధం ముగిసి మనస్సు నిలకడ చెందుతుంది. భిన్న ఆలోచనల ఆటంకం లేకుండా సజాతీయ ఆలోచనల ప్రవాహం ఏర్పడుతుంది.

ఇంతవరకూ ఉపాసన గురించి చూశాము. నిదిధ్యాసనం ఎలా చేయాలి? నిదిధ్యాసనం అంటే వేదాంత శ్రవణ, మననాలు చేసి నిశ్చయజ్ఞానం పొందాక చేసే ధ్యానం. నిదిధ్యాసనంలో ఆలోచనలు ఉండాలి, మనస్సు శూన్యం చేయకూడదు. మనస్సు ఉండాలి, ఆలోచనల ప్రవాహం ఉండాలి. ఎటువంటి ఆలోచన? వేదాంతబోధ గురించిన ఆలోచన.

**బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

వేదాంతసారం మూడు వాక్యాల్లో చెప్పబడింది. ఈ మూడింటిలో ఏ వాక్యాన్నైనా తీసుకోవచ్చు. బ్రహ్మసత్యం తీసుకోవచ్చు. ఈ జగత్తంతా ఉనికి రూపంలో ఉన్నది బ్రహ్మే అని ధ్యానం చేయవచ్చు.

జీవో బ్రహ్మైవ నాపరః తీసుకోవచ్చు. జగత్తు అంతటా ఉనికిరూపంలో ఉన్న బ్రహ్మే ఈ శరీరంలో కూడా చైతన్యం రూపంలో ఉన్నాడని ధ్యానం చేయవచ్చు. జగత్తులో సత్ అంశం తెలిస్తే, జీవిలో చిత్ అంశం తెలుస్తుంది. అందువల్ల సర్వవ్యాపకమైన సత్ జీవిలో ఉన్న చిత్ తప్ప ఏదీకాదు. ఈ చిత్ అంశమే ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది.

సత్ అంశం మీద ధ్యానం చేస్తే అది పరమాత్మ ధ్యానం అవుతుంది; చిత్ అంశం మీద ధ్యానం చేస్తే అది జీవాత్మ ధ్యానం అవుతుంది.

జగన్మిథ్యా కూడా తీసుకోవచ్చు. జగత్తులో ఉన్న ఏదో ఒక వస్తువును తీసుకోవచ్చు. అది ఏదైనా బాహ్యవస్తువు కావచ్చు, మీ శరీరం కూడా కావచ్చు. మీ ఇల్లు, మీ శరీరం ఏది తీసుకున్నా, ఒక విషయాన్ని మర్చిపోకూడదు. జగత్తులో ఏదైనా కూడా అనాత్మ కిందికి వస్తుంది. అనాత్మ అంటే మిథ్యా నామరూపాలు మాత్రమే. ఇలా జగత్తులోని వస్తువుమీద ధ్యానం చేస్తే దాన్ని మిథ్యాత్వ ధ్యానం అంటారు. ఈ విధంగా ఈ మూడు అంశాలమీద నిదిధ్యాసనం చేయాలి.

బ్రహ్మసత్యం మీద ధ్యానం చేస్తే అందులో కూడా అనేక నిర్వచనాల మీద చేయవచ్చు. బ్రహ్మ = ఆత్మ. ఆత్మ నిత్యం, ఆత్మ సత్యం, ఆత్మ శుద్ధం, ఆత్మ అసంగం, ఆత్మ నిర్వికారం. వీటిల్లో ఏదో ఒక నిర్వచనం తీసుకుని నిదిధ్యాసనం చేయాలి. అన్ని అంశాల మీద కూడా

చేయవచ్చు కాని అన్నీ ఒక్కసారే చేయకూడదు. రోజుకొకటి చొప్పున తీసుకుని, దాని మీద కాసేపు ధ్యానం చేయాలి.

నిదిధ్యాసనం చేసేముందు, నిదిధ్యాసనం ఏ విషయాలకోసం చేయకూడదో తెలుసుకోవాలి.

1. **ధ్యానం మోక్షమార్గం కాదు** – మోక్షం పొందటానికి ధ్యానం చేయమని చెప్పదు శాస్త్రం. ఎందుకంటే శాస్త్రం ప్రకారం మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు. మనం ముందే ముక్త పురుషులం. నాలుగు పురుషార్థాలలో మోక్షం ఒకటిగా ఇవ్వబడింది కదా అని అడగవచ్చు. మోక్షం పొందాల్సిన మార్గం కాదు, ముందే ముక్తపురుషులమని అర్థం చేసుకుని, దాన్ని స్వీకరించాలి. ఉపనిషత్తులు స్పష్టంగా చెబుతున్నాయి, జ్ఞానమే మోక్షమార్గం అని.

ఆ మాటకొస్తే జ్ఞానం కూడా మోక్షమార్గం కాదు. జ్ఞానం మోక్షం స్వతఃసిద్ధమని, మనం ముందే ముక్తపురుషులమనే సత్యాన్ని వెల్లడిచేస్తుంది.

**తమేవ విద్వాన్ అమృత ఇహ భవతి**

అంతే కాదు, జ్ఞానం వల్లనే మోక్షం అంటుంది. ఎక్కడా ధ్యానం వల్ల మోక్షం వస్తుంది అనలేదు. **జ్ఞానాత్ ఏవ తు కైవల్యమ్**

2. **ధ్యానం జ్ఞానప్రమాణం కాదు** – ధ్యానంవల్ల జ్ఞానం రాదు. శాస్త్రాలు జ్ఞానం పొందటానికి ఆరు ప్రమాణాలు ఉన్నాయని ఘోషిస్తాయి. అవి ప్రత్యక్షప్రమాణం, అనుమాన ప్రమాణం, ఉపమాన ప్రమాణం, అర్థాపత్తి ప్రమాణం, అనుపలబ్ధి ప్రమాణం, శాస్త్రప్రమాణం. ఈ ఆరింటిలో ధ్యానం లేదు. అందువల్ల ధ్యానం జ్ఞానప్రమాణం కాదు. జ్ఞానం అంటే లౌకికజ్ఞానం, ఆధ్యాత్మికజ్ఞానం రెండూ వస్తాయి. అందువల్ల ఏ జ్ఞానాన్ని కూడా ధ్యానంవల్ల పొందలేము.

3. **ధ్యానం సిద్ధులు పొందటానికి కాదు** – ఆధ్యాత్మ సాధనలో, సిద్ధులు పొందటానికి ధ్యానం చెయ్యమని చెప్పదు శాస్త్రం. ఎందుకు? ఏ అనుభవమైనా సరే, అది బాహ్యప్రపంచానికి సంబంధించినది, దానికి పరిమితి ఉంటుంది. అనుభవం అంటేనే దానికి కాలపరిమితి ఉంటుంది; అలా కాలపరిమితి ఉన్న అనుభవం కాలపరిమితి ఉన్న బాహ్యప్రపంచానికే చెందుతుంది. మామూలు అనుభవాలు మామూలు బాహ్యప్రపంచానికి చెందితే, అసాధారణ అనుభవాలు అసాధారణ ప్రపంచానికి చెందుతాయి. సిద్ధులు (మహర్షులు) అంతే! సిద్ధులు సిద్ధప్రపంచానికి చెందుతాయి. అనుభవించే వ్యక్తి, అనుభవించబడే మహిమ కాలేదు! అనుభవించే సబ్జెక్ట్, సాధారణ లేదా అసాధారణ అనుభవాల ఆబ్జెక్ట్ ఎన్నటికీ కాలేదు.

ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి మనం. సిద్ధులు, మహిమలు పొందలేరని కాని, అవి లేవని కాని అనటం లేదు మనం. కాని అవి బాహ్యప్రపంచానికి చెందినవి

అవుతాయి. అంటే ఆబ్జెక్టుకు చెందుతాయి కాని సబ్జెక్టుకు, అంటే నాకు, చెందవు. అందువల్ల అవి ఆత్మజ్ఞానంలోకి రావు. ఆత్మజ్ఞానంలోకి రావు కాబట్టి, ఆధ్యాత్మిక జ్ఞానంలోకి రావు. ఆధ్యాత్మిక జ్ఞానంలోకి రావంటే, లౌకిక జ్ఞానంలోకి వస్తాయి.

లౌకిక జ్ఞానంలోకి వస్తే అవి మోక్షాన్ని ఇవ్వలేవు. అందువల్ల మోక్షం కోరే వ్యక్తి సిద్ధుల వెంట పడకూడదు, పడలేడు. ఎందుకంటే ఆ సిద్ధులతో మురిసిపోయాడంటే, బాహ్య ప్రపంచంలోనే ఉండిపోతాడు; పరిమితి ఉన్న ప్రపంచంలోనే ఉండిపోతాడు; అనాత్మతోనే మమేకం చెందుతాడు; సంసారిగానే కొనసాగుతాడు.

గౌడపాదాచార్యులు, మాండూక్య ఉపనిషత్తులో సిద్ధుల గురించి ప్రస్తావిస్తూ, ఒకవేళ అలాంటి సిద్ధులు వస్తే వాటిని ఆబ్జెక్టులుగా తిరస్కరించమంటారు. ఎందుకంటే అవి అనాత్మ కిందకు వస్తాయి; అవి ఆత్మకు చెందవు.

**న ఆస్వాదయేత్ సుఖం తత్ర నిస్సంగః ప్రజ్ఞయా భవేత్**

గౌడపాదాచార్యులు శంకరులవారి గురువుకు గురువులు. ఇలాంటి సిద్ధులు కలిగితే, మనమొక ప్రశ్న వేసుకోవాలి. ఇది సబ్జెక్టా, ఆబ్జెక్టా? అనుభవం వచ్చింది, అనుభవం వెళ్ళింది అంటేనే అది బాహ్యప్రపంచానికి చెందినదని తెలుస్తోంది. అనుభవించే వ్యక్తికి రాకపోకలు లేవు. అందువల్ల ఆత్మ, మహిమలతో కూడిన అనుభవం కాదు, ఆత్మ అలాంటి అనేక సాధారణ, అసాధారణ అనుభవాల వెనక ఉంది. ఆత్మజ్ఞానం కోరే వ్యక్తి, ఆత్మ గురించి తెలుసుకోవాలి కాని, అలాంటి అనుభవాల మీద శ్రద్ధ చూపకూడదు. అందువల్ల ధ్యానం సిద్ధులు పొందటానికి కాదు.

**ధ్యాన ప్రతిబంధకాలు, పరిహారం**

ఈ సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం చేసే సాధకుడు కొన్ని ఆటంకాలను ఎదుర్కొంటాడు. భగవద్గీతలో కూడా ధ్యానమార్గాలు, ధ్యానప్రతిబంధాకల గురించి చూస్తాము. భగవద్గీతలో ధ్యానదశలను వివరంగా చూస్తే, ధ్యానప్రతిబంధకాలను మాండూక్యంలో చూస్తాము. ఈ రెండూ కలిపితే నిదిధ్యాసనం మీద పూర్తి అవగాహన ఏర్పడుతుంది కాబట్టి, ధ్యానదశలను కూడా వివరించటం జరిగింది.

మనను ధ్యానం చేయనివ్వకుండా అడ్డుపడే ఆటంకాలు నాలుగున్నాయి. అవి లయ, విక్షేపం, కషాయం, రసాస్వాదం.

ఎ) **లయ** – లయ అంటే మనస్సు నిద్రాస్థితిలోకి వెళ్ళటం. ఇలా ధ్యానంలో కూర్చుంటామో లేదో అలా నిద్ర ముంచుకు వచ్చేస్తుంది అంటారు చాలామంది. అలా నిద్ర వచ్చినందుకు సిగ్గు పడతారు కూడా! కాని నిజానికి అది వారి ఒక్కరి సమస్యే కాదు, అందరిదీ.

అందువల్లనే సామూహిక ధ్యానంలో లైట్లు ఆర్పేసి ధ్యానం చేయిస్తారు. మొదటి ఆటంకం తమః ప్రధానం.

బి) **విక్షేపం** – ఇక్కడ మనస్సు నిద్రాస్థితిలో ఉండటం కాదు, మనస్సు ఇంకో విపరీత పరిస్థితిలో ఉంటుంది. అంటే చాలా చంచలంగా ఉండి, ప్రపంచమంతా తిరిగివస్తుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే ఏ వేదాంతంకోసం ధ్యానంలో కూర్చున్నామో, ఆ విషయం తప్ప, అన్నింటి గురించీ ఆలోచిస్తుంది. రెండవ ఆటంకం రజోగుణప్రధానం.

సి) **కషాయం** – మనస్సు ఒక విధంగా స్థబ్ధంగా అయిపోవటం. మనస్సు నిద్రాస్థితికీ జారుకోదు, చంచలంగానూ ఉండదు. అసలు ఏపనీ చేయదు. దాన్ని స్తబ్ధీభావం అంటారు విద్యారణ్యులవారు దృక్‌దృశ్య వివేకంలో. ఏదైనా నమ్మలేని వార్తను వింటే మనస్సు పని చేయదు అంటే ఎలా స్పందించాలో తెలియక అలా స్తబ్ధంగా ఉండిపోతుంది.

**హోమ్ దే బ్రాట్ ది వారియర్ డెడ్** అని ఒక ఆంగ్ల పద్యం ఉంది. అందులో చనిపోయిన సైనికుడిని ఇంటికి తెస్తే, భార్య ఏడవదు, ఆవిడ జీవన్ముక్తి పొందలేదు. ఆ ఘాతుకమైన పరిస్థితిని తట్టుకోలేకపోయింది. అటువంటి పరిస్థితిలో మనస్సుకు ఎలా స్పందించాలో తెలియదు. అలా స్పందించకుండా, స్తబ్ధుగా ఉండిపోతే, ఆ వ్యక్తి మరణించినా మరణించవచ్చు. అందువల్ల ఆ సైనికుడి భార్యను ఏడిపించటానికి అందరూ రకరకాలుగా ప్రయత్నిస్తారు. చివరకి ఒక వృద్ధురాలు, ఆ స్త్రీయొక్క చంటిపిల్లవాడిని తెచ్చి ఆమె ఒళ్ళో వేస్తుంది. అప్పుడు కట్టలు కట్టలుగా దుఃఖం తెంచుకువస్తుంది ఆ ఇల్లాలికి. వీడిని ఎలా పెంచను, తండ్రి ఏడి అంటే ఏమని చెప్పను లాంటి భావాలు ఆమెను ముప్పిరిగొంటాయి.

ఇలాంటి సందర్భాలు ఎన్నో ఉంటాయి. అంటే తీవ్రమైన పరిస్థితుల్లో మనస్సు పనిచెయ్యదు. ఏ విధమైన ప్రతి స్పందనా చూపదు. విపరీతమైన ప్రమాదాల్లో, శరీరానికి నెప్పి తెలియదు. ఎందుకంటే మనస్సు పని చెయ్యటం ఆగిపోతుంది. ఇది శారీరకస్థాయిలోనే కాదు, భావోద్రేకస్థాయిలో కూడా జరుగుతుంది. విపరీత పరిస్థితుల్లో మనస్సు స్తబ్ధంగా అయిపోతుంది. శంకరుల వారు దాన్ని **రాగద్వేష వీర్యం** అని నిర్వచిస్తారు.

ఉదాహరణకు మీముందు భీకరంగా ఒక ఏనుగు నిల్చుని ఉంటే ఒక్కక్షణం మనస్సు పనిచెయ్యదు. అక్కడే ఉండాలా, పరిగెత్తాలా, ఏం చెయ్యాలి? ఏమీ చెయ్యలేరు. ఇలాంటి పరిస్థితి విపత్కర పరిస్థితులల్లోనే కాదు, ఆనందం ఎక్కువైనా కూడా ఏర్పడుతుంది. అబ్బాయి అమెరికా నుంచి ఇప్పుడప్పుడే రాననిచెప్పి, మర్నాడు పొద్దున్నే తలుపు తెరిచేసరికి గుమ్మం ముందు నిలబడితే కలో నిజమో తెలియని పరిస్థితి. కాళ్ళూ చేతులూ ఆడలేదు అంటారు. అందువల్ల తీవ్ర రాగద్వేషాలు అవ్యక్తస్థితిలో ఉంటే దాన్ని కషాయం అంటారు. ధ్యానంలో మనస్సు ఆ స్థితిలోకి వెళ్ళే ప్రమాదం ఉంది.

డి) **రసాస్వాదం** – ఒక్కోసారి ధ్యానం ఒక విధమైన విశ్రాంతిని ఇస్తుంది; ఒక ఆహ్లాదభావన కలుగుతుంది. ఎందుకంటే మనస్సు, బుద్ధి, శరీరం విశ్రాంతి పొందుతాయి. కాబట్టి ఆనందం, హాయి, సుఖం కలుగుతాయి. వాటిని రసం అంటారు. ఈ ఆనందం ఆత్మానందం లేదా బ్రహ్మానందం కాదు. ఎందుకంటే ఈ ఆనందం శాశ్వతానందం కాదు. కేవలం ధ్యానంలోనే కలుగుతుంది. ధ్యానం నుంచి బయటకు రాగానే ఆ ఆనందం మటుమాయమవుతుంది. అందువల్ల కేవలం ధ్యానంలో అనుభవానికి వచ్చే ఆనందం బ్రహ్మానందం కాదు. బ్రహ్మానందం అంటే పూర్ణత్వభావన. అది ఎప్పుడూ ఉంటుంది.

ఈ రసాస్వాదం మంచిదే అయినా కూడా దీనితో మురిసిపోకూడదు. ఎందుకంటే ఆ ఆనందంతో మురిసిపోతే, వేదాంతాన్ని జీర్ణించుకోవటానికి అది ప్రతిబంధకం అవుతుంది. అందువల్ల దీనికి రసాస్వాదం లేదా ఇంద్రియ సుఖం అంటారు. పైగా ఎప్పుడైతే ఒక వ్యక్తి ఈ రసాస్వాదం పొందుతాడో, అప్పుడే ఆ ధ్యానం నుంచి బయటకు రావటానికి ఇష్టపడడు. ఎంతసేపూ ధ్యానంలోనే ఉండాలనుకుంటాడు. ధ్యానం మాని పని చెయ్యాల్సి వస్తే చిరాకు పడతాడు; ఎవరైనా ఫోను చేస్తే మండిపడతాడు; ఎవరైనా పిలిస్తే చిటపటలాడతాడు; ఎవరైనా వస్తే ఎగిరిపడతాడు. ఎందుకంటే ధ్యానం అతనికి ఒక వ్యసనంలా మారుతుంది.

వేదాంత ధ్యానం లేదా నిదిధ్యాసనం ఈ ఆనందాన్ని అనుభవించేటందుకు చేసేది కాదు, పూర్ణత్వాన్ని అనుభవించేటందుకు. అది కూడా సర్వకాల సర్వావస్థల్లోనూ అనుభవించేటందుకు. ధ్యానంలోనే ఆనందం పొందితే, అది నిత్యానందం కాదు. జ్ఞాని ఆనందం నిత్యానందం.

**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్** –గీత 5.8

ఏం చూస్తున్నా, ఏం వింటున్నా, ఏం ముట్టుకున్నా, ఏది వాసన చూసినా జ్ఞాని ఆనందిస్తాడు. అందువల్ల ధ్యానంలో కలిగే రసాస్వాదం కూడా ఆటంకమే. ఆ విధంగా ధ్యానంలో కలిగే నాలుగు ఆటంకాలు – **లయ, విక్షేపం, కషాయం, రసాస్వాదన.** వీటిని తొలగించుకునేందుకు మార్గాలను చూద్దాము.

**ధ్యానప్రతిబంధకాల పరిహారాలు**

ఎ) **లయ పరిష్కారం** – నిద్రాస్థితిని రెండు రకాలుగా ఎదుర్కోవచ్చు. నిద్ర కలిగే కారణాన్ని తొలగించటం ద్వారా, అభ్యాసం ద్వారా.

ధ్యానంలో నిద్ర ఎందుకు వస్తుంది? శాస్త్రమే ప్రతి ఒక్క విషయమూ కూలంకషంగా చర్చిస్తుంది. మనం దాన్ని చదివి అర్థం చేసుకుంటే చాలు. అవి – బహు అశనం, అజీర్ణం. అంటే అతిగా తినటం, అజీర్ణం చెయ్యటం. అతిగా తిని ధ్యానంలో కూర్చుంటే, రక్తప్రసరణ

అంతా దానికే వెళ్ళిపోతుంది. అజీర్ణం చేస్తే కడుపు మందంగా ఉంటుంది; కడుపు మందంగా ఉంటే బుద్ధి మందంగా ఉంటుంది.

నిద్రాశేషం ఇంకో కారణం. శరీరానికి కొంత శాతం నిద్ర అవసరం. మీరు అతి ఉత్సాహంతో అర్ధరాత్రి రెండు గంటలకు లేచి ఆరింటిదాకా ధ్యానం చేస్తే, మీ మనస్సుకు, శరీరానికి కావాల్సిన విశ్రాంతిని భంగ పరిచిన వారవుతారు. అప్పుడవి, 'ఆగు, మాకూ సమయం వస్తుంది, నువ్వు గీతాబోధలో కూర్చున్నప్పుడు నీ పని పడతాము,' అంటాయి. అందుకని వాటికి తగిన విశ్రాంతిని ఇవ్వాలి. నిద్రాశేషం, అతిగా తినటం, అజీర్ణం – ఇవి కారణాలు.

ఇంకో అంశం అభ్యాసం. మనస్సుకు ఎన్నడూ ధ్యానం అలవాటు లేదు. అది పవీలియన్ సూత్రాన్ని పాటిస్తుంది. అదేమిటంటే ఒక కుక్కకు రెండురోజులు గంటకొట్టి, దాని వెంటనే ఆహారం పెడితే, మూడవ రోజు గంట కొట్టగానే, ఆహారం కోసం చూస్తుంది కుక్క. అది కుక్కే అవనవసరం లేదు. మనం కూడా అంతే. భోజనం సమయం అవగానే ఆకలి వేస్తుంది. దాన్ని అసోసియేషన్ థియరీ అంటారు. మామూలుగా మనం ఎప్పుడు నిశ్శబ్దంగా కూర్చుంటాం? పనులన్నీ మానేసి, ఇంద్రియాలను ఉపయోగించకుండా, నిశ్శబ్దంగా ఉండేది ఎప్పుడు? నిద్రపోయే ముందు. కళ్ళు మూసుకుని, పనులు మానుకు కూర్చుంటే, పాపం మనస్సు 'ఓహో నిద్ర పోవాలి కాబోలు, ఇప్పుడు కూర్చునే నిద్రపోతాడు కాబోలు,' అనుకుంటుంది. అందువల్ల మనస్సుకు శిక్షణ ఇచ్చుకోవాలి. 'ఓ మనసా, నేను నిద్ర పోబోవటం లేదు, ధ్యానం చెయ్యబోతున్నాను,' అని చెప్పుకోవాలి. అభ్యాసం ద్వారా మనస్సు నేర్చుకుంటుంది. ఈ విధంగా నిద్ర సమస్యను పారద్రోలవచ్చు.

బి) **విక్షేప పరిష్కారం –** చంచలమైన మనస్సును ఎలా అదుపులో పెట్టాలి? అభ్యాసం, వైరాగ్యాల ద్వారా దాన్ని అదుపులో పెట్టాలి. కృష్ణపరమాత్మ కూడా వీటి గురించి వివరంగా చెబుతాడు. అప్పుడు విక్షేప పరిష్కారాన్ని చూద్దాము.

వైరాగ్యాన్ని పెంచుకోవటమెలా? మీరు పెంచుకునే రాగమే మీ దుఃఖహేతువు అని మీరు పదేపదే మనస్సుకు చెప్పుకోవాలని అంటున్నారు గౌడపాదాచార్యులవారు. రాగం శోకానికి దారితీస్తుంది. అందువల్ల రాగం లేకుండా చేసుకోవటమే వైరాగ్యం.

వైరాగ్యంలో జగత్తు దుఃఖహేతువు అని అర్థం చేసుకుంటే అభ్యాసంలో జగత్తు అనాత్మ అని పదేపదే తలచుకోవాలి. అనాత్మ మిథ్య. మిథ్యావస్తువు మీకు ఆనందాన్ని ఇవ్వలేదు అని గ్రహించాలి. జగత్తు నామరూపాలు మాత్రమే. అది ఎండమావి వంటిది. వైరాగ్యం, అభ్యాసం విక్షేప పరిహారాలు.

సి) **కషాయ పరిష్కారం –** అనేక కారణాలవల్ల మనస్సులో అనేక భావాలను అణగద్రొక్కి ఉంచుతాము. అవి కోపం, బాధ, దుఃఖం, అపరాధభావన, ఈర్ష్య, ఏదైనా కావచ్చు. అవి

మనస్సు విప్పి చెప్పుకోలేనివి. అవి మనస్సును స్తబ్ధంగా చెయ్యవచ్చు. అందువల్ల ధ్యానంలో కూర్చుంటే, వీటివల్ల మనస్సు స్తబ్ధంగా అవవచ్చు. కాని ఏ కారణంవల్ల మనస్సు అలా అయిందో తెలియదు, దానికి ఒకటే మార్గం! నిశ్శబ్దంగా కూర్చుంటే, అణగద్రొక్కబడిన భావోద్రేకం నెమ్మదిగా పైకి వస్తుంది. 1953లో నా భార్య నన్ను ఇలా అంది. ఇప్పుడు 2020 అయినా నాకు ఆ బాధ పోలేదు. మనస్సుకు కంప్యూటర్‌ను మించిన మేధాశక్తి ఉంది. ఎన్ని విషయాలనైనా అది నిక్షిప్తం చెయ్యగలదు. దాని తర్వాత ఎన్నో మంచి విషయాలు జరిగాయి. కాని మనస్సు వాటిని పట్టించు కోకుండా, ఈ బాధనే లోతుగా నిక్షిప్తం చేస్తుంది. అనువైన సమయం ఆసన్నమైనప్పుడు అది పైకి వస్తుంది.

సాధారణంగా గృహస్థాశ్రమంలో ప్రస్తుత సమస్యలే ఎన్నో ఉండటంవల్ల గతంలోని సమస్యల గురించి ఆలోచించే తీరిక ఉండదు. అందువల్ల ప్రశాంతంగా ఏ ఆశ్రమానికో వెళ్ళి కూర్చుంటే, గతంలోని కొన్ని సంఘటనలు పైకి వచ్చే అవకాశం ఉంది. అప్పుడు వాటిని పారద్రోలకూడదు. ఏడవాలనిపిస్తే మనస్ఫూర్తిగా ఏడవండి. అందువల్లనే చాలామంది భగవంతుని ముందు భోరున ఏడుస్తారు, లేదా ఎవరైనా స్వామీజీ దగ్గరకు వెళ్ళినప్పుడు ఏడుస్తారు. అది కూడా మామూలుగా కాదు, వెక్కివెక్కి ఏడుస్తారు.

అందువల్ల కషాయ విజాతీయ అంటారు గౌడపాదుల వారు. ఏవైనా అణగద్రొక్కబడిన భావాలు ఉంటే, వాటిని బయటకు రానివ్వండి. ఎవరిమీదైనా అరవాలని ఉంటే, ఏ సముద్రపుటొడ్డుకో వెళ్ళి గొంతు చించుకుని అరవండి, ఏడవాలని ఉంటే మనస్ఫూర్తిగా ఏడవండి. ఏం చెయ్యాలనిపిస్తే అది చెయ్యండి. దాన్ని అణగ ద్రొక్కకండి. మొదట్లో కొన్ని రోజులు ధ్యానంలో ఏడుపు, కోపం, ఈర్ష్యల ప్రదర్శనలు ఉండవచ్చు. అవి చెయ్యండి.

డి) **రసాస్వాద పరిష్కారం** – రసాస్వాదాన్ని వివేకంతో పరిష్కరించుకోవాలి. 'ధ్యానంలో నేను అనుభవించే ఈ ఆనందం తాత్కాలిక ఆనందం, దీనికి నేను బానిసను కాకూడదు; పైగా నా స్వరూపం పూర్ణత్వం, నేను ధ్యానంలోనే కాదు, ఎప్పుడూ పూర్ణుడను; నేను అసంగుడిని. ధ్యానంలోనే కాదు, ఎప్పుడూ అసంగుడినే.' ఇలా వివేకంతో బుద్ధికి నచ్చచెప్పుకోవాలి.

ఈ విధంగా కారికలు 42–45లో నాలుగు ప్రతిబంధకాలు, నాలుగు పరిహారాలు చర్చించబడ్డాయి. వాటిని టూకీగా చూద్దాము.

| **ధ్యాన ప్రతిబంధకాలు –** | **పరిహారాలు** |
|---|---|
| ఎ) లయ (నిద్ర) | – నిద్రవచ్చే పరిస్థితులను పారద్రోలటం |
| బి) విక్షేపం (చంచల మనస్సు) | – వైరాగ్యం – సర్వమూ దుఃఖమే |
| | అభ్యాసం – ఉన్నదంతా బ్రహ్మే |

సి) కషాయం (స్తబ్ధీ భావన) – సాక్షిగా చూడటం
డి) రసాస్వాదం (ఆనంద అనుభవం) – దాన్ని ప్రతిబింబ ఆనందంగా తెలుసుకోవటం.

ఈ నేపథ్యంతో కారికలు చూద్దాము.

## కారిక 3.42

**ఉపాయేన నిగృహ్ణీయాద్విక్షిప్తం కామభోగయోః ।**
**సుప్రసన్నం లయే చైవ యథా కామో లయస్తథా ॥**

1. **లయ: సుప్రసన్నమ్ లయే** – మనస్సు నిద్రలోకి జారుకుంటుంది. అందువల్ల మనస్సు ప్రసన్నంగా ఉంటుంది. సుప్రసన్నమ్ లయ అనే ప్రతిబంధకాన్ని సూచిస్తుంది.

2. **విక్షేపం: కామభోగయోః విక్షిప్తమ్** – విక్షిప్తమ్ అంటే మనస్సు చెదురుతుంది. దేనివల్ల? కామభోగయోః అంటే విషయవస్తువులవల్ల. విషయవస్తువుల వెంట మనస్సు పరుగులు తీస్తుంది. ఇది విక్షేపాన్ని సూచిస్తుంది.

**యథా కామో (ప్రతిబంధః) లయస్తథా (ప్రతిబంధః)** – విషయవస్తువుల వెంట పరుగులు తీయటం ఎలా ప్రతిబంధకమో, అలా లయ కూడా ప్రతిబంధకమే. కామం రజోగుణాన్ని సూచిస్తే, లయ తమోగుణాన్ని సూచిస్తుంది. మనస్సు మరీ చురుకుగానూ ఉండకూడదు, మరీ మందకొడిగానూ ఉండకూడదు. మరయితే ఏం చేయాలి?

**ఉపాయేన నిగృహ్ణీయాత్** – ఉపాయంతో మనస్సును నిగ్రహించుకోవాలి. ఈ ప్రతిబంధకాలకు తగ్గ పరిహారాలను పాటించాలి అంటున్నారు గౌడపాదాచార్యులవారు. అవేమిటో వచ్చే కారికలో చెబుతారు.

## కారిక 3.43

**దుఃఖం సర్వమనుస్మృత్య కామభోగాన్నివర్తయేత్ ।**
**అజం సర్వమనుస్మృత్య జాతం నైవ తు పశ్యతి ॥**

ముందు కారికలో రెండు ప్రతిబంధకాలను పేర్కొన్నారు. అవి లయ, విక్షేపం. ఇందులో రెండవ ప్రతిబంధకం అయిన విక్షేపానికి పరిహారాలు రెండు సూచిస్తున్నారు. అవి వైరాగ్యం, అభ్యాసం. మీకు అనుబంధం మొత్తం జగత్తుతో ఉండదు. కొందరు మనుష్యులతో, కొన్ని సంస్థలతో, కొన్ని బ్యాంకులతో, కొన్ని ఇళ్ళతో అనుబంధం ఉంటుంది. వాటినుంచి విడివడటానికి రెండు మార్గాలు చెబుతున్నారు.

ఎ) <u>వైరాగ్యం</u>: **దుఃఖం సర్వమనుస్మృత్య** – సర్వమూ దుఃఖమే అని పదేపదే తలుచుకోవాలి. అనుబంధం ఉన్నచోట నిరంతరం ఆందోళన, భయం వెన్నంటే ఉంటాయి. మీకు ఎవరంటే

ఇష్టమో, వారికేమవుతుందోననే ఆందోళన లేదా వారు దూరమవుతారేమోననే భయం ఉంటూనే ఉంటుంది. ప్రస్తుతం వారు బాగున్నా, మీతో కలిసివున్నా, ఆ భయం మాత్రం పోదు. ఇంక నిజంగా దూరమయితే, ఆ బాధ ఎలా ఉంటుందో, వేరే చెప్పాలా? అందువల్ల బంధం అంటేనే దుఃఖమిశ్రితత్వం అని అర్థం చేసుకోవాలి. దీన్ని దోషదర్శనం అంటారు. అనుస్మృత్య అంటే పదేపదే అనుకోవాలి.

ఎందుకు పదేపదే అనుకోవాలి? ఈ వైరాగ్యం మీకు ఎప్పుడైనా కలుగుతూ ఉంటుంది. స్మశానవైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం అంటారు. ఎవరైనా అకస్మాత్తుగా మరణిస్తే, జీవితం అశాశ్వతమంటూ వేదాంతం మాట్లాడుతారు. అలాగే కష్టపడి పిల్లనో, పిల్లవాడినో కన్నాక, ఇంక మళ్ళీ పిల్లలను కనను బాబూ అంటుంది తల్లి. కానీ ఈ రెండు వైరాగ్యాలూ ఒకరోజు కన్నా ఎక్కువకాలం ఉండవు. మర్నాటినుంచి షరా మామూలే. అందువల్ల వైరాగ్యం శాశ్వతంగా ఉండాలంటే, **జాతస్య హి ధ్రువో మృత్యుః** – గీత 2.27

పుట్టినవారు మరణించక తప్పదు అనే ఈ ప్రకృతి సూత్రాన్ని మర్చిపోకూడదు.

**కామభోగాన్నివర్తయేత్** – ఈ దోషదర్శనం చేయటంవల్ల మనస్సు విషయవస్తువుల వెంట పరుగులు తీయదు. ఇది వైరాగ్యం పద్ధతి.

బి) **అభ్యాసం: అజం సర్వమనుస్మృత్య** – సర్వమూ బ్రహ్మయేనని నిరంతరం స్మరించాలి. అజం అంటే పుట్టుకలేని బ్రహ్మ. పుట్టుక లేని బ్రహ్మ కారణం. ఈ జగత్తు కార్యం. జగత్తు బ్రహ్మ అనే కారణం నుంచి వచ్చింది. కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదు కాబట్టి కార్యం మిథ్య. బంగారం లేకుండా ఆభరణాలకు విడిగా ఉనికి లేదు; మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు; అలాగే బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. బ్రహ్మ ఒక్కటే వస్తువు, జగత్తంతా మిథ్యా నామరూపాలు మాత్రమే. 'మిథ్యా నామరూపాలు నాకెలా భద్రత నివ్వగలదు?' ఈ మాటను పదేపదే స్మరించుకోవాలి.

దీన్ని జ్ఞాన అభ్యాసం అంటారు. కలలో చూసిన వజ్రపుటుంగరంమీద మోజు పడటంలో అర్థం లేదు. స్వప్నప్రపంచం ఉన్నట్టు ఉన్నా, నిజంగా ఎలా లేదో, జాగ్రద్ ప్రపంచం కూడా ఉన్నట్టు ఉన్నా, పారమార్థిక స్థాయికి లేస్తే, నిజంగా లేదు.

**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే** – గీత 6.35

**జాతం నైవ తు పశ్యతి** – జాతం అంటే సృష్టింపబడిన జగత్తు, విషయవస్తువులు. ఉన్నదంతా బ్రహ్మే అని అర్థం చేసుకుంటే జగత్తుమీద బంధం పెంచుకోడు.

విక్షేపం అనే ప్రతిబంధకానికి పరిహారాలు – వైరాగ్యం, అభ్యాసం.

**కారిక 3.44**

**లయే సంబోధయేచ్చిత్తం విక్షిప్తం శమయేత్పునః ।**
**సకషాయం విజానీయాత్సమప్రాప్తం న చాలయేత్ ॥**

**పునః విక్షిప్తం శమయేత్** – మనస్సును బాహ్యప్రపంచంనుంచి లాగినా అది అంత వెంటనే మాటవినదు. చిన్న పిల్లవాడిలాగా మళ్ళీ బాహ్యప్రపంచంలోకి పరుగులు తీస్తుంది. పిల్లవాణ్ణి ఎలా వెనక్కి తీసుకువస్తామో, అలాగే పిల్లవాని మనస్తత్వం ఉన్న మనస్సును కూడా వెనక్కి లాగాలి. విక్షేపగుణం వల్ల మనస్సు బాహ్యంగా పరుగులు తీస్తూనే ఉంటుంది. దాన్ని మనం వెనక్కి లాగుతూనే ఉండాలి.

అలా వెనక్కి లాగుతుంటే ఏమవుతుంది? ముందు కారికలో ఇంకొక ప్రతిబంధకం చూశాము. అది లయ అంటే నిద్ర. బయటకు పోనివ్వకపోతే, అది ఇంకో వైపుకు వెళ్ళిపోతుంది. అంటే నిద్రలోకి జారిపోతుంది. ఒక విపరీతధోరణి అయిన రాజసగుణంనుంచి, ఇంకొక విపరీతధోరణి అయిన తమోగుణంలోకి వెళ్ళిపోతుంది. అప్పుడు దాన్నుంచి లేపాలి.

**లయే** – అది రజోగుణంనుంచి తమోగుణానికి అంటే లయలోకి జారుకుంటే,

**చిత్తం సంబోధయేత్** – మనస్సుకు సుప్రభాతం పాడి మేలుకొల్పాలి. చిత్తం అంటే మనస్సు. ఇక్కడ గౌడపాదాచార్యులవారు దీనికి పరిహారం చూపరు కాని ఉపభాష్యకారులు చెప్పిన వాటిని గుర్తుతెచ్చుకుని వాటిలో ఏది సరిపోతుందో, దాన్ని ఉపయోగించాలి. నిద్ర రావటానికి కారణాలు నిద్రాశేషం, అతిగా తినటం, అజీర్ణం. వీటిని తొలగించటమే కాక, మనస్సుకు శిక్షణ ఇచ్చుకోవాలి. 'నేను నిదిధ్యాసనం చేయబోతున్నాను,' అని చెప్పుకోవాలి.

3. **కషాయంః సకషాయం విజానీయత్** – ఇక్కడ మూడవ ప్రతిబంధకాన్ని చూస్తాము. మనస్సును బాహ్యప్రపంచంనుంచి విడదీశాము, బాగానే ఉంది కాని మనస్సు నిదిధ్యాసనం చేయటానికి సిద్ధంగా ఉండదు ఒక్కోసారి. ఈ మధ్యఅవస్థను కషాయ అవస్థ అంటారు.

ఎందుకు కషాయ అవస్థ ఏర్పడుతుంది? ఎందుకంటే విక్షేపాన్ని పరిష్కరించారు కాని విక్షేపానికి మూలకారణాన్ని పరిష్కరించలేదు. విక్షేపంయొక్క మూలకారణం రాగద్వేషాలు. రాగద్వేషాలు కారణం, విక్షేపం కార్యం. కారణాన్ని తొలగిస్తే కాని కార్యం పోదు.

ఒకవేళ కారణాన్ని పారద్రోలకుండా, కార్యాన్ని మాత్రమే తొలగించటానికి బలవంతంగా ప్రయత్నిస్తే, ఆశించిన ఫలం రాదు. ఉదాహరణకు టీవీలో క్రికెట్‌మ్యాచ్ వస్తోంది. మీ అబ్బాయి రేపు పరీక్ష పెట్టుకుని, దానిలో లీనమైపోయాడు. మీరు అతను చదవటం లేదని, అతనిని బలవంతంగా టీవీ ముందునుంచి లేపి, అతని చేతిలో పుస్తకం పెట్టి, చదువుకోమని ఆజ్ఞ జారీచేసి, గది తలుపులు బంధించి వచ్చారు. అతను బుద్ధిగా

చదువుకుంటాడని మీ ఉద్దేశ్యమైతే అది పొరపాటు. అతను టీవీ చూడటం లేదు నిజమే కాని అతని మనస్సు అక్కడే అతుక్కుపోయింది. చేతిలో పుస్తకంమీదకు రాలేదు. అంటే విక్షేపం అయింది కాని కషాయం ఉండిపోయింది. అందువల్ల విక్షేపాన్ని మాత్రం పరిష్కరిస్తే చాలదు, దాని కారణాన్ని కూడా పరిష్కరించాలి.

అలాంటిదే త్రాగుడు, పొగత్రాగటం కూడా. మందు, సిగరెట్టు బలంగా వదిలివేసినా, వారి మనస్సు వాటి వైపుకే వారిని లాగుతుంది. అందువల్ల వారి మనస్సు ప్రశాంతంగా, నిశ్చలంగా ఉండదు. అలాగే నిదిధ్యాసనంలో మనస్సును బలవంతంగా లోపలికి లాగినా కూడా, రాగద్వేషాలు ఉంటూనే ఉంటాయి. ఈ రాగద్వేషాలనే కషాయం అంటుంది శాస్త్రం. కషాయం ఉన్న మనస్సు ప్రశాంతంగా ఉండదు. అటువంటి మనస్సు వేదాంతవాక్యాలను గుర్తు తెచ్చుకోలేదు. అందువల్ల వేదాంత వాక్యాలను గుర్తు తెచ్చుకోవాలంటే ముందు రాగద్వేషాలను పారద్రోలాలి. విక్షేప కారణమైన కషాయాన్ని నివారించకుండా, విక్షేపాన్ని మాత్రం నివారించి లాభం లేదు. ఇలా బలవంతంగా అణగద్రొక్కబడిన మనస్సునే సకషాయమ్ అంటున్నారు గౌడపాదాచార్యులవారు. దీన్నే కృష్ణపరమాత్మ **రసం** అంటాడు.

కషాయం ప్రతిబంధకానికి పరిష్కారం ఏమిటి? దీనికి కూడా గౌడపాదాచార్యులవారు పరిష్కారం ఇవ్వరు. మనం పూర్తిచేసుకోవాలి. కషాయంలో మనస్సు ఒక విధంగా స్తబ్ధంగా అయిపోతుంది. అటు చంచలంగానూ ఉండదు, ఇటు నిద్రాస్థితికీ జారుకోదు. దీనికి పరిష్కారం కషాయ విజాతీయం అంటారు. ఏవైనా అణగద్రొక్కబడిన భావాలు ఉంటే వాటిని బయటకు రానివ్వండి. వాటిని అణగద్రొక్కకండి. తరువాత విక్షేపానికి నేర్చుకున్న వైరాగ్యం, అభ్యాసం పద్ధతులు ఉపయోగించండి. ఆ విధంగా లయ, విక్షేపం, కషాయాలను పరిష్కరించాలి. అలా పరిష్కరించాక,

**సమప్రాప్తం** - మనస్సు ప్రశాంతంగా, నిశ్చలంగా సమంగా, స్థిరంగా ఉంటుంది. అలా స్థిరంగా ఉన్న మనస్సును,

**న చలయేత్** - చలింపజేయకండి. అటువంటి శాంతమనస్సును వేదాంతవృత్తిలో నిలబడనీయండి.

మనస్సు నిశ్చలంగా ఉంది అంటే ఆలోచనలు లేకుండా ఉండటం కాదు, వేదాంత వృత్తిలో స్థిరంగా నిలబడింది అనే విషయం మర్చిపోకూడదు. నేను నిత్య, ముక్త, శుద్ధ ఆత్మను అనే వృత్తిలో నిలబడుతుంది. ఇక్కడిదాకా మూడు ప్రతిబంధకాలను చూశాము. ఇప్పుడు నాలుగవ ప్రతిబంధకాన్ని చూడబోతున్నాము.

**కారిక 3.45**

**నాస్వాదయేత్సుఖం తత్ర నిస్సంగః ప్రజ్ఞయా భవేత్ ।**
**నిశ్చలం నిశ్చరచ్చిత్తమేకీకుర్యాత్ప్రయత్నతః ॥**

4. **రసాస్వాదం: సుఖం** – రసం అంటే ఆనందం. ధ్యానంలో పొందే ఆనందం. మనస్సు, బుద్ధి, శరీరం విశ్రాంతి పొందుతాయి కాబట్టి ఆనందం, హాయి, సుఖం కలుగుతాయి. ఈ ఆనందం ఆత్మానందం లేదా బ్రహ్మానందం కాదు. దీన్ని ప్రతిబింబానందం అంటారు. ఇందులో ప్రియమోద ప్రమోదాలనే తారతమ్యాలు ఉంటాయి. ఇది కేవలం ధ్యానంలోనే కలుగుతుంది.

ఇది ప్రతిబింబానందం అని ఎలా చెప్పగలరు? ధ్యానంనుంచి బయటకు వచ్చాక, 'అప్పుడు నేను ఆనందంగా ఉన్నాను,' అంటారు. అప్పుడు అది గతంలో పొందినట్టు అవుతుంది. ఎంత దివ్యానుభూతి పొందినా, అది తాత్కాలికమే.

ఈ రసాస్వాదం మంచిదే అయినా కూడా దీనితో మురిసిపోకూడదు. ఎందుకంటే, ఆ ఆనందంతో మురిసిపోతే, అది వేదాంతాన్ని జీర్ణించుకోవటానికి ప్రతిబంధకం అవుతుంది. అందువల్ల దీన్ని రసాస్వాదం లేదా ఇంద్రియసుఖం అంటారు. ఇది కూడా ఒక వ్యసనమే అవుతుంది. ఈ ఆనందంకోసం ఎంతసేపూ ధ్యానంలోనే ఉండాలనుకుంటారు. ఇతి ప్రతిబింబానందం.

మరి అయితే బింబానందాన్ని పొందటం ఎలా? ఈ ప్రశ్న నా అసలు ముఖాన్ని చూడటం ఎలా అని అడిగినట్టు ఉంటుంది. అద్దంలో మీ ముఖంయొక్క ప్రతిబింబాన్ని చూడగలరు కాని, మీ అసలు ముఖాన్ని చూడలేరు. ఎందుకంటే, మీ ముఖం మీరు బాహ్యంగా చూసే ఆబ్జెక్టు కాదు. మీ అసలు ముఖాన్ని చూడలేరని అర్థం చేసుకోవాలి. అలాగే బ్రహ్మానందాన్ని అనుభవించలేరని అర్థం చేసుకోవాలి. బ్రహ్మానందంవల్లనే తక్కిన ఆనందాలను పొందుతున్నారు.

**తత్ర సుఖం న ఆస్వాదయేత్** – అక్కడ, అంటే ధ్యానంలో, పొందే సుఖం బింబానందం కాదు. అందువల్ల దాని ఆనందంలో పొంగిపోకండి. ఆస్వాదించటం అంటే రుచిచూడటం. ఆ ఆనందాన్ని అనుభవించాలి అనుకోకండి. అలా అనుకుంటే అది ప్రతిబంధకం అవుతుంది. ఏంచేయాలి?

**నిస్సంగః భవేత్** – ఆ ఆనందంనుంచి విడివడాలి. ఒకవేళ, మీరు మీ ప్రతిబంబ ముఖం మీద అనుబంధం పెంచుకుంటుంటే, మీకు మీరే చెప్పుకోవాలి, 'నేను ఈ ప్రతిబింబ ముఖంమీద అనుబంధం పెంచుకోకూడదు; ఈ ప్రతిబింబ ముఖం వస్తుంది, పోతుంది.' అదే విధంగా సమాధిలో సుఖం వస్తుంది, పోతుంది. దాని మీద అనుబంధం పెంచుకోకూడదు.

**ప్రజ్ఞయా** – వివేకంతో విడివడాలి. ఏమిటా వివేకం? అనుభవంలోకి వచ్చే ప్రతి సుఖం కూడా ప్రతిబింబానందమే కాని, ఆత్మానందం కాదనే వివేకం. ఈ ఆత్మానందం సమాధిలో దొరుకుతుంది అనకూడదు. 'నేను ఈ ప్రతిబింబానందం మీద అనుబంధం పెంచుకోకూడదు; ఈ ప్రతిబింబ ఆనందం వస్తుంది, పోతుంది, కాని నేను ఆనంద స్వరూపుణ్ణి' అని మీకు మీరే చెప్పుకోవాలి.

**ఇతి** – ఈ విధంగా రసాస్వాద ప్రతిబంధకాన్ని నివారించుకోవాలి. ఈ కారికలో రసాస్వాదం అనే ప్రతిబంధకం, దానికి వివేకం అనే పరిష్కారం చూశాము.

**నిశ్చలం చిత్తమ్** – ఈ విధంగా నాలుగు ప్రతిబంధకాలను పరిష్కరించాక, మనస్సు నిశ్చలంగా అవుతుంది. ఒక విషయం మర్చిపోకూడదు, మనస్సు నిశ్చలంగా అవుతుంది అంటే మనస్సు ఆలోచనలు లేకుండా, శూన్యంగా ఉంటుందని కాదు అర్థం; మనస్సు నిశ్చలంగా వేదాంత వాక్యాల మీదే నిలుస్తుందని అర్థం.

**ఆత్మాకారవృత్తి వ్యతిరిక్తవృత్తిరహితమ్**

ఆత్మకు సంబంధించిన వృత్తి కాక, వేరే వృత్తి ఉండదు.

**నిశ్చరతి** – బయటకు నిష్క్రమిస్తున్న మనస్సును,

**ఏకీకుర్యాత్ ప్రయత్నతః** – ప్రయత్నపూర్వకంగా వెనక్కి లాగాలి.

**యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్** – గీత 6.26

గీతలో కూడా నిశ్చరతి పదం వేశాడు కృష్ణపరమాత్మ. నిశ్చరతి అంటే మనస్సు అనాత్మ అయిన ప్రాపంచిక విషయాల వెంట పరుగులు తీస్తుంది. ఏకీకుర్యాత్ అంటే దాన్ని ప్రయత్నపూర్వకంగా వెనక్కి లాగాలి.

మనస్సును బయటనుంచి లాగి, ఆత్మవృత్తిమీద ఏకాగ్రత చూపేలాగా చేయటం అనేది చెప్పటం తేలికే కాని, ఆచరణలో పెట్టటం అంత తేలిక కాదు. ఇలా ధ్యానంలో కూర్చుంటారో లేదో, మీ మనస్సు ఎటో వెళ్ళిపోతుంది. మొదట్లో మీ మనస్సు ఎటో వెళ్ళి పోయిందని కూడా మీకు తెలియదు. ఉన్నట్టుండి, ఏ ఫోనో మ్రోగితే, ఉలిక్కిపడి, ప్రస్తుతంలోకి వస్తారు. మీరు ధ్యానానికి కూర్చున్నారు కాని, మనస్సు ధ్యానంలో మిమ్మల్ని ఆందోళనపడేలా చేస్తున్నదని అప్పుడు గ్రహిస్తారు.

అందువల్ల ధ్యానంలో కూర్చునేముందు మీరు మీ మనస్సుకు బలంగా **ఆటో సజెషన్** ఇచ్చుకోవాలి. అది మీ సుప్తచేతనంలో (సబ్‌కాన్షస్ మైండ్) ఇంకుతుంది. అప్పుడు మీ చేతన మనస్సు (కాన్షస్ మైండ్) బయటకు పరుగులు తీసినా, మీ సుప్తచేతన మనస్సు వెనక్కి లాక్కువస్తుంది దాన్ని. ఉదాహరణకు మీరు ఇవాళ పొద్దున్నే మూడింటికి లేచి, ముస్తాబయి,

ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళాలి. ఆ విషయం మీ సుప్తచేతన మనస్సుకు చెప్పుకుంటారు. మీరు అలారం పెట్టుకుని పడుకుంటారు. అయినా లేవగలనో, లేదోననే భయం వెంటాడుతుంది. మీరు ఆలశ్యంగా లేచినట్టూ, విమానాన్ని అందుకోలేనట్టూ పీడకలలు కూడా వస్తాయి. కాని మీరు లేవాల్సిన సమయంకన్నా ఐదు నిముషాల ముందే, మీ శరీరాన్ని ఎవరో కుదిపి లేపినట్టుగా మీకు మెలకువ వస్తుంది. మీ శరీరాన్ని ఎవరు కుదిపారు? మీ సుప్తచేతన మనస్సు. ఎలా కుదిపింది? మీరిచ్చిన ఆటో సజెషన్‌వల్ల.

ధ్యానంలో కూడా అలా ఆటో సజెషన్ ఇచ్చుకుంటే, మనస్సు బాహ్యంగా పరుగులు తీయదు.

**కారిక 3.46**

**యదా న లీయతే చిత్తం న చ విక్షిప్యతే పునః ।**
**అనింగనమనాభాసం నిష్పన్నం బ్రహ్మ తత్తదా ॥**

బాహ్యంగా పరుగులు తీస్తున్న మనస్సును వెనక్కి లాగి, ప్రయత్నపూర్వకంగా ఆత్మజ్ఞానం మీద నిలబెట్టటంలో ఎదురయ్యే ప్రతిబంధకాలను వివరించారు గౌడపాదాచార్యులవారు ఇంతవరకూ. మీ ప్రయత్నానికీ, ఈ ప్రతిబంధకాలకీ మధ్య ప్రచ్ఛనయుద్ధం చాలా కాలమే కొనసాగుతుంది. ఈ మీ ప్రయత్నాన్ని ధారణ, ధ్యానం అంటారు. వీటి రెండింటి మధ్య చిన్న సూక్ష్మభేదాన్ని కూడా చూశాము. ధారణ అంటే ఒక వస్తువు మీద దృష్టి పెట్టటం; ధ్యానం అంటే ఆ పెట్టిన దృష్టిని దానిమీదే నిలపటం. జారిపోతున్న మనస్సును వెనక్కి లాగటమే ధ్యానం.

ఇప్పుడు ఈ కారికలో సమాధి గురించి చెప్పబోతున్నారు గౌడపాదాచార్యులవారు. ధారణ, ధ్యానం విజయవంతంగా చేస్తే, అది సహజంగా సమాధిలోకి దారితీస్తుంది. ధ్యానంలో మనస్సుతో చిన్న యుద్ధం చేస్తే, సమాధిలో, ధ్యానవస్తువులో సహజంగా స్థిరపడటం జరుగుతుంది.

సమాధిలో, ధ్యానం చేసే వ్యక్తి మనస్సు బ్రహ్మే అవుతుంది అంటున్నారు గౌడపాదాచార్యుల వారు. ఈ వాక్యం మనలను అయోమయంలో పడవేసే ప్రమాదం ఉంది. అంటే ధ్యానం చేయకముందు మనస్సు బ్రహ్మ కాదు, ధ్యానం చేశాక, నెమ్మదిగా బ్రహ్మ అయిందా?

వేదాంతంలో క్రియాపదాలను సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనస్సు బ్రహ్మ **అవుతుంది**లో **అవుతుంది** పదాన్ని అక్షరాలా తీసుకోకూడదు. ఏదీ కొత్తగా బ్రహ్మ అవనవసరం లేదు, ఎందుకంటే ప్రతిదీ అంతకుముందూ బ్రహ్మే, ఇప్పుడూ బ్రహ్మే, ఇకముందు కూడా బ్రహ్మే. మరి అయితే మనస్సు బ్రహ్మ అవుతుంది అంటే దాని అర్థం ఏమిటి? ఉన్నదంతా –

అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ - బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు నిదిధ్యాసన చేసే వ్యక్తి. ఉన్నదంతా బ్రహ్మే అయితే మనస్సు మాటేమిటి? మనస్సు ఉన్నదంతాలో వస్తుంది కాబట్టి అది కూడా బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు. అందువల్ల బ్రహ్మ అవుతుంది అంటే తను బ్రహ్మ అని అర్థం చేసుకోవటం.

ఉదాహరణకు తాడు-పాములో, అంతవరకూ పామునే చూసిన వ్యక్తి, టార్చ్‌లైటు వెలుగులో అది పాము కాదు, తాడు అని అర్థం చేసుకుంటాడు. అప్పుడు మనమేమంటాము? తాడు-పాములో పాము తాడుగా మారింది అంటాము. అంటే పాము తాడుగా, నిజంగా మారిందా? అసలు అక్కడ పాము ఉంటే కదా మారటానికి? మరి ఏమయింది? అంటే అతని దృక్పథం మారింది. దేన్నైతే అంతకుముందు పాముగా చూశాడో, దాన్నే ఇప్పుడు తాడుగా చూస్తున్నాడు. అక్కడ మారింది బాహ్యంగా ఉన్న వస్తువు కాదు, మారింది అంతరంగా ఉన్న అతని దృక్కోణం.

అలాగే ముందు కుండను చూస్తాడు ఒక వ్యక్తి. తరువాత తను చూస్తున్నది కుండను కాదు, కుండగా ఉన్న మట్టిని అని అర్థం చేసుకుంటాడు. దాన్ని మనం ఇలా అంటాము - జ్ఞానికి కుండ, మట్టిగా మారింది. ఇక్కడ కూడా అదే సూత్రం వర్తిస్తుంది. కుండ మట్టిగా మారదు. ఎందుకంటే, అంతకుముందు, కుండలోనూ, తరువాతా ఉండేది మట్టి మాత్రమే. అందువల్ల మారింది బాహ్యంగా ఉన్న వస్తువు కాదు, మారింది అంతరంగా ఉన్న అతని దృక్కోణం. కుండ దృష్టి, మట్టి దృష్టిగా మారింది.

ఇప్పుడు ఈ ఉదాహరణలను జగత్తు-బ్రహ్మకు అన్వయిస్తే, ముందు సాధకుడు బాహ్యంగా ఉన్న జగత్తును చూస్తాడు. జగత్తులో శరీరం, మనస్సు కూడా వస్తాయి. తరువాత తను మనస్సు కాదు, ఉన్నదంతా బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు. సర్వం బ్రహ్మమయం జగత్. మనస్సు బ్రహ్మ అవుతుంది అంటే అదీ అర్థం. ఇప్పుడు కారిక చూద్దాము.

**యదా న లీయతే చిత్తమ్** - ఎప్పుడైతే మనస్సు మొదటి ప్రతిబంధకాల నుంచి విముక్తి చెందుతుందో. న లీయతే మొదటి ప్రతిబంధకం అయిన లయ నుంచి విముక్తి చెందుతుంది.

**న చ విక్షిప్యతే పునః** - ఎప్పుడైతే మనస్సు రెండవ ప్రతిబంధకంనుంచి విముక్తి చెందుతుందో. న విక్షిప్యతే అంటే రెండవ ప్రతిబంధకం అయిన విక్షేపంనుంచి విముక్తి చెందుతుంది.

గౌడపాదాచార్యుల వారు మూడు, నాలుగు ప్రతిబంధకాలయిన కషాయం, రసాస్వాదం గురించి చెప్పకపోయినా వాటిని ఉపలక్షణంగా తీసుకోవాలి. అందువల్ల ఈ నాలుగు ప్రతిబంధకాలనుంచి ఎప్పుడైతే మనస్సు విముక్తి చెందుతుందో, అప్పుడు,

**అనింగనమ్** – మనస్సు అనాత్మ వృత్తుల నుంచి విడివడుతుంది. అనింగనమ్ అంటే అచలం. అనాత్మ వృత్తులు లేకుండా, మనస్సు స్థిరంగా ఉంటుంది. అందువల్ల,

**అనాభాసమ్** – ఎప్పుడైతే వృత్తులు ఉండవో, అప్పుడు ఆయా వృత్తులకు చెందిన విషయ వస్తువులు కూడా ఉండవు. ఆభాస అంటే వృత్తికి చెందిన వస్తువు. అనాభాస అంటే ఆ వస్తువులు కూడా బాధించవు.

అనింగనం, అనాభాసం పదాల మధ్య సూక్ష్మభేదం ఉంది. అనింగనం అంటే విషయ వృత్తులనుంచి విముక్తి; అనాభాసం అంటే విషయవస్తువులనుంచి విముక్తి. అంటే అతన్ని ఆంతరంగా ఆలోచనలు కలతపెట్టవు, బాహ్యంగా విషయవస్తువులు కలతపెట్టవు. ఇక్కడ ఆలోచనలు అంటే అనాత్మకు చెందిన ఆలోచనలు.

మనస్సు శూన్యంగా చేయకూడదు అని పదేపదే చూస్తున్నాము. అనాత్మ వృత్తులు ఉండవు కాని ఆత్మవృత్తి కొనసాగుతూనే ఉంటుంది. అంటే మనస్సులో అనాత్మ వృత్తులు తొలగిపోయి, ఆత్మవృత్తి మాత్రమే కొనసాగుతుంది.

**తత్తదా బ్రహ్మ నిష్పన్నమ్** – అటువంటి సమాధి స్థితిలో ఉపాసకుని మనస్సు బ్రహ్మే **అవుతుంది**. మనస్సు మెల్లమెల్లగా మారి బ్రహ్మ అవుతుంది అని అపార్థం చేసుకోకూడదు. మనస్సు ఎప్పుడూ బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు. అంటే దృక్పథంలో మార్పు వస్తుంది. మనస్సు నామరూపాలు మాత్రమే, అది మిథ్యా, ఉన్నది బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు.

**కారిక 3.47**

**స్వస్థం శాంతం సనిర్వాణమకథ్యం సుఖముత్తమమ్।**
**అజమజేన జ్ఞేయేన సర్వజ్ఞం పరిచక్షతే ॥**

ఈ కారికతో నిదిధ్యాసనం అంశానికి ముగింపు పలుకుతున్నారు గౌడపాదాచార్యులవారు. ముందు కారికలో మనస్సు బ్రహ్మ అవుతుంది అన్నారు. ఇక్కడ దానికి వివరణను ఇస్తున్నారు. ముందు రెండవ పాదం చూడండి.

**అజమజేన జ్ఞేయేన (అభిన్నమ్)** – అభిన్నమ్ మనం కలుపుకోవాలి. అజేన జ్ఞేయేన అంటే పుట్టుకలేని బ్రహ్మ. అజం అంటే పుట్టుక లేదు. అజేన అంటే పుట్టుకలేని; జ్ఞేయం అంటే జ్ఞానవస్తువు. ఇక్కడ బ్రహ్మ, అభిన్నం అంటే విడిగా లేదు. అంటే ధ్యానసమయంలో ఉపాసకుని మనస్సు బ్రహ్మకు భిన్నంగా లేదు. దీని అర్థం అతను బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకుంటాడని కాదు; ఉన్నదంతా మనస్సుతో సహా, బ్రహ్మే అని అర్థం చేసుకుంటాడు. అది కూడా ఎటువంటి బ్రహ్మ?

**స్వస్థమ్** – స్వరూపంలో ఉంది. బాహ్యంగా ఏమీ ఆధారం అవసరం లేదు.

**శాంతమ్** – ఏడవ మంత్రంలో తురీయలక్షణం వచ్చినప్పుడు ఈ పదం వచ్చింది.

**శాంతం శివమద్వైతమ్**

ఆ శాంతం పదమే ఇక్కడ వచ్చింది. శాంతం అంటే ప్రశాంతం.

**సనిర్వాణమ్** - మోక్షమే బ్రహ్మయొక్క స్వరూపం. మోక్షం అనేది ఎప్పుడో పొందాల్సిన సాధ్యవస్తువు కాదు, అది పొందేసిన సిద్ధవస్తువు. నిర్వాణం అంటే మోక్షం. సనిర్వాణం అంటే మోక్షంతో కూడినది.

**అకథ్యమ్** - మాటలతో నిర్వచించలేనిది. ఇవన్నీ బ్రహ్మను వివరించే పదాలు. స్వస్థం, శాంతం, సనిర్వాణం, అకథ్యం అయిన బ్రహ్మే అయింది.

**ఉత్తమం సుఖమ్** - అత్యున్నతమైన ఆనందం. ఈ ఆనందం అనుభవంలోకి వచ్చేది కాదు. తైత్తిరీయోపనిషత్‌లో ఆనందమీమాంసలో ఆనందంలోని తారతమ్యాలను చూస్తాము. అది ప్రతిబింబానందం. బ్రహ్మ ఆనంద స్వరూపం.

**సర్వజ్ఞమ్** - జ్ఞమ్ అంటే ప్రకాశకం; సర్వజ్ఞమ్ అంటే సర్వప్రకాశకం. ఎందుకంటే ఈ చైతన్యమే అన్ని మనస్సుల్లోనూ ఉండి, వాటిని ప్రకాశింపజేస్తున్నది.

**పరిచక్షతే** - అని ఆచార్యులు చెబుతున్నారు. గౌడపాదాచార్యులవారు, ఇలా ఆచార్యులు చెబుతున్నారు అనటంవల్ల ఈ బోధ ఆయన స్వంతం కాదనీ, గురుపరంపరంగా వస్తున్నదనీ చెప్పకనే చెప్పినట్టవుతుంది.

**నారాయణం పద్మభువం వశిష్ఠం**
**శక్తిం చ తత్పుత్ర పరాశరం చ**
**వ్యాసం శుకం గౌడపదం మహాంతమ్।**

నిదిధ్యాసనం చేయటంవల్ల కలిగే ఫలం - నేను అంతకుముందు, ఇప్పుడు, ఎప్పుడూ బ్రహ్మనే; నా శరీరం, నా మనస్సు, నా ఆలోచనలు - అన్నీ బ్రహ్మ+మిథ్యా నామరూపాలు మాత్రమే అని జ్ఞాననిష్ఠలో మీరు నిలబడతారు.

ఉన్నదొకటే బ్రహ్మ, నామరూపాలు అనేకం ఈ జ్ఞానంలో నిలబడటాన్ని బ్రహ్మనిష్ఠ అంటారు. ఈ బ్రహ్మనిష్ఠనే బ్రాహ్మీస్థితి అంటాడు కృష్ణపరమాత్మ రెండవ అధ్యాయంలో.

నిదిధ్యాసన ఫలం - బ్రహ్మనిష్ఠ.

ఇక్కడితో నిదిధ్యాసనం అంశం అయిపోయింది.

### కారిక 3.48

**న కశ్చిజ్జాయతే జీవస్సంభవోఽస్య న విద్యతే।**
**ఏతత్తదుత్తమం సత్యం యత్ర కించిన్న జాయతే ॥**

5. **ఉపసంహారం – కారిక 48**

ఈ కారికతో ఈ అధ్యాయాన్ని ముగించబోతున్నారు గౌడపాదాచార్యులవారు. అందువల్ల ముగించే ముందు ఏడవ మంత్రంలోని బోధను ఒకసారి గుర్తు తెస్తున్నారు. ఈ అధ్యాయానికి పేరు అద్వైత ప్రకరణం అని వచ్చింది ఆ మంత్రంలోని పదం నుంచే. అద్వైతం అంటే కార్యకారణ విలక్షణం. బ్రహ్మ కార్యమూ కాదు, కారణమూ కాదు, బ్రహ్మ కారణం కాదు అని చూపించాలంటే, బ్రహ్మనుంచి ఏమీ పుట్టలేదని నిరూపించాలి. అది ఈ కారికలో మళ్ళీ చూపిస్తున్నారు.

**కశ్చిత్ జీవః న జాయతే** – ఏ జీవుడు కూడా పుట్టలేదు, జగత్తు కూడా పుట్టలేదని మనం కలుపుకోవాలి. జీవుడు, జగత్తు పుట్టలేదని శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా ఖండించిన కారికలను ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి

**యుక్త్యా జీవసృష్టి నిషేధః**
**యుక్త్యా జగత్సృష్టి నిషేధః**
**శ్రుత్యా జీవసృష్టి నిషేధః**
**శ్రుత్యా జగత్సృష్టి నిషేధః**

ఇంత వివరంగా 3–30 కారికల్లో ఖండించినదాన్ని సగం పాదంలో మళ్ళీ గుర్తు చేస్తున్నారు గౌడపాదాచార్యులవారు.

న కచ్చిజ్జాయతే జీవః (జగతః) – కార్యం అసలు లేదు. ఎందుకు కార్యం లేదు?

**అస్య సంభవః న విద్యతే** – జీవుడు ఎందుకు పుట్టలేదంటే, జీవుడనే కార్యం రావటానికి అక్కడ కారణం లేదు. సంభవః అంటే కారణం. బ్రహ్మ కారణం కాదు. ఎందుకంటే బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

**ఏతత్తదుత్తమం సత్యం** – ఉన్నదొకటే ఉత్తమమైన సత్యం, అదే పారమార్థిక సత్యం. అది స్వప్నప్రపంచమైన ప్రాతిభాసిక సత్యంకన్నా, జాగ్రద్ ప్రపంచమైన వ్యావహారిక సత్యంకన్నా ఉన్నతమైనది. అందువల్ల ఉత్తమం సత్యం.

**యత్ర** – ఈ పారమార్థిక సత్యంనుంచి,

**కించిన్న జాయతే** – ఏ కార్యమూ రాలేదు. అంటే కార్యపాదాలయిన ఒకటి, రెండూ లేవు. కారణ పాదమయిన మూడు కూడా లేదు.

**పాదత్రయం నాస్తి చతుర్థపాదః ఏవ పారమార్థికసత్యః**

తక్కిన మూడు పాదాలూ మిథ్య. తురీయం మాత్రమే సత్యం. తురీయం అంటే ఏమిటి? దిక్కులు చూడకండి. మీరే ఆ తురీయం!

దీనితో గౌడపాదాచార్యులవారు అద్వైత ప్రకరణాన్ని ముగిస్తున్నారు.

# అధ్యాయం 3 – అద్వైత ప్రకరణం – సారాంశం

మాండూక్యోపనిషత్తులో ఏడవ మంత్రం చాలా ముఖ్యమైనదనీ, అందులోనూ రెండు పదాలు మరీ ముఖ్యమైనవనీ చూశాము.

**మంత్రం 7**

**నాంతఃప్రజ్ఞం న బహిష్ప్రజ్ఞం నోభయతఃప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్।**
**అదృష్టమవ్యవహార్యమగ్రాహ్యమలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః॥**

ఆ ముఖ్యమైన పదాలు ప్రపంచోశమమ్, అద్వైతమ్.

ప్రపంచోశమమ్ రెండవ అధ్యాయంలో వివరించబడింది. ప్రపంచోశమమ్ అంటే ప్రపంచ మిథ్యాత్వమ్. దానికి గౌడపాదాచార్యులవారు పెట్టిన పేరు ప్రపంచ వైతథ్యమ్. మిథ్యాత్వమ్ అన్నా వైతథ్యమ్ అన్నా ఒకటే. అందువల్ల ఆ అధ్యాయానికి **వైతథ్య ప్రకరణం** అని పేరు వచ్చింది. అందులో జగత్తు మొత్తం మిథ్య అని నిరూపించారు.

మాండూక్యోపనిషత్ పరిభాషలో ప్రపంచాన్ని నాలుగు విధాలుగా వర్ణించవచ్చు.

ఎ) విశ్వ/విరాట్ + తైజస/ హిరణ్యగర్భ + ప్రాజ్ఞ/ ఈశ్వర = 6 ప్రతిబింబాలు

బి) స్థూలశరీరం/ స్థూలప్రపంచం + సూక్ష్మశరీరం/సూక్ష్మప్రపంచం + కారణశరీరం/ కార్య ప్రపంచం = 6 అంశాలు

సి) ప్రథమపాదం + ద్వితీయపాదం + తృతీయపాదం = 3 పాదాలు

డి) కార్యం (మొదటి రెండు పాదాలు) + కారణం (మూడవ పాదం) = 3 అంశాలు.

వీటిలో మీకు ఏ వివరణ అనువుగా ఉంటే అది తీసుకోవచ్చు. ప్రపంచం మిథ్య అంటే కార్యమూ మిథ్య, కారణమూ మిథ్య.

అద్వైతమ్ పదం మూడవ అధ్యాయంలో వివరించబడింది. అదే పేరును తీసుకున్నారు ఈ అధ్యాయానికి. అందువల్ల దీనికి అద్వైత ప్రకరణం అనే పేరు వచ్చింది. అద్వైతమ్ అంటే ఏమిటి? మాండూక్యోపనిషత్ పరిభాషలో చెప్పాలంటే అది నాలుగవ పాదం, తురీయం. మొదటి మూడు పాదాలు కార్య, కారణ పాదాలు కాబట్టి, నాలుగవ పాదం కార్యకారణ విలక్షణమ్. గౌడపాదాచార్యులవారు ఈ తురీయాన్ని వివరించారు ఇందులో.

**కార్యకారణ విలక్షణ అద్వైత తురీయమ్ ఏవ సత్యమ్**

ఆ తురీయం ఏమిటి?

**స ఆత్మా స విజ్ఞేయః**

అంది ఉపనిషత్తు. ఆ తురీయం ఈ ఆత్మే. ఆత్మ ఏమిటి? ఆత్మ నేనే. ఇప్పుడన్నీ కలిపితే, మాండూక్యసారం – నేను సత్యతురీయాన్ని. మిథ్యా కార్యకారణ ప్రపంచానికి అధిష్ఠానాన్ని. ఈ ప్రపంచానికి ఏమయినా, నాకేమీ కాదు. నేను నిత్యముక్తశుద్ధ ఆత్మను. ఈ అధ్యాయం సారాంశం ఒక్కముక్కలో చెప్పాలంటే –

**కార్యకారణ విలక్షణ అద్వైత సత్య తురీయ ఆత్మా అహమస్మి**

ఈ నేపథ్యంతో ఈ అధ్యాయం సారాంశాన్ని చూద్దాము.

ఈ అధ్యాయంలో ఉన్న 48 కారికలను ప్రధానంగా ఐదు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. ఉపోద్ఘాతం – కారికలు 1, 2
2. సృష్టి నిషేధ వాదన – కారికలు 3–30
3. ఆత్మజ్ఞానం – కారికలు 31–39
4. నిదిధ్యాసనం – కారికలు 40–47
5. ఉపసంహారం – కారిక 48

(వీటినే **అద్వైతానికి తొమ్మిది మెట్లు** పేరుతో ఈ అధ్యాయం చివర్లో చూస్తాము.)

**1. ఉపోద్ఘాతం: కారికలు 1, 2**

మొదటి రెండు కారికల్లో గౌడపాదాచార్యులవారు తను చెప్పబోయే అంశాన్ని పరిచయం చేస్తున్నారు. ద్వైతం = సంసారం అంటున్నారు.

ద్వైతం ఎక్కడ ఉంటే, అక్కడ సంసారం ఉంటుంది. అది లౌకికంగా అవనీ, మతపరంగా అవనీ. ఈ సూత్రం ప్రకారం గొప్ప ఉపాసకుడు కూడా ద్వైతంలోకే వస్తాడు అంటారు గౌడపాదాచార్యులవారు. ఉపాసనలో కూడా ఉపాస్యదేవత–ఉపాసకుడు భేదం ఉంది. మనకు తెలిసి ఉపాసన శ్రేష్ఠం. కాని ఇక్కడ గౌడపాదాచార్యులవారు ఒక అణుబాంబు వేశారు. ఉపాసకులను కృపణులు అన్నారు.

ఎందుకంటే ద్వైతంలో కాలం, దేశం వస్తాయి. ఎక్కడ కాలం ఉంటే అక్కడ యమధర్మరాజు ఉంటాడు. యమధర్మరాజుకి ఇంకొక పేరు కాలుడు. కాలం ఉంటే నష్టమేమిటి? కాలం మనకు జన్మనిస్తుంది, బాగుంది; మన ఎదుగుదలకు తోడవుతుంది, బాగుంది; కాని అదే కాలం మనని నశింపజేస్తుంది, మృత్యుకోరల్లో చిక్కేలా చేస్తుంది; మనవారి నుంచి మనను దూరం చేస్తుంది. అందువల్ల ద్వైతం అంటే కాలం; కాలం అంటే సంసారం తప్పవు.

అద్వైతం మాత్రమే మోక్షాన్నిస్తుంది. ఈ విషయాన్ని మన మనస్సులో బాగా నాటుకునేలా చేశారు గౌడపాదాచార్యులవారు.

అద్వైతం అంటే కార్యకారణ విలక్షణ తురీయం – అది సత్యం.

2. **సృష్టి నిషేధ వాదన: కారికలు 3–30**

ఈ కారికల్లో గౌడపాదాచార్యులవారు సృష్టి నిజంగా జరగలేదని నిరూపించారు; దాన్ని సృష్టి నిషేధ వాదన అంటారు. దీన్నే అజాతివాదన అనికూడా అంటారు. అజాతిలో జాతి అంటే కులం కాదు; జాతి అంటే ఇక్కడ సృష్టి. జాతి అంటే పుట్టుక, జీవజగత్తుల పుట్టుక. కాని అజాతివాదన అంటే ఈ జీవజగత్తులు నిజంగా పుట్టలేదని నిరూపించటం.

కార్యం, కారణం రెండూ కూడా ద్వైతంలోకే వస్తాయి. అలా ఎలా చెప్పగలరు? కార్యంలోనే ద్వైతం స్పష్టంగా తెలుస్తుంది అనవచ్చు మీరు. నిజమే కార్యం ప్రత్యక్ష ప్రమాణసిద్ధం. ఉదాహరణకు ఒక చెట్టు కార్యం. దానిలో కొమ్మలు, ఆకులు, పువ్వులు, పండ్లు స్పష్టంగా తెలుస్తున్నాయి. అంటే అందులో ద్వైతం తెలుస్తుంది. అలాగే మనిషిలో అనేక అంగాలు కూడా తెలుస్తాయి. అంటే కార్యం = ద్వైతం. ఇందులో సందేహం లేదు.

కాని కారణం కూడా ద్వైతమే అని అర్థం చేసుకోవాలి. కారణం అంటే మరేదో కాదు, అవ్యక్తంగా ఉన్న కార్యమే. విత్తనంలో చెట్టు అవ్యక్తరూపంలో ఉంటుంది. ద్వైతం తెలియదు కాబట్టి అద్వైతం అని పొరపాటు పడే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, సుషుప్తి అద్వైతం అనిపిస్తుంది కాని అందులో ద్వైతం అవ్యక్తంగా ఉంది. అలాగే నిర్వికల్ప సమాధిలో కూడా ద్వైతం అవ్యక్తంగా ఉంటుంది.

అందువల్ల కార్యం వ్యక్త ద్వైతమయితే, కారణం అవ్యక్త ద్వైతం. అందువల్ల అసలు అద్వైతం కార్యకారణ విలక్షణమై ఉండాలి. అందువల్ల తురీయం కార్యకారణ విలక్షణం అని నిరూపించారు ఈ కారికల్లో. కార్య–కారణ అంశాల్లో, గౌడపాదాచార్యులవారు రెండవ అంశం అంటే కారణం మీద ఎక్కువగా దృష్టి పెట్టారు. అంటే తురీయం కారణ విలక్షణం అని నిరూపించారు.

కారణ విలక్షణం అంటే ఏమిటి? అంటే తురీయం నుంచి ఏదీ పుట్టలేదు. ఒక వ్యక్తి తండ్రి కాదు అని నిరూపించాలంటే, అతనికి పిల్లలు లేరని చూపించటం ద్వారా నిరూపించవచ్చు. తురీయం నుంచి ఏదీ పుట్టలేదని చెప్పటానికి జీవ, జగత్తులను తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. సృష్టి జరగలేదని చూపించటమే అజాదివాదన. దీన్ని నాలుగు దశల్లో చూపించారు. అవి –

ఎ) **యుక్త్యా జీవసృష్టి నిషేధః** – **కారికలు 3-9**

బి) **యుక్త్యా జగత్‌సృష్టి నిషేధః** – **కారిక 10**

సి) **శ్రుత్యా జీవసృష్టి నిషేధః** – **కారికలు 11-14**

డి) **శ్రుత్యా జగత్‌సృష్టి నిషేధః** – **కారికలు 15, 16, 23 -30**

ఇప్పుడు వాటిని వివరంగా చూద్దాము.

ఎ) **యుక్త్యా జీవసృష్టి నిషేధః – కారికలు 3-9**

జీవాత్మ-పరమాత్మల మధ్య కార్యకారణ సంబంధం లేదని నిరూపించటానికి ఆకాశ దృష్టాంతాన్ని తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు. జీవాత్మను ఘటాకాశంతోనూ, పరమాత్మను మహాకాశంతోనూ పోల్చవచ్చు. కుండ పుట్టినప్పుడు కుండలోని ఆకాశం పుట్టినట్టుగా అనిపిస్తుంది కాని లోతుగా విశ్లేషిస్తే అది నిజం కాదని తెలుస్తుంది.

ఉత్పత్తి – కుండ పుట్టింది కాని ఆకాశం కొత్తగా పుట్టలేదు

నాశః – కుండ పగిలితే, ఆకాశం మాయమవదు

దోషః – కుండకి మలినం అంటినా, ఆకాశానికి అంటదు

విశేషః – కుండకి విశేషరూపం ఉంది కాని, ఆకాశానికి లేదు

సంబంధః – కుండకూ, ఆకాశానికీ మధ్య సంబంధం ఉన్నట్టు ఉన్నా ఆకాశం ఏకం.

ఇప్పుడు జీవాత్మ-పరమాత్మల పరంగా చూద్దాము.

ఉత్పత్తి – శరీరం పుడుతుంది కాని ఆత్మ కొత్తగా పుట్టలేదు

నాశః – శరీరం మరణిస్తుంది కాని ఆత్మకు చావులేదు

దోషః – శరీరానికి మలినం అంటినా, ఆత్మకు అంటదు

విశేషః – శరీరానికి రూపం ఉంది కాని, ఆత్మకు లేదు

సంబంధః – జీవాత్మ, పరమాత్మల మధ్య సంబంధం ఉన్నట్టు ఉన్నా, పరమాత్మ ఏకం.

ఆకాశ దృష్టాంతేన జీవసృష్టి నిషేధః. అందువల్ల జీవాత్మ, పరమాత్మ నుంచి పుట్టలేదు.

బి) **యుక్త్యా జగత్‌సృష్టి నిషేధః – కారిక 10**

జగత్తును తర్కం ద్వారా నిషేధించటానికి స్వప్నప్రపంచాన్ని ఉదాహరణగా తీసుకున్నారు గౌడపాదాచార్యులవారు.

స్వప్నంలో ఉన్నంతవరకూ, ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు. దాన్నించి లేచాకే అతనికి తెలుస్తుంది. స్వప్నప్రపంచంలో ఉన్నంతవరకూ అది సత్యంగా అనిపిస్తుంది, అందులో వ్యవహారాలు నడుపుతాడు కాని లేచాకే అది మిథ్య అని తెలుస్తుంది. అలాగే బాహ్యప్రపంచం సత్యం అనిపించినంత మాత్రాన అది నిజం కాదు. నిజానికి

ఈ విషయం వివరంగా ముందే చూశాము. జగత్తుకు ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది - ఇవేవీ జాగ్రత్ ప్రపంచం సత్యం అని నిరూపించలేవు. అందువల్ల స్వప్నప్రపంచంలాగా, జాగ్రత్ ప్రపంచం కూడా మిథ్య.

**స్వప్న దృష్టాంతేన జగత్సృష్టి నిషేధః.**

**సి) శ్రుత్యా జీవసృష్టి నిషేధః - కారికలు 11-14**

జీవసృష్టి జరగలేదని నిరూపించటానికి గౌడపాదాచార్యులవారు శ్రుతిలోని మహావాక్యాలను తీసుకున్నారు. జీవాత్మ-పరమాత్మల ఐక్యాన్ని బోధించే ఏ శ్రుతివాక్యమైనా మహావాక్యం అంటారు. ఈ మాండూక్యోపనిషత్‌లోనే ఒక మహావాక్యం ఉంది. అది **అయమాత్మా బ్రహ్మ.**

కాని ఇక్కడ తైత్తిరీయోపనిషత్‌లోని ఒక మహావాక్యాన్ని తీసుకున్నారు గౌడపాదాచార్యులు. తైత్తిరీయంలో ముందు పంచకోశాలకు అతీతంగా ఉన్నది ఆత్మ అని తెలుసుకున్నాడు శిష్యుడు. తరువాత ఆ ఆత్మను ఆనంద ఆత్మ అనీ, అది బాహ్యంగా ఉన్న బ్రహ్మతో సమానం అనీ అన్నది ఉపనిషత్తు.

**శ్రుతి ప్రమాణాలు**

ఎ) ఆనంద ఆత్మ బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా - తైత్తిరీయమ్

బి) అయమేవ సః యోऽయమాత్మా, ఇదమ్ అమృతమ్, ఇదం బ్రహ్మ, ఇదగ్ం సర్వమ్॥
- బృహదారణ్యకమ్

సి) తత్రకో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః - ఈశావాస్యమ్

వ్యష్టిలోని చైతన్యం సమష్టిలోని చైతన్యం ఒకటే. వ్యష్టిలోని చైతన్యాన్ని జీవాత్మ అంటే సమష్టిలోని చైతన్యాన్ని పరమాత్మ అంటారు. పరమాత్మ నిత్యం, శాశ్వతం అని తెలుసు. అందువల్ల పరమాత్మకు చావు, పుట్టుకలు లేకపోతే; పరమాత్మ-జీవాత్మ ఒకటే అయితే; జీవాత్మకు కూడా చావు, పుట్టుకలు లేవు.

**శ్రుతిలోని మహావాక్యాల ప్రకారం జీవాత్మ = పరమాత్మ**

పరమాత్మకు పుట్టుక లేదు కాబట్టి జీవాత్మకు కూడా లేదు.

**డి) శ్రుత్యా జగత్సృష్టి నిషేధః - కారికలు 15-30**

జగత్ నిజంగా సృష్టించబడలేదని శ్రుతివాక్యాల ద్వారా నిషేధించటం. అనేకచోట్ల శ్రుతి జగత్ సృష్టిని నిషేధిస్తుంది.

1. **నేహ నానాస్తి కించన మృత్యోస్స మృత్యుం గచ్ఛతి** - కఠ

నానాత్వం కొంచెం కూడా లేదు అంటే ఈ ద్వైతప్రపంచం నిజంగా లేదు. స్వప్నంలో ద్వైతప్రపంచాన్ని చూస్తారు కాని అది నిజం కాదు, అది మీ వాసనామయ ప్రపంచం మాత్రమే. అలాగే ఈ జాగ్రత్ ప్రపంచం కూడా స్వప్నం–2 మాత్రమే. నిజంగా సృష్టి జరగలేదు.

2. **న భూమి రాపో న చ వహ్నిరస్తి**
**న చాఽ నిలో మేఽ స్తి న చాంబరం చ** – కైవల్యమ్ 23

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం ఏవీ పుట్టలేదు అని కైవల్యంలో వస్తుంది.

3. **ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే యుక్తా హి అస్య హరయః**
**శతా దశ ఇతి।** – బృహదారణ్యకమ్

పరమేశ్వరుడు మాయచే అనేకరూపాలు ఉన్నట్టుగా భాసిస్తున్నాడు అని బృహదారణ్యమ్‌లో వస్తుంది.

4. **అజాయమానో బహుధా విజాయతే** – పురుషసూక్తం

బ్రహ్మ సృష్టించకుండానే నానాత్వం ఉన్న ఈ జగత్తును సృష్టించాడు అని పురుషసూక్తంలో వస్తుంది. దీని అర్థం సృష్టించాడు కాని నిజంగా కాదు.

ఇంకా రెండు శ్రుతివాక్యాలను కూడా చూస్తాము. వీటి అన్నిటి అర్థం బ్రహ్మ నిజం సృష్టి చేయలేదు, నిజం జగత్తు రాలేదు. మీ స్వప్నప్రపంచం స్వప్నం–1 అయితే, జాగ్రత్ ప్రపంచం స్వప్నం–2. దీన్ని అజాతివాదము అంటారు.

**మిథ్యాసృష్టిః అస్తి – సత్యసృష్టిః నాస్తి**

**ప్రసంగవశాత్ ద్వైతత్వ మిథ్యాత్వమ్** (కారికలు 17–22)

సృష్టి నిషేధం చేస్తూ మధ్యలో గౌడపాదాచార్యులవారు ద్వైతం మిథ్య అని నిరూపించారు.

మనస్సు పరంగా – యత్ర యత్ర ద్వైతః తత్ర తత్ర భయః రాగః ద్వేషః
బుద్ధిపరంగా – కథం భావః మర్త్యతామ్ ఏష్యతి?

నిర్వికార బ్రహ్మ కారణం అయితే సవికారం అవాలి. అది ఎలా కుదురుతుంది?

3. **ఆత్మజ్ఞానం: కారికలు 31–39**

ఈ భాగంలో గౌడపాదాచార్యులవారు సంసారకారణం, దీనికి పరిష్కారం కూడా చూపారు.

**దశ 1: ద్వైతదర్శనం** – అద్వైతం సత్యం, ద్వైతం మిథ్య అనే విషయం తెలియక, ద్వైతాన్ని సత్యంగా తీసుకోవటమే సంసారం. జాగ్రదావస్థలో, స్వప్నావస్థలో ద్వైతదర్శనం

అవుతున్నది; ఈ రెండు అవస్థలు మనను భయపెడుతున్నాయి. సుషుప్తిలో ద్వైతం లేదు, భయం లేదు. అందువల్ల ఎక్కడ ద్వైతం ఉంటే అక్కడ సంసారం ఉంది. ఇది దశ 1.

**దశ 2: మనసే కారణం** – ద్వైతదర్శనంలో సంసారం ఉంది అన్నాము. ఇప్పుడు లోతుగా విశ్లేషిస్తే ఈ ద్వైతదర్శనం మనస్సు పనిచేస్తున్నప్పుడే అవుతున్నదని అర్థం అవుతుంది. సుషుప్తిలో మనస్సు పడుకుంటుంది, సంసారం లేదు. దీన్ని బట్టి మనసే సంసారానికి కారణం అని తెలుస్తున్నది.

**పరిష్కారం – అమనీభావః** – అందువల్ల మోక్షం పొందాలంటే మనస్సును నియంత్రించుకోవాలి. అక్షరాలా తీసుకుంటే మనోనాశనం. మనోనాశనాన్ని రెండు రకాలుగా చేయవచ్చు.

**రెండు పద్ధతులు – సత్య అద్వైత జ్ఞానేన –**

1. **ద్వైతమిథ్యాత్వ నిశ్చయః –** మనస్సును (బుద్ధిని) ఉపయోగించి, జ్ఞానం ద్వారా ఎదురుగా కనబడే జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం అని అర్థం చేసుకోవటం.

2. **మనోమిథ్యాత్వనిశ్చయః –** అనాత్మ ప్రపంచంలోకి జగత్తు, శరీరం, మనస్సు కూడా వస్తాయి కాబట్టి మనస్సు కూడా మిథ్య అని అర్థం చేసుకోవటం.

ఆత్మజ్ఞానం పొందటం ద్వారా మనోనాశనం చేయవచ్చుని, మనోనాశనం ద్వారా మోక్షం పొందవచ్చునీ చూపించారు.

ఆత్మజ్ఞానానికి గౌడపాదాచార్యులవారు ఇక్కడ రెండు ప్రత్యేక పదాలు వాడారు. అవి **ఆత్మ సత్యానుబోధః, అస్పర్శయోగః.**

ఎ) **ఆత్మ సత్యానుబోధః** – మనస్సును నాశనం చేయాలంటే మనస్సు జోలికి వెళ్ళనవసరం లేదు. మనస్సుకు అధిష్ఠానమైన ఆత్మవైపు తిరిగితే చాలు. ఎటువంటి ఆత్మ? సత్య ఆత్మ. ఆ సత్య ఆత్మ గురించి ఎలా తెలుసుకోవాలి? అనుబోధేన – శాస్త్ర ఉపదేశాన్ని గురువు ద్వారా పొందాలి. జ్ఞానం దానంతట అది రాదు. గురువు ద్వారా శాస్త్రాన్ని నేర్చుకుంటే వస్తుంది. ఈ ఆత్మజ్ఞానం మోక్షాన్ని కలిగిస్తుంది.

బి) **అస్పర్శయోగః** – అస్పర్శః అంటే అసంగ ఆత్మ; యోగః అంటే జ్ఞానం. కాబట్టి అస్పర్శయోగః అంటే అసంగ ఆత్మ (తురీయం) జ్ఞానం. ఉన్నదొకటే తురీయం కాబట్టి అది అసంగం. జ్ఞానం పొందిన వ్యక్తి నేను సంబంధాలకు అతీతుణ్ణి అని అర్థం చేసుకుంటాడు.

ఇది ఇంత గొప్ప జ్ఞానమైనా కూడా అందరూ దీన్ని ఇంత తేలికగా అర్థం చేసుకోలేరు అంటున్నారు గౌడపాదాచార్యులవారు. భయంలేని ఆత్మజ్ఞానంలో భయాన్ని దర్శించి

భయపడతారు కొందరు. ఎందుకంటే ఆత్మజ్ఞానం పొందితే అన్ని అనుబంధాలను వదులుకోవాలనే భ్రమలో ఉంటారు వారు. బంధాలు లేకపోతే జీవితం శూన్యం అని వారంటే బంధాలు బంధకత్వంలో తద్వారా సంసారంలో పడవేస్తాయి అంటుంది వేదాంతం. అసంగత్వమే మోక్షానికి దారితీస్తుంది.

4. **నిదిధ్యాసనం: కారికలు 40-47**

ఆత్మజ్ఞానం పొందితే రెండు ఫలాలు కలుగుతాయి. అవి ముఖ్యఫలం, అవాంతర ఫలం. ముఖ్యఫలం అంటే ఆత్మజ్ఞానమే. అవాంతర ఫలం మనస్సును సంస్కరిస్తుంది. తద్వారా జీవన్ముక్తిని ప్రసాదిస్తుంది.

కాని ఈ జీవన్ముక్తిలో స్థాయీభేదాలు ఉన్నాయి. దానికి కారణం అధికారీ భేదం. సాధన చతుష్టయసంపత్తి ఈ అధికారిత్వాన్ని ఇస్తుంది. శిష్యులను మూడు తెగలుగా విభజించవచ్చు. వారు ఉత్తమ అధికారి, మధ్యమ అధికారి, మంద అధికారి.

**ఉత్తమ అధికారి** – ఉత్తమ అధికారికి వేదాంత శ్రవణంలోనే ఇటు జ్ఞానమూ, అటు జ్ఞానఫలమూ కలుగుతాయి. అతనికి నిదిధ్యాసనం అవసరం లేదు.

**మంద అధికారి** – మంద అధికారిలో సాధన చతుష్టయ సంపత్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల అతను వేదాంతబోధనే సరిగ్గా అర్థం చేసుకోలేడు. జ్ఞానమే కలగనప్పుడు, జ్ఞానఫలం ఎక్కడ కలుగుతుంది? ఇతను కర్మయోగం, ఉపాసనయోగం చేయాలి. దానిలో భాగంగా వేదాంతశ్రవణం ఇంకా ఎక్కువ చేయాలి. అతను నిదిధ్యాసనం చేయలేడు. శ్రవణ, మననాలు విజయవంతంగా చేసినవారికి నిదిధ్యాసనం ఉపయోగ పడుతుంది.

**మధ్యమ అధికారి** – మధ్యమ అధికారికి కొంతమేరకు సాధన చతుష్టయ సంపత్తి ఉంటుంది. అందువల్ల అతను జ్ఞానం పొందుతాడు కాని కావల్సినంత అర్హత లేకపోవటం వల్ల జ్ఞానఫలమైన జీవన్ముక్తిని అనుభవించలేడు. శ్రవణ, మననాలు బాగానే చేసివుంటాడు. ఈ మధ్యమ అధికారికే నిదిధ్యాసనం అవసరం.

నిదిధ్యాసనం అనేక విధాలుగా చేయవచ్చు. పదేపదే శ్రవణం చేయవచ్చు; గురువు చేసిన బోధనుంచి తను రాసుకున్న అంశాలను పదేపదే పఠించుకోవచ్చు; తోటి శిష్యులతో చర్చించవచ్చు; ఇతరులకు బోధ చేయవచ్చు.

ఇవన్నీకాక శాస్త్రం ఒక సాంకేతిక పద్ధతిని సూచిస్తుంది. దాన్ని సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం అంటారు. ఇంగ్లీషులో వేదాంతిక్ మెడిటేషన్ అంటారు. అష్టాంగయోగంలో చెప్పబడిన ఎనిమిది అంశాల్లో యమనియమాలను వదిలేసి, తక్కిన ఆరూ పాటించాలి. అవి ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి.

ఈ ధారణ, ధ్యానం చేసే సమయంలో నాలుగు ప్రతిబంధకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. గౌడపాదాచార్యులవారు ఆ ప్రతిబంధకాలను, వాటి పరిహారాలను సూచించారు. ఆ ప్రతిబంధకాలను నివారించుకుని అహం శుద్ధోస్మి, అహం ముక్తోస్మి, అహం అసంగోస్మి వంటి వేదాంత వాక్యాల మీద నిదిధ్యాసనం చేయాలి.

| **ధ్యాన ప్రతిబంధకాలు** | **- పరిహారాలు** |
|---|---|
| ఎ) లయ (నిద్ర) | - నిద్రవచ్చే పరిస్థితులను పారద్రోలటం |
| బి) విక్షేపం (చంచల మనస్సు) | - వైరాగ్యం - సర్వమూ దుఃఖమే<br>అభ్యాసం - ఉన్నదంతా బ్రహ్మే |
| సి) కషాయం (స్తబ్ధ భావన) | - సాక్షిగా చూడటం |
| డి) రసాస్వాదం (ఆనంద అనుభవం) | - దాన్ని ప్రతిబింబ ఆనందంగా తెలుసుకోవటం. |

అలా ప్రతిబంధకాలను పారద్రోలి, ఆత్మజ్ఞానంలో నిలబడితే, మనస్సు బ్రహ్మ అవుతుంది. బ్రహ్మ అవుతుంది అంటే ఉన్నదంతా, మనస్సుతో సహా, అంతా బ్రహ్మే, మనస్సు మిథ్యా నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకుంటాడు. అంటే మార్పు బాహ్యంగా జరగదు, అతని దృక్కోణంలో జరుగుతుంది.

అంటే బ్రహ్మనిష్ఠలో నిలబడతాడు.

5. **ఉపసంహారం: కారిక 48**

ఈ కారికతో ఈ అద్వైత ప్రకరణాన్ని ముగించారు. అద్వైత ప్రకరణం పేరు ఏడవ మంత్రంలో ఉన్న **అద్వైతమ్** పదంనుంచి వచ్చింది. అద్వైతం అంటే కార్యకారణ విలక్షణం. బ్రహ్మ కార్యమూ కాదు, కారణమూ కాదు. బ్రహ్మ కారణం కాదు అని చూపించటానికి, బ్రహ్మనుంచి ఏమీ పుట్టలేదు అని నిరూపించారు గౌడపాదాచార్యులవారు.

ఈ బ్రహ్మ లేదా తురీయఆత్మ అత్యుత్తమ సత్యం. దీన్నే పారమార్థిక సత్యం అంటారు. మనకు అనుభవంలోకి వచ్చేది ప్రాతిభాసిక సత్యం లేదా వ్యావహారిక సత్యం. అవి రెండూ మిథ్యే. ఒకటి చిన్న మిథ్య అయితే, ఇంకొకటి పెద్ద మిథ్య. తురీయం సత్యం.

**మిథ్యా ప్రపంచానికి అధిష్ఠానం - సత్య తురీయం.**

సత్య తురీయం ఏదీ? దిక్కులు చూడకండి, అది మీరే.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా అహం బ్రహ్మైవ నాపరః.**

# అధ్యాయం 3 అద్వైత ప్రకరణం – ముఖ్యాంశాలు

## అద్వైతానికి తొమ్మిది మెట్లు

1. **ఉపోద్ఘాతం – కారికలు: 1, 2**

| | |
|---|---|
| **ప్రపంచోపశమమ్** పద వివరణ | – అధ్యాయం 2 |
| ప్రపంచం అంటే కార్యకారణాత్మక ప్రపంచం | – అది మిథ్య |
| **అద్వైతమ్** పద వివరణ | – అధ్యాయం 3 |
| అద్వైతం అంటే కార్యకారణ విలక్షణ తురీయం | – అది సత్యం |
| కార్యం, కారణం కూడా ద్వైతం | – ఇందులో ఉండే వ్యక్తి కృపణుడు |
| కర్మ, ఉపాసనలు కూడా ద్వైతం | – అందువల్ల సంసారము. |

తురీయం కార్యకారణ విలక్షణమైనా ఇక్కడ కారణం కాదు అని చూపించారు.

దీన్ని అజాతివాదః అంటారు. అకార్పణ్యం వక్ష్యామి అంటారు గౌడపాదాచార్యులవారు.

2. **యుక్త్యా జీవసృష్టి నిషేధః – కారికలు: 3-9**

ఉదా. ఆకాశ దృష్టాంతం

ఉత్పత్తి, నాశనం, దోషం, విశేషం, సంబంధం – ఈ లక్షణాలు కుండకు చెందుతాయి తప్ప కుండలోని ఆకాశానికి (ఘటాకాశానికి) చెందవు. అలాగే ఈ లక్షణాలు మనశ్శరీరాలకు చెందుతాయి తప్ప తురీయానికి కాదు.

**ఆకాశ దృష్టాంతేన జీవసృష్టి నిషేధః**

3. **యుక్త్యా జగత్సృష్టి నిషేధః – కారిక: 10**

ఉదా. స్వప్నదృష్టాంతం.

స్వప్నంలో ఉన్నంతవరకూ ఒక స్వాప్నికునికి తన స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు.

అలాగే జాగ్రత్ ప్రపంచాన్ని అనుభవిస్తాము, అందులో వ్యవహారం నడుపుతాము, అది ప్రయోజనకరంగా ఉంటుంది కాని తురీయానికి లేస్తే, అది సత్యం కాదు.

ప్రయోజనం ఉంది, బాహ్యంగా ఉంది, నాకు భిన్నంగా ఉంది, స్పష్టంగా ఉంది – ఇవేవీ జాగ్రత్ప్రపంచం సత్యం అని నిరూపించలేవు.

**స్వప్న దృష్టాంతేన జగత్ సృష్టి నిషేధః**

4. **శ్రుత్యా జీవసృష్టి నిషేధః - కారికలు: 11-14**

శ్రుతిలోని మహావాక్యాలు - తత్త్వమసి, అహం బ్రహ్మ అస్మి, అయమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ.

జీవాత్మ = పరమాత్మ; పరమాత్మకు పుట్టుక లేదు కాబట్టి జీవాత్మకు కూడా పుట్టుక లేదు.

**శ్రుతి ప్రమాణాలు**

ఎ) ఆనంద ఆత్మ బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా - తైత్తిరీయమ్

బి) అయమేవ సః యోఽ యమాత్మా, ఇదమ్ అమృతమ్, ఇదం బ్రహ్మ, ఇదగ్ం సర్వమ్॥
- బృహదారణ్యకమ్

సి) తత్రకో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః - ఈశావాస్యమ్

శ్రుతి ఐక్యవాక్యాలనే స్తుతిస్తుంది, ద్వైతాన్ని విమర్శిస్తుంది.

**మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి** - కఠ 2.1.10

ద్వైతంతో మొదలుపెట్టి అద్వైతానికి రావాలి.

5. **శ్రుత్యా జగత్సృష్టి నిషేధః - కారికలు: 15, 16, 23-30**

బ్రహ్మ కారణం కాదని చెప్పటానికి అనేక శ్రుతివాక్యాలు.

శ్రుతిలో సృష్టిప్రక్రియ ఉన్నది అధ్యారోప అపవాదన్యాయంకోసం. శ్రుతి ప్రత్యక్షంగా ద్వైతమో, అద్వైతమో చెప్పదు.

**అధ్యారోప అపవాదన్యాయం**

1.జగత్తు ఉత్పత్తి చెందింది. అది కార్యం - కార్యాన్ని పరిచయం చేస్తాము.

2. ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది. జగత్తుకు కారణం బ్రహ్మ - కారణాన్ని పరిచయం చేస్తాము. **ఇది అధ్యారోపం**

3. బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు - కార్యాన్ని నిషేధిస్తాము.

4. జగత్తు అనే కార్యాన్ని నిషేధిస్తే బ్రహ్మకు కారణత్వ హోదా లేదు - కారణత్వాన్ని నిషేధిస్తాము (కారణం లేదు అనకూడదు).

చివరికి మిగిలింది కార్యకారణ విలక్షణ బ్రహ్మ. **ఇది అపవాదం.**

శ్రుత్యర్థాపత్తి ప్రమాణం ద్వారా శ్రుతి సారం అద్వైతం అని అర్థం చేసుకోవాలి.

మిథ్యాసృష్టి అస్తి = సత్యసృష్టిః నాస్తి

ఎ) నేహ నానాస్తి కించన మృత్యోస్స మృత్యుం గచ్ఛతి – కఠ

బి) ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే యుక్తా హి అస్య హరయః శతా దశ ఇతి। – బృహదారణ్యకమ్

సి) అజాయమానో బహుధా విజాయతే – పురుషసూక్తమ్

డి) అంధం తమః ప్రవిశంతి యేఽ సంభూతిముపాసతే। – ఈశావాస్యమ్

ఇ) జాత ఏవ న జాయతే కో న్వేనం జనయేత్పునః – బృహదారణ్యకమ్

ఎఫ్) స ఏష నేతి నేత్యాత్మాఽ గృహ్యో న హి గృహ్యతేఽ శీర్యో న హి శీర్యతేఽ సంగో న హి సజ్యతేఽ సితో న వ్యథతే న రిష్యతి – బృహదారణ్యకమ్

ఈ వాక్యాల ద్వారా సృష్టి నిజంగా జరగలేదు అని తెలుస్తుంది.

అంటే జగత్ కార్యం కాదు; కార్యం లేకపోతే కారణం కూడా ఉండదు. అందువల్ల తురీయం కార్యకారణ విలక్షణం.

యుక్తిపరంగా – బ్రహ్మ కార్యం కారణత్వాత్ మాతృవత్

బ్రహ్మ నిజంగా కారణం అయితే, బ్రహ్మ కార్యం కూడా అవాలి; బ్రహ్మ మహాసంసారి అవాలి.

6. **ప్రసంగవశాత్ ద్వైతత్వ మిథ్యాత్వమ్ – కారికలు: 17-22**

ద్వైతభావనలో ఉంటే రెండు సమస్యలు.

ఎ) **మనస్సు పరంగా** – యత్ర యత్ర ద్వైతః తత్రతత్రః భయం, రాగః, ద్వేషః

బి) **బుద్ధిపరంగా** – కథం భావః మర్త్యతామ్ ఏష్యతి?

అనంతం బ్రహ్మ నిర్వకార బ్రహ్మ. కాని కారణం అయితే సవికారం అవాలి. అది ఎలా కుదురుతుంది?

అజాతస్య భావస్య జాతిమ్ – పుట్టుక లేని బ్రహ్మ పుట్టాడు అన్నట్టు ఉంది. దీని ద్వారా మూడు విషయాలు గ్రహించాలి.

1. మోక్షం అంటే ద్వైతంనుంచి ద్వైతానికి ప్రయాణం కాదు.
2. మోక్షం అంటే ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం.
3. ద్వైతంనుంచి అద్వైతానికి ప్రయాణం శారీరకంగా కాదు, మానసికంగా.

7. **ఆత్మజ్ఞానం – కారికలు: 31–39**

ఎ) **దశ 1 – ద్వైతదర్శనం** – యత్ర యత్ర ద్వైతదర్శనం, తత్ర తత్ర సంసారః

బి) **దశ 2 – మనసే కారణం** – యత్ర యత్ర మనః తత్ర తత్ర ద్వైతదర్శనమ్
మనః ఏవ మనుష్యాణం కారణం బంధమోక్షయోః

పరిష్కారం – అమనీభావః = మనోనాశః

మనోనాశేసతి ద్వైతం నైవ ఉపలభ్యతే

**రెండు పద్ధతులు – సత్య అద్వైత జ్ఞానేన –**

1. **ద్వైతమిథ్యాత్వ నిశ్చయః –** మనస్సును (బుద్ధిని) ఉపయోగించి, జ్ఞానం ద్వారా ఎదురుగా కనబడే జగత్తు మిథ్య, బ్రహ్మ మాత్రమే సత్యం అని అర్థం చేసుకోవటం.

2. **మనోమిథ్యాత్వనిశ్చయః –** అనాత్మ ప్రపంచంలోకి జగత్తు, శరీరం, మనస్సు కూడా వస్తాయి కాబట్టి మనస్సు కూడా మిథ్య అని అర్థం చేసుకోవటం.

ఆత్మజ్ఞానానికి పేర్లు – ఆత్మసత్యానుబోధః, అస్పర్శయోగః

ఆత్మజ్ఞానం – మూడు శరీరాలు కాదు, నామరూపాలు కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు, వ్యవహారం లేదు,

**తురీయం – సుప్రశాంతః, సకృజ్జ్యోతిః, సమాధిః, అచలః, అభయః.**

8. **నిదిధ్యాసనం – కారికలు: 40–47**

ఆత్మజ్ఞానం పొందితే ఫలం అమనీభావః అంటే జీవన్ముక్తి

అభయే భయదర్శినః

కాని భయపడుతున్నారు. ఎందుకు? అధికారభేదంవల్ల.

జీవన్ముక్తి ఫలం పొందాలంటే సాధన చతుష్టయ సంపత్తి ఉండాలి.

ఉత్తమ అధికారి జ్ఞానమూ, జ్ఞానఫలమూ పొందుతాడు.
మంద అధికారి జ్ఞానం పొందలేడు, అందువల్ల జ్ఞానఫలమూ పొందలేడు.
మధ్యమ అధికారి జ్ఞానం పొందుతాడు, జ్ఞానఫలం పొందలేడు.

అది పొందటానికి మనోనిగ్రహం ఉండాలి (సాధన చతుష్టయ సంపత్తి ఉండాలి).

మనోనిగ్రహం పొందాలంటే నిదిధ్యాసన చెయ్యాలి.

ఒక రకం నిదిధ్యాసనం – సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం

దానికి కలిగే నాలుగు ఆటంకాలు – నాలుగు పరిహారాలు.

| **ధ్యాన ప్రతిబంధకాలు –** | **పరిహారాలు** |
|---|---|
| ఎ) లయ (నిద్ర) | – నిద్రవచ్చే పరిస్థితులను పారద్రోలటం |
| బి) విక్షేపం (చంచల మనస్సు) | – వైరాగ్యం – సర్వమూ దుఃఖమే<br>అభ్యాసం – ఉన్నదంతా బ్రహ్మే |
| సి) కషాయం (స్తబ్ధ భావన) | – సాక్షిగా చూడటం |
| డి) రసాస్వాదం (ఆనంద అనుభవం) | – దాన్ని ప్రతిబింబ ఆనందంగా<br>తెలుసుకోవటం. |

ఆత్మాకార వృత్తి వ్యతిరిక్త వృతిరహితం అవాలి.

అప్పుడు బ్రహ్మనిష్ఠలో నిలబడతాడు.

9. **ఉపసంహారం**

తురీయం → అద్వైతం → కార్యకారణ విలక్షణం

జీవుడు, జగత్తు తురీయం నుంచి పుట్టలేదు.

**ఏతత్తదుత్తమం సత్యం యత్రకించిత్ న జాయతే**

చతుర్థపాద (తురీయం) ఏవ పారమార్థిక సత్యః

ఆ సత్యతురీయం ఏది? దిక్కులు చూడకండి. అది మీరే.